Damage Book

UNIVERSAL
LIBRARY
OU_204236
UNIVERSAL
LIBRARY

Osmania University Library

Call No. T84 S49Sq

Accession No. T906

Author

Title సంక్షిప్త భాగవతము

This book should be returned on or before the date last marked below.

శ్రీ ర స్తు.

శ్రీ రామకృష్ణపరబ్రహ్మణే నమః.

సంగ్రహ భాగవతము

ఇది

కడప, మ్యునిసిపల్ హైస్కూలునందుఁ బ్రధానాంధ్రపండితులు
ఆంధ్రబ్రహ్మాండపురాణాంధ్రశ్రీమద్రామాయణాది గ్రంథకర్తలు నగు
కావ్యతీర్థ : జనమంచి శేషాద్రిశర్మ గారిచే

రచియింపఁబడినది.

చెన్నపురి:

వావిళ్ల. రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్ వారిచేఁ

ప్రకటితము.

1926.

All Rights Reserved.

విషయ సూచిక.

విషయము.	పుట.
పరీక్షిన్మహారాజు ధర్మంబును గాపాడుట	9
పరీక్షిత్తునకు శృంగిశాపంబు గలుగుట	11
శుకమహర్షి వచ్చుట	18
శుకయోగి పరీక్షిత్తునకు బదులు చెప్పుట	20
భక్తియోగమును రాజునకు శుకయోగి తెలుపుట	22
విదురుఁడు తీర్థయాత్రకుం బోవుట	26
సనకసనందనాదులు వైకుంఠంబునకుం బోవుట	31
హిరణ్యాక్షుండు యజ్ఞవరాహముతోఁ బోరి మృతినందుట	34
దక్షునకు శివునితో విరోధంబు గలుగుట	38
దక్షప్రజాపతి యజ్ఞము చేయుట; సతీదేవి యచ్చటికిం బోఁగోరుట	41
సతీదేవి దేహత్యాగము చేయుట	44
వీరభద్రుఁ డుదయించి దక్షునియజ్ఞమును బాడుచేయుట	45
బ్రహ్మాదు లీశ్వరుం బొగడుట	46
ధ్రువునిచరిత్రము	47
వేనునిచరిత్రము	52
పృథుచక్రవర్తి యశ్వమేధంబు చేయ నింద్రుండా యశ్వము నపహరించుట	56
భరతోపాఖ్యానము	59
అజామిళోపాఖ్యానము	71
దేవదానవులయుద్ధము	78
వృత్రాసురకథ	81
చిత్రకేతూపాఖ్యానము	90
శ్రీహరిద్వారపాలకులకు శాపము గల్గుట	99
హిరణ్యకశిపుఁడు తపం బొనరించుట	102
ప్రహ్లాదచరిత్రము	114
నృసింహమూర్తి హిరణ్యకశిపుని వధించుట	145
గజేంద్రమోక్షణము	150
క్షీరసాగరమథనము	162

విషయసూచిక.

విషయము.	పుట.
శ్రీహరి మోహినీరూపమును దాల్చుట	171
వామనచరిత్రము	173
అంబరీషోపాఖ్యానము	183
శ్రీరామచరిత్రము	189
శ్రీకృష్ణచరిత్రము	197
శ్రీకృష్ణావతారము	201
పూతన వ్రేపల్లెకుం బోవుట	208
శకటాసురునిఁ గృష్ణుఁడు కాలఁ దన్నుట	210
తృణావర్తుఁడు శ్రీకృష్ణు నెత్తుకొని పోవుట	212
బలరామకృష్ణులు క్రీడించుట	214
బ్రహ్మ గోగోపకుల నంతర్ధానము చేయుట	220
శ్రీకృష్ణుఁడు కాళీయఫణిని మర్దించుట	223
నందాదు లింద్రయాగము చేయఁబూన హరి నివారించుట ...	228
గోవర్ధనాద్రిని గృష్ణుఁ డెత్తుట	230
శ్రీహరి యద్భుతగానము	231
అక్రూరుఁడు బృందావనమున కరుదెంచుట	236
కంసవధము	243
జరాసంధుఁడు మధురాపురిని ముట్టడించుట	245
రుక్మిణీకల్యాణము	251
ఉషాకన్యచరిత్రము	262
నారదముని శ్రీకృష్ణునిమహిమముఁ బరీక్షించుట	267
కుచేలోపాఖ్యానము	268
శ్రీహరి మృతవిప్రకుమారులఁ దెచ్చి యిచ్చుట	274
వసిష్ఠాదులు శ్రీహరిం గానవచ్చుట	280

పీఠిక.

మహాశయులారా !

సంగ్రహ రామాయణ భారతముల వ్రాసిన పిదప సంగ్రహభాగవతము వ్రాయునూహను మ-రా-రా-శ్రీ, వావిళ్ల వేంకటేశ్వరశాస్త్రులుగారు గల్గించిరి. నాచేత నేదే నొకగ్రంథమును వ్రాయించి తద్ద్వారా నన్నలరింపవలయునని వారియూహ. ఆంధ్రభాషలోని కాంధ్రీకరింపఁబడిన గ్రంథములయం దెల్ల భారత భాగవత రామాయణములు విఖ్యాతినొందిన వనుట మరల మరలఁ జెప్పవలసినదియే లేదు. అందును బలువురు భాగవతమునందలి పద్యములను గంఠస్థములుగఁ జేసికొందురు. కాఁబట్టి పోతనమహాకవివర్యునిపద్యరత్నములఁ బెక్కింటి నిందుఁ జేర్పవలయునని శాస్త్రిగారి యుద్దేశము. తదనుమతిని శిరసావహించి యీ చిన్నిగ్రంథమునఁ జేర్పఁదగి నన్నిటికంటెఁ గొంచె మెక్కువగనే చేర్చి బాలురకు సుబోధ మగుపద్ధతిని వ్రాసితి. భాగవతమునుగూర్చి నే నిటఁ దెలుపఁదగిన విశేషములు లేవు. లేవనఁగా స్థలము చాల దని భావము. అవియున్నియు నావ్రాయు శ్రీ కృష్ణావతారతత్త్వమునఁ దెలుపుచునే యున్న

వాఁడను. ఇందు ముఖ్యముగా భగవత్కథలు భక్తచరిత్రములు సంగ్రహించి వ్రాయఁబడినవి. నడుమ నడుమఁగల గాథ లనేకములు వలయుననియే వదలఁబడినవి అందులకుఁగారణము గ్రంథముపేరే తెలుపుచున్నయది. ఇందుఁ గల్పించిన విషయములు లేవు. తెనుఁగుభాగవతము ననుసరించియే యిది వ్రాయఁబడినది. ఈ గ్రంథమాల తొలుదొలుతఁ గడపపురమున నారంభింపఁబడినది కాని చేయూఁత కొఱకనికారణమున నిలిచియుండియు శ్రీ వేంకటేశ్వరామోదమున మరలఁ దలయెత్తఁ గల్గెనని వ్రాయక తప్పకున్నది. ఈగ్రంథమాలికయందు ముం దెట్టి గ్రంథములు వెలువడునో చెప్పఁజాలకున్నవాఁడను. శ్రీ వేంకటేశ్వరారాధనమున నెట్టి గ్రంథరత్నములు పొడసూపునో, సేవచింపవలయునా. ఆవిషయము ముందే వ్రాసి పిదపఁ బని చూపఁజాలకుండుటకంటె గ్రంథరూపముననే తెలియఁబఱచుట సముచితమని తలంచుచున్నాఁడను. ఈశ్వరానుగ్రహమునను మహాజనులసమ్మోదమునను శ్రీ వేంకటేశ్వరప్రసాదమునను నావాంఛాఫలసారభూత మనఁదగు శ్రీ రామావతారతత్త్వము వెలువడు భాగ్యము గలిగెనేని కృతకృత్యుఁడ నగుదును. అందు విశేషాంశములు పెక్కులుగలవు. శ్రీ రామచరిత్ర మంద ఱెఱింగినను బహువిధవిషయము లెఱుఁగఁ దగియుండును. సంసారసాగరోత్తరణమున కది నౌక

వంటి దనక తప్పదు. ఆస్తికు లీమాటకు బదులాడ నోడుదురని నాభావము. ఇట్టి గ్రంథము వెలువడఁగాఁ జూచు భాగ్యము నాకు నుండవలయు. శ్రీరామచంద్రపాదారవిందచింతనమే పరమపురుషార్థమని భావించు నాకు నిట్టి కోరిక యొదవుటలోఁ దప్పేమియు లేదు. అది వెలువడఁ జేయుభారము పెద్దల యాశీర్వచనముం దున్నది.

పురాణములు వ్యర్థము లనుకొనుకాలము గడచినది. నెమలినచో నందే విశేషాంశములు కల వను నూహ సజ్జనులకు విశేషించి కలిగినది. ఒక్కొక్క రొక్కొక్కరీతిఁ బరికించు చున్నారు. అందు నేను గ్రంథపఠనమువలన, దానియర్థమును గ్రహించుటవలన, దాని నాచరణమునకుం దెచ్చుటవలన నేమే యుపయోగము లున్నవో వానింగూర్చి చర్చించువాఁడను. ఈ చర్చ యే సార్థకమని నేనూహించువాఁడను. గ్రంథ మేకాలమునఁ బుట్టినది? ఎట్టిలేఖినిచే వ్రాయఁబడి యుండవచ్చును? ఏచోటనుండి కవి దీనిని వ్రాసియుండును? అనువిషయములఁ బ్రధానముగా నూహించువాఁడను గాను. అదిశక్తిలేమి నని యనన్ను బదులుచెప్పఁ బూనువారిలో నేనొకఁడను గాను. ఇట్టి నన్ను నేదో యొక గ్రంథరచనకుం బురికొల్పి నావ్రాసినదానిని ముద్రించి తద్ద్వారమున నన్ను సత్కరించు పరోపకారబద్ధ

కింకరులగు బ్ర. శ్రీ. మ-రా-రా-శ్రీ, నాపిళ్ల, వేంకటేశ్వరశాస్త్రిగారి కేతన్ముఖమున నాకృతజ్ఞతం దెలుపుకొనుచున్నాఁడను.

ఇట్లని విన్నవించు సజ్జనవిధేయుఁడు,
కావ్యస్మృతితీర్థ
జనమంచి శేషాద్రిశర్మ.

శ్రీ శ్రీ శ్రీ.

శ్రీః

శుభమస్తు.

శ్రీ రామకృష్ణపరబ్రహ్మణే నమః.

సంగ్రహ భాగవతము

ప్రథమస్కంధము.

రుచిరంబై విలస
త్సారంబై సకలమాని ♦ జనసన్నుతమై
గోరికలొసఁగుచు వెలసెడు
శ్రీరామాహ్వయ మహంబు ♦ సేవింతు మదిన్.

ఆర్యబాలకులారా! సంగ్రహరామాయణమును, సంగ్రహభారతమును బఠించితిరి. వానివలన నేర్చుకొనఁదగిన విశేషాంశములఁ బెక్కింటిని నేర్చితిరి. ఇఁక సంగ్రహభాగవతమును బఠింపుఁడు. లోకవ్యవహారములుగాక యిందుఁ బరమా

ర్థవిషయములు పెక్కులు గలవు. కావుననే మహాకవిశిరోమణి శ్రీబమ్మెరపోతనామాత్యుఁడు

ఆ. భాగవతము దెలిసి ♦ పలుకుట చిత్రంబు
శూలికైనఁ దమ్మి ♦ చూలికైన
విబుధజనులవలన ♦ విన్నంత కన్నంత
దెలియవచ్చినంత ♦ తేటపఱతు.

అని వచించెఁగదా. కాఁబట్టి భాగవతకథను దెలియుట కష్టతరమని యెన్నఁదగియున్నది. అట్టిదానిని దెలిసికొనినఁ గలుగు లాభము లనంతములని తెలియకపోవు. కావుననే మీరీయుత్తమకథను దెలిసికొనవలయును. తెలిసికొనుటమాత్రమే చాలదు. దానిని శ్రద్ధగా మనస్సునం దుంచుకొనవలయును. అంతమాత్రమే చాలదు. మదినిలిపిన దానిని సార్థకముచేయవలయు. అంతతో నైనదియా తెలిసినదాని నితరులకు బోధింపవలయును. ఇవన్నియుఁ జేసినంతనే యైనదియా? ఆరీతి ననుష్ఠించి కృతకృత్యులు గావలయును.

శ్రీరామాయణ భారతకథలవలనఁ బ్రపంచజ్ఞానము గలుగును. నిశ్చయము. నీతియు నలవడును. ఈభాగవతకథవలనఁ బరమార్థజ్ఞానము గలుగును. దాన లోకజ్ఞానము నశింపదు. ఈ రెండును దీనఁ గలుగునుగాన నీమహాగ్రంథము భువనవిఖ్యాతిం గాంచెను. మొత్తముమీఁద నీగ్రంథరత్నత్రయ

మునం దుత్తమమధ్యమాధమసంజ్ఞల నేర్పఱుప శక్య మెవ్వరి కిం గాదు.

శ్లో. రాజీవమివరాజీవం జలంజలమివాజని.

అన్న శ్లోకగ్రంథరత్నము లనన్వయాలంకారముంబోలి సాటిలేక యిల వెలయుచుండు.

ఈభాగవతము రామాయణభారతములం జదివినపిదపనే చదువవలయు. ఏలయందురో? ఇందు భక్తిజ్ఞానవైరాగ్యములం దెలుపువిషయము లెక్కువ. కథారూపముల నవ్వాని నెంతసులభముగం దెలిపినను గష్టపడియే గ్రహింపవలసి యుండును. కానం దొలుతొల్త పైగ్రంథద్వయమును బఠించి పిదప దీనిం జదివిన మీకుం గష్టము తగ్గును. కాన దీని మూఁడవతడవ వ్రాయవలసినయవసర మేర్పడినది. ఇట్టి యుత్తమగాథను సంగ్రహముగం దెలిసికొని యావల భాగవతముం బఠింపుండు. అప్పుడు కవిరత్నమగు శ్రీబమ్మెరపోతనగారియుపదేశమును గ్రహింపంగల్గుదురు. కథనువినుటకుముం దొకవిషయమును విని దాని మనస్సున నుంచుకొనుఁడు.

శ్రీరామావతారమునం దాంజేయవలసిన పనిం బూర్తి నొందించి భగవంతుం డగు రామమూర్తి స్వీయలోకమున కరుగ నిశ్చయించుతఱి నామహాపురాణపురుషుని దివ్యమంగళవిగ్రహమును గన్నులారం గాంచి మునిచంద్రులుగూడ మోహ

పరవశులైరనియు, ఆవిధ మాత్మ నెఱింగి మీకోరిక యవతారాంతరమున సిద్ధింపఁగలదని శ్రీరామమూర్తి తెలిపెననియు, దాన ముదమంది విశ్వామిత్రాదిమునులు ద్వాపరాంతమున సత్యభామాదిరూపములం గాంచిరనియు, నొకకథను గొందఱుపెద్దలు చెప్పుచుండుట మీరును వినియేయుందురు. అది రామాయణమునఁ జెప్పఁబడలేదు. కావునఁ గేవల కల్పితమని తలంప నవకాశము కలదు. నమ్ముటకుంగూడ నవకాశముకలదు. కాని దానిని మీరు నమ్మి తీరవలెను. నమ్మితిరా శ్రీకృష్ణావతారఫలము మీకు బోధపడును. నమ్మక లేనిపోని ప్రశ్నములు వేయసాగితిరా మీకీకథామృతాస్వాదనఫలము లభింపకుండుటయే గాక విపరీతభావములు పొడకట్టును. నాస్తికబాలకులుగాక యార్యబాలకుల రగుమీ రీకథను జక్కఁగా నమ్మి శ్రీకృష్ణావతారకథాపఠనఫలమును బొంది కృతకృత్యులరుగండు. నాస్తికవాదములను జేసినిష్ఫలప్రయత్నులుగావలదు. ఇఁకఁ గథను వినుఁడు.

భగవంతుఁ డవతరించుటకు నేదియో గొప్పకారణముండియే తీరవలయు. స్వల్పకారణములు దానికిం జాలవు. ప్రపంచములో నెప్పుడైనను సరియే యెల్లరుఁ బరిశుద్ధచిత్తులై పరిశుద్ధప్రవర్తకులై యున్నతఱి భగవంతుఁ డవతరించునా? ఆయవతారమునకు ఫలమేమి? ప్రపంచము జలమయమై యున్నతఱి సృష్టి చేయునవసరము గలిగినపుడు బీజభూతులుగ నున్నప్రా

గుల నుద్ధరించి వారి నభివృద్ధిచేయుటకుగా మత్స్యావతార మొందెను. మఱికొంతకాలమునకు దేవతలకు మహావిపద్దశ సంభవింపఁగా మంధరపర్వతోద్ధరణ మొనర్చి వారి కమృతలాభ మనుగ్రహించి రక్షించి రాక్షసులబాధలు తొలఁగింపందలఁచి కూర్మావతారమెత్తెను. పిదపఁ గొంతకాలమునకు సాధువులగు దేవతల రక్షించుకొఱకే లోకాంతకుఁడగు హిరణ్యాక్షుని జంప వరాహావతార మంగీకరించెను. మరల సకలలోకస్థిత సాధుసంరక్షణార్థమే హిరణ్యకశిపుం జంప నృసింహావతార మవధరించెను. మరల నింద్రునిరాజ్య మపహరించిన బలిని నిగ్రహించుపొంటె నాతిండు ధర్మరాశిగాన యాచించుటకంటె నితరోపాయంబు సమంజసముకాదు కావున వామనావతార మాదృతిఁ గైకొనియెను. ఆవల భూలోకమున నవార్యశౌర్యంబున విజృంభించుచు మునిజనులనేఁచు రాజుల నడంపఁబూని యాకార్య మంతపెద్దదిగాదు కావునఁ బరశురామునియందుఁ దనయంశమును జొనిపి యాకార్యమును సాధించెను. తరువాత త్రిలోకకంటకుం డగుటయేగాక పతివ్రతల బాధించుచున్న రావణాసురుం బొలియింపఁబూని బ్రహ్మవరమున నాతని నింకొకరీతిఁ బొలియింప ననువుపడమి మర్త్యంబున సంపూర్ణకళలతో శ్రీరామావతారమాశ్రయించెను. అవ్వల దుష్టరాజలోకంబు సంహరింపఁబూని యద్దాని నింకొకరచేఁ జేయించినఁ జాలు నని యెంచి శ్రీకృష్ణావతారము నధిగమించెను.

ఈయవతారములన్నియు లోకవిపద్దశఁ బాపఁబూని నవియేగాని లోకము సుఖసమృద్ధమై సాధుజనుల కేకష్టము లు రానితఱి నైనవికావు కదా. సకలజనులు పరమపవిత్రులై భక్తిగుణప్రధానులై యున్నకాలమున భగవంతుఁ డవతరించె నని యేపురాణమునఁగాని చదివితిరా? వింటిరా? లేదుకదా? కావునఁ బామరులెల్ల భక్తిరసపరిపూర్ణహృదయులై యున్నపు డిదిగో భగవంతుఁ డవతరించును, మహాత్ముఁ డవతరించున నుట పిచ్చితనమని మీకైనం దెలియకయుండునా? కాన నట్టి మాటల నమ్మకుఁడు. అవి జల్పితములని భావింపుఁడు.

శ్లో. పరిత్రాణాయసాధూనాం వినాశాయచ దుష్కృతాం,
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే.

అని భగవద్వాక్యమే మొదటి విషయము యథార్థ మని ఘోషించుచున్నది. కాఁబట్టి ప్రొద్దుపోని ప్రసంగముల నాలకిం పక శ్రీకృష్ణావతారకారణమును వినుఁడు.

భూదేవి ప్రజలచే నిండియుండెను. దురాత్ములు తలయె త్తసాగిరి. వారికిఁ బలుకుబడియుఁ గలిగియుండెను. అట్టివారి మాటల నాలకించి చేయువారును గొందఱుండిరి. మొత్తము మీఁద ధర్మధ్వంసముచేయఁబూనువా రెక్కువమంది భూమి పై వసించిరి. అది భూదేవి కెంతో భారముగాఁదోఁచెను. భగవంతుఁ డీభారమును దీర్పఁగలవాఁడని మొట్టపెట్టుకొని

యెను. ఆమొఱ్ఱ భగవంతునిమది కెక్కెను. అంతమాత్రమున నయ్యెనా? అవశ్య మీభారమును దీర్పఁ ద్వరపడవలయునని యాపురాణపురుషునకుం దోఁచెను. దేవత లామహాపురుషుని తాత్పర్య మెట్లో తెలిసికొని తమతమయంశములచే భూతలంబునఁ గొందఱం బుట్టించిరి. ముందు పరిచరులు ఆవల ప్రభువుగదా రావలయు. ఆవల శ్రీకృష్ణుం డవతరించెను. తనభక్తాగ్రేసరుండగు నరుని విజయునిగా నవతరింపఁజేసెను. ఇట్లవతరించిన యామునివంద్యపాదారవిందుఁడు శ్రీకృష్ణుఁ డొనరించిన మహాకార్యములే యీభాగవతమునఁ దెలియంబడు. వానిం జదువుటకన్న నెక్కువపుణ్యకార్య మేమున్నది.

శ్రీరామావతారమున నాదివ్యమంగళవిగ్రహునిఁ గామించినవారలెల్ల గోపికలుగా నవతరించిరి. వారికెల్ల శ్రీకృష్ణమూర్తిని గోరుటయే పురుషార్థముగా నైనది. అట్లే కోరిరి. ఆశ్రీపతి వారల కోరికలం దీర్చె. కావున నీశ్రీకృష్ణగాథయం దఖిలభక్తజనరక్షణము తేటపడును. ఇంతియగాక రాఁబోవు వారలకు విహితకృత్యములఁ దెల్పుటయే యీయవతారమునకు ఫలము. మత్స్యకూర్మాద్యవతారములలోఁ జేయనిమహాకార్య మీయవతారమునఁ జేసెను. ఎట్లు? భగవద్గీతాదిభక్తిజ్ఞానవైరాగ్యాది సద్గుణబోధరూపమున. ఏల? కలికాలమున మానవు లధర్మపరులై సత్కార్యవిముఖులై తలకొకశాస్త్రమును గల్పింపఁగలరు. అట్టివారికి సన్మార్గప్రదర్శకమగుంగాక

యనుసూహాచే బోధించెనని యెఱుంగుఁడు. కాఁబట్టి కలియుగమునఁ జాలకాలము దనుక భగవంతుఁ డవతరింపఁబూనఁడని నమ్ముఁడు. నిష్ఫలోపన్యాసముల వినకుఁడు. అందు వాక్ప్రౌఢిమ తప్ప నింకొక్కటి యుండదు. కీర్తిం గోరి కొందఱట్లు మాటలాడుదురు. కాని వారిమాటలయందు సత్యముగ గగనకుసుమమేయగు.

ఆర్యబాలకులారా! యీపైఁజెప్పిన నాలుగుమాటలు చక్కఁగా మదినిలుపుకొని భాగవతమును బఠించిన మీకపార లాభములు కలుగు. లేదేని వృథా కాలక్షేపముచేసినట్లేయగు. అట్టికార్యమును మీ రెప్పుడు చేయఁబూనరను నమ్మకమునాకున్నది. మీరార్యబాలురుకదా! కావున మీరు శ్రద్ధగా దీనిం జదివి కృతకృత్యు లరగుదురనియు, దాన నాయీశ్రమము ఫలించుననియు గట్టిగా నమ్మితిని. ఇఁక భాగవతము ననుసరించి కథను సంగ్రహించి వ్రాసెద. అవధరింపుఁడు. దీనిని జదువుటకుముం దీపద్యరత్నమును జక్కఁగాఁ బఠించి తరువాతఁ గథను జదువ నారంభింపుఁడు.

తే. చేతులారంగ శివునిఁ బూజింపఁడేని
నోరునొవ్వంగ హరికీర్తి ♦ నుడువఁడేని
దయయు సత్యంబు లోనుగాఁ ♦ దలఁపఁడేని
కలుగనేటికిఁ దల్లుల ♦ కడుపుచేటు.

ఈభాగవతకథ పరీక్షిత్తునకు శుకమహాయోగివరుచేఁ జెప్పఁబడినది. కానఁ దత్కాలంబు మొదలను వదించెద.

పరీక్షిన్మహారాజు ధర్మంబును గాపాడుట.

ధర్మరాజు పరీక్షిత్తుని రాజుంజేసి సోదరులతో మహాప్రస్థానమునకుం బోయిశరీరంబు వదలెను. పిదప నభిమన్యుకుమారుండు తాతలప్రవర్తనము లక్ష్యముగా రాజ్యమును బాలించుచుఁ బ్రజానురంజకుఁడై యుండెను. ఒక్కనాఁ డారాజశశాంకుఁడు వేఁటాడుతమకంబున నరణ్యమునకుంబోయెను. పూర్వవాహినియగు సరస్వతీతీరంబున ధర్మదేవతయు భూదేవియు వృషభధేనురూపంబులం దాల్చి ధర్మువుంగూర్చి సంభాషించుచు ముందు దీని కేమికీడువాటిల్లునో యనుచుండ నీరాజావృషభధేనువు లుండుతావునకు మార్గవశంబున నరిగెను. ఆతరుణమ్మున

శా. కైలాసాచలసన్నిభంబగుమహా♦గంభీరగోరాజముం
గాఁ క్రోధుఁడు దండహస్తుఁడు నృపా♦కారుండు క్రూరుండు జం
ఘాలుం డొక్కఁడు శూద్రుఁ డాసురగతిం♦గారుణ్యనిర్ముక్తుఁడై
నేలంగూలఁగఁ దన్నెఁ బంచితిలఁగా ♦ నిర్ఘాతపాదాహతిన్.

౧-స్కం. ప-౪౧౧.

శా. ఆలోలాంగక సశ్రుతోయకణజా♦లాక్షిన్ మహాంభారవన్
బాలారూఢతృణావలీకబళలో♦భవ్యాప్తజిహ్వాగ్రనాం
దోళస్వాంత నజీనవత్స నుదయ♦ద్దుఃఖాన్వితన్ ఘర్మకీ
లాలాపూర్ణశరీర నామొదవు న♦ల్లంఘించి తన్నెన్ వడిన్.

౧-స్కం. ప-౪౧౩.

ఆకుపురుషుండు డీ ట్లావృషభధేనువులం దన్నుటం గన్నులారఁ జూచి పరీక్షిత్తు పట్టరానికోపంబున ధనుర్దండంబున గుణంబెక్కించి మందున ట్లున్నకాండంబుగూర్చి మేఘగంభీర వచనంబులతోఁ పాపాత్మా!

శా. నిన్నుం గొష్టులఁజెష్టెనో కదిసెనో ♦ నిర్భీతిపై గోవులన్
దన్నంగారణమేమి? మద్భుజసనా♦థక్షోణి నెవ్వేళలం
దున్నేరంబులు చేయరా దెఱుఁగవా ♦ ధూర్తత్వముల్ భూమిభృ
త్సన్నాహంబునొనర్చ దెవ్వఁడవు నీ ♦ శాసించెదన్ దుర్మతీ.

అని పలుకుచు దీనాననంబులై యున్నయారెండింటిం గాంచి భయంబుపోవుమాటలం బెక్కంటిం బలికి వానిపై నాబాణం బు ప్రయోగంబుసేయఁబూన వాఁడు రాజరూపంబువదలి వాడినమొగంబుతో భయవిహ్వలుండై కరంబులుసాచి ఆరాజు పాదంబుల శిరస్సిడి వధింపకు మోరాజచంద్రమా! వదింప కుము. అని ప్రార్థించెను. వానింజూచి చంపనొల్లక యెక్కిడిన శరాసనంబు డించి పాపాత్మాతొలంగుము. ఆర్తత్రాణంబున కుపయోగించు నీవాఁడిబాణము దీనహీనననంబునకుం గడంగదు. నారాజ్యంబున నిలువకుమని ఆజ్ఞాపింప నాతం డో రాజేంద్రా! నేనెందుండుదు. ఆనతిమ్ము. అనియె. రాజును వానికి ప్రాణివధ స్త్రీ ద్యూత పానంబు లనంబడు నాలుగుస్థానంబులం జూపెను. ఇంకను ప్రార్థింప సువర్ణమూలంబులగు నసత్యమదకామహింసా వైరంబు లనుపంచప్రదేశంబుల నొసంగి యివిగాక యి

తరస్థానంబుల స్పృశింపవలదనియాజ్ఞ చేసె. వృషభంబునకు దపశ్శౌచదయలను మూఁడుపాదంబుల నొసంగె. భూదేవిఁ కభయదానంబున సంతోషంబుం గూర్చె.

ఇట్లు కలిని నిగ్రహించి ధర్మదేవతం గాపాడి భూదేవి క భయప్రదానంబుచేసి హస్తిపురంబున సుఖంబుండెను.

పరీక్షిత్తునకు శృంగిశాపంబుగలుగుట.

ఒక్కనాఁడు మృగయు లరుదెంచి మహారాజా! కాన నంబుల భయంకరమృగంబులు విచ్చలవిడిం దిరుచున్నయవి. మునుల కపారిభయ మంకురించుచున్నదని విన్నవించిరి. పరీక్షిత్తును గాటంపుగు వేఁటతమకంబును మునులభయంబుం దీర్పుకు తూహలంబును బొంగ వారివెంటఁ జతురంగబలంబులం గూడి చనిచని మహారణ్యంబులం గ్రుమ్మరి మృగంబులం జంపిచంపి క్షుత్పిపాసల నలయుచుఁ జల్లనినీరుదొరకునా? యని కోరుచుఁ బోయిపోయి యొక తపోవనంబుం గాంచెను. అందొక మహామునిసియతుండై శాంతిమూర్తియై పంచేంద్రియములను బహిరంగ విషయులం బరుగిడనీక తపంబొనరించుచుండెను. జడ లాతని నావరించియుండెను. ఆమునింజూచి జలపానముచేయఁ గోరియున్నాఁడుగాన మాటరాక యెట్లో కష్టముమీఁద మునిచంద్రా! తోయము లిందునందుఁ గానరావు. వేఁటాడి బడలియున్నవాఁడను జలము లిప్పింపుమా? యని ప్రార్థించెను.

యోగనియతుండగుట నమ్మునివరునకు నీవార్త చెవుల సోఁకలేదు. కాన నూరకుండెను. ఆవిధ మెఱుంగక రాజు

ఉ. కన్నులుమూసి బ్రాహ్మణుఁడు ♦ గర్వముతోడుత నున్నవాఁడు చే
సన్నలనైన రమ్మనఁడు ♦ సారెజలంబులఁ దెచ్చి పోయఁడే
మన్ననసైనఁ జేయఁడు స♦మగ్రఫలంబులు పెట్టఁ డింత సం
పన్నతనొందెనే తనత♦పశ్చరణాప్రతిమప్రభావముల్. ౪౬౧-ప.

ఆ. వారిఁగోరుచున్న ♦ వారికి శీతల
వారి యిడుట యొట్టి ♦ వారికైన
వారితంబుగాని ♦ వలసిన ధర్మంబు
వారియిడఁడు దాహ ♦ వారిగాఁడు. ౪౬౨-ప

అని పలికి శ్రమజనితరోషమున ముని తన్నుం దిరస్కరించె నని తలంచి మృతసర్ప మొక్కటిఁ దచ్చటఁ బడియుండం దాని వింటికోపునం గొని వచ్చి వలయువని యాతని మెడకుం జుట్టిపోయెను.

అంత నాచోత నింతనంతఁ దిరుగుచున్న మునికుమారు లావిధంబంతయుం జూచి పోయి శృంగిం గాంచి

క. నరగంధగజస్యందన
తురగంబుల నేలురాజు ♦తో యాతురుఁడై
పరఁగన్ నీజనకుని మెడ
నురగముఁ దగిలించి పోయె ♦ నోడక తండ్రీ. ౪౬౩-ప.

అని తెలిపిరి. మునికుమారులతో నాడుకొనుచున్న శృంగి శృంగంబుతోడి మూర్తిధరించినట్టు విజృంభించి యదరిపడి బల్యన్నుం

బుల భుజియించి క్రొవ్విన వాయసంబులవలె, ద్వారంబులం గాచికొనియుండు సారమేయంబుల చందంబున దాసభూతులగు క్షత్రియాభాసు లేరీతి బ్రహ్మణులచేఁ దమకు సంరక్షకులుగ నియమింపఁబడిరి? అట్టివారియింట నన్నం బెట్లు గుడువందగియుండు? అనిపలుకుచు రోషావేశంబునొంది

ఉ. ఆడఁడు తన్ను దూషణము ♦ లాశ్రమవాసులఁగాని వైరులం
గూడఁడు కందమూలములు ♦ గూడుగఁ దించు సమాధిచిత్తుఁడై
వీడఁడు లోనిచూడ్కులను ♦ విష్ణునిఁదక్కఁ బర ప్రపంచముం
జూడఁడు మద్గురుండు ఫణిఁ ♦ జుట్టఁగ నేటికి రాచవానికిన్. ౪౬౭-ప.

ఉ. పోము హిరణ్యదానములఁ ♦ బుచ్చుకొనంగ ధనంబులేమియుం
దేము సవంచనంబులుగ ♦ దీవన లిచ్చుచు వేసరింపఁగా
రాము వనంబులన్ గృహవి ♦ రాములమై నివసింపఁ జెల్లరే
పామును వైవఁగాఁదగునె ♦ బ్రహ్మమునీంద్ర భుజార్గళంబునన్. ౪౬౮-ప.

అనిపలికి బాలకులారా! ఈరాజు దుర్వారగర్వమున విఱ్ఱవీఁగుచున్నవాఁడు. కాన శాపానలంబున వీసి దహింపక విడువరాదు. చూడుండని రోషించి కౌశికీనదికిం బోయి పాదప్రక్షాళనంబుఁ జేసి యాచమించి నియమంబున ధర్మరక్షకుండగు జగన్నాథుం దలంచి యందఱు వినుచుండఁగా గంభీరఘోషంబున

ఉ. ఓడక వింటికోపునమ్ము ♦ తోరగముం గొనివచ్చి మాఱుమా
టాడకయున్న మజ్జనకు ♦ నంశతలంబునఁ బెట్టి దుర్మద

క్రీడఁ జరించురాజు హరి ♦ కేశవులొడ్డినఁ గావఁ జచ్చుఁబో
నేడవనాఁడు తక్షకఫ ♦ ణీంద్రవిషానలహేతిసంహతిన్. ౮౨౩-ప.

అని శపియించెను.

ఆర్యబాలకులారా! ఇందలితత్త్వమును ఆలోచింపుఁడు. శృంగియో బాలుఁడు. అతఁ డిచ్చినశాపమో హరకేశవు లడ్డపడినను జరగియే తీరవలసినది. అట్లే జరగెనుగదా? ఇట్టి శక్తి యాబాలున కెట్లుగలిగినది? కొంచె మూహింపుఁడు. కారణమును వినుఁడు. ఆకాలమునసుండువారు సత్యసంధులు. వంచన మెఱుఁగరు. ధనాశాతత్పరులుగారు. ఐహికసుఖములే ప్రధానము, ఆముష్మికసుఖమన నేమో మనకేల యనునంతటి మూఢులునుగారు. వారికాధారము సత్యము. తపస్సు. కాన వారిమాట వజ్రమువలె నప్రతిహతమైనది. శృంగి తపంబొనరించి యంతటిశక్తి నెపుడుసంపాదించె నని ప్రశ్నింపకుఁడు. ఆ తనితండ్రి శమీకముని. నియతస్వాంతుఁడు. తపోరాశి. సత్యమూర్తియే. అట్టిమహాముని యీతనికి నుపనయనకాలమున నుపదేశించెను. ఆమహనీయునితపశ్శక్తి కొడుకునందుఁ గొంత సంక్రమించెను. కావున నట్టిశక్తి యాబాలునకు లభించెను. ఇఁక మనవిషయ మాలోచింతము. మనకు గురువులుగ నుండువారు మనవంటివారే. చదువుమాత్రమే చెప్పఁగల్గుదురు. సత్యతపస్సులఁబాలించి యవార్య నిరుపమానతేజోవిరాజితులుగారు. కావున వారి కట్టియద్భుతశక్తులులేవు. చక్కఁగా వాదిం

పంగలరు. ఉపన్యాసముల నీయఁగలరు. తపోనియతుల మాటలచేతం జెప్పఁగలుగుదురు. అంతియకాని ఆచరించి 'యిదమిత్థ'మని నిర్వచింపఁజాలరు. కాన మన కట్టిశక్తి వారినుండి లభింపలేదు. ఇఁకఁ గథవినుఁడు.

ఇట్లు శృంగి శపియించి తనతండ్రియాశ్రమమునకుం బోయెను. తండ్రి మెడనున్న యాసర్పంబుం గాంచి మిక్కిలి వగచి దానిం దీయఁజాలక యెలుఁగెత్తి యేడ్చెను. ఆధ్వనివిని శమీకముని నియమసమాప్తియగుటయు సమాధిఁజాలించి మెల్లనఁ గన్నులువిప్పి కొడుకు నూఱడించి సర్పశవం బేలవచ్చెనని ప్రశ్నించుచు దానిం దీసివైచెను. శృంగి భయంబుడిగి వృత్తాంతం బంతయు నెఱింగించెను. అంగిరసుండగు శమీకుండా శాపంబునకు సంతాపించి నాయనా? ఇట్టి బెట్టిదమగు శాపమునకుఁ దగినయపరాధమా? యిది. తండ్రీ! ఎంతపనిచేసితివి? అశ్వత్థామశాపానలదగ్ధుఁడై కమలనాభునికరుణావిశేషమున మరలఁ బుట్టినవాఁడు ధర్మస్థాపకుఁడు. బలవంతుఁడై ప్రజల కాపదలు లేకుండునట్లు పాలించుచున్నవాఁడు. ఇట్టిరాచపట్టిని దిట్టతనంబుగలవానిఁ దిట్టఁదగునే? ఇట్టికట్టిడికార్యము నేల చేసితివి?

ఉ. కాపరిలేని గొఱ్ఱియల ♦ కైవడిఁ గంటకచోరకోటిచే
నేపరియున్న దీభువన ♦ మీశుఁడు కృష్ణుఁడులేమి నిట్టిచో
భూపరిపాలనంబు సమ ♦ బుద్ధి నితం డొనరింపఁ జెల్లరే
యీపరిపాటిద్రోహమున ♦ కిట్లు శపింపఁగ నేల బాలకా. ౪౭౨-ప.

అని పరితపించి తపస్విజనుల కిది న్యాయముగాదని యా
తనికి బుద్ధిచెప్పి శాపంబు గ్రహింప శక్యంబుగాదని యూ
హించి కొడుకుచేసినపాపంబునకుం గుంది తనశిష్యు నొకనిం
బిలిచి యీవృత్తాంతం బెల్ల నామహారాజున కెఱింగించిరమ్మని
పంచి తననియమమును సాగించుచుండెను.

ఆశాపవార్త విని యభిమన్యుతనయుఁడు కామక్రోధా
దివిషయాసక్తుం డగుటనకుం దక్షకవిషాగ్ని విరక్తిబీజంబయ్యెఁ
గదా యని తలంచుచుఁ గరినగరంబునకుం బోయి యేకాంతం
బునఁ దాఁజేసినమహాపరాధంబునకుం గుందుచుఁ బ్రతిశాపం
బేమనియీఁదగునని తలంచుచు, రాజగర్వంబునకుం దగుప్రా
యశ్చిత్తమయ్యె నని సంతసించుచు

క. గోవులకును బ్రాహ్మణులకు
దేవతలకు నెల్లప్రొద్దుఁ ♦ దెంపునఁ బీడల్
గావించు పాపమానస
మేవిధమునఁ బుట్టకుండ ♦ నేవారింతుఁగా.

అని వితర్కించుచుండెను. తక్షకుం డేడవదినంబున శాపంబు
నిర్వర్తింప వేచియుండెను. పరీక్షిత్తు సప్తమదినంబునఁ దనకుఁ
దక్షకవిషాగ్నిజ్వాలామాలికల మరణంబు తప్పదని యెఱింగిన
వాఁడౌట భూస్వర్గలోకంబుల భోగంబులు హేయంబులని త
లంచి రాజ్యంబు విసర్జించి యాహారంబుమాని దీక్షఁబూని

మ. తులసీసంయుత దైత్యజిత్పదరజ♦స్స్నానంబుకంటెన్ మహో
జ్జ్వలమై దిక్పతిసంఘ సంయుత జగ♦త్సౌభాగ్యసంధాయియై
కలిదోషావలినెల్లఁ బాపు దివిష♦ద్గంగాప్రవాహంబుకో
పలికింబోయె మరిష్యమాణుఁడగుచున్ ♦ బ్రాయోపవేశంబునన్. ౪౯౬-ప.

మనస్సు శ్రీగోవిందపాదారవిందపరవశతనొంద నొనరించి వసించెను. ఆవార్త నెఱింగి సకలలోకపావనమూర్తులు మహానుభావులు తీర్థంబునకుఁ దీర్థంబులొసంగంజాలు మహిమము గలవారు నగునత్రి, విశ్వామిత్ర, మైత్రేయ, భృగు, వసిష్ఠ, పరాశర, చ్యవన, భరద్వాజ, పరశురామ, దేవల, గౌతమ, కశ్యప, కణ్వ, కలశసంభవ, వ్యాస, పర్వత, నారద ప్రముఖు లగు బ్రహ్మర్షి దేవర్షి రాజర్షి పుంగవులును, కాండర్షులైనయరుణాదులును అరుదెంచిరి. శిష్యప్రశిష్యులతోఁగూడి యనుగ్రహసమగ్రులై దర్శనమిచ్చిన యామహాత్ముల కుచితరీతిఁ బూజంగావించి కూర్చుండం బ్రార్థించి యారాజసత్తముఁడు తనవృత్తాంతంబెల్ల నెఱింగించెను. మఱియు వినయంబున

ఉ. భూసురపాదరేణువులు ♦ పుణ్యులఁ జేయు నరేంద్రులన్ ధరి
త్రీసురులార, మీ చరణ♦రేణుకణంబులు మేనుసోఁక నా
చేసినపాపమంతయు న♦శించెఁ గృతార్థుఁడనైతి నెద్దియేఁ
జేసిన ముక్తిపద్ధతికిఁ ♦ జెచ్చెరఁ బోవఁగవచ్చుఁ జెప్పరే. ౫౦౧-ప.

క. చూపుఁడు నాకల్యాణము
పాడుఁడు గోవిందుమీఁది♦పాటలు దయతో
నాడుఁడు హరిభక్తులకథ
నేడహములలోన ముక్తి ♦ నేఁగఁగ నిచటన్. ౫౦౫-ప.

అని ప్రశ్నించుచున్న యారాజచంద్రునితో మును లిట్లుపల్కిరి. రాజేంద్రా! నారాయణధ్యానమొనరించు పవిత్రమానసుఁడవు. తత్కృపాపాత్రుఁడవు. నీకుఁ దప్పక ముక్తిలభియించు నని పలుకుచున్నమునులతో నార్యవర్యులారా! నారాయణుకథావిశేషంబులం దెలిపి నన్నుం గృతకృత్యునిగాఁ జేయుండని ప్రార్థించెను. వా రందులకుఁ బ్రత్యుత్తరం బిచ్చుట కాలోచించుచుండఁగా

శుకమహర్షి వచ్చుట.

సీ. ప్రతినిమేషము పర♦బ్రహ్మంబు నీక్షించి
మదిఁజొక్కి వెలుపల ♦ మఱచువాఁడు
కమలంబు మీఁది భృం♦గములకై వడి మోము
పైఁ నెఱసినకేశ ♦ పటలివాఁడు
గెలిచివాఁసి మాయ నం♦గీకరించినభంగి
వసనంబుఁ గట్టక ♦ వచ్చువాఁడు
సంగిగాఁడని వెంటఁ♦జాటుభూతములు నా
బాలురహాసశ♦బ్దములవాఁడు
తే. మహితపదజానుజంఘోరు ♦ మధ్యహస్త
బాహువక్షోగళానన ♦ ఫాలకర్ణ
నాసికాగండమస్తక ♦ నయనయుగళుఁ
డైన యవధూతమూర్తివాఁ ♦ డరుగు దెంచె. గం ౬-ప.

ఇట్లు శుకమహాయోగి వచ్చుటయు నాతనిప్రభావంబు నెఱింగినవారుగావున నిజాసనంబులుడిగ్గి యమ్మునులెల్ల ప్రత్యు

త్థానంబు చేసిరి. పాండవపౌత్రుండు నా యోగిశిఖామణికి నతిథిసత్కారంబులు చేసి నమస్కరించి కూరుచుండంజేసి, మఱియును వినయభక్తులు మనమునఁ బెనఁగొనుచుండఁగా

ఉ. భాలము నేల మోప భయభక్తులతోడ నమస్కరించి భూ
పాలకులోత్తముండు కరపద్మములన్ ముకుళించి నేఁడు నా
పాలిటి భాగ్య మెట్టిదయొ పావనమూర్తివి పుణ్యకీర్తి వీ
వేళకు నీవు వచ్చితి వివేకవిభూషణ దివ్యభాషణా. ౫౨౧-ప.

మ. అవధూతోత్తమ! మంటి నేఁడు నిను డాయంగంటి నీవంటివి
ప్రవరుం బేర్కొనుచుంటటన్ భసితమా! పాపంబు నాబోఁటికిన్
భవదాలోకనభాషణార్చనపద ప్రక్షాళనస్పర్శనా
దివిధానంబుల ముక్తి చేపడుట చింతింపంగ నాశ్చర్యమే. ౫౨౨-ప.

అని ప్రార్థించి సప్తదివసంబుల ముక్తికింబోవు మార్గంబు చెప్పవే మహాత్మా! యని మఱిమఱి వేఁడెను.

ఇది ప్రథమస్కంధము.

ద్వితీయస్కంధము.

శుకయోగి పరీక్షిత్తునకు బదులుచెప్పుట.

పరీక్షిన్మహారా జిట్లు ప్రశ్నముచేయఁగా శుకయోగి యత్యంతాదరంబున నోమహారాజా! ఈప్రశ్న ముత్తమోత్తమము. ఆత్మవేత్త లెంతయు దీనికి మెత్తురు. ముక్తికిఁబోవుమార్గంబుఁ దెల్పుట యీప్రశ్నమునకు నుత్తరంబగు. కావున శ్రద్ధాళు వగునీకుఁ జక్కనిబదులుచెప్పెద. వినుము. ద్వైపాయనమహాముని నాతండ్రి· బ్రహ్మసమ్మితమగు భాగవతము నొనరించెను. దాని నాచేఁ బఠింపఁజేసె. దానిం జెప్పెద.

హరినామస్మరణసంకీర్తనాదులచేఁ బ్రాణి ముక్తికింబోవు. వేఱొండుపాయంబు లేనేలేదు.

తరలము. హరి నెఱుంగక యింటిలో బహు ♦ హాయనంబులు మత్తుఁడై
పొరలుచుండెడి వెఱ్ఱిముక్తికిఁ ♦ బోవనేర్చునె వాఁడు సం
సరణముం బెడఁబాయఁ డెన్నఁడు ♦ సత్య మాహరినామసం
స్మరణమొక్కముహూర్తమాత్రము♦చాలు ముక్తిదమౌన్నృపా. ౮-ప.

పుణ్యమూర్తీ! ఖట్వాంగమహీజాని యొకఁడు పూర్వముండెను. బలశాలియగునారాజునొద్దకు దేవత లరుదెంచి 'రాజా! దానవులు మమ్మోడించిరి. నీసాయముఁగోరి వచ్చితిమి.

మాకు రక్షకుండవుగమ్మా!' యని వేఁడిరి. రా జాదేవతలకొ
ఱకు దివికేగి యసురులజయించెను. సురలు సంతోషించి వర
మడుగు మిత్తుమనిరి. దేవతలారా! ప్రీతులైనమి మొక్కటి
వేఁడెద. నాజీవితకాలమెంత? చెప్పుఁడు. చాలు. ఇంకొక్కవ
రము నేనొల్ల. నావిని దేవతలు రాజా! నీకొక్కముహూర్త
కాల మాయుస్సున్న దనిరి. రాజు భూతలంబున కరుదెంచి సక
లైశ్వర్యముల నస్థులకచ్చి సర్వసంగవిముక్తుఁడై హరిని మనం
బునఁ బదిలంబుగానిలిపి రెండుగడియలలోఁ గైవల్యపదము
నొందెను. కావున శ్రీహరికీర్తనంబునఁ బొందనలవికాని పదంబు
లేదు. నీకేడుదినంబులకుంగాని జీవితాంతంబుకాదు. ఇంతలో
ముక్తికింబోవునట్లు హరిధ్యానంబుచేయవచ్చు. కాఁబట్టి ధారణా
త్మకయోగంబు నాశ్రయింపుము. శ్రీనారాయణుపాదారవింద
మ్ముల డెందంబునఁ బదిలంబుగానిలుపుము. ముక్తి కరతలామల
కంబగు. అని ధారణనిలుపు నట్టిపద్ధతిం దెలిపి రాజా! సంసార
సుఖంబు శాశ్వతంబని తలంపకుండునది. అట్లు నిశ్చయింపకు
న్నచో ముక్తిమార్గంబు చేకూరదు. తృప్తియుండుట ప్రధా
నము. వినుము.

సీ. కమనీయభూమిభా♦గములు లేకున్న వే
పడియుండుటకు దూది ♦ పఱుపులేల
సహజంబులగు కరాం♦జలులు లేకున్న వే
భోజనభాజన ♦ పుంజమేల

వల్కలాజినకుశా ♦ వళులు లేకున్న వే
కట్ట దకూలసం♦ఘంబులేల
గొనకొనివసియింప ♦ గుహలు లేకున్న వే
ప్రాసాదసౌధాది ♦ పటలమేల
తే. ఫలరసాఢ్యలు కురియవే ♦ పాదపములు
స్వాదుజలములనుండవే ♦ సకలనదులు
బొసఁగ భిక్షము పెట్టరే ♦ పుణ్యసతులు
ధనమదాంధుల కొలువేల ♦ తాపసులకు.

అనుబుద్ధిచే యోగియగుభక్తుం డుండుఁ గావున సంసారబంధంబునకు వృద్ధికరం బగుశయ్యాసనాదివస్తుగణంబునం దాశవదలి విరక్తుండవు కమ్ము.

అన విని శుకయోగితోఁ బరీక్షిత్తు 'మహాత్మా! భక్తి యోగంబుం దెల్పుమా' యని ప్రశ్నింప నాతం డిట్లని చెప్పె.

భక్తియోగమును రాజునకు శుకయోగి తెలుపుట.

రాజా విను?

మ. అమరేంద్రాదులఁ గొల్చుభంగి జనుఁ డా ♦ యజ్ఞాక్షు సేవింపఁగా
విమలజ్ఞాన విరక్తిముక్తులొదవుఁ ♦ వేయేల భూనాథ త
త్కమలాధీశకథాసుధారసనదీ ♦ కల్లోల మాలాపరి
భ్రమ మెవ్వారికినైనఁ గర్ణయుగళీ ♦ పర్వంబు గాకుండునే. ౪౦-ప.

వాసుదేవునిశ్లోకవార్త లాలకించు నతనియాయువుఁ దప్ప నితరులయాయుస్సును భానుం డపహరించుచుండు, దానిం

దెలియక నేను జాలసంవత్సరములు జీవింతునని మనుష్యుఁడు భ్రాంతినొందుచుండు. యమదూతలు కొనిపోయినతఱిఁ బుణ్యంబుచేయనైతిఁగదా యని విలపించు. కాఁబట్టి సర్వదా భగవన్నామసంకీర్తనంబు చేయుచు భగవద్దివ్యమంగళవిగ్రహమును మనస్సున ధ్యానించుచుఁ దాఁజేసిన, చేయుచున్న సుకృతకర్మముల భగవదర్పణముగావించుచుఁ నందుభక్తుఁడు శాశ్వతకైవల్యమునొందు. అట్లుగాకున్న నామనుష్యుఁడు పశుతుల్యుఁడై తుది నరకముఁ బొందు. కావున

సీ. విష్ణుకీర్తనముల ♦ వినని కర్ణంబులు, గొండలబిలములు ♦ కువలయేశ
చక్రిపద్యంబులఁ ♦ జదువనిజిహ్వలు, కప్పలజిహ్వలు ♦ కౌరవేంద్ర
శ్రీమనోనాథు నీ ♦ క్షింపనికన్నులు, కేకిపింఛాక్షులు ♦ కీర్తిదయిత
కమలాక్షుపూజకుఁ ♦ గానిహస్తంబులు, శవముహస్తంబులు ♦ సత్యవచన

ఆ. హరిపదతులసీద♦ళామోద రతిలేని
ముక్కుపందిముక్కు ♦ మునిచరిత్ర
గరుడగమను భజన ♦ గతిలేనిపదములు
పాదపముల పాద ♦ పటల మనఘ. ౫౦-ప.

సీ. నారాయణునిదివ్య ♦ నామాక్షరములపైఁ
గరగని మనములు ♦ కఠిన శిలలు
మురవైరి కథలకు ♦ ముదితాశ్రుగోమాంచ
మిళితమై యుండని ♦ మేను మొద్దు
చక్రికి మ్రొక్కని ♦ జడునియౌదల నున్న
కనకకిరీటంబు ♦ కట్టెమోపు

మాధవార్పితముగా ♦ మనని మానవుసిరి
వన దుర్గచంద్రికా ♦ వైభవంబు

ఆ. కైటభారి భజన ♦ గలిగి యుండని వాఁడు
గాలిలోన నుండి ♦ కదలు శవము
కమలనాభుపదముఁ ♦ గననివాని బ్రదుకు
పసిఁడికాయలోని ♦ ప్రాణిబ్రదుకు. ౫౧-ప.

అనిపలికిన విని రాజిట్లనియె. మహాత్మా! మీదివ్యబోధంబున మమకారంబువదలె. ఇంక భగవంతుని దివ్యచరిత్రంబును వినఁ గోరెద. హరి జగంబుల సృజించుట రక్షించుట సంహరించుట వినిపింపుము. మఱియు నామానసీయము నవతారవిశేషంబుల వివరింపుము. నావిని శుకయోగి భగవంతుని ధ్యానించి గురువందనంబుచేసి యిట్లనియె. రాజేంద్రా! వినుము. కల్పాదియందు విధాత తానున్నకమలనాళమును జూడఁ గోరి యాసనంబు మొదలు గానక విసిగి క్రమ్మఱ యథాస్థానంబునఁ గూరుచుండి జగంబులసృజించునిచ్ఛ పొడమఁగా దానిపద్ధతి జ్ఞానంబునఁ దోఁపమి నూరక చింతించుచుండెను.

అత్తఱి జలంబుల నడుమనుండి తపశ్శబ్దము వినంబడియె. రెండుమాఱు లది వినఁబడఁగా నాశబ్దము నుచ్చరించిన పురుషుం డెవ్వండో యని తెలియంగోరి వెదకెను గాని యాతండు కనఁబడఁడయ్యె. వెదకి వెదకిమరలి వచ్చి తనస్థానమునఁ గూరుచుండి నిశ్చలమనంబునఁ జిరకాలంబు తపంబొనరించెను. ఇట్లు వేయిదివ్యసంవత్సరములు తపంబుచేయఁగా భగవంతుఁడు పొడచూపెను.

బ్రహ్మ యంత వైకుంఠంబుఁ గాంచి యందొక దివ్యసౌధంబున లక్ష్మీసేవితుండగు శ్రీమన్నారాయణుం గాంచి నమస్కరించి స్తుతించినం బ్రసన్నుండై పుత్రా! నీవాంఛితం బెఱింగింపుమా యని పలుకుచు విరించీ! నీతపంబునకు మెచ్చితి. తపము నాస్వరూపము. తపోవృక్షమునకు ఫలము నేనే. ఆతపస్సునకు జననస్థిత్యుపసంహారముల నొనర్చువాఁడను నేనే. కాన తపము నాభక్తికి మూలధనమని తెలిసి నీవట్లుచేసితివి కాన విగతమోహకష్టుఁడవైతివి. కావున నోసరసిజాసనా! నీమనోవాంఛిత మేదియైన నిచ్చెదఁ గోరుమా యనియె. దాన మోదంబంది బ్రహ్మ యానారాయణమూర్తిని సృష్టివిధానంబు తెలుపవే యని ప్రార్థింప నాభగవంతుఁడు దాని నెఱింగించి యారీతి సృజియింపుమని యాజ్ఞయిడి నిజలోకంబుతో నంతర్ధానమొందెను.

బ్రహ్మయు నారాయణాజ్ఞానుసారము లోకసృష్టిని జేయందలంచి భగవంతునిధ్యానించి తద్గతహృదయుండై యధాపూర్వంబుగా లోకంబుల నిర్మించి యానందించుచుండ నారదముని యరుదెంచి తండ్రికి నమస్కరించి నీవు నన్నడిగినట్లే ప్రశ్నించెను. బ్రహ్మ భాగవతంబంతయు నెఱింగించెను. ఆపద్ధతి నీకుఁ దెలియవినిపించెద. తొలుదొలుత దానికిం గలసంబంధమును వివరించెద.

ఇది ద్వితీయస్కంధము.

తృతీయస్కంధము.

విదురుఁడు తీర్థయాత్రకుం బోవుట.

రాజేంద్రా!

కురుపాండవులు కలహించుచుండఁగా విదురుఁడు ధృతరాష్ట్రునితో దుర్యోధనుండు పాడితప్పి పాండవుల నడంపఁజూచుచున్నవాఁడు కాన నాతనివిడనాడి కులంబుద్ధరింపుము. లేకున్న నీ వంశంబు ధరణి నిలువంజాలదనియె. చెంతనున్న దుర్యోధనుండా మాటలకుం గినిసి శకుని కర్ణ దుశ్శాసనులు వినుచుండ విదురుఁడు దాసీపుత్త్రుఁడు. వీనిం గొప్పచేయుటచే నింతపుట్టె. వీనిం బిలువనేల? దాన నీతుండు గర్వించి యొడలెఱుంగక ప్రేలెడు ననియె. ఆమాటలకు విదురుండు కటకటంబడి కరినగరంబువదలి యడవులకుంబోయి పుణ్యాశ్రమంబులఁ జూచుచు నెన్నియో దేశంబులుగడచి భూప్రదక్షిణంబు సేయునట్లు తిరుగుచుండ నుద్ధవుండు కనఁబడియె. విదురుఁ డాతనిఁ గౌఁగిలించుకొని కుశలప్రశ్నపూర్వకంబుగా ద్వారకానగరవృత్తాంత మడిగెను. ఉద్ధవుం డమ్మాటలకు బదులుచెప్పఁబూనెను గాని శ్రీకృష్ణవియోగ మాతని కంఠంబును బంధించె. దానం గన్నీరునించి యెట్టకేలకు శ్రీకృష్ణబలరామాదులు భూలోకంబు వదలుటయు, ధర్మమున

శించుచుండుటయుం జెప్పెను. అట్లు శ్రీకృష్ణమహామునుఁజె ప్పుచు నాతనినిర్యాణంబు చెప్పునపుడు పూతనాదులకు ముక్తి నొసంగినమహాత్ముండు కరుణానీరధి తనపాదపద్మముల నాశ్ర యించినవారికి ముక్తినొసంగుటకురుదా యని పలికెను. విదు రుఁ డది యెట్లని యడిగెను. ఉద్ధవుండు శ్రీకృష్ణుండు బాల్య మున నొనరించినక్రీడలం దెలిపి పూతనాదుల నుద్ధరించిన పద్ధతిని వివరించి విదురా! శ్రీకృష్ణమూర్తి మునిశాపంబున సకలయాదవులు నశింప బలరాముం డొకవృక్షమూలంబునని లిచి దేహమును జాలింప నేను బరిపరివిధంబులఁ జింతించుచుఁ గృష్ణుం డెటనున్నవాఁడో యని వెదకుచుం బోయిపోయి యొకానొకతరుమూలంబుచెంత నాసీనుండైనభగవంతునిం గంటిని. అత్తఱిమైత్రేయమహామునియు నరుదెంచెను. మమ్మిద్ద ఱంగాంచి యామహనీయమూర్తి చేరంబిల్చి యాత్మస్వరూ పంబు నెఱింగించి నీకిఁకఁ బునర్జన్మంబులేదు. ఉద్ధవా! సంసార సాగరంబు తరించితి వని యాజ్ఞయిచ్చెనని వివరించెను.

విదురుం డామాటల కానందపరవశుండై మహాత్మా! నీవే యదృష్టవంతుఁడవు. నీయట్టిభాగ్యశాలి జగంబునం గలం డే. సాక్షాత్కృష్ణభగవన్ముఖంబున నాత్మజ్ఞానవాక్యంబుల నాలకించితివి. ఇంతకన్న నేమికావలయు? కావున నోకరుణానీ రధీ! ఆవాక్యంబుల నాకుం దెలిపి కృతకృత్యునిం జేయు మని ప్రశ్నించెను. ఉద్ధవుండును సంతోషించి విదురా మైత్రేయుండు

బ్రహ్మర్షి. ఆతండు నీకుఁ జెప్పఁగలండు. పోదమురమ్మని యాతనిం దోడుకొని పోఁబోయి భవభంగయు శుభాంగయు నగుయమునం దాఁటి బదరికాశ్రమమును జేరి దివిషద్గంగానదిం గాంచి యందు స్నానమొనరించి కృతకృత్యుండై యందొక్క నిర్మలవిశాలపులినతలంబున యమనియమాదియోగాంగక్రియానిష్ఠుంబూని పద్మాసనాసీనుండై హరిపాదసరసీరుహవిన్యస్తచిత్తుండై బాహ్యేంద్రియవ్యాప్తిం బాఱందోలి సతతోపవాసంబుల డస్సి యున్న మైత్రేయుం గాంచెను.

ఇట్లుద్ధవవిదురులు ఆమహామునిం గాంచి నమస్కరించి చేతులొగ్గి మహాత్మా! సంసారచక్రంబునం బరిభ్రమించు మూఢాత్ములఁ బశుప్రాయుల రక్షించుకొఱకుఁగదా నారాయణపరాయణులై మీవంటిపుణ్యాత్ములు లోకంబునం జరియింతురని పలికిరి. విదురుండు వినయంబున

క. మునినాథచంద్ర! ననుఁగై
కొని కాచుతలంపు బుద్ధిఁ ♦ గూడిన యేని౯
వినుము మదీప్సిత మది నా
చనువునఁ గావింపవయ్య ♦ సజ్జనతిలకా. ౧౮౩-వ.

ఆకోరిక యెయ్యదియన్నం జెప్పెద. త్రిగుణాత్మకమాయానియంత యగు భగవంతుండు స్వతంత్రుండయ్యును అవతరించి ఏయేయవతారంబుల నేయేకర్మంబు లాచరించెను. నిష్క్రియుం డగునాపరమేశ్వరుండు మొదటఁ బ్రపంచంబు నెట్లు సృ

జించెను? ఎట్లురక్షించెను? ఆమహాత్ముని యవతారచర్యలను దద్భక్తాగ్రేసరులప్రర్తనంబులు దెలిపి నన్నుం గృతార్థుం జేయుమా యని ప్రశ్నించెను.

మైత్రేయుండును విదురుం గాంచి యాతనిప్రశ్నంబునకు మిగుల సంతసించి యిట్లు పలికెను. పాపరహితా! శ్రీకృష్ణకథాశ్రవణతత్పరుండవై నీవు నన్నడిగితివి. శుభస్కరంబగు ప్రశ్న మిద్దియే. నీవు భగవద్భక్తుండవు. కాంబట్టి హరికథాశ్రవణకుతూహలుండవగుట విచిత్రంబుగాదు. ఇంతియకాదు. నీవు మాండవ్యమునిశాపంబున సాత్యవతేయువలన భ్రాతృక్షేత్రంబున శూద్రయోనిం బుట్టినయముండవు. పరమజ్ఞానసంపన్నుండవు. కావున శ్రీకృష్ణుండు తననిర్యాణకాలంబున నేనాతనిసన్నిధికింబోవ నీకుపదేశింపుమని నాకెఱింగించినవిషయంబులు చక్కంగం దెలిపెద నని మహాదాదితత్వంబులస్థితియు, తత్సృష్టియు నెఱింగించి స్వాయంభువునాంబడుమనువు ప్రజాభివృద్ధి నేసిన పద్ధతియుం దెలిపి, వెండియు నిట్లనియె.

స్వాయంభువుమనువు భార్యాయుతుండై బ్రహ్మదేవునకుమ్రొక్కి వినయవినమితోత్తమాంగుండై మాకెద్దియాచరణీయము. ఏకర్మముచేసిన నీకు హితంబగు దాని వచింపుమా! యనియె. బ్రహ్మయు సంతోషించి

చ. మనుకొని తండ్రియాజ్ఞం దల ♦ మోపి నిజోచితకృత్య మేమిపం
చినం దనశక్తియుక్తి నెడ ♦ చేయక చేయుట పుండరీకలో॰

చనపద సేవ చేయుట ప్రజాపరిపాలనశాలి యౌటయుఁ జ
జనకునకుఁ సుతుండు పరిచర్యలొనర్చుట సువ్వె పుత్రకా, ౩౯౦-ప.

భగవంతుఁడు యజ్ఞమూర్తి కావున నా సర్వేశ్వరు మదినిల్పి యజ్ఞములు చేయుము. విష్ణుభక్తి లేక చేయుయజ్ఞములు నిష్ఫలములు. అట్టివానిం జేయకుము. వికారవిదూరుఁడగు నారాయణునుంగూర్చి విధివిహితముగా యజ్ఞముల నొనరింపుము. దాన నీకును నీసంతానమునకును మేలుచేకూరును. అన విని స్వాయంభువుండు తండ్రీ! నాకు నివసింపఁ జోటులేకున్నది. యజ్ఞముల నెట్లుచేయుదు. సకలభూతముల కాధారభూతమగు నీభూమి నీటిలో మునిఁగియున్నయది. కాన దాని నుద్ధరించునుపాయ మెఱింగింపుము.

అని ప్రశ్నించిన బ్రహ్మయు నాలోచించుచుండెను. అంతలో బ్రహ్మదేవుని నాసికావివరమ్మునుండి యజ్ఞవరాహమూర్తి యంగుష్ఠమాత్రశరీరుండై వెలువడి యాకాశమున నిలిచి క్షణమాత్రమున నేనుఁగంతవాఁడయ్యెను. మౌను లచ్చెరువందిరి. బ్రహ్మయు నాశ్చర్యపరవశుండై యుండ సూకరాకారుండగు నాభగవంతుఁడు ప్రళయజీమూతభయదభూరిగర్జనాటోపభిన్నదిక్కాండ మగుఘుర్ఘురారావమునుగావించెను. దానివిని మౌనులెల్ల వేదమంత్రంబులస్తుతించిరి. అంత నాయజ్ఞవరాహమూర్తి జలంబుల మునింగి యున్నభూమి నుద్ధరించెను. అనఁగా విదురుఁడు మైత్రేయునితో మహాత్మా! యజ్ఞవరాహమూర్తి

హిరణ్యాక్షుం జంపెననివింటి. ఆకథ నెఱింగింపు మని ప్రశ్నింప మైత్రేయుం డుపప్పొంగి విదురున కిట్లనియె.

సనకసనందనాదులు వైకుంఠంబునకుం బోవుట.

విదురా! వినుము. హిరణ్యాక్ష హిరణ్యకశిపులవృత్తాంతమును వివరించెద. మున్ను బ్రహ్మమానసపుత్రు లగుసనకసనందనాదులు లోకంబులం గ్రుమ్మరుచు వైకుంఠమును జూడం గోరిపోయిరి. ఆలోకనై భవంబును జూచి యచ్చెరువంది శ్రీనారాయణమూర్తిని సేవింప నాతిసి దివ్యమందిరంబునకుం బోయిరి. అందు ద్వారంబున జయవిజయు లనువా రిరువురు రక్షకులై భగవద్దర్శనార్థ మరుదెంచినవారిని సమయంబెఱింగి లోపలికిం బోనిచ్చుచు ననసమయంబైన నడ్డుచునుండిరి. ఈసనకసనందనాదులు వృద్ధులయ్యును బాలురవలె వారికిం గన్పడిరి.

ఆసమయము ఎవ్వరింగాని లోపలికి విడువం గూడనిది గాన వీరినిగూడ సమయముగాదు. నుంతనిలువుం డని నిలువరించిరి. భగవద్దర్శనమునందలి తహతహపాటున వా రాగ్రహించి మీరు గర్వంబున మమ్మడ్డితిరి గాన మీరు భూలోకంబునం గామక్రోధలోభంబు లనుశత్రువులు బాధింపం బుట్టుండని శపించిరి. వారును నమస్కరించి తమతప్పు నొప్పుకొని క్షమింపం బ్రార్థించిరి.

ఇంతలో నీవృత్తాంతంబంతయు దివ్యజ్ఞానంబున నెఱింగి భగవంతుం డచ్చటికి వేంచేసెను. సనకసనందనాదు లామహా

త్మునిం బొగడి యవ్వల నీజయవిజయులను గాపాడుమని వేడిరి. నారాయణుండు వారితో మీరు రాక్షసులుగా జన్మించి నాకు శత్రువులై సర్వదా నన్నే స్మరించుచు నాచే మృతింగాంచి నా లోకంబునకుఁ జేరఁగలరు పొం డని యాజ్ఞాపించి యంతర్హితుం డయ్యెను.

ఆ జయవిజయులు మునులశాపంబు దురతిక్రమ మగు టయు, నారాయణునాజ్ఞ యగుటయుఁ గారణంబులుగాఁ గశ్యపుని రెండవభార్య యగుదితికడుపునం బుట్టిరి. వారిజన్మకాలమున ననేకోత్పాతములు గానంబడియె. దేవతలు సంక్షోభించిరి. ఇట్లు వా రుదయించినంతఁ గశ్యపమహర్షియు, వారిం జూడంగోరి, నామకరణంబు చేయుందలంచి

చ. దితిజఠరంబునందుఁ దన ♦ తేజము మున్నిడినట్టిపుత్త్రు న
ద్భుతచరితుర్ హిరణ్యకశి♦పుం డను పేరఁ బ్రసూతివేళ నా
దితి ముసు గన్నయట్టి రవి ♦ తేజుని గాంచనలోచనుండు నా
హితమతిఁ బేరుపెట్టి చని♦యెన్ నిజనిర్మలపుణ్యభూమికిన్. ౬౧౧-ప.

అంత నాతనయు లిద్దరు బ్రహ్మను దపంబున మెప్పించి యలభ్యవరంబులం బొందిరి. హిరణ్యకశిపుసోదరుం డగు హిరణ్యాక్షుండు గదాదండంబుం బూని యుద్దండబాహువీర్యంబున నెల్లరజయింపం బూని దిగ్విజయయాత్రకు బయలు వెడలెను. ఎదురుపడినవారి నెల్ల జయించుచు సముద్రంబునుజొచ్చి యందున్నవరుణునిం జూచి రణభిక్షయొసంగు దే యని యడుగ

నాతం డారాక్షసునిశక్తిప్రాభవంబులం దలంచి క్రోధం బుపసంహరించి మెల్లన నాతనితో నిట్లనియె. దానవేంద్రా! నీతోఁ బోర నే నెంతవాఁడను. యుద్ధవాంఛమాని యీజలంబుల నున్నవాఁడ. నీతోఁ బోరఁజాల. నారాయణమూర్తితప్ప నితరులెవ్వరు నీతో మార్కొని పోరంజాలరు. ఆతండు వైకుంఠపురంబున నున్నవాఁడు. ఇంకొక్కమాట వినుము.

ఉ. నిందకు నోర్చి యాజి మొన ♦ నిల్వఁగ నోపక వీఁగి పాఱు నీ
పందల వెంటఁ బడ్డ మగ ♦ పంతమె సర్వశరణ్యుఁ డైన గో
విందుఁడు దీర్చు నీపని వి ♦ వేకవిహీన చనంగ నోపుదే
నందుల కేఁగు మాతఁ డమ ♦ రారులఁ బోర జయించు నిచ్చలున్. ఉ. ౨3 ప.

ఇంతియకాదు. ప్రతియుగంబున నాతం డవతరించి దుష్టనిశాటులఁ గీటడఁగించుచుండు,

ఉ. కావున నావిభుం దొడరి ♦ కయ్యము చయ్యమెయిఁగఁ జేసి ర
క్షోవర! నీభుజాబలము ♦ సొంపఱి మేదినిఁ గూలి సారమే
యావలి కాశ్రయంబగుదు ♦ వచ్చటి కిప్పుడ యేఁగుదేని నీ
చేవయు లావు నేర్పడును ♦ జెప్పఁగ నేటికి మీఁదికార్యముల్. ఉ-౨౬-ప.

అనియె. ఆమాటల కుదగ్రతరుండై మండిపడి యప్పుడ కదలి వైకుంఠమునకుం బోవుచుండెను. త్రోవలో నారదుం డెదురుపడి యెందుఁబోయెదవన నతండు తనవాంఛితంబుఁ దెలుప నారదుం డోరాక్షసరాజా!

చ. గురుభుజుఁ డమ్మహాత్ముఁడు వి ♦ కుంఠపురంబున నేఁడు లేఁడు భూ
భరము వహింప నాదికిటి ♦ భారముఁ దాల్చి రసాతలంబునం

దిరవుగనున్నవాఁ డచటి ♦ కేఁగఁగనోపుదు వేని యేఁగు మం
దరయఁగఁ గల్గు నీకు నసు♦రాంతకుతోడి రణం బవశ్యమున్. ౬౩౦-ప.

ఆమాటలు చెవులుసోఁకఁగనే మండిపడి పద్మలోచను నెదిరింప నెపుడు పోరుదునా ? యనుకౌతుకంబు తన్నుం ద్వర పెట్టఁగా కాలదండంబుఁ దిరస్కరించుగదాదండంబు కరంబు నంబూని త్రిజగద్భయంకరాకారంబుమీఱ రసాతలంబునకుం బోయెను.

హిరణ్యాక్షుండు యజ్ఞవరాహముతోఁ బోరి మృతినందుట.

అంతకుమున్నె హిరణ్యాక్షు మృతినొందించుకుతూహలంబున యజ్ఞవరాహరూపంబు ధరియించియున్న శ్రీమన్నారాయణమూర్తి యాదనుజేంద్రుం గాంచి విలాసంబున,

సీ. తుదమొదళ్లకుఁజిక్కఁ ♦ దునిసిపాఱఁగ మోరఁ
గులశైలములఁ జిమ్ము ♦ కొంతదడవు
బ్రహ్మాండభాండంబు ♦ పగిలి చిల్లులుపోవఁ
గొమ్ములఁ దాటించుఁ ♦ గొంతతడవు
జలధులేడును బంక ♦ సంకులం బై యింక
ఖురముల మట్టాడుఁ ♦ గొంతదడవు
ఉడురాజు సూర్యుండు ♦ నొక్కమూలకుఁ బోవఁ
గుఱుచవాలముఁ ద్రిప్పుఁ ♦ గొంతతడవు
తే. గునియుఁ గుప్పించు లంఘించుఁ ♦ గొంతతడవు
నెగయు ధరఁ ద్రవ్వ బొటియఁగా ♦ నేపుకేఁగి

దానవేంద్రునిగుండెలు ♦ తల్లడిల్లఁ
బంది మెల్లన రణపరా♦పంథి యగుచు. ౬౩౭-ప.

ఆయాకారమును జూచి దనుజవరుండు తల్లడిల్లియు ధైర్యం బవలంబించి నిలునిలుమని యదల్చి మార్కొనియెను. భగవంతుం డాతని మాటల కాగ్రహించి యాతనింగాంచి కన్నుల నుండి నిప్పుకణంబులు పడుచుండ,

సు. వినగా యోగి యమంగళాచరణ యు♦ద్వృత్తిన్ ననున్ నీమది
స్సనయంబున్ వనగోచరం బగుమృగం ♦ బంచుం దలంతౌర నే
నెనయన్ వన్యమృగంబయౌదు బలియై ♦ యేతెంచు నీబోఁటి యా
శునకశ్రేణి వధింతు నేఁ డనిమొనన్ ♦ సోఁకోర్చి వర్తించినన్. ౬౫౫-ప.

అనిపలికి తలపడియెను. ఇట్లిరువురు ఘోరంబుగాఁ బోరాడసాగిరి. గదాఘాతంబుల మిడుంగురులుసెదర నట్టహాసంబులు భీరంబులు చెలంగఁ గొంతసేపు సంగరంబు భేద మింతయు లేక చేయుచుండిరి. భగవంతుం డగు నాదివరాహమూర్తి మించి యాతని నొప్పించి యాయసురుమేను చించి లోకంబు లౌరాయన హిరణ్యాక్షునిం జంపెను. దేవత లానందపరవశులై పూలవానలఁ గురిపించిరి.

కర్దమప్రజాపతి దేవహూతికి నభీష్టవరంబు లొసంగుట.

అని వినిపించి మైత్రేయుండు విదురుంగాంచి నీతికోవిదా! హిరణ్యాక్షుని చరితంబు వినిపించితి. ఆవలవినుము. స్వాయంభువుండు చరాచరభూతంబులం బుట్టించె. అందు దేవ

హూతి యనుకన్యను కర్దమమునికిచ్చి వివాహంబుచేయ నావనితామణి పార్వతి పరమేశ్వరుం గొల్చునట్లు కర్దముని సేవించుచుఁ గ్రమంబున స్నానపానాదులయందు నిచ్ఛమాని కృశించెను. ఇట్లు నిరంతర శుశ్రూషాపరాయణురాలగు నామెం గాంచి లేమా! నీవొనరించు శుశ్రూషల కలరితి. వరముం గోరు మిచ్చెద. దివ్యదృష్టియుఁ గావలయునేఁ బ్రసాదించెద. అన నామె యంజలింగీలించి తొలుత కృశించిననాయీదేహంబు పుష్టినొంది సకలసుఖంబు లనుభవింప వలంతిగ నుండ వలయు. ఆవల యాచించెద. అనియె. ఆముని కడుం బ్రసన్నుండై సకలవైభవంబులం దులదూగునొకసౌధంబు నిర్మించి విమానంబును గల్పించెను. దేవహూతియు సకలాభరణభూషితురాలై యట్లున్నభర్తంగూడి చాలకాలము విహరించెను. కొంతకాలమునకు దేవహూతికిఁ దొమ్మండ్రుగురుపుత్రికలుద యించిరి. అంత గర్దముండు సన్న్యసింప నుద్దేశించెను. అవి యెఱింగి దేవహూతి భర్తం జేరంబోయి యీపుత్రికలకుఁ దగినభర్తలం బ్రసాదించి నాకు జ్ఞానోపదేశము చేయంగలపుత్రునిం బ్రసాదింపుఁ డనిప్రార్థించెను. ఆమునియుఁ దొలుత సంతానము గల్గువఱకుఁ గూడియుందునని వాగ్దానము చేసియున్నవాఁడు కావున నామెమాటల నాలకించి దేవీ! నీగర్భంబున భగవంతుం డుదయించు. నియతవై యుండుమనియె. ఆమెయుఁ బతియానతి జవదాఁటక వర్తింపఁ గొంతకాలంబునకు

నారాయణమూర్తి కపిలనామంబున నాయింతికిం బుత్రుండై జన్మించెను. ఆకపిలముని తల్లియడిగినప్రశ్నములకు సదుత్తరంబు లొసంగి తత్వజ్ఞానంబుం బ్రసాదించెను. మఱియుఁ బిండోత్పత్తి ప్రకారంబును, గర్భస్థుం డగుజీవుండు భగవంతునిస్తుతించుపద్ధతియుఁ దెలిపెను. అని విదురునకుం దెల్పి మైత్రేయుండు మఱియు నిట్లని చెప్పెను.

ఇది తృతీయస్కంధము.

చతుర్థ స్కంధము.

దక్షునకు శివునితో విరోధంబుగల్గుట.

విదురా !

కర్దమసంతానంబు నెఱింగించితి. ఇంక దక్షుం డను ప్రజాపతి చరితంబును వినుము. దక్షునకుఁ బుత్రికాసంతానము గలదు. దేవవరులెల్లరు, మహర్షులును వారలం బెండ్లియాడిరి. ఈశ్వరునిభార్య యగుసతీదేవియుఁ బతిభక్తిరతయై యుండెను. సత్రయాగ మొకచో జరగుచుండ దక్షాదులచటికివచ్చిరి. దక్షాదులు ప్రజాపతులుగాన వారిరాకం గాంచి సదస్యులందఱును లేచిరి. బ్రహ్మయు నీశ్వరుండును లేవకుండిరి.

దక్షుఁ డంతట భక్తితో బ్రహ్మకు నమస్కరించి దేవతలొసంగినపూజలను గైకొని తనరాకం గాంచియు లేవకున్న యీశ్వరుంగాంచి నిప్పుకణంబులు కన్నులనుండి పడుచుండఁగా నచ్చటివారందఱ కాపురాంతకుం జూపి దేవతలారా! మోహమత్సరములతో నేఁబల్కుటలేదు. వినుఁడు. ఈశ్వరుఁ డీతఁడు దిక్పాలయశోహానికరుఁడు. సజ్జనాచరితమార్గం బీతనిచే నశింపఁజేయఁబడియె. సిగ్గుకూడ నీతనికిలేదు. సావిత్రీసమానయగు నాతనయను బతివ్రతను మర్కటలోచనుఁ డితఁడు సకలముని

సురసమక్షమునఁ బెండ్లియాడి శిష్యభావంబుఁ బూనినవాఁడు. అట్లయ్యు నేరాఁగాఁ బ్రత్యుద్గమాభివందనములు సలుపకున్న మానెఁ గాని నన్నుఁగాంచి నోటిమాటలనైనఁ బల్కరింపరాదా? వాని కేమికొదువగల్గెను? మఱియు,

సీ. అనయంబు లుప్తక్రి♦యాకలాపుఁడు మాన
హీనుఁడు మర్యాద ♦ లేనివాఁడు
మత్తప్రచారుఁ డు♦న్మత్తప్రియుఁడు దిగం
బరుఁడు భూతప్రేత ♦ పరివృతుండు
దామస ప్రమథభూ♦తములకు నాథుండు
భూతిలిప్తుం డస్థి ♦ భూషణుండు
నష్టశౌచుండు ను♦న్మదనాథుఁడును దుష్ట
హృదయుఁ డుగ్రుఁడును బ♦రేతభూని

తే. కేతనుఁడు వితతస్రస్త ♦ కేశుఁ డశుచి
యయినయితనికి శివనాముఁ ♦ డను ప్రవాద
మెటులుఁగలిగె నశివుఁ డగు ♦ నితని నెఱిఁగి
యెఱిఁగి వేదంబు శూద్రున ♦ కిచ్చినటులు. ౪౪-ప.

నాకుమారిత నిచ్చితి. ఏమిచేయవచ్చు? అని యిట్లు ప్రతికూలవచనములు పలికి యంతకంత కుప్పొంగుక్రోధంబును బట్టఁజాలక శపియించుకాంక్షచే జలంబులు కరంబులం గొని యెల్లరువినుచుండఁగా ఈశ్వరు నుద్దేశించి,

క. ఇతఁ డింద్రోపేంద్ర పర
కృతుఁడై మఖసమయమున హ♦విర్భాగము దే

వతలం గూడంగ మహితని
యతిం బొందక యుండుంగాక ♦ యని శపియించెన్. ౪౭-ప.

ఇట్లు శపియించిన దక్షునిం గనియు నీశ్వరుం డూరకుండెను. సభ్యులెల్ల రాతని నిందించిరి. దానం గోపం బినుమడింప నాతం డింటికిం బోయెను.

ఇట్లు దక్షుం డీశ్వరుని శపించినవార్త విని నందికేశ్వరుం డాగ్రహంబున నిట్లనియె. ఈదక్షుండు మర్త్యశరీరంబు శ్రేష్ఠంబుగాం దలంచి యప్రతిద్రోహి యైనభగవంతునందు భేదదర్శియై యపరాధంబుగావించెను. ఇట్టిమూఢాత్ముండు తత్త్వవిముఖుండగు. మఱియుం గూటధర్మంబు లయినసివాసంబుల గ్రామ్యసుఖకాంక్షలం జేసి సక్తుండై యర్థవాదంబు లయిన వేదంబులచే నష్టమనీషం గలిగి కర్మతంత్రంబు విస్తృతంబుచేయు. ఇంతియకాక దేహాదికంబు పాదేయంబులుగాం దలంచుచు బుద్ధిచేత నాత్మతత్త్వంబు మఱచి వర్తించుచుం బశుప్రాయుండై స్త్రీకాముకుండు నగు. ఇదియుంగాక దక్షుం డచిరకాలంబున మేషముఖుం డగు. ఇంతియకాదు,

మ. అనయంబున్ దనమానసంబున నవి♦ద్యన్ ముఖ్యతత్త్వంబుగాం
గని గౌరీశుం దిరస్కరించిన యస♦త్కర్తాత్ము నీదక్షునిన్
అనువర్తించినవాండు సంసరణక♦ర్తారంభుం డై నిచ్చలున్
జననంబందుచుం జచ్చుచున్ మరల నో♦జం బుట్టుచున్ వర్తిలున్. ౪౮-ప.

మఱియును ఈమహేశ్వరద్వేషు లైనద్విజు లర్థవాదబహుళంబు లైనవేదవాక్యంబులవలన మధుగంధసమం బైనచిత్త

క్షోభంబుచేత విమోహితమనస్కులై కర్మాసక్తు లగుదురు. మఱియును భక్ష్యాభక్ష్యవిచారశూన్యులై దేహాదిపోషణంబు కొఱకు ధరియింపఁబడిన విద్యాతపోవ్రతంబులు గలవారలై ధనదేహేంద్రియంబులయందుఁ బ్రీతింబొంది యాచకులై విహరింతురు.

ఇట్లు నందికేశ్వరుండు బ్రాహ్మణజనంబుల శపియించిన విని భృగుమహాముని సురల శపింపంబూని,

తే. వసుధ నెవ్వారు ధూర్జటి ♦ వ్రతులు వారు
వారి కనుకూలురగుదు రెవ్వారువారు
నట్టి సచ్ఛాస్త్రపరిపంథు ♦ లైనవారు
నవనిఁ బాషండులయ్యెద ♦ రని శపించె. ౫౦-ప.

ఇట్లిరువు రన్యోన్యశాపపరాభూతులయ్యు భగవదనుగ్రహంబు గల వార లగుటం జేసి నాశంబు నొందకుండిరి. ఈశ్వరుం డంతయు లోఁదలంచుచు అనుచరసమేతుఁడై నిజనివాసంబునకుం బోయెను. బ్రహ్మయు నాయజ్ఞంబును బూర్తి నొందించి కృతకృత్యుం డయ్యెను.

దక్షప్రజాపతి యజ్ఞముచేయుట, సతీదేవి యచ్చటికిఁ బోఁగోరుట.

తర్వాత దక్షశంకరులకు విరోధంబు వృద్ధినొందుచుం డెంగాని తగ్గదయ్యె. కొంతకాల మిట్లు గడచెను. అంతట దక్షుండు రుద్రవిరహితం బగుయజ్ఞము చేయసమకట్టి ప్రజా

పతిత్వగర్వంబున నీశ్వరాదుల ధిక్కరించి యరుద్రకంబుగా వాజపేయసవనంబు గావించి యావల బృహస్పతిసవననామకం బైనమఖంబు చేయం బ్రయత్నించెను.

ఆయజ్ఞంబు చూచువేడుక గల యాతనికుమారితలు తమభర్తలం గూడి యచ్చటికిం బోవుచుండిరి. వారినెల్ల నాతఁడు సమాదృతిం బిలిచియుండెను. దక్షతనయయు నీశ్వరుభార్యయు నగుసతీదేవి యాకసంబున విమానంబులతోఁ బోవుచు దేవతలు తండ్రియజ్ఞమహిమను గొనియాడుట విని యాకసమువంకం జూడ సురకిన్నరగంధర్వాంగనలు సకలాభరణభూషితాంగ విరాజితలై పోవుచుండం గాంచి యీశ్వరునితోఁ నిట్లు పలికెను. ప్రాణేశ్వరా! నాతండ్రి యజ్ఞముచేయుచున్నాఁడట. వింటిరే. ఆయధ్వరమును గాంచుకోరికల నిదిగో సురగంధర్వాదులు తమతమకాంతలం గూడి యరుగుచున్నవారు. నాకును బోవలయు నను వేడుక జనించుచున్నయది. నాతోఁబుట్టువులంద ఱచటికివత్తురు. ఒక్కచోట నందఱం జూచినట్లగును. కాన నినుంగూడి యచటికిం బోయి పారిబర్హకసంజ్ఞఁగల భూషణములం గైకొనఁ గోరికపుట్టెడు. మహేశ్వరా! సకలబ్రహ్మాండములు భవన్మాయానిర్మితంబు లగుట నీకునాశ్చర్యకరంబుగాకున్నను భవదీయతత్వం బెఱుంగక స్త్రీస్వభావంబుగలిగి కృపణురాల నగునేను నాజన్మభూమిం జూడఁ

గోరితి. ఈ నాకాంక్షితమును సఫలమగునట్లు చేయుమా యని ప్రార్థించెను.

భగవంతుండు సర్వజ్ఞుండు. సర్వసాక్షి. సర్వసముఁడు. అయినను ఆకాలమున నామెమాటలకు బదులుచెప్పంబూని తనయసమ్మతిం జూపఁబూని, కాంతాతిలకమా! నీవన్నమాట నిశ్చయమే. బంధువులయిండ్లయందు జరగుశుభమహోత్సవములకుఁ బిలువకున్నను బోవలసినదే. కాని యది యశ్శత్రిము లగుజనులయెడ నుపయోగింపఁదగు తంత్రము. నీతండ్రి సజ్జనుఁడుకాఁడు. దుర్మతి. గర్వి. కావున మన మటకుం బోరాదు. పోయినచో నవమానము తప్పక కల్గును. నీవు ప్రియపుత్రికవయ్యును నాకుఁ బత్నివగుటం జేసి పిలువఁబడకపోయితివి. కాన నాయందున్న క్రోధము నీయందు నాతని కుండకపోదు. నిన్నవమానించును. నేను రాను. నీవు పోవలదు. పోయితివా యప్రియంబు వాటిల్లు. నావిని యామె మనంబున నేమేమోయనుకొనుచు వెడలిపోయెను.

ఇట్లు సతీదేవి ప్రయాణము సాగించుటెఱింగి ప్రమథగణములలోఁ గొందఱు వెంటఁబోయిరి. వారు వెంటరా నా సతి పోయిపోయి తండ్రియజ్ఞశాలం గాంచి లోపలఁ బ్రవేశించెను. ఆమెం గాంచియుఁ గాంచనట్లు తండ్రి యూరకుండెను. పలుకరింపనితండ్రిభావ మెఱింగి తక్కినతోఁబుట్టువులు నట్లే యూరకుండిరి.

సతీదేవి దేహత్యాగముచేయుట.

ఇట్లు సతీదేవి తండ్రిచేతను, దోఁబుట్టువులచేత నవమానింపఁబడి యీశ్వరోక్తి మనంబునం దలంచి తండ్రీ! పరమేశ్వరు సామాన్యుంగాఁ దలఁచి యిట్లు నిందించితివి. అంతియ కాక పిలువకున్నను వచ్చిన నన్ని ట్లవమానించితివి. నీ కీశ్వర తత్త్వ మించుకయుఁ దెలిసినదికాదు. ఇది నీప్రాగ్జన్మపాపఫలమే యనక తప్పదు. వేదనుతుండై ప్రపంచమూలకారణం బన నలరుభగవంతుని పరమేశ్వరుని శివు జామాతృబుద్ధిచే సామాన్యుంగాఁ దలంచుటకన్న నవినీతి మఱేముండును? ప్రేతభూచరుఁడను లోనగుదురుక్తుల నిందించితివి. మహర్షు లిట్లు శంకయుం దలంపరు. కావున,

చ. నెలకొని ధర్మపాలనవి◆నిర్మలు భర్గుఁ దిరస్కరించున
క్కలుషునిజిహ్వఁ గోయఁదగుఁ ◆ గాకటు చేయఁగ నోపఁడేని దాఁ
బోలియుట యొప్పు కంటికిఁ బ్ర◆భుత్వము చాలమిఁ గర్ణరంధ్రముల్
బలువుగ మూసికొంచుఁ జనఁ◆ బాడి యటందురు ధర్మవర్తనుల్. ౧౦-ప.

మ. జనుఁ డజ్ఞానమునన్ భుజించినజుగు◆ప్సం బైనయన్నంబు చ
య్యన వెళ్లించి పవిత్రుఁడైనగతి దుః◆ష్టాత్ముండవై యీశ్వరున్
ఘను నిందించిన నీతనూభవమునం◆గా నొర్వ నీహేయభా
జనమైనట్టి శరీరముం విడిచి భా◆స్వచ్ఛుద్ధిఁ బాటిల్లెదన్. ౧౧-ప.

అని యిట్లు దేవి యనేకభంగులం బలికి యాశరీరంబు పాయుటకన్న నుత్తమమార్గంబు వేఱొండు లేదని నిశ్చయించి యుదఙ్ముఖియై యాచమనంబుచేసి మౌనంబుధరియించి పరమే

శ్వరుండే తనకు జన్మాంతరమున భర్తయగుంగాక యని తలంచుచు యోగమార్గంబున ననలునుద్దీపింపఁజేసి యొకక్షణంబున భస్మమయాంగియై చనియెను.

సతి మృతినొందుటం గాంచి యామెయనుచరులగు ప్రమథగణములు గదాఖడ్గాదిసాధనంబులందాల్చి దక్షునిపైఁ గవియ మహాక్రోధంబున భృగుమహాముని యాభిచారకహోమంబుచేయ ఋభునామకదేవత లుదయించి వారలం బాఱందోలిరి. వారును గైలాసంబున కరిగిరి.

నారదుండావార్తను శంకరునకెఱింగించెను. ఈశ్వరుండామాటల నాలకించి గర్వితుండగు దక్షుని విడుచుట పాడిగాదని యూహించి మహాగ్రహంబున సంరంభించి,

శా. ఆద్యుండుగ్రుఁడు నీలకంఠుఁ డిభదైత్యారాతి దష్టోష్ఠుఁడై
మాద్యద్భూరి మృగేంద్రఘోషమున భీమప్రక్రియ న్నవ్వుచున్
విద్యుద్వహ్ని శిఖాసముచ్చయరుచిన్ వెల్గొందుచంచజ్జటిన్
సద్యఃక్రోధమతోడఁ బుచ్చి వయిచెన్ క్ష్మాచక్రమధ్యంబునన్. ౧౦౫

వీరభద్రుఁ డుదయించి దక్షునియజ్ఞమును బాడుచేయుట.

ఇట్లు జటను భూమిపై వైవఁగా నందుండి భయంకరాకారముగల యొకమహాపురుషుం డావిర్భవించెను. అతఁడే వీరభద్రుఁడు. రెండవరుద్రుఁ డనందగువాఁడు. ఇట్లుదయించి తండ్రీ! యేమిచేయవలయు నాజ్ఞయిమ్మని వేఁడెను. అపుడు శంకరుండు,

చ. గురుభుజశౌర్య భూరిరణ♦కోవిద నుద్భట కోటి కెల్ల నీ
వరయ వరూధినీవరుఁడ♦వై చని యజ్ఞముఁగూడ దక్షునిన్
బరువడిఁ ద్రుంపు మీ వచటి♦బ్రాహ్మణతేజ నుఁ జేయమంటివే
నరిది మదంశసంభవుఁడ ♦ వై తగు నీకు నసాధ్యమెయ్యెడన్. ౧౦౯-ప.

అని యాజ్ఞాపించెను. ఇట్లు వీరభద్రుఁ డీశ్వరాజ్ఞ శిరంబు నధరియించి యీశ్వరునకుఁ బ్రదక్షిణం బొనరించి నిశితశూలమును గేలనంది దక్షునియజ్ఞస్థలంబునకుం బోయెను. రుద్రపార్షదు లాతనిం గలిసికొని మఖశాలం బ్రవేశించి బహుభంగుల ధ్వంసముగావించిరి. సూర్యున కాసందడిలో దంతములు డుల్లుటయు భృగుమునికి శ్మశ్రుపాతము నింకను మిగిలినవారికిఁ గావలసినప్రాయశ్చిత్తములు చక్కఁగా నెఱవేతెను. దక్షునిబట్టి వీరభద్రుండు కంఠమునఱికి హోమముచేసెను. తక్కినవారు గాలికి బుద్ధిచెప్పి యెటకో పరుగిడిరి. వీరభద్రుండు పనిముగియుటంజేసి మరలి కైలాసంబునకుం బోయెను. ఆయజ్ఞమునకు నారాయణుండు బ్రహ్మయు రారైరి.

బ్రహ్మాదు లీశ్వరుం బొగడుట.

అంతట దేవత లీవార్తను బ్రహ్మకుం దెలుప నాతండు వారలదుఃఖమును మాన్పి వారిం దోడ్కొని కైలాసంబునకుం బోయి శంకరుని బహుభంగులం బొగడెను. అందుల కానందించి మరలఁ జచ్చినవారి బ్రదికింపందలంచి శంకరుండు దక్షుం

డజముఖుండగుననియె. ఇతరుల కట్లె వారివారికిందగినట్లు వర ములిచ్చెను. బ్రహ్మయు నామహేశ్వరుం బ్రార్థించి తోడ్కొని తానును దేవతలును దక్షునియజ్ఞవాటమునకుం బోవ దక్షుం డజముఖుండై లేచి యీశ్వరుం బొగడి బ్రహ్మాదుల గారవించి యీశ్వరునకు హవిర్భాగంబొసంగి యజ్ఞమునుసాంతముగావిం చెను. అప్పటికి విష్ణుమూర్తియరుదేర దక్షాదు లమ్మహాత్ముని బహుభంగుల స్తుతియించిరని మైత్రేయుండు విదురునకుంజెప్పి శ్రీనారాయణభక్తుం డగు నొకబాలకునిచరిత్రంబుఁ జెప్పెదవి నుమని యిట్లుచెప్పెను.

ధ్రువునిచరిత్రము.

శ్రీకృష్ణభక్తాగ్రేసరా! బ్రహ్మకు స్వాయంభువుమను వుద యించెను. ఆయనభార్యయగు శతరూపకుఁ బ్రియవ్రతోత్తాన పాదు లనునిరువురుకొడుకు లుదయించిరి.

అందుత్తానపాదుండు ప్రసిద్ధిగాంచెను. ఆరాజునకు సునీ తియు సురుచియు ననునిద్దఱుభార్యలు కలరు. సునీతికి ధ్రువుం డనుకొడుకుపుట్టె. ఆభార్య రాజునకుఁ బ్రియపత్నిగాకుండెను. రెండవభార్యయగుసురుచి ప్రియపత్నియైయుండెను. ఆమెకు ను త్తముఁడనుకొడుకు పుట్టెను.

రాజొకనాఁడు కొలువుకూటమున సింహాసనముపై నుండఁగా ఉత్తముఁ డనుచిన్నభార్యకొడుకు చేరఁబోయెను. వానినెత్తుకొని ముద్దాడుచుండెను. ధ్రువుండును తండ్రితోడ

నెక్కఁబోవఁగా నుత్తానపాదుఁ డాతనినెత్తుకొని ముద్దాడక యూరకుండెను. అదిచూచి సురుచియు మొదటనే గర్వించి యుండునది కాన మఱింతగర్వమూని సవతికొడుకైనధ్రువుని జూచి,

తే. తండ్రితొడ నెక్కు వేడుక ♦ దగిలెనేని
పూని నాగర్భమున నాఁడు ♦ పుట్ట కన్య
గర్భమునఁ బుట్ట కోరవఁ ♦ గలదె నేఁడు
జనకుతొడ నెక్కు భాగ్యంబు ♦ సవతి కొడుక. ౨౧౯-ప.

క. అదిగాక నీవధోక్షజు
పదపద్మము లాశ్రయింపు ♦ పాయక హరి నా
యుదరమునఁ బుట్టఁజేయును
వదలక యట్లైన ముదము ♦ వడసెద వనఘా. ౨౨౦-ప.

అని యిట్లు వినరాని మాట లాడెను. ఆపలుకులు ములుకుల వలె మనమున నాటి బాధింపఁగా తండ్రి యుపేక్షించుట కెంతయుంగుంది దుఃఖాంబురాశిలోమునుఁగుచు దండతాడితసర్పంబుభంగి రోషకలితుండై కన్నీరు మున్నీరుగా స్రవించుచుండఁ దల్లికడకుం బోయెను. తల్లియు నట్లు వచ్చినపుత్త్రునిం గాంచి తొడలపై నిడుకొని ఆవృత్తాంతంబంతయు నందున్న దాసీజను లెఱింగింప నిట్టూర్పులుపుచ్చుచుఁ గొడుకుంజూచి నాయనా! పెనిమిటి నన్ను భార్యయని భావింపకపోయిన మానెఁ గాని దాసియనికూడ భావింపకున్న నావంటి దౌర్భాగ్యురాలి కడుపునఁ బుట్టితివిగాన సవతి యట్లుపలుకుట మంచిదే. ఆమె

చెప్పినట్లు శ్రీహరిపాదపద్మముల నాశ్రయింపుము. ఆశ్రీహరి తప్ప నొండు శరణంబు లేదని హితి ముపదేశించెను.

ధ్రువుండును జననీవాక్యముల విని తన్నుఁ దాన నియ మించుకొని పురంబు వెడలి పోవుచుండఁగా నారదుం డెదురు పడి తద్వృత్తాంతంబంతయు దివ్యదృష్టి నెఱింగి పాపనాశన దక్షం బగు తనదక్షిణకరంబున నాతనిశిరం బంటి మానభం గంబునకు సహింపని క్షత్రియుల ప్రభావం బద్భుతంబుగదా యని యూహించి వత్సా ! సకలసంపత్సమృద్ధం బగునగ రంబు వెలువడి యెందేగెదవు ? స్వజనకృతావమానసంతప్తుం గా నిన్నుం దలంచెద.

అనిన ధ్రువుండు నారదునితో మహాత్మా సపత్నీమాతృ వాగ్బాణక్షతంబగు వ్రణంబును భగవద్ధ్యానరసాయనంబున మాపుకొనం బ్రయత్నింపఁబోయెద నన నారదుం డిట్లు పల్కెను.

బాలకా! నీవు కడుం జిన్నవాఁడవు. క్రీడలం దేలుచుం డునీయీడున నీ కవమానమానములు లేవు. కాన నోర్చియుం డుము. తల్లి చెప్పినరీతి భగవంతునారాధింతు నంటివేని అది చా లకష్టమగుపని. యోగీంద్రు లెంతో కాలంబు శ్రమంపడుదురు. అప్పటికిని లభింపకున్న బహుజన్మములం బ్రయత్నింతురు. అ ట్లుచేసియు నాభగవంతునిమార్గము కనుంగొనం జాలరు. కాన నతఁడు దురారాధ్యుఁడు. ఇట్టి నిష్ఫలోద్యోగమును మానుము.

అని బోధించెను గాని యాతనిపట్టుదల తగ్గదయ్యెను. ఆవిషయం బెఱింగి హర్షించి నారదుండు వత్సా! నిన్నుం బ్రేరేపించినవాఁడు భగవంతుఁడుగాని మఱొకరుగారు. అని తపోనియమంబులం దెలిపి నీవు యమునాతీరమున నున్న మధువనంబునకుం జనుము. ఆవనము పరమపవిత్రమైనది. ఆనదిం గ్రుంకి నిష్ఠతో నీమంత్రంబు జపియింపుమని వాసుదేవమంత్రం బుపదేశించి పూజావిధానంబుం దెలిపి యంతర్హితుం డయ్యెను.

ధ్రువుండు నారదోక్తప్రకారంబ మధువనంబునకుం బోయి తపం బొనరించుచుండెను. ఆయుగ్రతపంబునకు దేవతలు భీతిల్లి నారాయణున కెఱింగించి సత్వరంబుగ నాతనికోర్కెఁ దీర్పవేయుని వేఁడిరి. నారాయణుండు ధ్రువునకుం బ్రత్యక్షంబయ్యెను. ధ్రువుం డామహనీయమూర్తికి నమస్కరించి స్తుతిసేయనసమర్థుండై యూరకుండెను. ఆవిధం బెఱింగి తనశంఖంబున నాబాలకుని కపోలతలంబంటిన నాతండు దివ్యజ్ఞానసంపన్నుండై భగవంతుని వేదవాక్యంబుల వినుతించెను.

ఆస్తుతులకుం బ్రీతుండై నారాయణుండు వత్సా! జ్యోతిశ్చక్రంబునందు శాశ్వతంబగుపదంబు నీకొసంగితి. దాని నిరువదియాఱువేల సంవత్సరములు గడువఁగాఁ బొందఁగలవు. అంతవఱకు రాజ్యంబు ధర్మంబునఁ బాలింపుము. నీయనుజుం డగు నుత్తముఁడు మృగయార్థంబు వనంబులకుం జని మృతుండగు.

వాని వెదకుచుంబోయి వానితల్లియు దావపావకున కాహుతి యగు. నీవు నన్ను యజ్ఞంబుల నారాధింపుము. అని పలికి యదృశ్యుం డయ్యెను.

ధ్రువుండు సంతృప్తి నొందక పురంబున కరుగుచుండ ముందఱ నారదుం డాతనిరాక ఉత్తానపాదునకుం దెల్పెను. ఆతం డానందించి ధ్రువు నెదుర్కొని గాఢాలింగనపూర్వకంబుగా శిరస్సు మూర్కొని మన్ననలం దన్పెను. ధ్రువుం డెల్లరకు నమస్కరించి సోదరు నాదృతిం గాంచి పౌరుల కెల్ల నానందంబు గల్గించెను.

అంత నుత్తానపాదుం డాతనికి రాజ్యంబు నప్పగించి వృద్ధుండగు తన్నుం దా నెఱింగి వనంబునకుం జనియె. ధ్రువుండు రాజ్యంబును బూజ్యభంగి నేలి యుత్కలనామకుండగు పుత్రుని, నతిమనోహరాంగియగు కన్యారత్నంబుం గనియె. ఆతనిసోదరుండగు నుత్తముండు వివాహంబు లేకుండ మృగయార్థంబువనంబునకుం జని యందు యక్షునిచే హతుండయ్యెను. ఆదుఃఖంబున నాతనితల్లియు నడవులకుం బోయి దావపావకపరివృతయై మృతిం బొందె.

ధ్రువుండు నారాయణాజ్ఞానుసారము రాజ్యంబుం బాలించి భగవత్పూజాతత్పరుండై ధ్రువంబగు పదంబు నొందె. అని మైత్రేయుండు తెల్పిన విని విదురుండు మునీంద్రా! భగవద్భ

త్తుండగు నంగభూపాలునకు దుష్టసంతానం బెట్లు కలిగె వివరింపుమా యని ప్రశ్నింప నామైత్రేయుం డట్లు బదులు చెప్పెను.

వేనునిచరిత్రము.

వినవయ్యా! రాజర్షి యనఁబరఁగు నంగనామకుం డశ్వమేధయాగము చేయ సమకట్టి ఋత్విక్కులను బ్రార్థించి వారు రాఁగా జన్నము నారంభించెను. ఋత్విక్కులు యథావిధి దేవతలను హవిర్భాగములం గైకొనం బిలిచిరి. దేవతలందొక్కఁడైన రాకుండెను. దానికి వారచ్చెరువంది రాజేంద్రా! ఇది యేమి హేతువో కాని దేవతలు హవిర్భాగములు గొనరారైరి. హోమము యథావిధి జరపఁబడినది. ఇందుఁ దప్పిస దించుకంతయు లేదు. అనిన విని యారాజు దుఃఖించి యందులకుం గల కారణంబు సదస్యులనడుగందలంచి మౌనంబుచాలించి మహాత్ములారా! ఏల దేవతలు రారైరి. కారణం బెఱింగించి నన్ను మన్నింపుఁడనియె.

వారా విషయమాలోచించి రాజచంద్రమా! ఇది ఇప్పటిదోషముగాదు. పూర్వజన్మకృతదోషమే. దాని నెఱింగింతుము. వినుము. నీవు రాజర్షి వయ్యును సంతానహీనుండవు కాన యాగభాగములు శుద్ధములు కావని వారు రారైరి. కాఁబట్టి పుత్రకామేష్టి నొనరించి పుత్త్రుంబడయుము. వారు వచ్చిపరిగ్రహింతురు. నా విని యా యంగరాజు సంతానార్థియై విశిష్ట

దేవతాకంబగు పురోడాశంబుచే హోమము గావించెను. ఆ హోమకుండంబునుండి హేమమాల్యాభరణుండగు పురుషుండు పొడసూపి హిరణ్యపాత్రంబున స్నిగ్ధపాయసంబుం గొనుమని యొసంగెను. బ్రాహ్మణానుమతంబున దానిని గ్రహియించి సంతుష్టస్వాంతుండై దానిని భార్య కిచ్చెను. ఆమెయు దానిని భుజించి గర్భముం దాల్చి యొక కుమారుం గాంచెను. ఆతఁడు మాతామహుఁడు మృత్యు వనువాఁడు గాన వానింబోలి ధర్మేతరపథంబునఁ బ్రవర్తించుచుండెను. వానికి వేనుఁడను నామకరణము చేయఁబడియె. వాఁడు చిన్ననాటనుండి దుష్పథమున వర్తించుచుఁ దనయీడుబాలకుల వధించుచు శరాసనబాణములం దాల్చి వయస్సురాఁగా మృగజాతిఁగరుణలేక చంపుచుండఁగా నాకొమరుంజూచి దుఃఖించి రాజు వానిం జక్కఁ జేయఁ బూనియు విఫలోద్యముఁడై యర్ధరాత్రిసమయంబున నెటకో పోయెను. ప్రజలారాజుం జూడఁగోరి వెదకిరి గాని ఫలము గలుగక పోయెను.

తర్వాత వేనునకుఁ బట్టంబుగట్టిరి. సింహాసనము నెక్కినది మొదలా వేనుఁడు గర్వంబున విజృంభించుచు సజ్జనుల నవమానించుచు, నొక్కండె భీతిమాని యెల్లతావుల సంచరించుచు నెదురులేక యుండెను. ఇట్లుండి గర్వంబు కన్నులం గప్ప నికమీఁద యాగములు చేయరాదు. దానము లీయరా

వ. హోమములు చేయఁ బనిలేదని భేరీధ్వనులాకసంబు ముట్టునట్లు చాటింపించెను. మును లిది యేమి యచ్చెరు వని యొక్కచోఁ గూడి యందఱుం బోయి వేనునితో మహారాజా! ఈరీతి శాసింప న్యాయంబే. యజ్ఞంబుల దానంబుల హోమంబుల భగవంతుండగు నారాయణుండు తృప్తుండగు. ఆతండు తృప్తినొందిన లోకంబులు సంతృప్తింగాంచు. ఇట్టి కార్యంబుల వలదనుట క్షేమముగాదన నాతండప్పలుకులయెడ ననాదరంబు చేసి వారల కిట్లు బదులుచెప్పెను.

చ. ఎనయఁగ జారకామిని నిజేశుని ద్రుచ్చిలి జారపూరుషుం
దనపతిగాఁదలంచుగతి దద్దయు మూఢమనస్కులైతన
ర్చిన నరపాలరూపము భరించిన యీశ్వరు నన్నెఱుంగక
న్యుని భజియింప మీ రిహపరోన్నత సౌఖ్యములందరెన్నఁడున్.

౪-౨౪-ప.

ఆమాటలు శ్రుతివిచారణచణంబులైన మౌనులెల్ల నీక వీఁడు జీవించినఁ బ్రపంచంబున ధర్మవృత్తంబు నశియించు నని నిశ్చయించి హుంకారమాత్రంబున నాతనిం బొలియించిరి. అంతట మహోత్పాతంబులు దోఁచెను. మును లాలోచించి యాతనియూరుమథనంబు చేయఁ గ్రూరు లుదయించిరి. మును లాతనిబాహుమథనంబుచేయ నొకకుమారుండు నొక పుత్రికయు జనించిరి. కొడుకు పృథునామంబునం బరఁగెను. అర్చినామంబునఁ బుత్రికయుఁ బ్రఖ్యాతి నొందె. ఆపృథువు

సకలరాజలక్షణలక్షితుం డౌట నందఱు హర్షించిరి. క్రమముగ నాతనికిఁ బట్టాభిషేక మొనర్చిరి.

ఆతండు రాజ్యంబు పాలించుచుండఁ బ్రజలు మహా రాజా! మాకు నాహారంబును బ్రసాదింపవే యని మొఱయి డిరి. వారిఁగాంచి యింకఁ బ్రజలకు సుఖకరమగునట్లు వృత్తిని గల్పింపకున్న నారాజత్వమున నేమి లాభమని నిశ్చయించి కరు ణాళుండై వారలఁగాంచి వృత్తిని గల్పించెద. భయపడకుఁ డని యోదార్చి, గోరూపధారిణియగు భూదేవిని శోధించి పిదుకంద లంప భూమి యిట్లనియె. రాజా! నేను విషమస్థలినై యున్న దాన. వర్షము గురిసిన నది నిల్చునట్లుండ వలయుఁగాన నన్ను సమస్థలిపై పెంపొందం జేయుము. అనుటయు నారాజు పర్వ తంబుల నందందున్నవాని నొకచోఁ జేర్చి భూమి సమస్థలిగా నొనరింప గోరూపంబున నాభూమి సకలౌషధులం బండెను. క్ర మముగా నామనుష్యు లవ్వానివలనఁ దగిన యన్నమును సం పాదించుకొని సుఖముగా బ్రతుకఁగలిగిరి. ఈవిధమునంతయుం గాంచి దేవపితృయక్షరాక్షసగంధర్వనాగాదులు తమతమ యభీష్టఫలంబుల నాభూమినుండి పొందఁగల్గిరి.

ఇట్లు పృథుచక్రవర్తిరాజ్యంబు పూజ్యభంగి వెలసె ను. మనుజులు శ్రమము మాని విహితవృత్తులచే జీవించుచు నుండిరి. ఈతిబాధలు జగంబున లేకుండెను. చక్రవర్తియు

భగవత్పూజాతత్పరుండై శతాశ్వమేధంబు లొనరింపఁ గృతని శ్చయుండై సరస్వతీనదీప్రాంతంబున నివేశంబుఁ గల్పించుకొని దీక్ష చేసెను. ఇంద్రుండు దానికి నసూయ నొంది విఘ్నము చేయ నిశ్చయించుకొనెను.

⊸ { పృథుచక్రవర్తి యశ్వమేధంబు చేయ నింద్రుం డాయశ్వము నపహరించుట. } ⊷

ఇట్లు సంకల్పించి తొంబదితొమ్మిది యశ్వమేధంబు లొనరించి నూఱవయాగంబు ప్రారంభించెను. ఇంద్రుం డద్దాని కోర్వఁజాలక పాషండవేషకలితతిరోభావంబున నాయశ్వం బును న్యాయవిరహితుండై కొని గగనంబునఁ బోయెను. ఆవిధ మెఱింగి పృథుచక్రవర్తి కుమారుండు శరచాపంబులం దాల్చి యింద్రుని వెనుకొనుచుం బోయిపోయి యింద్రునిఁ జూచెను. అత్రి యంతలో నాకుమారునితో వీఁడు యజ్ఞహంతయు ధర్మ విధ్వంసకుం డగునింద్రుండు. వీని జయింపుమని ముమ్మాఱు లు చ్చరించెను. అంత నాకుమారుం డాతని నిలునిలుమని యదల్చి తీవ్రబాణంబులు ప్రయోగింప నాయింద్రుం డాయశ్వమును విడిచి యదృశ్యుండై పోయెను.

వీరుఁ డాపృథురాజకుమారుఁ డాయశ్వమును గొని యజ్ఞభూమికి వచ్చెను. అచ్చట నున్న మహర్షు లందఱును హ ర్షాశ్చర్యకరకర్మంబులంగాంచి జితాశ్వుం డనునామం బిడిరి.

అంత యజ్ఞము సాగుచుండ దేవతానేత యోర్వఁజాలక తమః
పటలంబును నిర్మించి కాంచనపాశబద్ధమై యూపదారుపరిశో
భితమగు నాయశ్వంబును హరించెను. వినువీథిఁబోవు నాయిం
ద్రునిమార్గము నత్రి తెలుప నారాజకుమారుండు మహారో
షంబు మీఱం బోయి యింద్రుంజూచి నొంపఁ జాలకుండెను.
అత్రియు మరల నాతనింబురికొలిపెను. దాన నాతండు తోఁక
ద్రొక్కినభుజంగంబువిధంబున మండిపడి మహోగ్రశరం
బరిపోసిన శతమఖుండార్తుఁడై యశ్వమును విడిచి పరుగెత్తెను.
రాకొమరుం డాహయరత్నముం గొని మరలి వచ్చెను.

అంతఁ బృథుచక్రవర్తి యింద్రుని యసత్ప్రవృత్తి కాగ్ర
హించి బాణంబు ప్రయోగింపఁబూనెను. ఋత్విజులాతని వారిం
చి రాజా! యజ్ఞదీక్షాకాలముగాన నిది పరహింసనోద్యమమున
కదను గాదు. మే మాతనిం జంపఁగలుగుదుము. చూడుమని
యింద్రునాకర్షించుమంత్రంబుల హోమము చేయసాగిరి.
బ్రహ్మ యచటికరుదెంచి వారిప్రయత్నమును నిలిపి యజ్ఞఫలం
బారాజున కనుగ్రహించి యరిగెను. నారాయణుండును శత
యజ్ఞఫలంబులు సంపూర్ణంబులుగ నీకుం గలుగు ననియె.

అంత సనకసనందనసనత్కుమారసనత్సుజాతు లను
బ్రహ్మమానసపుత్రులు మహర్షివరేణ్యులరుదెంచి కృతసపర్యులై
యాతని కధ్యాత్మతత్వంబు లుపదేశింప జ్ఞానవైరాగ్యవంతుండై

యారాజచంద్రుఁడు ముక్తి నొందెను. అని యిట్లు విదురునకు మైత్రేయుండు తెలిపి నారాయణమహిమల నెన్నియేనిఁ దెల్పెను. విదురుండు మహాత్మానిచే శ్రీభగవంతుని మహిమలవింటిని. కృతార్థుఁడనైతినని యామునివర్యునిచే సెల వంది కరిపురంబున కుం బోయెను.

ఇది నాల్గవస్కంధము.

పంచమస్కంధము.

భరతోపాఖ్యానము.

ఇట్లు విదురమైత్రేయసంవాదంబుఁ దెలిపి శుకమహాయోగి పరీక్షిత్తున కిట్లనియె. అవనీనాథా! భగవద్భక్తుండగు భరతునిచరితంబుఁ జెప్పెద విను. భరతుఁడు పాలింపఁబట్టి యీ ఖండము భారతవర్షంబనం బ్రఖ్యాతం బయ్యె. ఆమహారాజు భగవద్భక్తుండు. పూజ్యభంగి రాజ్యంబును జిరకాలము పాలించెను. భగవదారాధనము సేయ వ్యవధి చాలమి నారాజు రాజ్యంబు పుత్రవశంబు చేసి యరణ్యంబునకుం బోయి నియతుండై తప మొనరించుచుండెను.

ఒక్కనాఁ డారాజర్షి గండకీనదియందు స్నానకృత్యంబు సలిపి యంతర్జలంబులఁ బ్రణవోచ్చారణంబు చేయుచుండెను. ఇంతలో నిర్భరగర్భిణి యగునొక్కహరిణి జలపానంబు చేయ సరుదెంచి జలంబుల నొడ్డుననిలువంబడి పానము చేయుచుండ సింహము ధ్వనిచేసెను. దానికి భీతిల్లి యది యెగిరెను. గర్భము గళితమై జలంబులం బడియెను. హరిణి భయంబున నటునిటు దుమికి తత్పాతంబున మృతినొందెను.

భరతుఁడు లేచునప్పటి కాశిశువు నీళ్లపైఁ దేలుచుండెను. చూచి కరుణించి దానిం గొనితెచ్చి పెంచుచుండెను. నానాఁటికది పెరిగి పెద్దదయ్యెను. భరతునకు దానిని పోషించుటయే తపస్సాయెను. సర్వకాలము దానిరక్షణమునందే యున్మత్తుని కరణిఁ బ్రవర్తించుచుఁ గరుణాతరంగితాంతరంగుండై దానికాలిలో ముల్లు గ్రుచ్చుకొనినఁ దనకంటిలోఁ గ్రుచ్చుకొనినయట్లు తలపోయుచుఁ బెంచుచుండెను. ఉదయాదిగా దానిరక్షణమందే నిబద్ధబుద్ధియై యుండుటంబట్టి యామునిచంద్రుని యోగాభ్యాసాదులు నానాఁటికి క్షీణింపసాగెను. కాని వానిపరిక్షీణతకా ముని పరితపింపక యాహరిణపోతమును జూచుచుఁ గరుణ దళ్కొత్తుచుండఁగా

ఉ. అక్కటా! తల్లిఁబాసి హరిణార్భక ♦ మాప్తులు లేమిఁజేసి యే
దిక్కును లేకయున్న నిటఁ ♦ దెచ్చితి, నాయెడ నీమృగార్భకం
బెక్కుడుప్రేమ చేసి చరి ♦ యించుచు నున్నది నాదుసన్నిధిన్
మక్కువ చేసి దీనిఁ గడు ♦ మన్ననలం దగఁ బ్రోతు నెంతయున్.

అని తలపోయుచు

క. శరణని వచ్చిన జంతువుఁ
గరుణం గనువిచ్చి చూచి ♦ కాచినపుణ్యం
బరయఁగ నధికంబని మును
గర మెఱింగించిరి మునీంద్ర ♦ గణములు ప్రేమన్.

అని మనంబున నూహించుచుఁ దానే కార్యము చేయుచున్నను

దానిం జెంత నుంచుకొని రక్షించుచు, వృకాదిసాధుమృగహింసకమృగంబులనుండి దాని కేయుపకారము గలుగకుండఁ గాపాడుచుఁ, దాని యానందమునకుఁ దా నెంతయు హర్షించుచుఁ బెంచుచుండెను.

ఇట్లు కొంతకాలము జరుగ నొక్కనాఁ డాహరిణపోతంబు నైజచాపలంబున నెక్కడికో పోయెను. కన్నులు తెఱచునరికి చెంత లేకపోఁగా నాముని కలంగుచు నలువలంకులకుం బరుగిడి పరుగిడి దృష్టిసారించిపరికించుచు, నాకు గదలినను అదియేయని భ్రమించుచు నచ్చటికిం బోవ నది కాకపోఁగా వెతలం గుడుచుచుఁ దిరుగుచు నిత్యనైమిత్తికకర్మములు మాని యుండె నని చెప్పి శుకయోగి రాజయోగినిం దిలకించి,

సీ. జననాథ మున్ను మో♦క్షవిరోధ మని పాయఁ
గారాని పుత్రాది♦కంబు నెల్లఁ
బాసి తపస్వియై♦భరతుండు హరిణశా
బకపోషణంబునఁ♦బాలనమున
నతిలాలన ప్రీణ♦నానుషంగంబుల
మూషకబిల మతి♦రోషమునను
సర్పంబు చొచ్చిన♦చందంబునను యోగ
విఘ్నంబు మిక్కిలి♦విస్తరిల్లె
ఆ. గాన నెంతదాని♦కైనను గాలంబు
గడపరామి నట్లు♦గాకపోదు
పరమమునులకైనఁ♦బాయవు కర్మంబు
లూరు లనంగ నెంత♦నరవరేణ్య.

అని పలికి మఱియు నిట్లనియె. రాజేంద్రా! ఆరీతి భరత ముని విచారించుచుండ నాజింకపిల్ల కంటఁబడెను. ఆహా! ఆసమయమున నాయనకుఁ గల్గిన మోదమునకు అంతమే లేదు. ముక్తిపదము లభించినట్లే ఆనందించెను. కడుంగడు ముద్దాడెను. మేను నిమిరెను. ఎత్తి తొడపైఁ గూరుచుండఁబెట్టుకొనియెను. అన్నా! ఇంకెన్నఁడు నిట్లు పోకుమా యని బుద్ధి చెప్పెను. ఇట్లు ముద్దులాడి యథారీతిగాఁ బోషించుచుండెను. అపుడప్పు డది కనఁబడకపోవుట తటస్థించుచు రాఁగా దుఃఖించుచుఁ గంటఁబడఁగా నానందించుచు నాపనియే కృత్యముగాఁ గాలముఁ గడపుచుండెను.

మానవదేహము గనుక మృత్యు వాసన్న మయ్యెను. ప్రాణవాయువులు తావుల్ తప్పెను. అత్తఱి నాపోతము తన యెదుట నిలుచుండి తా ననుభవించు పరితాపమును జూచుచుండెను. మునియు దానినే మనంబున నిలిపి ప్రాణములం బాసెను.

"అంతకాలస్మృతి ఫలింపక మానదు."

అన్న సూక్తి యేనాఁటికిఁ దప్పదు. ఆభరతుం డాహరిణశాబకమును మనమున నిడికొని యసువుల విడిచెను. కాన హరిణీగర్భంబున హరిణశాబకంబై జన్మించెను. చిరకాలము రాజ్యభోగంబుల రోసి భగవ దారాధన మొనరించినకతన

పూర్వస్మృతి కలిగి యుండెను. తనకు మృగత్వము గల్గుటకు హేతు వెఱింగెను. ఎఱింగి నిట్టూర్పులు పుచ్చుచు,

ఉ. రాజులు ప్రస్తుతింప సుర♦రాజసమానుఁడనై తనూజులన్
రాజులఁ జేసి తాపసులు ♦ రాజఋషీంద్రుఁ డటంచుఁ బల్కఁగాఁ
దేజము నొంది యీహరిణ♦దేహమునందలి ప్రీతిఁ జేసి నా
యోజ చెడంగ నేఁ జెడితి ♦ యోగిజనంబులలోన బేలనై.

అని దుఃఖించుచు భగవద్ధ్యానసామర్థ్యంబున నెట్లో పులస్త్యమహామునిచంద్రునాశ్రమము నొంది యందు వసించి హరిణదేహత్యాగకాల మెపుడు వచ్చునా యని కోరుచు శుష్కపర్ణంబులు, తృణంబులు, చిగురుటాకు లాహారంబులుగా నటఁగల సరస్సులలో మునుఁగుచు నెట్లో కాలక్షేపము చేసి యాహరిణశాబక తనువును త్యజించెను. ఆంగీరసుండను బ్రాహ్మణు ప్రథమభార్యయందుఁ గల్గిన పుత్రనవకంబునందుఁ దానొక్కండై జన్మించి తండ్రి యొనరించు నుపనయనాదిక్రియ లన్నింటిని ఇచ్ఛలేకున్నను గ్రహించు చుండఁగా నాంగిరసుండు సురపురి కరిగెను. తల్లియు సహగమనం బొనర్చెను. సవతి తల్లికొడుకులు తనను వేదాదివిద్యలంజదువనీయక సంసారభారనిర్వహణకృత్యంబున నీతని నియోగించిరి. మనస్సునం దొప్పనిపని చేయువాఁడు గాన దాని నాసక్తితోఁ జేయక యెట్లోనిర్వహించు చుండుటం గాంచి వార లున్మత్తుఁడా!

జడుఁడా! మూఢుఁడా! బధిరుఁడా! యని పిలువ సాగిరి. వాని నోర్చుకొనుచు నధశ్శయనంబు చేయు చుండి యొకనాఁడు చేనికావలి యుండెను.

ఆపురపాలకుఁ డగు వృషలభూపతికి సంతానము లేదుఁ కాళికి బలియిచ్చిన సంతానము కలుగఁగలదని యెవ్వరో యాయన కుపదేశించిరి. అతఁడు పుత్రవాంఛ గలవాఁడు. కావునఁ బురుషపశువులం దొకనిఁ దెమ్మని భటుల కాజ్ఞాపించెను. భృత్యు లాపనికై ప్రయత్నించు చుండఁగా నొకఁడు నాఁటిరేయి పశువును గానలేక వీరాసనమున నున్న యీవిప్రయోగిని మంచిపశువిది బలికిఁ జాల బాగున్న దని పట్టికట్టి కొనిపోయి యభ్యంజనాదిసంస్కారములునిర్వర్తించిరి. నూతనవస్త్రంబులఁ గట్టనిచ్చిరి. గంధపుష్పాదుల నలంకరించిరి. మృష్టాన్నంబులు భుజియింపఁబెట్టిరి. సకలోపచారముల నలరించిరి. మహావాద్య ఘోషంబులతో నాపురుషపశువుం గాళికాదేవిసముఖంబున కుం గొంపోయి నిలువంబెట్టిరి. వృషలపతి యట కరుదెంచి కాళికామంత్రాభిమంత్రితంబయి భయంకరాకారంబయి తనదు ఖడ్గఁబు గ్రహియించి యీపరమశుభకృత్యత్వంబున నభీష్టసిద్ధి గలుగవలయునను తలంపున హింసింపం దలఁచెను. కరంబు పైకెత్తి ఖడ్గంబున మెడఁ ద్రుంపం బూనెను.

ఇంతలో సర్వభూతసముండై బ్రహ్మభూతాత్ముఁడై నిర్వైరుఁడై యున్న యాబ్రాహ్మణకుమారుని తేజంబు చూడరానిదై

యొప్పఁగా నాభద్రకాళి ముప్పిరిగొను కోపంబున హుంకార పూర్వకంబుగా నట్టహాస మొనర్చెను. అట్టహాస మొనర్చి పాపాత్ము లగు నాభటులను వృషలపతిని నిముసములో భస్మము చేసెను. అంతతోఁ దృప్తి నొందక యారాజుశీర్షంబు చేనంది నలుదట్ల నాట్యము చేయసాగెను.

క. ధరలోన నెవ్వరేనిని
ధరణీసురవరుల కెగ్గు ♦ దగఁ దలఁచినవా
రరయఁగఁ జెడుదురు నిక్కము
హరి ధరణీసురవరేణ్యు♦లం దుండుటచేఁ.

అనుట తెల్లమేకదా యని తెలిపి శుకయోగి మఱియు రాజుతో నిట్లుచెప్పెను. పరీక్షిద్భూపాలకా! ఆవిప్రుఁడా కాళికాలయంబున.

ఉ. అచ్చట విప్రసూనుఁడు భ♦యం బొకయించుక లేక చంపఁగా
వచ్చిన వారియందుఁ గర♦వాలమునందును గాళియందు దా
నచ్యుతభావ ముంచి హృ♦దయంబునఁ బద్ధదశాత్ముఁ డెంతయున్
మచ్చికతోడ నిల్పి యను♦మానము నొందక యుండె నెంతయున్.

కొలఁది గడియ లందుండి మరలి వచ్చి యథాపూర్వముగాఁ గావలి యుండెను. ఇట్టివ్యాపారముననే కొంతకాలముజరిగెను. వృత్తియందుఁ బ్రమాదంపడక కాలముఁగడపుచు సంసారబాధ లంటకుండ నాభూసురకుమారుఁ డుండెను.

సింధుభూపాలకుం డగురహూగణుం డొకనాఁడు కపిల మహామునియాశ్రమం బిక్షుమతీనదీప్రాంతమున నున్నట్లు విని

యచ్చటకుం బోయి కపిలమునివలన విజ్ఞాన మెఱుంగఁ గోరి శిబికారోహణ మొనర్చి ప్రయాణము చేయుచుండెను.

శిబికావాహికులు దారినడుమ చేనియొద్దఁ గాపున్న నాబ్రాహ్మణునిం జూచి యాయనభుజమున శిబికాదండము నుంచి యలసటఁ దీర్చుకొనఁ గోరి యాతనిం బట్టితెచ్చి పల్లకి మోయుమని బలవంతము చేసిరి. పాప మావిప్రప్రవరుం డాశిబికను మూఁపునఁ బెట్టుకొని మోయుచు నోపినంత నడచుచుండెను. అలవాటు చాలనందున నియమముగా నడువఁ జాలక తోఁచినట్లు నడువసాగెను. ఆశిబిక కుదురుతప్పి హెచ్చుతగ్గులుగా నుండఁగా లోపలఁ గూరుచున్న యారాజు వారి నదల్చి యింతకుముందువలెఁ గాక యిప్పటున నీరీతి విషమముగా నీశిబిక యుండ నేల? అని యదలించెను. ఆపలుకుల కడలి వాహకులు రాజేంద్రా! ఈతప్పు మావలన నైనది కాదు. మాలో నాల్గవవాఁడు సుఖగమనంబుగా నడవ నేరఁడు. వీనితో మేమును చిక్కులు పడుచున్నవారము. అని వినయముతో బదులు చెప్పిరి.

రాజు వృద్ధోపాసనము చేసినవాఁడే. ఐనను ఆసమయమున నాగ్రహించి బ్రహ్మతేజంబున భాసిల్లు నాభూసురుం గనుంగొనఁ జాలక కఠినస్వరం బలరుచుండఁగా,

చ. "అలసితి వెంతయుం ముసలి వాఁకట డస్సితి వెన్న మిక్కిలిం
బలుచనయున్న దీశిబిక భారము దూరము మోసి తేగలేం
నిలిచెదవు......."

అని పలికెను. ఆబ్రాహ్మణుఁడు బదులు పల్కక మోయుచుం డెను. ఈశరీరము కడపటిదని యాముని యెఱుంగును గాన నహంకారమమకారంబులం బొందక మిథ్యాజ్ఞానరహితుండై బ్రహ్మభూతుండై మౌనముని యథాపూర్వముగా నాశిబిక మోయుచుండెను. వెండియు నారాజు శిబిక చక్కఁగా నడ వకుండుటం దెలిసికొని యావాహకుని బలుభంగులం బదరె ను. తూలనాడు పల్కులన్నియుఁ గ్రుమ్మరించెను. బుద్ధిలేక యెన్నియో తులువమాటలు పలికి యాయనను నొప్పించెను.

అంతట భరతుఁడు మందమందభాషణంబుల నిట్లని యె. రాజేంద్రా! నీపలుకులు ఋతంబులు. భారం బీతనువునకే గాని నాకుం గలుగనేరదు. స్థౌల్యము, కృశత్వము, ఆధివ్యా ధులు, క్షుత్తృష్ణలు, ఇచ్ఛావిరోధభయంబులు, జరామరణం బులు, రోగనిద్రాజాగరణంబులు, నహంకారమమకారమదశో షణాదులు శరీరంబుతోడనే పుట్టును గాని నాకవి యేవియుఁ గలుగనేరవు. నే నిపు డున్మత్తమూకాంధజడులుంబోలె సహ జస్వభావంబునుం బొందిన నాయందు నీశిక్ష యేలాభంబు నాపాదింప నేర్చు. అని పలునీతు లుట్టిపడునట్టిమాటలు పలికి మౌనం బవలంబించి యథారీతిగా మోయుచుండెను.

ఆరాజు తత్వజ్ఞానాపేక్షితుండై చనుచున్నవాఁడు కావు న స్వహృదయగ్రంథివిమోచకంబులు, బహుయోగశాస్త్రగ్రం

థసమ్మతంబులు నగు నాభూసురువాక్యంబుల విని త్వరపడి యాశిబిక దిగి యామహనీయమూర్తికి భయభక్తిసంభ్రమంబులు పురిగొన వలగొని వందనం బాచరించి గర్వము నావలం బోద్రోలి కరంబులు జోడించి “మహాత్మా! ఎఱుంగక సామాన్యజనుంగా భావించి యెన్నియోకాఱులు పల్కితి. నీ వవధూతవేష మూని సంచరించుచున్న మహాత్ముఁడవు. నిన్నెఱుంగనేర కున్నాఁడ. నాయం దనుగ్రహమునుపఁ దలఁచిన యాకపిలమునివర్యుఁడవా! నాతప్పులు క్షమించి నన్నుఁ గృతార్థునిఁ జేయుమా” యని పెక్కుభంగులం బ్రార్థించి బహువిధోపదేశములం బొంది విజ్ఞానియై కరకమలంబులు ముకుళించి మహానుభావా!

మ. జ్వరితార్తుం డగు రోగి కౌషధ మతీష్టంబైనచందంబునన్
ధరలో నాతపతప్తదేహి కడు శీతంబైన తోయంబునన్
గరిమం గోరినరీతి నెంతయు నహంకారాహిదష్టుండనై
పరఁగన్ నాకును నీవచోమృతము దప్పన్ మందు వే యున్నదే.

అని ప్రార్థించెను.

భరతుం డాతనియెడం గరుణాళుండై తత్వజ్ఞానం బుపదేశించెను. రాజు సంతుష్టుండై దేహాత్మభ్రమం బాసెను. భరతుండును గొంతకాల మట్లుండి నారాయణచరణములం గొలువ నరిగెను. అని యిట్లు శుకయోగి రాజునకుం దెల్పి భరతుని చరిత్రమును దెలిపిన యనంతరంబ భారతవర్షమునం

గల నదనదీసరఃపర్వతములవిషయము నెఱింగించి ఖగోళవిషయంబు లించుక తేటపఱచి నరకలోకములగాథలం దెలియం బలికి యెట్టియెట్టి పాపంబు లొనరించిన నెట్టినరకంబులంబొంది యేలాటి కష్టముల ననుభవింప వలయునో యావిధం బంతయుం దేటపడునట్లు చెప్పెను.

ఇది పంచమస్కంధము.

షష్ఠస్కంధము.

భగవంతుం డగుశుకయోగి యిట్లు తెలుప న్విని రాజర్షి భగవద్గుణవర్ణనాకర్ణనకుతూహలమానసుండై చేతు లొగ్గి మహాత్మా!

ఆ. కడిఁదివేదనలకుఁ • గారణంబై యుండు
గఱుతులేని నరక•కూపరాశి
పాలుగాక నరుఁడు • బ్రదికెడుమార్గంబు
పరమపుణ్య తెలియఁ • బలుకవయ్య.

అని ప్రశ్నించెను. రా జిట్లు మధురవాక్కులం బ్రశ్నింప యోగిరాట్టు వాదరంబున నాతనిం జూచి భక్తవర్యా! రాజేంద్రా!

చ. సతతము కృష్ణపాదజల•జంబులయందు మనంబు నిల్పు సు
వ్రతులుఁ దదీయశుద్ధగుణ•రాగులుఁ గాలుని యుగ్రపాశ సం
హతుల ధరించు తత్సుభట•కోటులం గలలోనఁ గాన రే
గతులను దుష్టకర్మములు • గైకొనువారలఁ జెంద నేర్చునే.

కాఁబట్టి నీ యీ ప్రశ్నంబునకుం దగినట్లు పురాతనేతిహాసం బొక్కండు గలదు వచింతు. నాలకింపు మని మధురతరాలాపంబుల నిట్లు పలికెను.

అజామిళోపాఖ్యానము.

రాజా! కన్యాకుబ్జ మనుపురవర మొకఁడు గలదు. ఆనగరంబు నివాసంబుగా నజామిళుం డను బ్రాహ్మణుం డొకఁడు పాపాత్ముండై నిర్భాగ్యుండై మూర్ఖుఁడై సదాచారంబుల వీటిఁబుచ్చి దురాచారసంసక్తుండై యుండు. ఆతఁడు జూదమాడుచు, సురాపానము లొనరించుచుఁ దనవంటిగుణములు గల యొకతుకం బెండ్లియాడి సూకరము పెక్కుపిల్లల నీనునట్లు బహుపుత్రుల నామెనుండి పడసెను. వృద్ధత్వము రానురాను వానికి మోహాంధకార మభివృద్ధియాయెను. నిరంతరము బాలకుల నుపలాలనముచేయుటలోఁ గాలమును బుచ్చెను. ఇట్లు కొంత కాలము జరగ వృద్ధుం డయ్యెను.

సీ. నిర్మలంబనఁ జాల ♦ నెఱయు చిత్తంబన
నల్లనివెండ్రుకల్ ♦ తెల్లనయ్యెఁ
దగుమోహపాశబం♦ధంబుజాతినమాడ్కిఁ
బొదలినయంగముల్ ♦ వదలివ్రేలె
నింద్రియంబుల కోర్కు♦లిఁక నొల్ల ననుభంగి
నుడుగక తలచాల ♦ వడఁకఁ జొచ్చెఁ
దమకంబు ప్రాయంబుఁ ♦ దగిలిపోయినమాడ్కి
లోచనంబులచూడ్కి ♦ నీచమయ్యె

ఆ. వగరుపుట్టె సంత ♦ బెగలె దంతంబులు
నుక్కుకోసయు దగ్గుఁ ♦ బిక్కటిల్లె

శిరము నొవ్వఁ దొడఁగెఁ ♦ జెదరె మనం బంతఁ
గడిఁదియైన ముప్పు ♦ కాలమునను.

ఇట్లు ముదుసలితనంబు వ్యాపింప వయసున నెనుబదెని మిదివత్సరంబులు నిండెను. బుద్ధిభ్రాంతినొందుట కారంభించెను. దేహపాటవము తగ్గిపోయెను గాని సంసారచింతాపాటవ మిసుమంతయు సడలమింజేసి కడపటికొడుకగు నారాయణుఁ డప్పుడించుక బాలుండుగా నాతనికిం దోఁచిన కతన రేయింబవళ్లాతనిం జీరుచు ముద్దాడుచుండెను. కాని భగవద్ధ్యానసమాసక్తచిత్తుఁడుకాఁడయ్యెను. అంత మృత్యువువాఁతం బడుతటి చెంత కేతెంచెను. యమకింకరు లాతనికిం దోఁచిరి. వారిం గాంచినంతనే భయంపడి

క. ఘోరమున నాడు బాలుఁడు
బోరనఁ దన చిత్తసీమఁ ♦ బొడగట్టిన నో
నారాయణ నారాయణ
నారాయణ యనుచు నాత్మ ♦ నందను నొడివెన్.

పూర్వజన్మసుకృతావేశంబున హరిస్మరణంబు మృతికాలంబునఁ జేయు భాగ్యంబుగలుగఁగా శ్రీభగవంతుని దూతలు పొడసూపి భయంకరాకారులగు యమదూతల నదల్చి యజామిళునిఁ గొంపోవఁ బ్రయత్నించిరి. వారలం గాంచినంతనే శమనుదూత లదరిపడి వినయమునఁ జేతులొగ్గి, మహాత్ములారా! మీ రెవ్వరిదూతలు. పాపాత్ములలో మొదటివాఁ డీతఁడే

యని చెప్పఁదగిన వీని మాచేఁ బడకుండఁ గొంపోవుచున్నారే. దీనికింగారణమేమి. యమునియాజ్ఞ యంత నిస్సారమయ్యెనా? యన వారించుక నవ్వి యమదూతలారా! మీరు సంశయింపఁ బనిలేదు. శ్రీవిష్ణుమహిమము మీరెఱుంగరు. ఈతండెన్ని పాపము లొనరించినను గడపట శ్రీనారాయణమూర్తిం దలంచెను. ఆనామస్మరణమహిమమును వినుండు.

సీ. బ్రహ్మహత్యానేక ♦ పాపాటవుల కగ్ని
కీలలు హరినామ♦కీర్తనములు
గురుతల్పకల్మష♦క్రూరసర్పములకుఁ
గేకులు హరినామ♦కీర్తనములు
తపనీయచౌర్యసం♦తమసంబునకు సూర్య
కిరణముల్ హరినామ♦కీర్తనములు
మధుపానకిల్బిష♦మదనాగసమితికిఁ
గేసరుల్ హరినామ♦కీర్తనములు
తే. మహితయోగోగ్రనిత్యస♦మాధివిధుల
నలరు బ్రహ్మాదిసురులకు ♦ నందరాని
భూరినిర్వాణసామ్రాజ్య♦భోగభాగ్య
ఖేలనంబులు హరినామ♦కీర్తనములు.

ఇంకను వినుఁడు. మీసంశయము లంతరించును.

సీ. ముక్తికాంతైకాంత♦మోహనకృత్యముల్
గేలిమై హరినామ♦కీర్తనములు
సత్యలోకానంద♦సౌభాగ్యయుక్తముల్
గేలిమై హరినామ♦కీర్తనములు

మహితనిర్వాణసా♦మ్రాజ్యాభిషిక్తముల్
గేలిమై హరినామ♦కీర్తనములు
బహుకాలజనితత♦పఃఫలసారముల్
గేలిమై హరినామ♦కీర్తనములు

తే. పుణ్యమూలంబు లనపాయ♦పోషకంబు
లభిమతార్థంబు లజ్ఞాన♦హరణకరము
లాగమాంతోపలబ్ధంబు♦ లమృతసేవ
లార్త శుభములు హరినామ♦కీర్తనములు.

మఱియొక్కమాట యాలకింపుఁడు.

క. కామంబు పుణ్యమార్గ
స్థేమంబు మునీంద్రసాంద్ర♦ చేతస్సరసీ
ధామంబు విష్ణు నిర్మల
నామంబుఁ దలంచువాఁడు♦ నాథుఁడు గాఁడే.

క. డెందంబు పుత్త్రవలనం
జెందిన దని తలఁప వలదు♦ శ్రీపతి పేరే
చందమున నైనఁ బలికిన
నందకధరుఁ డంటఁ గలఁడు♦ నాథుం డగుచున్.

ఆ. బిడ్డపేరు పెట్టి♦ పిలుచుట విశ్రామ
కేలి నైన మిగులఁ♦ గేలి నైనఁ
బద్యగద్యగీత♦భావార్థముల నైనఁ
గమలనయనుఁ దలఁప♦ గలుషహరము.

ఉ. కూలినచోటఁ గొట్టుపడి♦ కుందినచోట మహోజ్వరాదులం
ద్రేలినచోట, సర్పముఖ♦పీడల నందినచోట నార్తులై

తూలినచోట విష్ణు భవ♦దూరునిఁ జేర్కొని రేని మీఁద నా
కాలునియాతనావితతిఁ ♦ గానరు పూనరు దుఃఖభారముల్.

మ. నిరతంబై నిరవద్యమై నిఖిలచి♦న్నిర్మాణమై నిత్యమై
నిరహంకారగుణాఢ్యమై నియమమై ♦ నిర్దోషమైనట్టి శ్రీ
హరినామస్మరణామృతం బితఁడు ప్ర♦త్యక్షంబు సేవించెఁ దా
మరణాంతంబున నిట్టిసజ్జనునిధ♦ర్మం బేల వ్యర్థంబగున్.

అని యిట్లు శ్రీమన్నారాయణనామమాహాత్మ్యం బెఱింగింప విని యమదూతలు వారికి మ్రొక్కి పనివినిరి.

అజామిళుం డాయమపాశవిముక్తిం గాంచి యెదుటం దోఁచిన హరిదూతలం గాంచి నమస్కరించి విజ్ఞానవైభవంబున నేమో పలుకం బూనునంతలో వారాతనిభావం బెఱింగి యదృశ్యులైరి. అట్లగుటం దెలిసికొని యాబాడబుండు పరితాపంబున భగవంతుని నెదుట నిలుపుకొని తనదుష్కృతంబుల నెల్ల నివేదించి కన్నీరునించి "యాపద్బాంధవా! నన్నుం గావుమా" యని ప్రార్థించుచు,

క. హరిభక్తులతో మాటలు
ధర నెన్నఁడుఁ జెడని పుణ్య♦ధనములమూటల్
పరముక్తికాంత తేటలు
నరిషడ్వర్గంబు చేరని ♦ యరు దగుకోటల్.

అని తలంచుచు నాక్షణంబ యిల్లు వదలి గంగాద్వారంబునకుం బోయి యందు నియమంబున యోగాభ్యాసపరతంత్రుండై తద్బలంబున నసువులం బాసి భగవంతునియం దాత్మను

గలిపి యందుం దోఁచు దూతలం బరికించి నమస్కరించి యా వ్యయానందసుఖం బనుభవించుచుండెను.

రాజేంద్రా !

క. కర్మంబు లెల్లఁ బాయును
మర్మము దెలుపంగ లేరు ♦ మధురిపుపే రే
పేర్మిని నోడువుటకంటెను
దుర్మదమునఁ జిత్త మెన్ని♦త్రోవలఁ జన్నన్.

కాఁబట్టి నీప్రశ్నమునకు సముత్తరం బీకథయే యనిన నా రాజును నమస్కరించి యోగీంద్రా! యమదూత లట్లు తిరస్కృతులై యేమి చేసిరో తెలుపుము. దాన నింకను నీనామమాహాత్మ్యం బెఱుకిపడు నని ప్రశ్నింప దరహాసితవదనుండై శుకుం డిట్లు పలికెను.

క్షత్రియమునీ! వినుము. అట్లు నిరాకృతులై పసుగుకొనుచుం జని ప్రేతనాయకుంగాంచి వృత్తాంతం బెల్ల నెఱింగించి యిట్లగుటకుం గారణంబుఁ దెలుప వేడిరి. దండధరుండు మనంబునఁ బుండరీకాక్షుం దలంచుచు వారలం గరుణ చెలంగం గాంచి యూఱడించుచు విష్ణువు తనకన్న సర్వోత్కృష్టుఁడని తేటపఱచి, ఆ శ్రీహరినామమహిమమును వారికిం దెలుపుచు దూతలారా !

సీ. ఏకసక్కముననైన ♦ నిందిరారమణునిఁ
బలుకంగ లేని దు♦ర్భాషితులను

గలలోన నైన శ్రీ ♦ కాంతునిసత్పాద
కింజముఁ జూఁడని ♦ కర్మదృశుల
నవ్వుచు నైనఁ గృ ♦ ష్ణప్రశంసకుఁ జెవిఁ
దార్పనేరని దుష్క ♦ థాప్రవణుల
యాత్రోత్సవంబుల ♦ నైన నీశుని గుడి
త్రోవఁ ద్రొక్కఁగ లేని ♦ దుష్పదులను

ఆ. బరమభాగవతుల ♦ పాదధూళిసమస్త
తీర్థసారమనుచుఁ ♦ దెలియలేని
వారి వారివారి ♦ వారిఁ జేరినవారిఁ
దోలుతఁ గట్టి తెండు ♦ దూతలార.

ఆ. పద్మనయను మీఁది ♦ భక్తియోగం బెల్ల
ముక్తియోగ మనుచు ♦ మొదలెఱుంగు
వారి వారివారిఁ ♦ వారిఁ జేరినవారిఁ
త్రోవఁ దలఁప వలదు ♦ దూతలార.

అని యిట్లుపదేశింప వారు సంతుష్టులయిరి. రాజా! ఈ యితిహాసంబు పూర్వకాలంబునఁ గుంభసంభవుండు మలయ పర్వతంబునఁ బురుషోత్తము నారాధించుచుండి నాకుం దెలిపె. అన విని యాశ్చర్యంబున బరీక్షిజ్జనపాలుండు భగవన్నామంబు స్మరియించి కథాసంశ్రవణకుతూహలుం డయ్యెను. యోగియు భగవత్కథల ననేకములు తెలుపుచు నింకను భగవత్కథా సారమును దెలుపువాఁడై యిట్లనియె.

దేవదానవులయుద్ధము.

రాజసత్తమా! దేవేంద్రుండు నిండుపున్నమ యగుటం జేసి సకలభోగంబు లనుభవించుచు శచీదేవితనయూరువులపై నుండ దిక్పాలకు లొనరించుమనవుల రాజసంబుతో నాలకించు చుండెను. అప్పట్టున గీష్పతి వాస్తోష్పతికిం గొన్నినీతులు చెప్పం దలంచి యాకొలువుకూటంబునకు వచ్చెను. రాజ్యగర్వంబునం గన్నుంగానని యాతం డా సురదేశికు రాకం గాంచియు నెఱుం గనియట్లూరకుండెను. అవమతికిం జాల నొచ్చుకొనుచు నాధి షణుండు నిజగృహంబునకుం బోయెను. పరీక్షిద్రాజా! ఇట్లు రాజ్యమదంబున దేవతానేత గీష్పతిం గెడ్పఱచె. కాఁబట్టి

ఆ. కుపథవర్తు లగుచుఁ ♦ గుత్సితదుర్వచో
నిపుణు లైనవారు ♦ నియతి దెలిసి
తొలఁగ లేక వార ♦ ధోగతిఁ బడుదురు
తప్ప లేక రాతి ♦ తెప్పభంగి.

అని తెలిపి మఱియు నిట్లనియె. అంత దేవపతి దేవదేశికు నియింటికిం బోయి పావనచిత్తుంగా నొనర్పం బూనెను గాని యామాననీయచరిత్రుం డధ్యాత్మమాయం గైకొని యదృశ్యుం డై యుండెను. ఇంద్రుండు గృహంబున వెదకి వెదకి ఖిన్నుండై యిల్లు చేరెను.

రాక్షసు లీవిధ మెఱింగిరి. అంద ఱప్పుడే కూడి భార్గ వునిపరిసరంబునకుం బోయి తత్కృపాపాత్రులై యసురులపైకి

సమరము చేయఁబోయిరి. త్రిదశులు దర్పంబున వారిఁ దలఁపడిరి కాని శరవిసరవిద్ధసర్వాంగులై దివ్యాస్త్రంబులు మాఱుపలుకమి ఖిన్నులై కాలికి బుద్ధిచెప్పి బ్రహ్మలోకంబునకుం బోయి పాకజాసనుం గాంచి దీనులై మ్రొక్కి గతంబు విన్నవించిరి. వారి పరిదేవనంబు విని వారిజాసనుం డనుకంపాతిశయంబున సభయం బొసంగెను.

ఉ. నెట్టన పాపకర్మమున ♦ నేరమిఁ జేసితి రేమి చెప్ప మీ
పుట్టిననాఁటినుండియును ♦ బుద్ధులు చెప్పి జగంబు లేలఁగాఁ
బట్టముఁ గట్టి పెంచుకృ♦పానిధి బ్రహ్మకళావిధిజ్ఞుఁ డే
పట్టక గుట్టు జాతి సిరి♦పట్టునఁ దొట్టినపొట్టక్రొవ్వునన్.

ఇట్టి యవమతిం బొందిరి. కాఁబట్టి గురువర్యోపాసకులగు రాక్షసులచే బాధింపంబడితిరి. కావున నిప్పుడు త్వష్ట యను మనువుతనయుండు విశ్వరూపుం డను మునిపుంగవు నాశ్రయింపుఁడు. ఆతం డెట్టియిక్కట్టులనైన నివారించు నన విని దేవతలా విశ్వరూపు పాలికిం జని తమయిడుమల విన్నవించి గురుత్వం బంగీకరింపుమా యని ప్రార్థించిరి. విశ్వరూపుం డాపన్నులగు దివిజులం గాంచి గురుతిరస్కృతిం జేసి మీరిట్లు కడు నిడుమలఁ బడితి రని బదటి పదంపడి సర్వాపత్పరిహారకం బగు నారాయణకవచం బుపదేశించెను.

ఇంద్రుం డతిభక్తి నారాయణకవచంబుం బరిగ్రహించి నియమంబున వార్చి తదుక్తప్రకారంబున సర్వాంగంబుల దారి భావించి ముకుళితకరకమలుండై

చ. గరుడునిమూఁపుపైఁ బదయు♦గంబు ఘటిల్లఁగ శంఖచక్రవ
ర్మరుచిరశార్ఙ్గఖడ్గశర♦ గాజితపాశగదాదిసాధనో
త్కరనికరంబు లాత్మకర♦కంజములన్ ధరియించి భూతిసం
భరితమహాష్టబాహుఁడు కృ♦పామతితో ననుఁ గాచుఁ గావుతన్.

అను మొదలగు దివ్యస్తుతిరాజంబుల స్తుతియించె. రాజేంద్రా యీనారాయణకవచప్రభావం బచింత్యంబు. సర్వరోగంబులు దీనిం బఠించినఁ దొలంగు. సర్వకామంబులు ఫలించు.

అంత నింద్రుండు తత్ప్రభావంబున రిపులన్ జయించి విజయశ్రీయుతుండై నిజరాజ్యం బేలుచుండెను. విశ్వరూపుండు తల్లియందలివిశ్వాసంబున యజ్ఞభాగంబుల నమరులకుం దెలియకుండ ససురులకు నిచ్చుచుండెను. ఆవిశ్వరూపమునకు శిరస్త్రయంబుగలదు. ఇంద్రుఁ డావిధం బెఱింగి యాగ్రహంబు పట్టంజాలక గురువనితలంపక యాతనిశిరమ్ముల మూఁడింటిని ఖండించెను. ఆయనతలలు మూఁడింటిలో సోమపానంబు సేయుశీర్షము కపింజలంబయ్యె. సురాపానం బొనరించుమస్తకంబు కలవింకం బయ్యె. అన్నంబుఁ దినుతల తిత్తిరి యయ్యె. ఇట్లాశీర్షత్రితయంబు పక్షిరూపంబులఁ దాల్చె బ్రహ్మహత్యయై యేతెంచి యింద్రునిఁ జుట్టుకొని తమ్ముఁ బరిగ్రహింపు మని నిర్బంధించెను.

ఆ బ్రహ్మహత్యలబాధకుఁ దాళఁజాలక మహేంద్రుండు భయాకులమానసుండై వానిం బరిగ్రహించి యొక్కసంవత్సరం బాబాధల ననుభవించెను. ఆవల వాని నెల్లైనం బాపు

కొనం జూచి దీనుండై భూజలవృక్షస్త్రీలం బ్రార్థించి నాయీదు రితంబుల నాలుగుభాగంబులుగా నొనరించి పుచ్చుకొనుం డని యె. వార లంగీకరించిరి. అందు భూమితనయందుఁ జేయంబడు ఖాతంబు తనంతన పూడునట్టివరంబును, జలంబు తనయందుఁ బ్రక్షాళితం బైన యేవస్తువైనను బావనం బగునట్టివరంబును, వృక్షంబులు ఛేదింపంబడినను బునః ప్రరోహంబు గలుగువరం బును, స్త్రీలు సదా తమకుఁ గామసుఖంబులు గలుగునట్టివరం బును గోరిరి. శచీనాథుఁ డవ్వాని నట్లె యొసంగెను. అంత భూ మ్యాదులు బ్రహ్మహత్యాభాగంబులం గొనియె. భూమి చవుటి నేలగను, జలంబు బుద్బుదఫేనరూపంబునను, వృక్షంబులు నిర్యాసభావంబునను, కాంతలు రజోవికారంబునను దాని నను భవించునట్లు తెల్పిరి. ఇట్లు నాలుగుభాగంబులుగా బ్రహ్మహత్యా నిర్ముక్తిం గాంచి యింద్రుండు యథారీతిగా నుండెను.

వృత్రాసురకథ.

పాఠకులారా! ఎన్నిపాట్లు పడినను దాఁ జేసినదుష్కృత్య మనుభవింపక నశింప దనుట గ్రహింపుఁడు. చేయరానికార్య ముల నొనరించి వాని నెట్లో కప్పిపుచ్చినంతమాత్రమున దాని యనుభవము తమకుఁ దప్పినదని కొందఱు దేవానాంప్రియులు భావింతురు. అది మిగులఁ బొరపాటు. బుద్ధిపూర్వముగ నొన రించిన దుష్కృత మనుభవించినఁ గాని నశింపదు. ఇంద్రుఁడు

బ్రహ్మహత్యను ఇతరుల ననుభవింపఁ బ్రార్థించి తాను దప్పించు కొనియెఁగదా యని ప్రశ్నింపకుఁడు. అట్లు తప్పించుకొనుట సాధ్యము కాదని నమ్ముఁడు. త్రిలోకాధిపతియైన శతక్రతువు లొనరించి త్రిమూర్తులను దలంచినపుడు చూడఁదగినంతపుణ్యమొనరించిన యింద్రుఁ డొక సంవత్సర మాపాపము ననుభవించెను. ఆవల నాల్గుభాగముల నితరుల ననుభవింపఁజేసెను. అంతలో నది యాయనను వదలలేదు. ముం దాయింద్రు నెట్లు బాధించెనో మీ రెఱుంగ గలరు. ఇఁకఁ గథ వినుఁడు.

త్వష్ట విశ్వకర్మతండ్రి. ఇంద్రుండు తనకొడుకును ద్రుంచుట నెఱింగెను. పుత్రశోకము దుర్భరము గాన దాని ననుభవించెను. శక్తియుక్తుఁ డగువాఁడు దుఃఖపడుటతోడనే తృప్తినొందఁడు కాన నాదుఃఖపదమున నాగ్రహమును బ్రవేశింపఁజేసెను. ఆగ్రహ మగ్నివంటిది. అది యెవరినైనను బాధింపక చల్లారదు. త్వష్ట దుఃఖమునుమాని శతమఖమారణము చేయఁబూని యాభిచారికహోమంబొనరించెను. ఆభిచారిక మనునది క్రూరకర్మము. ఇతరుల బాధించుటకో చంపుటకో చేయుకార్యమ నిదానియర్థము. ఆదేవతలుక్రూరస్వభావులుగానుందురు. హోమద్రవ్యము లట్టివే. అది హింసాప్రధానకర్మమని తెలిసికొనఁదగినది. ఆహోమము పూర్తి కాఁగా నాయగ్నిగుండమునుండి కల్పాంతకాకారవిస్రుతకీలానలనిష్ఠురేక్షణగుణక్షుభ్య త్రిలోకుం

డగు నొక బాలకుండు వెడలివచ్చెను. ఆతనిం జూచినంతనే యందలివారందఱు భయంపడిరి. వృత్రుఁ డను నామకరణ మొనర్పఁబడెను. అపసితనమునందే యాతనిప్రతాప మోర్వ రానిదని యందఱకుం దోఁచెను. ఓర్వఁజాలక దేవత లాతనిం జుట్టుముట్టి శస్త్రాస్త్రంబుల ముంచిరి. ఆ యాయుధముల నాబాలకుం డూరక మ్రింగెను. ఆపద్ధతిం గాంచి పురందరాదిబృందారకులు డెందంబులం బుట్టిన భీతిని దశదిశలకుం బాఱి రక్షకుఁ డెవ్వఁడగునా యని వెదుకసాగిరి. అంతట నమరు లందఱొకచోటం జేరి యాలోచించి యాపద్బాంధవుండు పుండరీకాక్షుండు గా కన్యుం డొకండు కలఁడే యను నిశ్చయంబున వైకుంఠంబున కరిగి భక్తివినయతాత్పర్యంబు లొప్పుచుండఁగా

చ. "ఉదకమయంబునన్ వసుధ ♦ నొందఁగఁ జేసి తనర్చుకొమ్మునన్
వదలక యంటఁ గట్టి మను♦వల్లభుఁ గాచిన మత్స్యమూర్తి స
మ్మదమున మమ్ముఁ బ్రోచు నను♦మానము మానఁగ వృత్రు చేతియా
పదఁ దొలఁగించి నేఁడు సుర♦పాలుర పాలిటిభాగ్యదైవమై."

అని యిట్టి స్తుతుల ననేకంబుల స్తుతియించిన నారాయణుండు కరుణావారిరాశి వారికిఁ బ్రత్యక్షంబయ్యె. అత్తఱి

సీ. "తగు శంఖచక్రగ♦దాధరుం డగువాని
శ్రీవత్సకౌస్తుభ♦శ్రీలవానిఁ
గమనీయమాణిక్య♦ఘనకిరీటమువాని
దివ్యవిభూషణ♦దీప్తివాని

మండితకేయూర♦కుండలంబులవాని
సిరి యురస్స్థలమునఁ ♦ జెలఁగువాని
దనుఁ బోలుసేవక♦దండంబుఁగలవాని
జిలుఁగైనపచ్చని♦వలువవానిఁ
ఆ. దెల్లదమ్మివిరులఁ ♦ దెగడుకన్నులవాని
నవసుధాద్రవంపు ♦ నవ్వువానిఁ
గలిరొ వేల్పుపిండు ♦ కప్పురపాటులోఁ
గన్నులందు నున్న ♦ కఱవు దీఱ."

కనినంతనే వారు ముకుళితకరాంజలులై భయభక్తు లొలయ నానందంబున

సీ. "దండంబు యోగీంద్ర♦మండలనుతునకు
దండంబు శార్ఙ్గకో♦దండునకును
దండంబు మండిత♦కుండలద్వయునకు
దండంబు నిష్ఠుర♦భండునకును
దండంబు మత్తవే♦దండరక్షకునకు
దండంబు రాక్షస♦ఖండనునకు
దండంబు పూర్ణేందు♦మండలముఖునకు
దండంబు తేజఃప్ర♦చండునకును
తే. దండ మద్భుతపుణ్యప్ర♦ధామునకును
దండ ముత్తమవైకుంఠ♦ధామునకును
దండ మాశ్రితరక్షణ♦తత్పరునకు
దండ మురుభోగినాయక♦తల్పునకును."

అని నతులు సమర్పించి వృత్రదానవభీతి రానుండుటఁ దెలిపి మాకిఁక దిక్కు నీవే కదా యని ప్రార్థించిరి. ఆమాటల

కాభక్తితాత్పర్యంబుల కలరి శ్రీమన్నారాయణుండు దరహాసితవదనుండై మృదుమధురభాషణంబులతో దేవతలారా! మీనుడులు నా కెంతయు సంతసంబు సేయంజాలె. మీకు మేలయ్యెడు. భయపడకుఁడు. ఇఁక మీభయంబు నశియించువిధంబు వినుండు. నాభక్తుండు దధీచి యను మహాముని కలండు. ఆమునిశరీరంబు మద్విద్యాతిశయమహత్త్వంబునఁ దేజోవిశేషంబున భాసురంబై సారతమంబై యుండు. దానిం బరిగ్రహింపుఁడు. ఆముని వదాన్యులలో వదాన్యుడు. తప్పక వేడిన మీకిచ్చు. ఆయనశల్యంబులై విశ్వకర్మనిర్మితంబులై శతధారలు గల యాయుధశ్రేష్ఠంబగు. అదియు మత్తేజఉపబృంహితంబై వృత్రాసురశిరోహరణకారణంబై యుండు. దానంజేసి మీకు మరలఁ ద్రిలోకాధిపత్యంబు సుస్థిరంబుగ నిలువం గలదు. మీకు శత్రుబాధ లడంగు నని యాదేశించి యంతర్హితుండయ్యె.

అంత నమర్త్యులు పరిహృష్టాంతరంగులై సముద్రమధ్యభాగమున నున్న దధీచిమునికడకుం జని యాతనిసమాధికి మెచ్చుకొనుచు నమస్కరించి వినయ ముట్టిపడుచుండఁగా

ఆ. “దేహి సుఖము గోరి ♦ దేహంబు ధరియించు
దేహి విడువ లేఁడు ♦ దేహ మెపుడు
దేహి యస్మదీయ♦దేహంబుకొఱకునై
హ మీదేఁ గదయ్య ♦ దేవతలకు.”

ఉ. "ఎక్కడ నెల్లలోకముల ♦ నెవ్వరు గోరనికోర్కి నేఁడు మా
తెక్కలిపాటుకై తివిరి ♦ దేహము వేఁడఁగ వచ్చినార మే
మెక్కడ తీవ్రకర్గతి ♦ యెక్కడ దైవకృతంబు గాక యీ
రాక్కఫుదాన మీవరుస ♦ రోయక వేఁడుదు రే జగంబులన్."

క. "అడుగంగ రాని వస్తువు
లడుగరు బ్రతిమాలి యెట్టి ♦ యర్థులు నిను నే
మడిగితిమి దేహ మెల్లను
గడు నడిగెడువారి కేడ ♦ కరుణ మహాత్మా."

అని వేఁడిరి. ఆమాటల కమ్ముని యాగ్రహమ్ము నొందక యను
గ్రహసమగ్రమానసుండై

ఆ. "ఎలమి బ్రదుక నిచ్చ ♦ నెనసినవారికి
దేహ మెల్లభంగిఁ ♦ దీపు గాదె
యచ్యుతుండు వచ్చి ♦ యర్థించె నేని ని
దన్ను నిచ్చునట్టి ♦ దాత గలఁడె."

అని పలికి దేవతలారా! యర్థ మడుగుయాచకులు గలరు.
దేహ మడిగెడి యాచకుండు లేఁడు. యాచకవాంఛాపరి
పూరణసమర్థులగు దాతలు గలరు గాని తనదేహ మీనేర్చు
దాత లేఁడు. ఒకప్పుడు తనదేహ మిచ్చుదాత యుండుఁగాక.
యట్టివానిం జంపునట్టి యాచకుఁడుండునా. అథవా చంపును
బో. శల్యంబుల నన్నింటి నేటి పంచుకొను యాచకు లుందురా.
మీరు లోకజాలము రక్షింపఁబూనుపాలకులు. మీ కెట్లిట్లుహిం
స చేయుబుద్ధి పుట్టెనో మీ కెట్లు ప్రాణములు తీపో ఇతరుల

కర్తయని తలంపవలదా. అని నేర్పుమైఁ బ్రశ్నించెను. దేవతలా మాట లాలకించి

తే. "సర్వభూతదయాపర♦స్వాంతులకును
బుణ్యవర్తను లగు మిమ్ము ♦ బోఁటివారి
కమితసత్కీర్తికాముల ♦ కలఘుమతుల
కియ్యరానిపదార్థంబు ♦ లెవ్వి గలవు."

ఆ. "అడుగరాని సొమ్ము ♦ నడుగరా దని మానఁ
డడుగు వానిమాట ♦ లడుగ నేల?
భ్రాంతి నడుగుచోటఁ ♦ బ్రాణంబు లేనిని
నిచ్చువాఁడు దాఁపఁ ♦ డిచ్చుఁ గాని."

అని పలుక దధీచిమహాముని దరహాసంబు మోమున నాట్యము సల్ప నఖిలలోకధర్మం బెఱింగియు నొక్కింత కాలంబు ప్రీతివాక్యం బిచ్చితి. సహింపవలయు నని ప్రార్థించి ... యట్టివారి కుపకృతి గలుగునేని యీతుచ్ఛదేహంబుతో నింకఁ జేయవలసిన దేమని నుడువుచు శ్రీమత్పరబ్రహ్మంబును దలంచుచు శరీరంబు వదలెను. అప్పు డింద్రుం డాశల్యంబుల విశ్వకర్మ నిశితశతధారాసమావృతంబై వెలుంగు వజ్రాయుధంబు గా నమరింపం దానిం గైకొని యైరావతంబు నెక్కి సకలదేవతలు పరివేష్టింప వృత్రాసురునిపైకిం బోయెను.

వృత్రుండు నుద్దండలయకాలప్రచండచండభానుం బోలె దుర్నిరీక్ష్యతేజోవిభాసురుండై దానవబలంబులు గొలువ ననికి

నడచెను. ఇరుదెగలవారును పోరు ఘోరంబుగాఁ జేయుఁదొడం గిరి. ఆసంకులసమరంబు కొంతకాలంబు చెల్లె. అంతట దేవాధి పవృత్రాసురులు తలపడి దుర్భరభంగి యుద్ధ మొనర్చిరి. గెలుపోటములు నిర్ణయింప వీలులేక యుండెను. వృత్రుని దెబ్బకు నైరావతము తల్లడిల్లెను. దానిని సేదదేర్చుచుండఁ గులిశంబు జాఱి క్రిందఁబడియెను. ఇంద్రుఁడు లజ్జించి మోము వంచి యుండఁగా వృత్రాసురుం డింద్రునిం జూచి సవ్వాచు

క. "దురమునఁ గైదువు వదలిన
శరణన్నను వైరిజనులఁ ♦ జంపరు వీరుల్
వెఱఁగంద నేల కులిశము
కర మరుదుగఁ బుచ్చికొనుము ♦ కాచితి నింద్రా".

అని నీతి మెఱయఁ బలికినవృత్రాసురుని దైవముగాఁ దలంచి యింద్రుండు దానవేంద్రా,

ఉ. "లోకము లెల్ల నిండి తన♦లోనుగ సర్వము చేసి ప్రాణులన్
దీనులఁ బెట్టి యెల్లెడలఁ ♦ దీపులు చూపెడు విష్ణుమాయ నేఁ
డేకమతిం దలంచి తిది ♦ యేల మహాసురరూపు మాని సు
శ్లోకుఁ బురాణపూరుషుని ♦ శోభనమూర్తి ధరింపు మింపునన్".

ఉ. ఏనియమంబు సల్పితివొ ♦ యెట్టిమహాతప మాచరించితో
పూని రజోగుణాభిరతిఁ ♦ బొందిన నీమతి శాంతిదాంతిస
మ్మానసమానసానుభవ♦ముత్తమగాథుల గోష్ఠభావస
మ్మానుఁడ మేయుఁ డాదనుజ♦మర్దను భక్తి ప్రసంగ మెంతయున్.

క. నారాయణరూపామృత
పారావారమునఁ దేలు♦భక్తుఁడు దా భూ

దారకృతఖాతకోదక
పూరంబున నేల తృప్తిఁ ♦ బొందు మహాత్మా".

ఇట్లింద్రుండు పలుకుచుండ వృత్రుండు యుద్ధోన్ముఖుండై తలపడ శతమఖుండును వెనుదీయక మారొడ్డన వృత్రాసురుం డైరావతంబుతో నింద్రుని మ్రింగెను. అప్పుడు

ఉ. "కందఁడు భీతిఁ గుందఁడు ప్ర♦కంపన మొందఁడు పెద్దనిద్దురం
జెందఁడు తత్తఱింపఁడు వి♦శేషము జొప్పఁడు వైష్ణవీజయా
నందపరైక విద్యను మ♦నంబునఁ దాల్చుచు నుండెఁ గాని సం
క్రందనుఁ డానిశాచరుని♦గర్భములో పరిరక్షితాంగుఁడై".

ఇట్లు శ్రీమన్నారాయణకవచ ప్రభావంబున నుండి తన యోగబలంబున నతనియుదరంబును గులిశంబున భేదించి యైరావతసహితుండై వెడలి వజ్రంబున నాతనికంఠంబు చేదింప వృత్రాసురుండు గతాసువై యిలం గూలెను. అత్తఱి

ఆ. "ఏమి చెప్పనప్పు ♦ డింద్రారితనువున
నొక్క దివ్యతేజ ♦ ముచ్చి వెడలి
లోక మెల్లఁ జూడ ♦ లోకులు చూడ నీ
లోక మరసి విష్ణు♦లోకు జొచ్చె".

ఇట్లు వృత్రుండు మడసిన నాపెనుపాపంబు వికృతరూపంబుతోఁ బొడచూపి వెను దగులఁగా శతమఖుండు నలుదెసలకుం బరుగిడి పరుగిడి యెందును నిల్వఁజాలక మానససరోవరంబుం జొచ్చి యందొక్కకమలనాళంబునం దూఱి యందుఁ దంతువులంగలిసె రూపంబు లేకయుండెఁ. బ్రహ్మహత్యయు

నాచోటు ఈశ్వరదిక్కుగానఁ బ్రవేశించి యింద్రునిఁ బాధింపఁ జాలకుండెను. పదంపడి నిరంతర నారాయణధ్యానబలంబున నా బ్రహ్మహత్యాభీతిం బాసి శంకరుననుకంపామహిమంబున రక్షింపఁబడి శచీదేవి బృహస్పతి నారాధించి ప్రసన్నుం జేయఁ దదాశిషంబుల మరల నింద్రపదవిం బొంది యశ్వమేధంబు లొనరించి యథారీతిగా రాజ్యంబుం బాలించుచుండెను.

చిత్రకేతూపాఖ్యానము.

అనిన విని పరీక్షిన్నరేంద్రుఁడు శుకయోగీంద్రుం జూచి మహాత్మా, మహాక్రూరకర్ముఁడగు వృత్రుఁడు సుజ్ఞానియెట్లయ్యెను. యుద్ధరంగమున నమరేంద్రు నెట్లునొప్పించెను. తెలుపుమా యను నయోగి యిట్లు చెప్పెను. ఓ రాజేంద్రా! తొల్లి కృష్ణద్వైపాయనుండును నారద దేవలమహర్షులు నా కెఱింగించినవిధంబు నీ ప్రశ్నమునకు నుత్తరం బగు విను మని యిట్లు చెప్ప మొదలిడెను.

పూర్వము శూరసేనదేశము లని పేరుగాంచిన భూములఁ బాలించు నరపతి చిత్రకేతువు నా విఖ్యాతుఁడు కలఁడు. ఆతనికిఁ బెక్కుమంది పత్నులు గలరు. ఎవరియందుఁగాని యా నరపతి సంతానమును బడయఁజాలకుండెను. ఎన్ని భోగభాగ్యము లుండినను సంతతి లేనికొఱతయాతని బాధించుచునే యుండెను. తద్దుఃఖమున నాతఁడు సదా విషణ్ణచిత్తుఁ డగుచుండెను. ఒక్కదివసంబున నారాజునింటి కంగిరసుఁ డనుమునిపతి యరు

దెంచెను. రాజా మునిరాజును యథాశాస్త్రముగాఁ బూజించె
ను. దాన నతఁడు పరమానందభరితుఁడై కుశలప్రశ్నములను
జేసి రాజేంద్రా! సకలవిధములలోపములేని నీవిపుడేల ఖిన్నుఁడ
వై యున్నవాఁడవు తెల్పుమని ప్రశ్నించెను. చిత్రకేతు వా
మునిం గాంచి మహాత్మా, ధ్యానబలంబున సర్వ మెఱింగిన
మీకు నేఁ జెప్పవలసినదే మున్నది! అని యేమియు విశేషించి
పలుకక యూరకుండెను. ముని యాతనికోరిక నెఱింగి, భూ
పాలశేఖరా! నీ కోరిక నెఱింగితిని. నా చెప్పినట్లుచేసిన నీకుం
గుమారుండు కలుగు నని తానే యాతనిచేఁ బుత్రకామేష్టి
చేయించి యజ్ఞశేషపదార్థంబు తొలిపత్ని యగు కృతద్యుతి
కొసంగెను. ఆమె గర్భముం దాల్చి కుమారునిం గనెను.

ఆసమయమున నాచిత్రకేతు మనస్సున సంతోషమిము
డక యుప్పొంగెను. ఒడలు తెలియకుండఁ జేసెను. విప్రప్రవ
రులు లోనగువారి కెల్ల వలసిన ధనంబు లిచ్చెను. జాతకర్మాది
విధులునిర్వర్తింపఁబడెను. కుమారుఁడుశుక్లపక్షశీతద్యుతివలెదిన
దినప్రవర్ధమానుండై యుండెను. కుమారుఁడు కలిగినది మొద
లాభూపతి కృతద్యుతియందే బద్ధానురాగుఁడై యుండెను.
దాని కోర్వఁజాలక తక్కిన పత్నులాభూపతి కింతప్రీతి తొలి
లలనయందు నొలయుటకుఁ గారణము తనయుండే కదా. వీనిం
బొలియించినచో నీప్రీతితగ్గునని చింతించి యాబాలునకు విషం
బిడి చంపిరి. నిద్రించువానివలె గుమారుఁ డుండ నింతనేపేటి

నిద్రయని దాది యూహించి మృతుం డయ్యెనని యెఱింగి యాక్రోశించెను. తల్లి యెఱింగి బిట్టురోదనముఁ గావించెను. రాజమందిరం బెల్ల దుఃఖపూరనిమగ్నమయ్యెను. రాజునకా దుర్వార్త యమితశోకము నొసంగెను. రాజరుదెంచి నిశ్చేష్టుఁడయ్యెను. ఎవరు నాతని దుఃఖమును దీర్చువారు లేకుండిరి. అంత నంగిరసుఁడు నారదసమానితుఁడై నతనికడ కరుదెంచి మృతునిచెంత మృతునిభంగిఁ బడియున్న రాజుం గాంచి

సీ. "నీవు వీఁ డెవ్వఁడు? ♦ నీ వెవ్వనికి శోక
సంతాప మందెదు ♦ సార్వభౌమ
పుత్రమిత్రాదులు ♦ పూర్వజన్మంబున
నెవ్వనివారలో ♦ యెఱుఁగఁగలవె
మొదల నదీవేగ♦మున నాడకాడకు
సికతంబు గూడుచుఁ ♦ జెదరుచుండు
నారీతిఁ బ్రాణుల ♦ కతికాలగతిచేతఁ
బుట్టుట చచ్చుట ♦ పొసఁగుచుండు

ఆ. గాన భూతములకుఁ ♦ గలుగుభూతంబులు
మమతతోడ విష్ణు♦మాయఁ జేసి
దీని కడల నేల? ♦ ధృతి దూలఁగా నేల?
బుద్ధిఁ దలఁప వలదె ♦ భూతసృష్టి"

అని యనేకనీతుల నుపదేశించెను. ఆజ్ఞానోపదేశమున రాజు తెలివొంది చేతులు మోడ్చి యతివేషము లూనిన మీరెవ్వరు? అని ప్రశ్నించెను. అంగిరసుఁ డయ్యా. నేను నీచే బు

త్రకామేష్టి చేయించినవాఁడను. ఈయన నారదముని యని తెలిపి నీదుఃఖం బపనయింపనరుదెంచితిమని బోధించెను. అంత నారదముని, రాజా నీకుమారునితోఁ బని కలదేమో కనుఁగొనుమిదె వీనిఁ బ్రదికించెదనని పలికి యోజీవుఁడా! నీకు శుభంబౌనఁగూడ ఈతనువునఁ బ్రవేశింపుము. నీతల్లిదండ్రులదుఃఖం బపనయింపుము. ఆయుశ్శేషం బనుభవింపుము పిత్రధీనంబైన రాజ్యపదంబున నధివసింపు మనియె. ఆమాటల కాబాలుండు ప్రతివచనం బిచ్చుచు

తే. "కర్మవశమున నెందు సుఖంబు లేక
దేవతిర్యఙ్నృయోనులఁ ♦ దిరుగునాఁకు
వెలయ నేజన్మమందునో ♦ వీరు తల్లి
దండ్రు లయినారు చెప్పవే ♦ తాపసేంద్ర".

క. "సతు లెవ్వరు? సుతు లెవ్వరు?
పతు లెవ్వరు? మిత్రశత్రు♦బంధుప్రియసం
గతు లెవ్వరు? సర్వాత్మక
గతుఁడై గుణసాక్షియైన ♦ ఘనుఁ డొక్కనికిన్".

అని పలికి చిత్రకేతుం గాంచి నాకును మీకు నెక్కడి సంబంధంబు? మీరు దుఃఖింపఁ బని లేదు. జ్ఞానంబు సంపాదింపుము. తరింతువని పలికి జీవుండు పోయెను. చిత్రకేతుండును వానిబంధువులు విస్మితులైరి. అంతఁ జిత్రకేతుం డాతనయునకు నౌర్ధ్వదైహికంబు లొనరించి కాళిందికిం బోయి స్నానమొనరించి నిర్మలాంతఃకరణుండై నారదునకు నమస్కరిం

చెను. ఆముని యాభూపాలునకు భగవన్మంత్ర ముపదేశించెను. పిదప నంగిరసుం గూడి బ్రహ్మలోకంబునకుం బోయెను.

చిత్రకేతుండు నారదోపదేశంబునఁ బవిత్రచిత్తుండై నిరాహారుఁడై భగవంతు నేడురాత్రంబు లారాధించెను. దాన విద్యాధరాధిపత్యంబు రత్నవిమానంబును లభించె. భగవదను గ్రహంబును గలిగెను. దానఁ ద్రిజగంబులనుఁ దిరుగుచుఁ గొన్నిదినంబులకు నొక్కచోట

సీ. "తారహారపటీర ♦ ధవళ దేహము వాని
రమణీయనీలాంబ ♦ రంబువాని
మణికిరీటస్ఫుర ♦ న్మస్తకంబు వాని
గంకణకేయూర ♦ కరము వానిఁ
గర్బురమయదీప్త ♦ కటిసూత్రములవానిఁ
దరళయజ్ఞోపవీ ♦ తములవాని
నలినుప్రసన్నవ ♦ క్త్రాంబుజంబులవానిఁ
దరుణవివృత్తనే ♦ త్రములవాని

ఆ. సిద్ధమండలంబు ♦ సేవింపఁ బుణ్యప్ర
సిద్ధి వెలసినట్టి ♦ యిద్ధచరితుఁ
బద్మలోచనునకుఁ ♦ బాదపీఠంబైన
ఘనునిఁ బన్నగేంద్రుఁ ♦ గాంచె నతఁడు".

కన్నంతనే భక్తినమ్రకంధరుండై నమస్కరించి వినయ మొప్పారఁగా

తే. "అరయ బ్రహ్మాదు లెవ్వని ♦ ననుసయించి
భక్తియుక్తుల మనములఁ ♦ బ్రసుతింతు

రవని యెవ్వనితలమీఁద ♦ నావగింజఁ
బోలు నావేయిశిరముల ♦ భోగిఁ గొల్తు".

అని నుతించెను. ఆనుతుల కలరి యనంతుఁడు తనవిధం బెఱింగించి ముక్తుండ వైతి వని యాశీర్వదించి యదృశ్యుఁ డయ్యెను.

చిత్రకేతుఁ డవ్వల నాదివ్యవిమానం బెక్కి తిరుగుచు భగవంతునిం బాడుచుఁ బోవుచు వలసినచోట్ల నిలుచుచు నొక్కనాఁడు కైలాసంబు చెంతం బోవుచుండి

క. "ఆరజతభూధరంబున
నీరేజభవామరాది ♦ నికరము గొల్వం
జేరోలగమున నుండిన
గౌరీయుతుఁ డైనహరునిఁ ♦ గనియె నరేంద్రా".

సీ. తననిజరూప మిం♦తయు నున్కి తెలియక
వాదంబు చేసెడు♦ వేదరవముఁ
గరుణావలోకనా♦కాంక్షితులై యున్న
బ్రహ్మాదిసనకసం♦ ప్రణుతిరవము
సారశివానంద♦సల్లాపముల నొప్పు
ప్రమథగణాళియా♦స్ఫోటరవంబు
డమరుమృదంగాది ♦ ఢమఢమధ్వనితోడి
పటుభృంగినాట్యవి♦స్ఫారరవము

తే. మానుగాఁ జామరలు వీచు ♦ మాతృకాది
కామినీజనమహితకం♦కణరవంబు
మెండు చెలఁగంగఁ గన్నుల♦పండు వయ్యెఁ
గొండరాచూలిపెనిమిటి♦ నిండుకొల్వు".

అట్లు కాంచి బ్రహ్మాదిసేవితుండయ్యుఁ దనయూరుతలంబున గౌరి నునుచుకొని యున్న పరమేశ్వరుం గాంచి చిత్రకేతుండు పకపక నవ్వెను. అంతట నూరకుండక యామె వినుచుండఁగానే జంకు లేక,

సీ. కొమరొప్పఁ గా లోక♦గురుఁడును గడలేని
ధర్మస్వరూపంబు ♦ దాన యగుచు
జడలు ధరించియు ♦ పరిలేనితపమునఁ
బొడవైన యీ యోగి♦పుంగవులును
బ్రహ్మవాదులుఁ గొల్వ ♦ భాసిల్లు కొల్వులో
మిథునరూపంబున ♦ మెలఁతతోడఁ
బ్రాకృతుండును బోలె ♦ బద్ధానురాగుఁడై
లాలితుం డయ్యె ని♦ర్లజ్జత నిట

ఆ. నకట! ప్రకృతిపురుషుఁ ♦ డైనఁ దా నేకాంత
మందు సతులతోడ ♦ నలరుఁ గాని
యిట్లు ధర్మసభల ♦ నింతులతోఁ గూడి
పరిఢవింప లేఁడు ♦ భ్రాంతి నొంది.

అనిపలికెను. ఈశ్వరుఁ డామాటల వినెను. ఏమియుఁబలుక లేదు. పక్కున నవ్వెను. ఆసభలోనివా రేమన కూరకుండిరి. అంతటఁ జిత్రకేతునియహంకారమునకుఁ బార్వతి యోర్వక సభ్యులారా! వింటిరె గదా వీని ప్రల్లదములు. సనకాదిమునిధ్యేయుని శంకరునితత్త్వము నీతుచ్ఛుఁ డెఱుంగఁగలఁడా! మహర్షులవివేకమునసా భగవంతుని సేవించుట? అని మఱియు నాగ్రహం బుపేర్మిని జిత్రకేతుని సభ్యులకుం జూపి

సీ. ఎవ్వనిపదపద్మ ♦ మింద్రాదివిబుధుల
చూడాగ్రపంక్తుల♦నీడఁ జూచు
నెవ్వనితత్త్వం బ♦దనయంగ బ్రహ్మాది
యోగిమానసపంక్తి ♦ నోలలాడు
నెవ్వనిరూపంబు ♦ నేర్పాటు గానక
వేదంబు లందంద ♦ వాద మడుచు
నెవ్వనికారుణ్య ♦ మీలోకముల నెల్లఁ
దనిపి యెంతయు ధన్య♦తములఁ జేయు

తే. నట్టి సర్వేశుఁ బాపసం♦హారు ధీరు
శాశ్వతైశ్వర్యు నాత్మసం♦సారు నీశు
నెగ్గు పల్కిన పాపాత్ముఁ ♦ డెల్ల భంగి
దండనార్హుండు గా కెట్లు ♦ తలఁగఁగలఁడు.

తే. నిఖిలలోకాశ్రయంబు స♦న్నిహితసుఖము
సకలభద్రైకమూలంబు ♦ సాధుసేవ్య
మైన కంజాక్షుపాదప♦ద్మార్చనంబు
ననుసరింపంగ ఖలుఁడు వీఁ ♦ డర్హుఁ డగునె.

అని పలుకుచుఁ జిత్రకేతువుం గాంచి దురాత్మకా! ఈపాపంబునకు ఫలంబుగా నీవు రాక్షసయోనింబుట్టు మని శపించి యింతనుండి మహాత్ముల నవజ్ఞచేయకుండు మని పలికెను.

ఈమాటలు వినఁబడఁగనే చిత్రకేతుఁడు విమాన ముడిగి యా జగజ్జననికి నమస్కరించి చేతులు జోడించి తల్లీ! నాదుష్కర్మము నన్నింతకుం దెచ్చెను. ఈశాపమునకు దుఃఖింపను. జగన్మాతయగు నిన్ను నిట్లు పలికిన దోషమునకే శంకించు

వాడను. తల్లీ క్షమింపుము. నాయీయపరాధమును మన్నింపుము. ఇఁక నెన్నఁడు నిట్టి యవివేకమునకు నామదిఁ జోటీయ నని పలికి పార్వతీపరమేశులఁ బ్రీతులఁ జేసి విమాన మెక్కి పోయెను. ఆచిత్రకేతువే ఆశాపంబునఁ ద్వష్ట చేయుయజ్ఞంబున దక్షిణాగ్నియందు దానవయోనిం బుట్టి జ్ఞానసంపన్నుఁడు గా నుండెను. రాజేంద్రా ! ఇది వృత్రాసురపూర్వకథ. ఇఁక నేమి వినఁ గోరెదవో తెల్పు మని పలికెను.

ఇది షష్ఠస్కంధము.

సప్తమస్కంధము.

శ్రీహరిద్వారపాలకులకు శాపముగల్గుట.

పరీక్షిన్మహారాజు యోగిపుంగవుపలుకు లాలించి భక్తిభారంబున నిట్లు ప్రశ్నించెను. 'యోగీంద్రా! సర్వభూతసముఁడగు శ్రీహరి దేవేంద్రుని నిమిత్తమై దానవుల వెదకి వెదకి చంప నేల! ఈశంకను మాన్పుమా' యని వేఁడెను. శుకయోగియు రాజేంద్రా! నీప్రశ్నము పరమపవిత్రమైనది. భగవల్లీలల నాలకింపఁ గుతూహలుఁడ వగునీ వడిగిన విషయమునకు బదులు చెప్పెద. వత్సా!

క. చిత్రంబులు త్రైలోక్యప
విత్రంబులు భవలతాలవిత్రంబులు స
న్మిత్రంబులు మునిజనవన
చైత్రంబులు విష్ణుదేవుచారిత్రంబుల్.

కాన నవి వినఁ దగినవి. సావధానుఁడవై యాలకింపుము. భగవంతునకు శత్రుమిత్రభావంబులు లేవు. సర్వసాక్షి. సర్వసముఁడు కాని సత్త్వగుణంబునకు వృద్ధియు రజస్తమోగుణంబులకు హానియుఁ గల్గించు నిచ్ఛ గలవాఁడు. కాఁబట్టియే సత్త్వగుణంబు గల దేవతలఁ బాలింపం బూని రజస్తమోగుణు

లయిన దానవులఁ జంపుచుండు. ఇదియు దీని రహస్యము. దీనిచరిత్రం బంతయుఁ జెప్పెద.

పూర్వము సనక సనందన సనత్కుమార సనత్సుజాతు లను పేరఁబరఁగు బ్రహ్మమానసపుత్రులు నగుమునివరులు దైవ వశంబున నెల్లకడలఁ దిరుగుచు పంచషడ్వర్గసమవయస్సంయు తకాయులగుచు దిగంబరులయి శ్రీహరిని సందర్శింప వైకుంఠం బునకుం బోయిరి. భగవంతుని దివ్యసౌధంబుఁ గాంచినంతనే ప్రణమిల్లి లోపలం జొచ్చుతఱి ద్వారసీమ నున్న జయవిజయు లను నిరువురు పురుషులు ద్వారపాలకులుగాన వారిని వారిం చిరి. ఎన్నఁడుగాని వారిగమన మప్రతిహతము. ఆనాఁడు భగవంతు నెపుడెపుడు దర్శింతుమా యనితమకమునఁ జొచ్చు చుండ వారు వారించిరి. ఇంచుకంతయైన పరువు నారయక నిలిపిరి. హుంకరించిరి. చొరరాదు నిలువుం డనిరి.

అత్తఱి వారికిం గల్గిన యాగ్రహమునకు మేర లేదు. భగవంతుని దర్శింపఁబోవఁగా నడ్డుటకు వీరెవ్వ రని యెంచిరి. దుష్టాత్మకు లిటఁ జేరిరని నిశ్చయించిరి. వెంటనే వారెల్ల నేకవా క్యముగా మీరుమమ్ము నివారించితిరి. ఇది యాసురకృత్యము. కావున మిమ్ముక్షమింప నవకాశము లేదు. మీరు వేగమయసుర యోనిజన్మింపుడు. ఇచ్చోటమీరుండ నర్హులుకారు. రజస్తమో గుణ ప్రధానులరయి యసురులుగండు. ఇఁకఁబొండని శపించిరి.

ఆశాపము చెవిసోఁకగనే జయవిజయులు కంపించిరి. చేసినపని కిట్టిఫలము గలిగెనే ఇఁక గతియేమని దుఃఖించిరి. భగవదనుజ్ఞ నెఱవేర్చితిమి కదా? ఇట్టిశాపము గా నేల యని విచారించిరి. ఇఁక నాలసింపరా దని కృతనిశ్చయులై వారిపాదములం బడిరి. మొఱ పెట్టుకొనిరి. మాయపరాధము లేదు. స్వామియాజ్ఞ నతి మిమ్ము నిలిపితిమి. మమ్ము శపింప న్యాయమా? యని దీనాలాపంబు లాడిరి. మాగతి యేమని వ్యసనపడిరి. తమరు పరమ కృపానిధులుగాన మన్నింపుఁ డని చేతుఁ మొగ్గి ప్రార్థించిరి. తుదకు బోరున నేడ్చిరి.

సనకసనందనాదులు వారిఁ గరుణించిరి. దూరదృష్టి నవలోకించిరి. ఆఱుజన్మంబుల భగవంతునితో మైత్రి నొందిగాని మూఁడుజన్మముల ద్వేషించికాని శాపవిముక్తి నొంది మరల నిందుండుఁడని శాపవిముక్తిని బ్రసాదించిరి. లోనికరిగి శ్రీమన్నారాయణమూర్తిం దిలకించిరి. కృతార్థుల మైతిమని మనవి చేసిరి. సెలవొంది తమయిచ్చాం బోయిరి.

ఆజయవిజయులు హిరణ్యకశిపు హిరణ్యాక్షులన నవతరించిరి. హిరణ్యాక్షుని శ్రీహరి యాదివరాహరూపం బెత్తి వధించెను. హిరణ్యకశిపుండు ప్రహ్లాద నాత్మకుమారుని హింసించి నరసింహరూపధారి యగు శ్రీహరిచే హింసింపఁబడియె. అనఁ దద్వ్యధం బెటులెంగింపు మని రాజు ప్రశ్నింప శుకయోగి యిట్లు చెలిపెను.

హిరణ్యకశిపుఁడు తపం బొనరించుట.

హిరణ్యాక్షుండు మడసినపిదప హిరణ్యకశిపుఁడు శోకదందహ్యమానమానసుండై ఘూర్ణిల్లి సభామండపమున నిలువంబడి త్రిమస్తక, త్రిలోచన, శకుని, శంబర, శతబాహు, నముచి, హయగ్రీవ, పులోమ, విప్రచిత్తి ప్రముఖు లైనదైత్యదానవులఁ బెక్కండ్ర రావించి వారితో నిట్లుపలికెను. రాక్షసప్రవరులారా!

శా. నాకుం దమ్ముఁడు మీకు నెచ్చెలి రణ♦న్యాయైకదక్షుండు బా
హాకుంఠీకృతదేవయక్షుఁడు హిర♦ణ్యాక్షుండు, వానిన్ మహా
సౌంకర్యాంగము దాల్చి దానవవధూ♦సౌకర్యముల్ నీఱుగా
వైకుంఠుండు వధించి పోయె నఁట యీ ♦ వార్తాస్థితిన్ వింటిరే.

అని హెచ్చరించి తనప్రతాపంబు వినిపింపం దలంచి.

సీ. భుజశక్తి నాతోడఁ ♦ బోరాడ శంకించి
మున్నీట మునిఁగిన ♦ మునుఁగుఁ గాక
యలయించి పెనఁగు నా ♦ యచలసంభ్రమమున
కెఱఁగి వెన్నిచ్చిన ♦ నిచ్చుఁగాక
జగడంబు సైపక ♦ సౌకర్యకాంతి నై
యిల క్రింద నీఁగిన ♦ నీఁగుఁగాక
క్రోధించి యటుగాక ♦ కొంతపౌరుషమున
హరిభంగి నడిరిన ♦ నడరుఁగాక

ఆ. కఠినశూలధారఁ ♦ గంఠంబు విదళించి
వానిశోణితమున ♦ వాఁడి మెఱసి

మత్సహోదరునకు ♦ మహి దర్పణము సేసి
మెఱసివత్తు మీకు ♦ మేలుఁ దెత్తు.

అని పలికి తనపూన్కి కనువగురీతి వారిని బ్రవర్తింపఁ జేయఁ దలంచి దానవులారా! మీ రీక్షణంబ యరిగి భూలోకంబునం గల మునులతపస్సుల కంతరాయంబుఁ గల్పించి యజ్ఞంబులు పాడుచేసి ధర్మకార్యముల నెల్లెట్లు పాడు సేయఁ దగునో యాయారీతులఁ గార్యముల నిర్వహించి రండని పంపెను. వా రారాక్షసరాజునాజ్ఞ శిరసావహించి యాకార్యముల నిర్వహింపఁ బోయిరి.

హిరణ్యకశిపుఁ డంతట హిరణ్యాక్షునకుఁ దిలోదకంబు లిడి యతనిబిడ్డలగు శకునిశంబరకాలనాభమదోత్కచుల నింకనుం గలవారిని మెల్లన నాశ్వాసించి సోదరభార్యల రప్పించి ధైర్యము చెప్పి జ్ఞాన ముపదేశించుచు

సీ. భూపాలకుఁడు నిద్ర ♦ పోయెడి నొండేని
విలపింప నేటికి ♦ వెఱ్ఱులార
యెవ్వఁడు భాషించు ♦ నెవ్వఁ డాకర్ణించు
నట్టివాఁ డెన్నఁడో ♦ యరిగినాఁడు
ప్రాణభూతుం డైన ♦ పవనుఁ డాకర్ణింప
భాషింప నేరఁడు ♦ ప్రాణి దేహ
ములకు వేఱై తాను ♦ ముఖ్యుఁడై యింద్రియ
వంతుఁడై జీవుండు ♦ వలను మెఱయఁ
ఆ. బ్రాభవమున భూత ♦ పంచకేంద్రియమనో
లింగదేహములను ♦ లీలఁ గూడు

విడుచు నన్యుఁ డొకఁడు ♦ విభుఁడు దీనికి మీరు
పొగుల నేల వగలఁ ♦ బొరల నేల?

అని యనేకనీతులను దెలిపెను. ఆయుపదేశమున దుఃఖము పోఁగా వారు జ్ఞానంబు నూని భగవంతు నారాధించుటయే తరణోపాయం బని తలంచిరి.

ఆదట హిరణ్యకశిపుఁడు అజరామరభావంబును త్రిజగద్రాజ్యంబును, సాటిలేని పరాక్రమమును, సర్వశత్రువుల నోడించు శక్తియుఁ గోరి యివి తపంబునఁగాని సాధ్యములు కావని తలంచి తీవ్రతపంబు సేయఁ బూని మందరాద్రిద్రోణికిం జనియె. ఆపర్వతము పావనతమాశ్రమసముపేతము. సకలర్తుఫలసమన్వితము కావున సందొక సిద్ధాశ్రమమున నిలిచి తపంబు చేయఁ బూనెను. కాలిపెనువ్రేలు నేల మోపి తదాధారంబున నిలువంబడి బాహువులఁ బైకినెత్తి ఆకసమును అర్ధదృష్టిం జూచుచుఁ బొడవు లగునెఱ్ఱనిజడలతోఁ బ్రళయకాలసూర్యబింబమాయని తోఁపఁజేయుచు నెవ్వరేఁ దన్నుజక్కఁగాఁ జూడఁజాలక భీతిల్ల మహాభయంకర మగుతపంబు చేయుచుండెను. ఈసమయమున దేవతలు యథాపూర్వముగా స్వర్గము నాక్రమించుకొని. రాజ్య మేలుచుండిరి.

ఆతపం బంతకంతకు భయంకరం బయ్యెను. ఆతపోగ్నిభరింపఁ జాలకపోయిరి. అట్టితఱి భూతంబులన్నియు నాకంపించెను. ఆదానవేంద్రుని శిరస్సునుండి పుట్టిన ధూమములోనమం

టులతోఁ దేటిచూడఁ దరంబుగాకుండెను. అప్పుడు దేవతలు కంపించి సురపురి విడిచి బ్రహ్మలోకంబునకుం బోయి బ్రహ్మను జూచి నమస్కరించి చేతులు మోడ్చి వినయ మొట్టిపడుచుండ

క. "దితికొడుకు తపమువేఁడిమి
నతితప్తుల మైతి మింక ♦ నలజడి నమరా
వతియుండ వెఱతు మెయ్యది
గతి మాకును దేవదేవ♦కారుణ్యనిధీ.

శా. శంకాలేశములేదు దేవ త్రిజగ♦త్సంహారముం దేవతా
సంకోచంబును వేదశాస్త్రపదవీ ♦ సంక్షేపముం లేక యే
వంకం లేవనటంచు దుస్సహతపో♦వ్యావృత్తి చిత్తంబుతో
సంకల్పించె నిశాచరుఁడు ప్రతిసం♦స్కారంబు చింతింపవే."

అని మొఱ్ఱపెట్టిరి. అంతతో నూరకుండక తపోభీతి తమ్ముఁ బురికొలుపఁగా

మ. భవనీయం బగునున్నతోన్నతమహా ♦ బ్రహ్మైకపీఠంబు సం
స్తవనీయం బగుభూతియుం విజయముం ♦ సౌఖ్యంబు సంతోషముం
భువనశ్రేణికి నిచ్చి దైత్యునితప♦స్స్ఫూర్తిం నివారించి యో
భువనాధీశ్వర కావవే భువనముల్ ♦ పూర్వప్రసాదంబునన్.

అని పెక్కుతెఱంగుల విన్నవింప నా నళినసంజాతుండు విబుధప్రార్థనంబు నూహించి యిఁకఁ దడవుసేయుట పాడిగాదని నిశ్చయించి భృగుదక్షాదులు వెంటనంటిరాఁగా మందరాద్రి కరుదెంచి యం దొకచోట నియమమూని పిపీలికావృతమేదో మాంసచర్మరక్తుం డై వల్మీకతృణవేణుపటలపరిచ్ఛన్నుఁ డై

మహోత్తరతపఃప్రభావసంపన్నుండై నీరంధ్రనీరదనికరనివిష్టనీరజబంధుండువోలె నివసించి యున్న హిరణ్యకశిపుం జూచి యచ్చెరు వంది యిట్టితప మ్మొనరించిన వారి నెన్నండును గాననని తలంచి మహాప్రీతితో దక్షిణహస్తం బెత్తి

మ. ఓసురారాతికులేంద్ర నీక్రియ ♦ నుగ్రమైనతపంబు మున్
చేసిచూపినవారు లేరిఁకఁ ♦ జేయువారును లేరు నే
నీసమాధికి మెచ్చితిన్ విను ♦ నీయభీష్టము లిత్తు నా
యాస మేటికి లెమ్ములెమ్ము మ♦హాత్మ కోరుము కోరికల్.

శా. దంశవ్రాతములుం బిపీలికలు మే♦ధఃక్రవ్యగక్తంబులన్
సంకీర్ణంబులుఁ జేసి పట్టి తినఁగా ♦ శల్యావశిష్టుండవై,
వంశచ్ఛన్నతృణావళీయుతమహా ♦ వల్మీకమం దింద్రియ
భ్రంశం బింతయు లేక నీవు నిలువం ♦ బ్రాణంబు లెట్లుండెనో.

హిరణ్యకశిపూ! ఆహారమును జలము నొల్లక యీరీతి నూఱుదివ్యవత్సరములు మేనఁ బ్రాణవాయువుల నిలుప నెవ్వరికే శక్యమా? నీతపోనియతిం జూడ మహత్తమసంతోషము ప్పొంగుచున్నది. ఇట్టి ఘోరతపంబున మమ్మెల్ల నోడించితివి. నే నిపుడు వాత్సల్యముచేత నీచెంత కేతెంచితిని. నీకోర్కుల ఫలింపఁ జేసెదను. అని పలుకుచు నడవియీఁగలు లోనగునవి భక్షింప నామమాత్రావశిష్టమై యున్నట్లున్న యాహిరణ్యకశిపుశరీరంబుపయిఁ గమండలుజలంబులు ప్రోక్షించిన నా దానవాధిపతి యాకమండలూదకంబున నంగంబులెల్లఁ దము

పంబడఁ దపంబు చాలించి తీవ లల్లిబిల్లిగ నల్లుకొని యున్న వల్మీకంబు నెట్లో వదలించుకొని వెడలివచ్చి యథాపూర్వదేహపరాక్రమంబులు వెలయఁ బుటముపెట్టిన బంగరువలెఁ దనుచ్ఛాయయొప్పాఱ మెఱయుచు వచ్చి వినయవినమితోత్తమాంగుఁడై భక్తిభారంబున వాణీప్రాణనాథునకు నమస్కరించి పెక్కుభంగుల వినుతించి గద్గదస్వరంబున మెల్లఁగా.

క. కోరినవారల కోర్కులు
నేరుపుతో నిచ్చి మనుప ♦ నీ క్రియ నన్యుల్
నేరరు కరుణాకర నేఁ
గోరెద నీవిచ్చెదేని ♦ కోరికలభవా.

ఆకోరిక లెవ్వి యందువేని మహాత్మా! ఆలకింపుము.

శా. గాలిం గుంభిని నగ్ని నంబువుల నా ♦ కాశస్థలిన్ దిక్కులన్
రేలన్ ఘస్రములం దమఃప్రబల భూ ♦ రిగ్రాహ రక్షో మృగ
వ్యాళాదిత్య నరాదిజంతుకలహ ♦ వ్యాప్తిన్ సమస్తాస్త్రశ
స్త్రాళిన్ మృత్యువులేని జీవనము లో ♦ కాధీశ యిప్పింపవే.

కరుణానీరధీ! ఇంతియకాదు. యుద్ధంబులఁ బ్రతిలేని పౌరుషంబును, దిక్పాలకుల మీఱంజాలు మహిమమును, భువనత్రయజయంబును దయచేయుమా యని ప్రార్థించెను.

పంకజాసనుండు వాఁడు కోరినవరంబు లన్నియుఁ బ్రసాదించి సాదరంబుగా నాతనిం జూచుచుఁ జిఱునవ్వుతోఁ బల్కెఁ గా

శా. అన్నా! కశ్యపపుత్ర దుర్లభము లీ ♦ యర్థంబు లెవ్వారికిన్
ము న్నెవ్వారలు గోరరీవరములన్ ♦ మోదించితిన్ నీయెడన్

నన్నుం గోరినవెల్ల నిచ్చితిఁ బ్రవీణత్వంబుతో బుద్ధిసం
పన్నత్వంబున నుండుమీ సుమతివై భద్రైకశీలుండవై.

అని హెచ్చరించి బృందారకులు పరివేష్టింప **నిజమందిరము**నకుం జనియె.

పాఠకులారా! బ్రహ్మ యిన్నివరముల ననుగ్రహించెనుగాని 'ప్రవీణత్వంబుతో బుద్ధిసంపన్నత్వంబున నుండుమీ సుమతివై' అని హెచ్చరించెను. అనఁగా నీవు సుమతివి కానిచో నీవరములు నీకు ఫలింపవు సుమీ యని బ్రహ్మాభావమైనట్లు కనుపట్టు. ఆవిధమెఱుంగక హిరణ్యకశిపుఁడు మెలంగి ప్రాణంబుల వదలుకొనియెను. ఎట్టిశక్తియున్నను దానిని నిలుపుకొనుటకు సత్ప్రవర్తనమే యుండవలయు. అదిలేనిచో నెంతటిశక్తియున్నను నిష్ఫలమగు. ధనముల సంపాదించుట యొక గొప్పగాదు. విద్యల నార్జించుట యొక మహిమము గాదు. సాధువుల యాశీర్వాదముఁ బడసి దానిని నిలుపుకొనుటయే కష్టము. దానికి సత్ప్రవర్తనము పెద్దలయందు భక్తి పిన్నలయందుఁ బ్రేమము అనునివి ప్రధానములు. ఇవి లేకున్న నెన్నిశక్తులుండినను నిష్ఫలములగును. సువాసినీలకలికమునకుఁ దిలకమువలె విద్యకు భూషణము వినయము. అది సత్ప్రవర్తనమునఁ బుట్టినది. అదియుండుటయే ప్రధానము. అది యొక్కటి లేక హిరణ్యకశిపుఁ డేమాయె. ఇఁక మన మనఁగా నెంతవారము. ఇఁకఁ గథవినుఁడు.

బ్రహ్మ యివ్విధి వరముల ననుగ్రహించి తనసదనమున కరుగఁగానే హిరణ్యకశిపుఁడు కృతార్థుఁడౌటఁ బరమానందమున స్వాంతము వికసింపఁ దన మందిరమునకుం జని తనరాకకై వేచియుండు సుందరీజనంబుల నానందింపఁజేసి మంత్రులను బంధువులను దక్కుంగల రాక్షసులను రావించి తన యుదంతంబెల్ల దెలిపెను. వారును ఆశుభవార్తల నాలించి పరమానందభరకందళితస్వాంతులై చెలరేఁగిరి. ఆర్చిరి. పెడబొబ్బ లిడిరి. ఇఁక దేవతల మునుల ఇష్టానుసారము బాధించవచ్చునుగదా? యని సంతసించిరి. మీసముల మెలిపెట్టిరి. భుజము లప్పళించిరి. తొడలు చఱచిరి. ఆయుధముల జళిపించిరి. ధనస్సులఁ బట్టిరి. బాణంబులఁ గూర్చి జ్యారవంబుల దిక్కుల నింపిరి. ఇట్లెన్నియో జగత్పరితాపకరకృత్యంబుల నొనరించిరి. ఆకృత్యంబులం జూచినవా రెల్ల నిఁక లోకములు నిలువఁజాల వని యెంచిరి. అందుఁ గొంద ఱక్కటా! త్రికాలవేత్తయయ్యు నలువ యిట్టి కట్టడిమానసికి వరముల నిట్టివాని నీఁజెల్లునా యని వగచిరి. మిగిలిన కార్యమునకు వగచి లాభమేమని కొందఱు పెదవుల విఱిచిరి. కొంద ఱిఁక మనకులకాంతల గతి యేమని దుఃఖించిరి. ధర్మవినాశనకాల మిదె వచ్చె నని కొందఱు కన్నీరు నించిరి. తపోధను లిఁక నదృశ్యులై గుహల యందెందో యుండుట మేలని యూహించిరి. వెంటనే ప్రతిక్రియ శ్రీహ

రియో! శంకరుఁడో! యూహింపకున్న నెట్లు? అని కొందఱు కొందలం పడిరి.

కొలది దినము లిట్లు గడచెను. హిరణ్యకశిపుని కుటుంబ మొక్కచోఁ జేరెను. దితియుఁ గొంతలఁ జిక్కక హిరణ్యాక్షునిచావునకు వగవక యుండెను. హిరణ్యకశిపుఁ డఖిలపరివారయుతుండై శుక్రుని యానతిమీఱక వారియాలోచనల వినుచు రాజ్యమును బరిపాలించుచుండెను. ఒక్కనాఁడు తనమంత్రులం గూడి చేయఁ దగుపని యేమని యాలోచించి

క. సోదరుఁ జంపిన పగకై
 యాదర మించుకయు లేక ♦ యసురేంద్రుఁడు గం
 జోదరుపై వైరము దు
 ర్వాదరతుం డగుచుఁ జేసె ♦ మనుజాధీశా.

సీ. ఒకనాఁడు గంధర్వ♦యూధంబుఁ బరిమార్చు
  దివిజుల నొకనాఁడు ♦ దెరలఁ దోలు
 భుజగుల నొకనాఁడు ♦ భోగంబులకుఁ బాపు
  గ్రహముల నొకనాఁడు ♦ గట్టివైచు
 నొకనాఁడు యక్షుల ♦ నుగ్రత దండించు
  నొకనాఁడు విహగుల ♦ నొడిసి పట్టు
 నొకనాఁడు సిద్ధుల ♦ నోడించి బంధించు
  మనుజుల నొకనాఁడు ♦ మద మడంచుఁ

తే. గడిమి నొకనాఁడు కిన్నర♦ఖచరసాధ్య
 చారణప్రేతభూతపి♦శాచవన్య
 సత్వ విద్యాధరాదుల ♦ సంహరించు
 దితి తనూజుండు దుస్సహ♦ తేజుఁ డగుచు.

ఇట్లు లోకముల బాధించుచు, దనకు జయింప నలివి కానిసత్వం బెద్దియు లేదని తలంచెను. అంత విశ్వకర్మయను దెంచి హిరణ్యకశిపునకు నివాసార్హ మగుదివ్యప్రాసాదము నొకదాని నిర్మించెను. అది లోకాతీతము. దాని శిల్పము మనోవాగతీతము. తుదకు విశ్వకర్మకే యచ్చెరువు పుట్టించెను. ఆ దివ్యహర్మ్యమున నివసించి హిరణ్యకశిపుఁ డుండ హరిహరవిరించులు తప్పఁ దక్కినవారెల్ల నాతని ప్రతాపమునకు జంకి శరణు చొచ్చిరి. మీపాదసేవకులు మగుమమ్ము రక్షింపుమాయని కొందఱు వేఁడిరి. కొందఱు పరువెత్తి యెందో నివసించిరి. ఏ లోకమునకు బోయినఁ బోనీయఁ డని కొంద ఱాతనినే యాశ్రయించి మనుట మేలని తదాస్థానంబున నీచోద్యోగములనుండిరి. ఎట్టిరాక్షసుఁడైనను వాని మాట దేవతలకెల్ల శిరోధార్యముగ నుండెను.

ఆదానవేంద్రునిచారు లెల్ల యెడలఁ దిరుగుచు

సీ. కోలాహలముమాని ♦ కొలువుఁ డీసురలార
తలఁగి దీవింపుఁడీ ♦ తపసులార
ఫణులెత్తకుఁడు నిక్కి ♦ పన్నగేంద్రములార
ప్రణతులై చనుఁడి ది♦క్పాలులార
గానంబుసేయుఁడీ ♦ గంధర్వవరులార
సందడిఁ బడకుఁడీ ♦ సాధ్యులార
యాడుఁడీ నృత్యంబు ♦ లప్సరోజనులార
చేరిక మ్రొక్కుఁడీ ♦ సిద్ధులార

తే. శుద్ధకర్పూరవాసిత♦సురభిమధుర
భవ్య నూతన మైరేయ ♦ పానజనిత
సుఖవిలీనత నమరారి ♦ సొక్కినాఁడు
శాంతి లేదండ్రు నిచ్చలుఁ ♦ జారు లధిప.

ఇట్లు లోకంబు లాకులంపడం జేయుచుఁ దద్భటులు తిరుగుచుఁ జాటుచుండఁగా నిఁక సామాన్యమానవుల మాట యిట్టిదని వచింప నేరికి శక్యము? ఇట్టు లుండియు హిరణ్యకశిపుఁడు పూజ్యభంగి రాజ్యంబును బాలింపఁ జూచుచుండెను. ఆతని యాటోపంబునకు వెఱచి

సీ. సకలమహాద్వీప ♦ సహిత విశ్వంభర
స్థలిని దున్నక పండు ♦ సస్యచయము
కామధేన్వాదుల ♦ కరణి నర్థులు కోరు
కోర్కులు గగనంబు ♦ కురియుచుండు
వననిధు లేడును ♦ వాహినీసందోహ
ములును వీచుల రత్న♦ముల వహించు
నుర్వీరుహంబులు ♦ నొక్కకాలంబున
నఖిలర్తుగుణముల ♦ నతిశయిల్లు
తే. నంబుసంపూరితద్రోణు ♦ లగుచు నొప్పుఁ
బర్వతంబులు సర్వది♦క్పాలవివిధ
గుణము లెల్లను దాన కై ♦ కొనుచు దైత్య
విభుఁడు త్రైలోక్యరాజ్య సం♦వృద్ధి నుండ.

ఈరీతి రాజ్యంబుఁ బరిపాలించుచుండఁగా నాతని యనుచరులెల్ల కడలం గ్రమ్మరుచుఁ దాపసుల సంతాప మందఁ

జేయుచు నేమాత్రము కరుణ లేక లోకుల బాధించుచు యజ్ఞములకు విఘ్నముల నాపాదించి దేవతల బలహీనులఁగా నొనరించుచుఁ దమ కెదురులేక వర్తింపసాగిరి. అత్తఱి దీర్వరాని బాధల పాలై నివాసముల మాని దిక్కుతోఁచక తిరుగుచు విపన్నులై

ఉ. ఎన్నఁడు మాకు దిక్కగల ♦ దెన్నఁడు దైత్యుల బాధమాను మే
మెన్నఁడు వృద్ధిఁ బొందఁగల ♦ మెవ్వరు రక్షకు లంచు దేవతా
కిన్నరసిద్ధసాధ్యముని ♦ ఖేచరనాయకు లాశ్రయించి రా
పన్నగతల్పు భూరిభవ♦బంధవిమోచనుఁ బద్మలోచనున్.

పూటపూట కాదాన వేంద్రుని యత్యుగ్రదండనము భరింపరాని దికాఁగా ఇసుమంతయు నోర్వఁ జాలక యమరు లెల్ల నొక్కచోఁ గూడి

ఉ. ఎక్కడ నున్నవాఁడు జగ♦దీశ్వరుఁ డాత్మ మయుండు మాధవుం
డెక్కడి కేగె శాంతులు ము♦నీశులు భిక్షులుఁ గారు క్రమ్మఱం
దిక్కుల నెల్ల నెక్కడు తు♦దిం జొర దిక్కగునట్టి దిక్కకై
మ్రొక్కెద మేను హస్తయుగ♦ముల్ ముకుళించి మదీయరక్షకున్.

అని ప్రార్థించుచు నాహారనిద్రలు మాని నిరంతరధ్యానము లొనరించిరి. ఆసమయమున శ్రీహరి వారికిం గానరాక మేఘసమాన నినదంబున నిట్లు పలికెను.

మ. భయముం జెందకుఁ డయ్య నిర్జరవరుల్ ♦ భద్రంబు మీ కయ్యెడున్
జయమున్ లాభము భూతిసంతతికి మ♦త్సందర్శన ప్రాప్తి న
వ్యయమై చేరు; నెఱుంగుడున్ దితిసుత♦వ్యాపారభాషావిప
ర్యయముల్ కాలము గూడఁ జంపెదఁ జనుం♦డం దాఁక మీత్రోవలన్.

ఆ. శుద్ధసాధులందు ♦ సురలందు శ్రుతులందు
గోవులందు విప్ర♦కోటియందు
ధర్మపదవియందుఁ ♦ దగిలి నాయందు నాఁ
డెన్నఁ డలుగు నాఁడె ♦ హింస నొందు.

మఱి యొక్కరహస్యము చెప్పెద నాలకింపుఁడు.

క. కన్నకొడుకు శమదమసం
పన్నుఁడు నిర్వైరుఁ డనఘ ♦ ప్రహ్లాదుని వాఁ
డెన్నఁడు రోషంబున నా
పన్నతి నొందించు నాఁడె ♦ పట్టి వధింతున్.

వాఁడు వరబలగర్వితుఁడు. చచ్చువాఁడుకాఁడే యని సంశయింతురా? ఐన వినుఁడొక్కమాట?

శా. వేధోదత్త వరప్రసాదగరిమన్ ♦ వీఁ డింతవాఁడై మిమున్
బాధం బెట్టుచు నున్నవాఁడని మదిన్ ♦ భావింతు భావించి నే
సాధింపం దఱికాదు గావునఁ గడున్ ♦ సైరించితిన్ మీఁదటన్
సాధింతున్ సురలార నేఁడు చనుఁడా ♦ శంకింప మీ కేటికిన్.

అని పలికి యూరకుండెను. దేవతలాపలుకుల కానందించి హిరణ్యకశిపుమృతికై వేచియుందుమని భగవంతునిఁ బ్రార్థించి తమతమనెలవుల కేఁగి పోయిరి.

ప్రహ్లాద చరిత్రము.

కొంతకాల మీరీతి సాగెను. హిరణ్యకశిపునకు విచిత్ర చరిత్రు లగునలుగురు కొడుకులు పుట్టిరి. అందు,

సీ. తనయందు నఖిలభూ♦తములందు నొకభంగి
సమహితత్వంబున ♦ జరగువాఁడు
పెద్దలఁ బొడగన్న ♦ భృత్యునికైవడిఁ
జేరి నమస్కృతుల్ ♦ చేయువాఁడు
కన్నుదోయికి నన్య♦కాంత లడ్డంబైన
మాతృభావము చేసి ♦ మరలువాఁడు
తల్లిదండ్రులభంగి ♦ ధర్మవత్సలతను
దీనులఁ గావఁ జిం♦తించువాఁడు
తే. సఖులయెడ సోదరస్థితి ♦ జరపువాఁడు
దైవతములంచు గురువులఁ ♦ దలఁచువాఁడు
లీలలందును బొంకులు ♦ లేనివాఁడు
లలితమర్యాదుఁ డైన ప్ర♦హ్లాదుఁ డధిప.

ఆకుమారుఁడు సకలగుణసంపన్నుఁడై యలరారుచు వినుతపాత్రుఁడై

సీ. ఆకారజన్మవి♦ద్యాఢ్యవరిష్ఠుఁడై
గర్వసంస్తంభసం♦గతుఁడు కాఁడు
వివిధ మహానేక ♦ విషయ సంపన్నుఁడై
పంచేంద్రియములచేఁ ♦ బట్టు పడఁడు
భవ్యవయోబల ♦ ప్రాభవోపేతుఁడై
కామరోషాదులఁ ♦ గ్రందుకొనఁడు
కామినీప్రముఖభో♦గము లెన్ని గల్గిన
వ్యసనసంసక్తి నా ♦ వంకఁ బోఁడు
ఆ. విశ్వమందుఁ గన్న ♦ విన్న యర్థములందు
వస్తుదృష్టిఁ జేసి ♦ వాంఛ యుడఁడు

ధరణినాథ దైత్య♦తనయుఁడు హరిపర
తంత్రుఁడై హతాన్య♦తంత్రుఁ డగుచు.

తనకు సాటి చతుర్దశ భువనంబులందును లేక వర్తిల్లుచుండెను- సకలసద్గుణంబులు తమంతతన తమ దరుదెంచి ప్రహ్లాదు నాశ్రయించి వేఱొకచోటునకుఁ బోనొల్లక యుండెను. ఆ ప్రహ్లాదుఁడు పుట్టినప్పటినుండియు నాతని జూచి తల్లియుఁ దండ్రియు నితఁడు కులోద్ధారకుఁ డగునని యు, నితఁడు సకలజనస్తుతిపాత్రుఁ డగుననియు మాతృపితృభక్తిపరాయణుఁ డగుననియుఁ జింతించి సంతోషాంబుధి నోలలాడుచుండిరి. రాక్షసులకన్న దేవతలాతనిఁజూచి సంతసించుచు నీతనివంక హిరణ్యకశిపు మృతిని గన్నులారఁ గాంతుముకదా యని సదా యానందించుచుండిరి.

ప్రహ్లాదుఁడు తనతోడిబాలురతో నాడుకొను చున్నను వారికి భగవద్భక్తిని దెల్పుచు, సత్ప్రవర్తనము లలవడఁజేయుచు వారిని దనకు వశవర్తులనుగాఁ జేసికొని యుండెను. కాని లోకములోని పిల్లలవలెఁగాక మహర్షివలె భగవంతుని యందే తనచిత్తమును జేర్చి ప్రవర్తించుచుఁ దనను జూచువారెల్ల నితఁడు మహాపురుషుఁ డనితలంచున ట్లుండెను. ఒక్కతరుణమున బాలుర వదలి తా నొంటరిగాఁ దిరుగుచు శ్రీమన్నారాయణమూర్తితో నాడుకొనుచు నుండెను. సదా భగవంతుఁ డాతనికిఁ గనంబడు చున్నయ ట్లుండెను. మఱియు నామహాపురుషుఁడు

సీ. వైకుంఠచింతావివర్జితచేష్టుఁడై
యొక్కడ నేడుచు నొక్కచోట
నశ్రాంతహరిభావనారూఢచిత్తుఁడై
యుద్ధతుఁడై పాడు నొక్కచోట
విష్ణుఁ డింతియకాని వేఱొండు లేదని
యొత్తిలి నగుచుండు నొక్కచోట
నలినాక్షుఁ దనునిధానముఁ గంటి నేనని
యుబ్బి గంతులు వైచు నొక్కచోటఁ
ఆ. బలుకు నొక్కచోటఁ బరమేశుఁ గేశవుఁ
బ్రణయహర్షజనితబాష్పసలిల
మిళితపులకుఁడై నిమీలితనేత్రుఁడై
యొక్కచోట నిలిచి యూరకుండు.

ఇట్లాతఁడు సామాన్యబాలునివలెఁ గాక ప్రవర్తించుచుండెను. ఇంచుక శైశవమునఁ గాలము గడచెను. హిరణ్యకశిపునకు మనస్సున నీకుమారుఁడు సామాన్యబాలునివలెఁ బ్రవర్తింపఁడు. భక్తిపరవశుఁడైనట్లు నటించుచున్నవాఁడు. ఆలోచింపఁగా వెఱ్ఱివానివలెఁ గనఁబడుచున్నవాఁడు. అని మఱియు విచారించుచు నక్కటా! యీనాకుమారుఁడు స్వర్గరాజ్యమును లెక్కసేయఁడు. ధనధాన్యములవంకనైనఁ జూడఁడు. ఎట్టి యపురూపపదార్థమును దెచ్చి యిచ్చినను బ్రీతితోఁ బరిగ్రహింపఁడు. పోనీ! వెఱ్ఱివాఁడేమోయనుకొందునా వీనిమాటలు వేదవాక్యములవంటివిగా నున్నవి. ఇట్లుండుటకుం గారణము చదువు చెప్పింపక పోవుటచేతనే యయి

యుండవచ్చును. ఇంతియగాక, ఎంతటి బుద్ధిశాలి యైనను చదువనివాఁ డజ్ఞుఁడే యగును. ఎంతటి మూఢుఁ డైనను జదివినచో సదసద్వివేకచతురతగల్గును. కావున గురువులను బిలుపించి చదివించెదను. దాన వీఁడు చతురుఁడగును. అని యోజించి శుక్రాచార్యతనయులఁ జండామర్కు లనువారిరావించి సవినయముగా నమస్కరించి కరములు ముకుళించి మహాత్ములారా!

శా. అంధప్రక్రియ నున్నవాఁడు పలుకం ♦ దస్మత్ప్రతాపక్రియా
గంధం బించుక లేదు మీరు గురువుల్ ♦ కారుణ్యచిత్తుల్ మనో
బంధుల్ మాన్యులు మాకుఁ బెద్దలు మనుం ♦ బాటించి యీబాలకున్
గ్రంథంబుల్ చదివించి నీతికుశలుం ♦ గావించి రక్షింపరే.

అని ప్రార్థించి కుమారు నప్పగించెను. వారును హిరణ్యకశిపునానతిఁ గైకొని రాజకుమారునిం బ్రీతిమీఱఁ బిలుచుకొనిపోయి సమానవయస్కు లగుసహశ్రోతల రాక్షసకుమారులం గొందఱం గూర్చి రాజగృహాంతికమున నొక్కసుందరవిశాలసౌధమును బ్రవేశించి చక్కఁగాఁ జదువు చెప్పనారంభించిరి. ప్రహ్లాదుఁడును

క. ఏపగిది వారు చెప్పిన
నాపగిదిం జదువుగాని ♦ యట్టిట్టని యా
క్షేపింపఁడు తానన్నియు
రూపించిన మిథ్యలని ని♦రూఢమనీషన్.

విద్యాభ్యాస మీరీతిఁ గొంతకాలము సాగఁగా, హిరణ్యకశిపుఁ డొకనాఁడు కుమారు విద్యాపఠన మెట్లున్నదో పరీక్షింపఁ గోరెను. వెంటనే బాలకుం దోడుకొని రావలయునని గురువులకు వార్త నంపెను. వారును బాలునిం దోడుకొని వచ్చి రాక్షసరాజును దర్శించిరి. గురువులం గూడివచ్చి భక్తిభరంబునఁ జెంత నిలుచున్న కుమారుం గాంచి పరమానందంబునఁ జేరం జీరి కౌఁగిటం జేర్చి వత్సా! యని తొడపై నునుచుకొని తనమనమున నౌరా!

క. అనుదినసంతోషణములు
జనితశ్రమతాపదుఃఖ♦సంశోషణముల్
తనయుల సంభాషణములు
జనకులకుం గర్ణయుగళ♦సద్భూషణముల్.

అని తలంచుచు నాయనా! నీకు భద్రంబెయ్యదియో చెప్పుమని సాదరముగాఁ బ్రశ్నించెను. ప్రహ్లాదుఁడును కరములు ముకుళించి

ఉ. ఎల్ల శరీరధారులకు ♦ నిల్లను చీఁకటినూతిలోపలం
ద్రెళ్లక వీఁడి నేమను మ♦తిభ్రమణంబున భిన్నులై ప్రవ
ర్తిల్లక సర్వము న్నతని♦దివ్యకళామయమంచు విష్ణునం
దుల్లముఁ జేర్చి తారడవి ♦ నుండుట మేలు నిశాచరాగ్రణీ.

అని మెల్లఁగాఁ బలికెను. ఆమాటలు విని మనమున నించుక కోపము పొడసూపినను కుమారునిఁ గాంచినంతనే యది నశింప మెల్లఁగా నాయనా! యని పిలిచి నవ్వుచు

శా. నాకుం జూడఁగ నీకు జోద్యమయ్యెడిఁ గదా ♦ నాతండ్రి యీ బుద్ధిదా
నీకున్ లోపలఁ దోఁచెనో పరులు దు♦ర్నీతుల్ పఠింపించిరో
యేకాంతంబున భార్గవుల్ పలికిరో ♦ యీ దానవశ్రేణికిన్
వైకుంఠుండు కృతాపరాధుఁ డతనిన్ ♦ వర్ణింప నీకేటికిన్.

అని పలికి మఱియుఁ బుత్రునిం జూచి యించుక గట్టిగా

మ. సురలం దోలుటయో సురాధిపతులన్ ♦ స్రుక్కించుటో సిద్ధులం
బరివేధించుటయో మునిప్రవరులన్ ♦ బాధించుటో యక్షకి
న్నరగంధర్వవిహంగనాగపతులన్ ♦ నాశంబు నొందించుటో
హరియించున్ గిరియంచు నేల చెడ మో♦హాంధుఁడవై పుత్రకా.

అని హెచ్చరించెను. ప్రహ్లాదుఁడు తండ్రినిజూచి నాదరముగాఁ దండ్రీ! మోహనిర్మూలనంబు చేసి యే భగవంతునందుఁ దత్పరులై జ్ఞానముగల పురుషులకుఁ బరులు తమరు నను మాయాకృతంబయిన యసత్పురుషగ్రాహ్యంబగు భేదంబు గానరాదు. అట్టి పరాత్పరునకు నమస్కరించుచున్నాఁడను. మఱియు

శా. అజ్ఞుల్ కొందఱు నేము దామనుచు మా♦యం జెంది సర్వాత్మకుం
బ్రజ్ఞాలభ్యు దురన్వయక్రమములన్ ♦ భాషింపఁగా నేర రా
జిజ్ఞాసాపథమందు మూఢులు గదా ♦ చింతింప బ్రహ్మాదివే
దజ్ఞుల్ తత్పరమాత్ము విష్ణు నితరుల్ ♦ భాషింపఁగా నేర్తురే.

అని పలికి గురువగు శుక్రపుత్రుంగాంచి భక్తిశ్రద్ధలు వెలయ మోమునఁ జిఱునగవు మొలకలెత్తఁగా భగవద్భక్తిని బోధింపఁ దలంచి మెల్లఁగాఁ దండ్రి వినుచుండఁగా మహాత్మా! బ్రాహ్మణోత్తమా!

సీ. మందారమకరంద ♦ మాధుర్యమునఁ దేలు
మధుపంబు పోవునే ♦ మదనములకు
నిర్మలమందాకి♦నీవీచికలఁ దోఁగు
రాయంచ చనునె త♦రంగిణులకు
లలితరసాలప♦ల్లవఖాదియై చొక్కు
కోయిల చేరునే ♦ కుటజములకుఁ
బూర్ణేందుచంద్రికా♦స్ఫురితచకోరకం
బరుగునే సాంద్ర నీ♦హారములకు
తే. నంబుజోదరదివ్యపా♦దారవింద
చింతనామృతపాన వి♦శేష మత్త
చిత్త మేరీతి నితరంబు ♦ జేర నేర్చు
వినుతగుణశీల మాటలు ♦ వేయునేల.

అను ప్రహ్లాదుని పలుకుల విని రాజసేవకుఁడు గాన నాపుఁగోపిం తుండు దనుజరాజకుమారుం జూచి యాగ్రహంబు కనఁబడు చుండఁ దిరస్కారపూర్వకంబుగా నిట్లు పలికెను. వత్సా! ప్రహ్లాదా!

ఉ. పంచశరద్వయస్కుఁడవు ♦ బాలుఁడ వించుక గాని లేవు భా
షించెదుతర్కవాక్యములు ♦ చెప్పిన శాస్త్రములోనియర్థ మొ
క్కించుక యైనఁ జెప్ప వసు♦రేంద్రుని ముందట మాకు నొదలల్
వంచుకొనంగఁ జేసితివి ♦ వైరవిభూషణ వంశదూషణా!

అని పలికి రోషంబున రాజసేవకులం జూచి

చ. తనయుఁడుగాఁడు శాత్రవుఁడు ♦ దానవభర్తకు వీఁడు దైత్యచం
దనవనమందుఁ గంటకయు♦తక్షితిజాతముభంగిఁ బుట్టినాఁ

డనవరతంబు రాక్షసకు♦లాంతకుఁ బ్రస్తుతిచేయుచుండు దం
డనముఁ గాని శిక్షలకు ♦ డాయఁడు పట్టఁడు కొట్టఁ జుద్ధలెఁ.

అని యంతతో నిలువక రాక్షసేంద్రుం జూచి రాజభక్తి యల
రారఁగా మహాప్రభూ!

క. ఈపాపనిఁ జదివింతుము
నీపాదము లాన యింక ♦ నిపుణతతోడం
గోపింతుము దండింతుము
కోపింపకు మయ్య దనుజ♦కుంజర! వింటే.

అని ప్రార్థించి యందుల కాతం డనుమోదింపఁ బ్రహ్లాదకుమారుఁ దోడుకొని పోయి యేకాంతమునఁ గూరుచుండఁ బెట్టుకొని శక్తినంతయుఁ గనఁబఱచుచు నా బాలకునకుఁ బెక్కుమాఱులు రాజనీతిమార్గము లన్నింటిని బూసగ్రుచ్చిన ట్లుపదేశించెను. అంతియగాక యుద్ధమర్మములఁ దెల్పెను. ప్రజారక్షణోచితధర్మవిశేషముల బోధించెను. నీతిశాస్త్రమంతయుఁ బఠింపఁజేసెను. మఱియు నితరవిశేషవిషయములెల్ల శ్రద్ధగా నెఱింగించెను. ప్రహ్లాదుఁడు నించుకంతయు గురువు ధిక్కరింపక అశ్రద్ధ నూనక సేవగింపక భక్తియులగఁ బాఠములఁ బఠించెను. అడిగిన ప్రశ్నములకు బదులు చక్కఁగాఁ జెప్పెను. దానిచే నతఁ డీ బాలుఁడు నీతికోవిదుఁ డయ్యె నని నమ్మెను. పరమానందమున నావార్తలఁ దల్లికిం దెల్పెను. ఆలీలావతీదేవియుఁ బరమానందభరితస్వాంతయయ్యెను. కొడుకుం జీరఁ బంచి యుపలాలించెను. తండ్రికడకుం గొంపోవుదు నని పురోహితుండు తెలుప

వివిధవిధభూషణముల నలంకరించెను. బుద్ధిచెప్పెను. భక్తిమార్గము తెల్పెను. తండ్రికడ నేమియుఁ దోఁచినట్లు మాటలాడకుము రా నాయనా యని బుజ్జగించెను. మీతండ్రి లోకత్రయాధిపతి సుమీ! చూడఁబోసనుఁ డని హెచ్చరించెను. అవ్వల పురోహితుని నోటఁ బాపెను. ఆతండు ప్రహ్లాదుంగాంచి వత్సా! రాజసభకుం బోవవలయును. అందు నీతండ్రి నిన్నుం బరీక్షించును. అప్పుడు,

ఉ. త్రిప్పకుమన్న మామతము ♦ దీర్ఘములైన త్రివర్గపాఠముల్
తప్పకుమన్న నేఁడు మన♦దైత్యవరేణ్యుని మ్రోల నేమముల్
చెప్పిన నీతిగారి మఱి ♦ చెప్పకుమన్న విరోధినీతులన్
విప్పకుమన్న [1]దుష్టమగు ♦ విష్ణుచరిత్రకథార్థజాలముల్.

అని బుజ్జగించి యతఁడు తనమాట జవదాఁటువాఁడు కాఁ డని మది నెఱనమ్మి,

సీ. అడుగడుగునకు మధ♦వానుచింతనసుధా
మాధుర్యమున మేను ♦ మఱచువాని
అంభోజగర్భాదు ♦ లభ్యసింపఁగ లేని
హరిభక్తి పుంభావ ♦ మైనవాని
మాతృగర్భము చొచ్చి ♦ మన్నది మొదలుగాఁ
[2]జిత్త మచ్యుతు మీఁదఁ ♦ జేర్చువాని
నంకించి తనలోన ♦ నఖిల ప్రపంచంబు
శ్రీవిష్ణుమయమని ♦ [3]చెలఁగువాని

1 'దుష్టతర విష్ణు చరిత్ర కథార్థజాలముల్' అని పా. 2 'చిత్త మచ్యుతుపయి ♦ జెలఁగువాని' అని పా. 3 'చెప్పువాని' అని పా.

తే. వినయకారుణ్యబుద్ధివి♦వేకలక్ష
ణాదిగుణముల కాటప♦ట్టైనవాని
శిష్యు బుధలోకసంభావ్యుఁ ♦ జేసె గురుఁడు
ముందటికిఁ ద్రొబ్బి తండ్రికి ♦ మ్రొక్కు మనుచు.

హిరణ్యకశిపుంగాంచి సానునయోక్తు లలరారుచుండఁగా

క. శిక్షించితి [1]మన్యము లగు
పక్షంబులు మాని నీతి ♦ పారగుఁ డయ్యెన్
రక్షోవంశాధీశ్వర
వీక్షింపుము నీకుమారు ♦ విద్యాబలమున్.

అని విన్నవించెను. రాక్షసాధ్యక్షుం డాపలుకు లాలించి సంతసించి తనపాదములకు వందన మొనరించి కరయుగంబు జోడించి నిలుచున్న చిన్నికుమారకుం గాంచి మహానందంబును జాలియుఁ దోలఁకాడ వెంటనే చేరఁదీసికొని గాఢాలింగనపురస్సరంబుగా నంకమునఁ గూరుచుండఁబెట్టుకొని నుంచువుదువ్వి చిబుకంబుఁ బుణికి చెక్కిలి ముద్దుగొని శిరంబు మూర్కొని మహానందంబున వెల్లువలై ప్రవహించు కన్నీటిధారల నాతని మోముఁదమ్మిఁ దడుపుచు మృదులమధురతరాలాపంబు లలరుచుండ నాయనా!

శా. చోద్యం బయ్యెడి నింతకాల మరిగెన్ ♦ శోధించి యేమేమి సం
వేద్యాంశంబులు చెప్పిరో గురువులే ♦ వెంటం బఠింపించిరో
విద్యాసార మెఱుంగఁగోరెద భవ♦ద్విజ్ఞాతశాస్త్రంబులోఁ
బద్యం బొక్కటి చెప్పి సార్థముగఁ దా♦త్పర్యంబు భాషింపుమా.

అని పలికెను.

---

1 'మన్యుల వగు' అని పా.

ఆర్యబాలులారా! పైపద్యమును జదివితిరిగదా. అర్థముతోఁగూడఁ దాత్పర్యమును జక్కఁగాఁ దెలుపుదురా యని తండ్రి కొడుకు నడిగెను. ప్రతిపదమునకుఁ బ్రాతీతికమగు నర్థమును దొలుతఁ జెప్పవలయు. పిదప నాపదముల జోడింపునఁ దేలుచున్న విశేషార్థసారము తాత్పర్యమని భావించి భాషింపవలయు. ఇదియే పూర్వపద్ధతి. "ముకస్యము కార్థః" అన్నట్లుగాదు. ఇట్టి పద్ధతియే మీరలవఱచుకొనవలయు. ఒక్క యుదాహరణమును వినుఁడు.

తే. విమల మధురమనోహర ♦ వృత్తి వెలయు
వారిఁ గొనియాడ బుధులెంత ♦ దూరమైనఁ
బోవుదురు గాన నేను నీ ♦ పొందుఁగోరి
దవ్వనక వచ్చితి నశేష ♦ తాపశమని.

అని వసుచరిత్రమున రాజరాజభూషణమహాకవిచెప్పెను. శుక్తిమతియను నదికిని, కోలాహలమను పర్వతమునకు సంభాషణజరగుఘట్టమున నీపద్యమున్నది. సామాన్యార్థ మేమనఁగా—సకలతాపములఁ బోఁగొట్టు శుక్తిమతీనదీ! లోకమున స్వచ్ఛమై మనోహరమగు ప్రవర్తనముగల వారిని వినుతించుట కెంతదూరమైనను సజ్జనులుపోవుదురు. కాఁబట్టి నేనును నీచెంతనుండఁగోరి దూరమనక హిమాలయప్రాంతమునుండి వచ్చితి నని పలికెను.

విశేషార్థము.—పదములజోడింపు విశేషార్థ మిందుఁ గల దని బోధించును. కవి మనతావునకు వచ్చి యిందు రెండవయర్థము

గల దని చెప్పఁడుగాని చదువువాఁడు తెలివిగలవాఁడేయైనచో నాపదములఁ జోడించును గాంచినంతనే విశేషార్థ మిందుఁ గవి యనువదించె నని కనుఁగొనును. కోలాహలుఁడు కాముకుఁడు. శుక్తిమతి పద్మినీజాతి యన్నులమిన్న. కాఁబట్టి యిట్లూహింపఁద గు. సకలతాపములను బోఁగొట్టుదానవుకదా నీవు శుక్తిమతీ! (నాకిపుడుగల పరితాపమును బోఁగొట్టఁజాలవా? యని భావ ము) కపటములేక మనమున కింపును బెంచు నడకగలవారిని "కొనియాడ" కొని=పరిగ్రహించి. ఆడన్=విహరించుటకు. బు ధులు=సరసులగుజనులు ఎంతదూరమైననుపోవుదురు. కానన్= ఇది లోకాచారము గనుక నేనును (తాపార్తితుఁడనుగానున్న నేను) దూరమనక వచ్చితిని. అని ఈయర్థము పదములకూర్పు వలనఁ గలిగినది. కాని యితరకారణములఁ గాదు. కాఁ బట్టి హిరణ్యకశిపుఁడు కుమారునిఁ బ్రతిపదమున కర్థమును జెప్పి యావలఁ దాత్పర్యమును జెప్పుమని యడిగెను. ఇదిప్రా చీనపద్ధతి. అదియే మంచిపద్ధతి. ఈకాలమున నది తాఱుమా ఱగుట మీరునెఱుంగఁగలరు. ప్రాచీనపద్ధతియే విజ్ఞానప్రదమ ని నమ్ముఁడు. ఆవలఁ గథ వినుఁడు.

హిరణ్యకశిపుఁ డిట్లుపలికి యంతతో నూరకుండక పుత్రు నకు రోషము గల్గించి విద్యావిషయమున శ్రద్ధఁబూనునట్లు చేయనెంచి మహాప్రీతితో

శా. నిన్నున్ మెచ్చరు నీతిపాత్రమహిమన్ ♦ నీతోడి దైత్యార్భకుల్
కన్నా రన్నియుఁ జెప్ప నేర్తుగ కదా ♦ గ్రంథార్థముల్ దక్షులై
యన్నా! యెన్నఁడు నీవు నీతివిదుఁడౌ ♦ దంచున్ మహావాంఛతో
నున్నాఁడన్ ననుఁగన్నతండ్రి భవదీ♦యోత్కర్షముం జూపవే.

అని పలికి బిడ్డ గౌఁగిలించుకొనియెను. ఇట్లు తండ్రి తన్నడిగిన విషయము లన్నియు నెఱింగియు నాతనియజ్ఞానమును బాపనెంచి జనకుఁడు, సకలలోకాధిపతి, కఠోరహృదయుఁడు, పరాక్రమశాలి యని తలంపక శ్రీమన్నారాయణపాదారవిందధ్యానతత్పరుండై తనముంగల భగవంతుఁడు నిలిచియున్నట్లే భావించువాఁడు గావున మెల్లఁగాఁ దండ్రిం గాంచి మృదులతమస్వరంబున,

క. చదివించిరి నను గురువులు
చదివితి ధర్మార్థముఖ్య♦శాస్త్రము లెల్లన్
జదివినవి గలవు పెక్కులు
చదువులలో మర్మ మెల్లఁ ♦ జదివితి తండ్రీ.

మ. తనుహృద్భాషలసఖ్యమున్ శ్రవణమున్ ♦ దాసత్వమున్ వందనా
ర్చనముల్ సేవయు నాత్మలో నెఱుకయున్ ♦ సంకీర్తనల్ చింతనం
బను నీతొమ్మిది భక్తిమార్గముల స♦ర్వాత్మున్ హరిన్ నమ్మి స
జ్జనుఁడై యుండుట భద్రమంచుఁ దలఁతున్ ♦ సత్యంబు దైత్యేశ్వరా.

ఇంతియగాక.

శా. అంధేందూదయముల్ మహాబధిరశం♦ఖారావముల్ మూకస
ద్గ్రంథాఖ్యాపనముల్ నపుంసకవధూ♦కాంక్షల్ కృతఘ్నావలీ

బంధుత్వంబులు భస్మహవ్యములు లు♦బ్ధద్రవ్యముల్ క్రోడస
ద్గంధంబుల్ హరిభక్తివర్జితులరి♦ క్తవ్యర్థసంసారముల్.

తండ్రీ! ఇంకొక్కమాట నాలకింపుము. మనస్సును సమాహితమగునట్లు చేయుము. తరణోపాయ మేదియని యాలోచింపుము.

సీ. కమలాక్షు నర్చించు ♦ కరములు కరములు
శ్రీనాథు వర్ణించు ♦ జిహ్వ జిహ్వ
సురరక్షకుని జూచు ♦ చూడ్కులు చూడ్కులు
శేషశాయికి మ్రొక్కు ♦ శిరము శిరము
విష్ణు నాకర్ణించు ♦ వీనులు వీనులు
మధువైరిఁ దవిలిన ♦ మనము మనము
భగవంతు వలగొను ♦ పదములు పదములు
పురుషోత్తముని మీఁది ♦ బుద్ధి బుద్ధి
తే. దేవదేవునిఁ జింతించు ♦ దినము దినము
చక్రహస్తునిఁ బ్రకటించు ♦ చదువు చదువు
కుంభినీధవుఁ జెప్పెడి ♦ గురుఁడు గురుఁడు
తండ్రి హరిఁ జేరు మనియెడు ♦ తండ్రి తండ్రి.

తొందఱపడక యింకొక్కమాట నాలింపుము.

సీ. కంజాక్షునకుఁ గాని ♦ కాయంబు కాయమే
పవనగుంభితచర్మ ♦ భస్త్రి గాక
వైకుంఠుఁ బొగడని ♦ వక్త్రంబు వక్త్రమే
ఢమఢమధ్వనితోడి ♦ ఢక్క గాక
హరిపూజనము లేని ♦ హస్తంబు హస్తమే
తరుశాఖనిర్మిత♦దర్వి గాక

కమలేశుఁ జూడని ♦ కన్నులు కన్నులే
తనుకుడ్యజాలరం♦ధ్రములు గాక
ఆ. చక్రిచింతలేని ♦ జన్మంబు జన్మమే
తరళసలిలబుద్బు♦దంబు గాక
విష్ణుభక్తిలేని ♦ విబుధుండు విబుధుఁడే
పాదయుగముతోడి ♦ పశువు గాక.

మహాత్ములు యోగులు నిరంతరధ్యానమొనరించి యెఱింగి మనవంటిమూఢులకుఁ దెల్పిన భాషణముల నించుక యాలకింపుము.

సీ. సంసారజీమూత♦సంఘంబు విచ్చునే
చక్రిదాస్యప్రభం♦జనము లేక
తాపత్రయాభీల♦దావాగ్ను లాఱునే
విష్ణుసేవామృత♦వృష్టి లేక
సర్వంకషాఘౌఘ♦జలరాసు లింకునే
హరిమనీషాబడ♦బాగ్ని లేక
ఘనవిపద్గాఢాంధ♦కారంబు లడఁగునే
పద్మాక్షనుతి రవి♦ప్రభలు లేక
తే. నిరుపమాపునరావృత్తి ♦ నిష్కళంక
ముక్తినిధిఁ గానవచ్చునే ♦ ముఖ్యమైన
శార్ఙ్గకోదండచింతనాం♦జనము లేక
తామరసగర్భునకు నైన ♦ దానవేంద్ర.

అను నీప్రహ్లాదునిపలుకులు హిరణ్యకశిపుని చెవులకు ములుకులవలె నయ్యెను. శ్రుతిరంధ్రముల ద్వారా మనస్సున కెఱుక

పడియె. వెంటనే యాతనినయనము లెఱ్ఱవాఱెను. అప్పుడే మోము వివర్ణతంగాంచెను. అధరము కంపింపసాగెను. భుజశిఖరము లెగురి మొదలిడెను. కరతలగతఖడ్గము తనంతన తానే క్రూరత వహించెను. దేహ మింక నూరకుండుట పాడిగాదని కాఁబోలు వడఁకసాగెను. ఇంతయేల సింహాసనమే యల్లలనాడఁజొచ్చెను. ఆ వెంటనే యాదానవనేత యదరిపడి క్రూరనేత్రము లగ్నిజ్వాలలఁ గురియుచుండ శుక్రపుత్రుంగాంచి యీతఁడు దుర్మాత్ముఁడై నావిరోధియగు శ్రీహరికథలఁ జెప్పియుండు నని యెంచుచు నిట్లు పలికెను.

చ. పటుతరనీతిశాస్త్రచయ ♦ పారగుఁ జేసెదనంచు బాలు నీ
వటుకొనిపోయి వానికి న♦నర్హములైన విరోధిశాస్త్రముల్
కుటిలతఁ జెప్పినాఁడవు భృ♦గుప్రవరుండ వటంచు నమ్మితిం
గటకట! బ్రాహ్మణాకృతివి ♦ గాక యథార్థపు బ్రాహ్మణుండవే.

ఏమయ్యా! ధర్మేతరమార్గమునఁ బ్రవర్తించి నాకొడుకును బాడుచేసితివి. నాద్రవ్యమును గొని మామకసహాయమున జీవించుచు, నందఱికన్న మిక్కుటమగు మర్యాదలం బొందుచు నీవిట్లు చేసితివే. ఇది పాపముకాదా! ఇట్టి నీకు సుగతిగలదా. అని మఱుమాటరాక యూరకుండెను. పురోహితుఁడు రాజునకుఁ దీవ్రక్రోధ మంకురించె నని యెఱింగి వడంకుచు మహాప్రభూ!

ఉ. తప్పులు లేవు మావలన ♦ దానవనాథ! విరోధిశాస్త్రముల్
చెప్పము క్రూరులై పరులు ♦ చెప్పరు, మీచరణంబులాన సు

మ్మెప్పుడు మీకుమారునకు ♦ నింతయు నైజమనీష యెవ్వరుం
జెప్పెడి పాటిగాదు ప్రతి♦చింతఁ దలంపును నేర్చుకైవడిన్.

త్రిలోకాధినాథా! మున్నొక్కమాట విన్నవింతు. అవధరింపుఁడు.

క. మిత్రులము పురోహితులము
పాత్రులమే మదియుఁ గాక ♦ భార్గవులము నీ
పుత్రుని నిటువలెఁ జేయఁగ
శత్రులమే దైత్యజలధి♦చంద్రమ వింటే.

అను పలుకుల నాలకించి హిరణ్యకశిపుఁడు మనమున నించుక యోజించెను. ఆమాటలు నిజములే యని నమ్మెను. వారిని సాదరముగా వీక్షించెను. వెంటనే మోము మరలించెను. కొడుకుం జూచి కుమారా! గురువు లుపదేశింపని యీనీతులు నీకెవరు బోధించిరి. వారి పేరు చెప్పుము. చాలు. ఆవల వారివిషయ మాలోచించెద ననియె. ప్రహ్లాదుఁ డామాటల కించుకయు భయంపడక నిశ్చలచిత్తుండై సుస్మితాననుండై తండ్రి వంకఁ జూచుచు మహాత్మా! జనకా!

ఉ. అచ్చపుఁ జీఁకటింబడి గృ♦హవ్రతులై విషయప్రవిష్టులై
చచ్చుచుఁ బుట్టుచున్ మరలఁ ♦ జర్వితచర్వణు లైనవారికిం
జెచ్చెరఁ బుట్టునే పరులు ♦ చెప్పిన నైన నిజేచ్ఛ నైన నే
మిచ్చిన నైనఁ గానలకు ♦ నేగిన నైన హరిప్రబోధముల్.

ఉ. కానని వాని నూఁతగొని ♦ కాననివాఁడు విశిష్టవస్తువుల్
కానని భంగిఁ గర్మములు ♦ గైకొని కొందఱు కర్మబద్ధులై

కానరు విష్ణుఁ గొంద ఱట ♦ గందు రకించన వైష్ణవాంఘ్రిసం
స్థానరజోభిషిక్తులగు ♦ సంహృతకర్ములు దానవేశ్వరా.

తండ్రీ! తుదిమాట యొక్కదానిని వినుము. కోపాగ్ని జ్వాలల మనస్సును గాల్పఁబూనకుము. శాంత మూనుము.

శా. శోధింపంబడె సర్వశాస్త్రములు ర♦క్షోనాథ! వేయేటికిన్
గాథల్ మాధవశేముషీతరణిసాం♦గత్యంబునం గాక దు
ర్గాధన్ దాఁటఁగ వచ్చునే సుతవధూ ♦ మిత్రోగ్ర వాంఛామద
క్రోధోల్లోలవిశాలసంసృతిమహా♦ఘోరామితాంభోనిధిన్.

అను పలుకుల విని రక్కసులఱేఁడు తటుక్కునఁ గొడుకుపైఁ గల మక్కువను దెగఁగోసి తొడలపైనున్నవాని గొబ్బున దిగఁ ద్రోసి నిర్భరక్రోధంబు దీపింప వేఁడిచూపుల మింట మంట లెగయుచుండఁ జెంతనున్న మంత్రులం గాంచి యిట్లు పలికెను. మంత్రులారా! వరాహరూపమెత్తి తనపిన్నతండ్రిని జంపె నని యీ ప్రహ్లాదుఁడు మనమునఁ గోపమూనక సేవకుఁడు క్షుద్రరాజును బొగడినట్లు హరిని బొగడుచున్నవాఁడు. నాకరవాలమునకుఁ దనప్రాణవాయువుల నర్పింపఁ బూనియున్నవాఁడు. నాతో విరోధమున కొడిగట్టినాఁడు. లోకమున నెందైన నిట్టి పాపాత్ముని బితృద్రోహిని జూచితిరా? అని యంత నిలువక శూరదానవ పుంగవులం గాంచి,

శా. పంచాబ్దంబులవాఁడు తండ్రి నగు నా♦పక్షంబు నిందించి య
త్నించి ద్వేషించి భీతియు లేక విష్ణు నహితుం ♦ గీర్తించుచున్నాఁడు, వ

ల్దంచుం జెప్పిన మానఁ డంగమునఁ బు♦త్రాకారతన్ వ్యాధి జ
న్మించెన్ వీని వధించి రండు దనుజుల్ ♦ మీమీపటుత్వంబులన్.

అని వారిని హెచ్చరించి తీవ్రమగు కోపము తనుముంపఁగా హుంకరించి కరవాలము జళిపించి

శా. అంగవ్రాతములోఁ జికిత్సకుఁడు దు♦ష్టాంగంబు ఖండించి శే
షాంగశ్రేణికి రక్షచేయుక్రియ నీ♦యజ్ఞుం గులద్రోహి దు
స్సంగుం గేశవపక్షపాతి నధముం ♦ జంపించి వీరవ్రతో
త్తుంగఖ్యాతిఁ జరించెదం గులముని♦ర్దోషంబుఁ గావించెదన్.

కాఁబట్టి మీరిప్పుడే

క. హంతవ్యుఁడు రక్షింపను
మంతవ్యుఁడు గాఁడు యనుని ♦ మందిరమునకున్
గంతవ్యుఁడు వధమున కుప
రంతవ్యం డనక చంపి ♦ రండీపడుచున్.

అని దానవనాయకుండు రూక్షంబుగాఁ బలికిన విని రాక్షసవీరు లాక్షణము పెక్కండ్రు శూలంబులఁ గేలంబూని వక్త్రంబులు తెఱచికొని యుబ్బి పెడబొబ్బలిడుచు బాలుండని కాని, రాచబిడ్డఁడని కాని, కనికరింపఁదగిన ప్రాయముగలవాఁడనికాని, లోకమాన్యసచ్ఛీలుండనికాని, ఇన్నింటిని బట్టి యవధ్యుఁడని కాని యూహింపక కూరిరస్వాంతులై శూలములంగొని ప్రహ్లాదుని కోమలతరాంగములఁ జూచి క్రమ్మిరి. ఎన్నిమాఱులు శూలములఁ బ్రహరించుచున్నను బ్రహ్లాదుఁడు వలదనికాని, అమ్మా యనికాని, ఇంక నిట్టిమాటలు పలుకను నన్ను రక్షింపుఁడీ యని

కాని పలుకక నిరంతర మాతరాత్పరుని నారాయణమూర్తిని ధ్యానించుచు నూరకుండెను. ఆశూలపుఁబోటు లాతని యంగమున కించుకంతయు నొప్పిని గల్గింపఁ జాలవయ్యెను. శూలములతోఁ దన్నుఁ గ్రుమ్ముచున్నపుడెల్ల నోపన్నగశయనా! ఓదనుజభంజనా! ఓజగదధీశా! ఓమహాపన్నశరణ్యా! ఓనిఖిలపావనా! అని వినుతించెను గాని, కన్నుల నీరుపెట్టుటగాని, భయముచే నంగములు వడఁకించుటగాని చేయక యూరక నిర్వికారుఁడై యుండెను.

ఇట్లు దానవులు చేయు ఘోరకృత్యము లాప్రహ్లాదకుమారు నొప్పింపఁ జాలవయ్యెను. ఒక్కమాఱైనను ఈబాధలకుఁ దాళఁజాల ననకుండుటంజూచి వా రచ్చెరువునొందిరి. ఆవిధ మాహిరణ్యకశిపుఁ డెఱింగి యేకాంతమునఁ గూరుచుండి ఔరా!

ఉ. శూలములన్ నిశాచరులు ♦ స్రుక్కక దేహము నిగ్రహింపఁగా
బాలుఁడు నేలపైఁబడఁడు ♦ పాఱఁడు చావఁడు తండ్రి నైన నా
పాలికివచ్చి చక్రధరు♦పక్షము మానితి నంచుఁ బాదముల్
ఫాలము సోఁక మ్రొక్కఁ డన♦పాయతనొందట కేమిహేతువో.

అని సంశయించుచు నెన్నియోవిధంబుల నింకను బాధింపుదునని చింతించి దిగ్గజములచేఁ ద్రొక్కించియుఁ బాములచేఁ గఱపించియు ననేకరీతుల బాధింపుఁడని దానవవీరుల కాజ్ఞాపించెను. వా రట్లేచేసిరి. వానిచేఁ బ్రహ్లాదుఁడు బాధింపఁబడఁ

డయ్యెను. అణుమాత్రమైన బాధింపఁబడినట్లు తోఁపఁజేయక నవ్వుచు శ్రీహరినామసంకీర్తనము చేయుచుండెను. ఆవిధమంతయు దానవులు వచింపఁగా నాలకించి దానవేంద్రుఁ డొక్క నాఁడు రహస్యస్థలంబునఁ గూరుచుండి ముక్కుపై వ్రేలిడుకొని అక్కటా!

ఉ. ముంచితి వార్ధులన్ గదల♦మొత్తితి శైలతటంబులందు ద్రొ
బ్బించితి శస్త్రరాజిఁ బొడి♦పించితి మీఁదనిభేంద్రపంక్తి ద్రొ
క్కించితి ధిక్కరించితి శ♦పించితి ఘోరదవాగ్నులందుఁ ద్రో
యించితిఁ బెక్కుపాట్ల నల♦యించితి. జావఁ డిదేమి చిత్రమో.

ఇంతియ గాక,

చ. ఎఱుఁగఁడు జీవనౌషధము♦ లెవ్వరు భర్తలు లేరు బాధలం
దరలఁడు నైజతేజమునఁ♦ దథ్యము జాడ్యము లేదు మిక్కిలిన్
మెఱయుచు నున్నవాఁ డొకని♦ మేషము దైన్యము నొందఁ డింకనే
తెఱఁగునఁ బ్రంతు వేసరిలి♦ దివ్యము వీని ప్రభావ మెట్టిదో.

వాస్తవము నూహింప వీఁడు సామాన్యుఁడు కాఁడు. వీనితోడి వైరంబున నాకే మృతిసిద్ధించు నని తోఁచెడిని. అని చింతనముచేయుచుఁ జండామర్కుల రావించిన వారరుదెంచి యాతనిసంశయములనెఱింగి ధైర్యము చెప్పఁ దలంచి గంభీరముగా,

శా. శుభ్రఖ్యాతివి నీప్రతాపము మహా♦చోద్యంబు దైత్యేంద్ర గో
షభ్రూయుగ్మవిజృంభణంబున దిగీ♦శవ్రాతముల్ బోరులన్
విభ్రాంతంబుగఁ జేసి యేలితిగదా♦ విశ్వంబు వీఁ డెంత యీ
దభ్రోక్తుల్ గుణదోషహేతువులు చిం♦తం బొంద నీకేటికిన్.

శా. వక్రుండైనజనుండు వృద్ధగురుసే♦వంజేసి మేధానయో
పక్రాంతిన్ విలసిల్లు మీఁదట వయః♦పాకంబుతో బాలకున్
శక్రద్వేషణబద్ధుఁ జేయుము మదిం♦జాలింపు మీరోషమున్
శుక్రాచార్యులు వచ్చునంత కితఁడున్ ♦ సుశ్రీయుతుం డయ్యెడున్.

అని హితంబుఁ దెలిపిరి. ఆమాటల కించుక యూఱడిల్లి గురుపుత్రులారా! గృహస్థుపులైన రాజుల కుపదేశింప ననువగు ధర్మంబుల నుపదేశించి నాకుమారుని సన్మార్గమునకుం ద్రిప్పుఁడని యాదేశించెను. వా రంతఁ దద్దాజ్ఞ మహాళిందాళ్చి సకలవిధ ధర్మంబుల నుపదేశించిరి. ఆ ప్రహ్లాదుఁడు రాగద్వేషంబులచే విషయాసక్తులగు వారలకు గ్రహింప ననువగు ధర్మార్థకామంబులు తనకు నగ్రాహ్యంబు లని తలంచెను. అంతియగాక అనర్థంబులం దర్థకల్పనంబుచేయుట దిగ్భ్రమం బనియు నూహించెను.

ఆవల గురువులు కర్మానుష్ఠానమున కరుగఁగాఁ దనతో నాడుకొనవచ్చిన బాలకులం జీరి సోదరులారా! మనగురువులు మంచివిద్య చెప్పుటలేదు. ఇది యసద్విద్య. నేనొక్క చదువు చెప్పెద. అది నిరపాయము. అని వారి నేకాంతంబునఁ గూరుచుండఁబెట్టుకొని సాదరంబుగా,

ఉ. బాలకులార! రండు మన♦ప్రాయపుబాలురు కొంద ఱుర్విపైఁ
గూలుట కంటిరే గురుఁడు ♦ క్రూరుఁ డనర్థచయంబునందు దు
ర్శీలత నర్థకల్పనముఁ ♦ జేసెడి గ్రాహ్యముగాదు శాస్త్రమే
మేలెఱిఁగించెదన్ వినిన ♦ మీకు నిరంతర భద్ర మయ్యెడిన్.

అని భక్తిమార్గంబునఁ గల భేదంబులం దెలుపుచు

సీ. కంటిరే మనవారు ♦ ఘనులు గృహస్థులై
విఫలులై కైకొన్న ♦ వెఱ్ఱితనము
భద్రార్థులై యుండి ♦ పాయరు సంసార
పద్ధతి నూరక ♦ పట్టువడిరి
కలయోనులందెల్ల ♦ గర్భాద్యవస్థలఁ
బురుషుండు దేహియై ♦ పుట్టుచుండుఁ
దన్నెఱుంగఁడు కర్మ ♦ తంత్రుఁడై కడపట
ముట్టఁడు భవశత♦ములకు నైన
ఆ. దీన శుభములేదు ♦ దివ్యక్రియలేదు
జగతిఁ బుట్టిపుట్టి ♦ చచ్చిచచ్చి
పొరల నేల మనకుఁ ♦ బుట్టని చావని
త్రోవ వెదకికొనుట ♦ దొడ్డబుద్ధి.

ఇంతియగాదు. మఱొక్కయుదాహరణమును వినుఁడు. అది మీరు నెఱింగినదియే. ఐనం దెల్పెద.

శా. హాలాపానవిజృంభమాణమదగ♦ర్వాతీతదేహోల్లస
ద్బాలాలోకనశృంఖలానిచయ సం♦బద్ధాత్ముఁడై లేశముక్
వేలానిష్క్రమణంబుఁ గానఁడు మహా♦విద్వాంసుఁడుం గామినీ
హేలాకృష్టకురంగశాబకమగుక్ ♦ హీనస్థితిక్ వింటిరే.

ఆ. విషయసక్తులైన ♦ విబుధాహితులతోడి
మనికి వలదు ముక్తి♦మార్గవాంఛ
నాదిదేవు విష్ణు ♦ నాశ్రయింపుఁడు ముక్త
సంగజనులఁ గూడి ♦ శైశవమున.

అని పెక్కురహస్యములు తెలిపెను. ఆ బాలు రావాక్యముల నాలకించి ప్రమోదవాహినీ నిమగ్నమానసు లై,

ఉ. మంటిమి గూడి భార్గవకు♦మారుల యొద్ద ననేకశాస్త్రముల్
వింటిమి లేఁడు సద్గురుఁడు ♦ వేఱొకఁ డెన్నఁడు రాఁజాల ను
కంటికి నైనరాదు చొరఁ♦గా వెలిఁ బోవరాదు నీకు ని
ష్కంటకవృత్తి నెవ్వఁడు ప్ర♦గల్భుఁడు చెప్పె గుణాఢ్య! చెప్పుమా.

మహాత్మా!

క. సేవింతుము నిన్నెప్పుడు
భావింతుము రాజవనుచు ♦ బహుమానములన్
గావింతుము తెలియుము నీ
కీవింత మతిప్రకాశ ♦ మేక్రియఁ గలిగెన్.

అని ప్రశ్నించిరి. ప్రహ్లాదుఁ డాబాలకుల కనేకనీతివాక్యము లుపదేశించి శ్రీహరిభక్తి ముక్తిసాధన మని చక్కఁగాఁ దెలిపెను. ఆమాటలకు బాలకులెల్ల మిగుల హర్షించిరి. గురువుల యుపదేశముల విన నిచ్చగింపరైరి. తుదకు

క. ఆడుదము మనము హరి రతిఁ
బాడుద మేప్రొద్దు విష్ణు♦భద్రయశంబుల్
వీడుదము దనుజసంగతిఁ
గూడుదము ముకుందభక్త♦కోటిన్ నూటిన్.

అను ప్రహ్లాదోపదేశము గట్టిగా నమ్మిరి. ఆవిధ మెఱింగి శుక్రాచార్యపుత్రుండు దానవనాథుపాలికిం బోయి మోము వెలవెల పోవఁగా,

శా. రక్షోబాలుర నెల్ల నీకొడుకు చేరం జీరి లోలోన నా
శిక్షామార్గము లెల్లఁ గల్ల లని యాక్షేపించి తా నందఱన్
మోక్షాయత్తులఁ జేసినాఁడు మనకున్ మోసంబు వాటిల్లె నీ
దక్షత్వంబునఁ జక్కఁజేయవలయున్ దైతేయవంశాగ్రణీ.

క. ఉల్లసిత విష్ణుకథనము
లెల్లప్పుడు మాకుఁ జెప్పఁ డీగురుఁ డని న
న్నుల్లంఘించి కుమారకు
లొల్లరు చదువంగ దానవోత్తమ వింటే.

తుదిమాట వినుము.

క. ఉడుగఁడు మధురిపుకథనము
విడివడి జడుపగిదిఁ దిరుగు వికసనమున నే
నొడివిన నొడువులు నొడువఁడు
దుడుకనిఁ జదివింప మాకు దుర్లభ మధిపా.

అని తెలియఁ బలికిరి. ఆమాటల కాగ్రహించి తనయు
రావించి యించుకయును గరుణంబూనక నిర్భరక్రోధవివశుఁడై
యాడుగఱచి ప్రహ్లాదా! మూర్ఖుఁడా! దిక్పాలకులు నాయాజ్ఞ
శిరసావహింతురు. నాదర్శనమును గోరి యోడ్లకోలఁది కాచి
యుందురు. అగ్నిప్రభృతులు నాగృహమున వంటచేయుచుందు
రు. దిక్పాలపత్నులు నాయింటఁ జేటులై యుందురు. అట్టి నా
యానతిమీఱి యేమో ప్రేలుచున్నవాఁడవు. మూర్ఖా!

శా. కంఠక్షోభము గాఁగ నొత్తిలి మహాగాఢంబుగా డింభకై
కుంతుం జెప్పెదు దుర్జయుం డనుచు వైకుంఠుండు వీరవ్రతో

త్కుంతాబంధురుఁ డేని నేఁ డిలలన్ ♦ ఖండింప దండింపఁగాఁ
గుంఠీభూతుఁడు గాక కావలదె మ♦ద్ఘోరాహవక్షోణికిన్.

కుమారా! ఆచార్యులు వచింపకయున్న యర్థమును దెలిసినట్లు బోధించి బాలుర గురువిముఖులఁగా నొనర్చితి వఁట. ఇంతియగాక పగవాఁడగు విష్ణుని వర్ణించితివఁట. దీనిచే దానవ వంశాచారంబుల నేటఁ గలిపితివి. ఇట్టి మూఢాత్ముని గులపాంసనుని నీచుని నిన్నుఁ జంపుట పాపముగాదు. వంశమునకు మేలు గల్గించినట్లగును. అంతియగాక వంశమును నిర్దుష్టముగా నొనరించిన పుణ్యము లభించును. మఱొక్కమాట వినుము.

క. దిక్కుల గెలిచితి నన్నియు
దిక్కెవ్వఁడు రోరి నీకు ♦ దేవేంద్రాదుల్
దిక్కులరాజులు వెఱ్ఱొక
దిక్కెఱుఁగక కొలుతు రతఁడె ♦ దిక్కని నన్నున్.

క. బలవంతుఁడ నేజగముల
బలములతోఁ జనక వీర♦భావమున మహా
బలుల జయించితి నెవ్వని
బలమున నాడెదవు నాకుఁ ♦ బ్రతివీరుఁడవై.

అని పలికినఁ బ్రహ్లాదుఁడు చిఱునవ్వునఁ దనమనోభావమును దెలుపుచుఁ దండ్రితో మెల్లఁగా

క. బలయుతులకు దుర్బలులకు
బలమెవ్వఁడు నీకు నాకు ♦ బ్రహ్మాదులకున్
బలమెవ్వఁడు ప్రాణులకును
బలమెవ్వం డట్టి విభుఁడు ♦ బల మసురేంద్రా!

క. దిక్కులు కాలముతో నే
దిక్కున లేకుండఁ గలుగు ♦ దిక్కుల మొదలై
దిక్కుగల లేనివానికి
దిక్కయ్యెడు వాఁడు నాకు ♦ దిక్కు మహాత్మా!

తండ్రీ! మఱొక్కబుద్ధి వినుము. కోపమున మదిని జెదఱ నీయకుము.

ఉ. లోకము లన్నియుం గడియ♦లోన జయించినవాఁడ వింద్రియా
నీకముఁ జిత్తముం గెలువ♦నేరవు నిన్ను నిబద్ధుఁ జేయు నీ
భీకరశత్రు లార్వురఁ బ్ర♦భిన్నులఁ జేసినఁ బ్రాణికోటిలో
నీకు విరోధి లేఁడొకఁడు ♦ నేర్పున జూడుము దానవేశ్వరా!

ప్రియ జనకా! నా ప్రార్థన నంగీకరింపుము.

క. పాలింపుము శేముషి ను
న్మూలింపుము కర్మబంధ♦ముల సమదృష్టిం
జాలింపుము సంసారముఁ
గీలింపుము హృదయమందుఁ ♦ గేశవభక్తిన్.

అని పలుకుచున్న భాగవతశేఖరుం గాంచి దోషాచర ఖరుం డాగ్రహమున,

శా. నాతోడం బ్రతిభాషలాడెదు జగ♦న్నాథుండ నాకంటె నీ
భూతశ్రేణికి రాజు లేఁడొకఁడు సం♦పూర్ణప్రభావుండ మ
ద్భావితం జంపిన మున్ను నేవెదకితిం ♦ బల్లాఱు నారాయణుం
డేఁదిద్వీశ్వరులోన లేఁడు మఱి వాఁ ♦ డెందుండురా దుర్మతీ!

పాపాత్ముఁడా! ప్రహ్లాదా!

క. ఎక్కడఁ గలఁ డే క్రియ నే
చక్కటి వర్తించు నెట్టి ♦ జాడను వచ్చున్

జక్కడుతు నిన్ను విష్ణునిఁ
జెక్కులు వ్రేలెదవు వాని ♦ భృత్యునిపగిదిన్.

అని ఘోరధ్వనితోఁ బల్కెను. ఆమాటలకుఁ బ్రహ్లాదుఁడు హరి కింకరుఁడే యామాట శంకింపక ప్రమోదపులకాంకురసంకలితసర్వాంగుండై యించుకంతయుఁ గోపమూనక త్వరపడక హృదయారవిందపీఠంబున శ్రీనాథుం దలంచి నిలిపి నమస్కరించి బాలవర్తనంబున నర్తనంబుఁ జేయుచు,

మ. కలఁ డంభోధిఁ గలండు గాలిఁ గలఁ డా♦కాశంబునన్ గుంభినిం
గలఁ డగ్నిన్ దిశలం బగళ్ల నిశలన్ ♦ ఖద్యోతచంద్రాత్మలన్
గలఁ డోంకారమునం ద్రిమూర్తులఁ ద్రిలిం♦గవ్యక్తు లందంతటం
గలఁ డీశుండు గలండు తండ్రి వెదకం ♦ గా నేల యీ యాయెడన్.

క. ఇందుఁ గలఁ డందు లేఁ డని
సందేహము వలదు చక్రి ♦ సర్వోపగతుం
డెందెందు వెదకి చూచిన
నందందే కలఁడు దాన♦వాగ్రణి వింటే.

అని కుమారుఁడు పలుకుచుండఁగా నెందున్నవాఁడో చూపుమని తండ్రి యాక్షేపించుచుండఁగా శ్రీహరి యాదానవనేతం జంప నరసింహాకృతి సర్వత్ర నెలకొనియుండెను. అత్తఱి నా దానవేంద్రుఁ డించుకంతయు నోర్పుపూనక

క. డింభక సర్వస్థలముల
నంభోరుహనేత్రుఁ డుండు ♦ ననుచు మిగుల సం
రంభంబునఁ బలికెద వీ
స్తంభంబునఁ జూపఁగలవె ♦ చక్రిం గ్రక్కన్.

క. స్తంభమునఁ జూప నేనియుఁ
గుంభిని నీశిరముఁ ద్రుంచి ♦ కూల్పఁగ రక్షా
రంభమున వచ్చి హరి వి
స్రంభంబున నడ్డపడఁగ ♦ శక్తుం డగునే.

అని గద్దించెను. ఆమాటయు జంకక విసుగునొందక యేవగింపక త్వరపడక ధైర్యము నెడఁబాయక సంతసమును దెలుపునట్టి చూపులఁ జాలింపక ప్రహ్లాదుఁడు భక్తవత్సలుఁడగు భగవంతునిభటుఁడు కావున,

శా. అంభోజాసనుఁ డాదిగాఁగఁ దృణప♦ర్యంతంబు విశ్వాత్ముఁడై
సంభావంబున నుండు ప్రోడ విపుల ♦ స్తంభంబునం దుండఁ డే
స్తంభాంతర్గతుఁ డయ్యు నుండుటకు నే ♦ సందేహముల్ లేదు ని
ర్దంభత్వంబున నేఁడు గానఁబడుఁ బ్ర♦త్యక్షస్వరూపంబునన్.

అను పలుకులు చెవులసోఁకినంతనే మండిపడి యుద్దండ విక్రముఁడగు దానవనాథుండు హుంకరించి నిశాతఖడ్గంబు కరంబున నమర్చి జళిపించుచుఁ గొడుకుఁ దిరస్కరించుచు యుగాంతకాలహుతవహునిపోల్కిఁ గానంబడుచు,

మ. వినరా డింభక మూఢచిత్త గరిమన్ ♦ విష్ణుండు విశ్వాత్మకుం
డని భాషించెద వైన నిందుఁ గలఁడే ♦ యంచున్ మహాక్రోధియై
దనుజేంద్రుం డతిచేత వ్రేసెను మహా♦దగ్రప్రభాశుంభమున్
జనదృగ్భీషణదంభమున్ హరి జను♦స్సంరంభమున్ స్తంభమున్.

ఆవేటున కాస్తంభంబు పగిలెను. పటపట యనుశబ్దము ముప్పతిల్లెను. అది రోదోంతరంబుల నిండెను. సకలజగద్భయంకర

రీతిం బొలుపారెను. అది విని జంతుసంతానంబులు నిశ్చేష్టిత ము లయ్యెను. కొండలు పగిలి ధరణిం ద్రొళ్లెను. ఆధ్వనియుఁ బైధ్వనిలోఁ జేరి వ్యాపింప సముద్రములు ఘూర్ణిల్లెను. ఆధ్వనియు వానితోఁ గలిసెను. బ్రహ్మాండకటాహంబును విదళింపఁ జూచెను. ఆసమయమున నాస్తంభమునుండి నరసింహమూర్తి యావిర్భవించెను. ఆరూపము చూడఁగా,

కం. నరమూర్తి కాదు కేవల
హరిమూర్తియుఁ గాదు మానవాకారముఁ గే
సరియాకారము నున్నది
హరిమాయారచితమగు యథార్థముచూడన్.

అని యాతరుణమున హిరణ్యకశిపుఁ డూహించెను. అంతతో నాతనియూహ నిలువలేదు.

ఉ. తెంపున బాలుఁడాడిన సుధీరత సర్వగతత్వముం బ్రతి
ష్ఠింపఁ దలంచి యిందు నరసింహశరీరముఁ దాల్చి చక్రి శి
క్షింపఁగ వచ్చినాఁడు హరిచే మృతియంచుఁ దలంతు నైన నా
సొంపును బెంపు నందఱును జూడఁ జరింతు హరింతు శత్రువున్.

అను నభిప్రాయము హిరణ్యకశిపునకుం గల్గఁ జేసెను.

అంత నాదానవేంద్రుఁడు ధైర్యము నూది గదాదండ ముద్దండగతిం గరంబునంబూని శ్రీనరసింహమూర్తి కెదురు నడచెను. చెంతఁ జేరినకొలఁదిని తదీయాప్రతిమానతేజోవిశేషంబున దైత్యపతి నిర్గతప్రభుం డయ్యెను. అంతలో గదాదండంబు గిరగిరం

ద్రిప్పి నరసింహమూర్తిపై వైచెను. ఆపరాత్పరుండా వ్రేటును లెక్కఁగొనక వానిం బట్టుకొనియె. వాఁడు నిలువక మిట్టిపడి పట్టు తప్పించుకొని చెలరేఁగెను. దేవత లించుక సంశయించిరి. అంతలో నరసింహమూర్తి యాదానవుని యాటోపంబు సైరింపక

నృసింహమూర్తి హిరణ్యకశిపుని వధించుట.

సీ. పంచాననోద్ధూత ♦ పావకజ్వాలలు
భూనభోంతర మెల్లఁ ♦ బూరితముగ
దంష్ట్రాంకురాభీల ♦ ధగధగాయితదీప్తి
నసురేంద్రునేత్రము ♦ లంధములుగఁ
గంటకసన్నిభో♦త్కటకేసరాహతి
నభ్రసంఘము భిన్న ♦ మై చలింపఁ
బ్రళయార్కప్రచండా ♦ ప్రతిమభాస్వరములై
ఖరనఖరోచులు ♦ గ్రమ్ముదేర
తే. సటలు జళిపించి గర్జించి ♦ సంభ్రమించి
దృష్టి సారించి బొమలు బం♦ధించి కెరలి
జిహ్వ యాడించి లంఘించి ♦ చేత నొడిసి
పట్టె నరసింహుఁ డాదితి ♦ పట్టి (నపుడు).

ఆపట్టున దానవనాయకుఁడు హుంకరించెను. గాని వదలించుకొని పోవ శక్యము కాదయ్యెను. అత్తఱి

మ. విహగేంద్రుం డహి వ్రచ్చుకైవడి మహో♦ద్వృత్తిన్ నృసింహుండు సా
గ్రహుఁడై యూరువులందుఁ జేర్చి నఖసం♦ఘాతంబులన్ వ్రచ్చె దు

స్సహు దంభోళికఠోరదేహు నచలో♦త్సాహున్ మహాబాహునిం
ద్రహుతాశాంతకభీకరున్ ఘనకరున్ ♦ దైత్యాన్వయశ్రీకరున్.

శా. చించున్ హృత్కమలంబు శోణితము వ♦ర్షించున్ ధరామండలిం
ద్రెంచుం గర్కశనాడికావళులు భే♦దించున్ మహావక్షమున్
ద్రుంచున్ మాంసము సూక్ష్మఖండములుగా ♦ దుష్టాసురున్ వ్రచ్చి ద
ర్పించుం బ్రేవులు కంఠమాలికలు క♦ల్పించున్ నఖోద్భాసియై.

సీ. వక్షఃకవాటంబు ♦ వ్రక్కలు చేయుచో
ఘనకుఠారంబుల ♦ కరణి నొప్పు
గంభీరహృదయపం♦కజము భేదించుచోఁ
గుద్దాలములభంగిఁ ♦ గొమరుమిగులు
ధమనీవితానంబు ♦ దవిలి ఖండించుచోఁ
బటులవిత్రంబుల ♦ పగిది మెఱయు
జఠరవిశాలాంత్ర ♦ జాలంబుఁ ద్రెంచుచోఁ
గ్రకచసంఘంబుల ♦ గరిమఁ జూపు

తే. నంకగతుఁడైన దైత్యుని ♦ నాగ్రహమున
శస్త్రచయముల నొంపక ♦ సంహరించి
యమరు నరసింహు నఖరంబు ♦ లతివిచిత్ర
సమరముఖరంబులై యుండె ♦ (జనవరేణ్య.)

ఇట్లా హిరణ్యకశిపునివిదళించి తనపై కరుదెంచు దైత్య నివహంబులం జక్రధారల నిశ్శేషంబుగా వధించెను. ఈరీతిగా

శా. రక్షోవీరుల నెల్లఁ ద్రుంచి రణసం♦రంభంబు చాలించి దృ
ష్టిక్షేపంబు భయంకరంబుగ సభా ♦ సింహాసనారూఢుఁడై

యక్షీణాగ్రహుఁడై నృసింహుఁడు కరాళాస్యంబుతో నొప్పెఁ దుర్
వీక్షింపం బలికింప నోడి యితరుల్ విభ్రాంతులై డాఁగఁగన్.

ఆరూపము భయంకరమై చెలఁగెను. ఎవ్వరును డాయ నోడిరి. బ్రహ్మాదులు వేదమంత్రముల వినుతించిరి. దిక్పాలకులు పొగడిరి. మహర్షులు ధ్యానించిరి. శ్రీదేవియుఁ బ్రార్థించెను. కాని ఆఘోరరూపము చూడ సలవిగాకుండెను. ఎవరుగాని దాని శాంతింపఁజేయ నేరమని నిశ్చయించిరి. అత్తఱిఁ జతురాననుం డాలోచించి ప్రహ్లాదునికడకుం బోయి సవినయముగా

క. సాంద్రమగు కోపమున మీ
తండ్రి నిమిత్తమునఁ జక్రి దారుణమూర్తిన్
వేంద్రము విడువఁడు మెల్లనఁ
దండ్రీ శీతలునిఁ జేసి దయచేయఁగదే.

అని ప్రార్థించెను. ఆప్రార్థనము నాదేశముగా శిరసావహించి ప్రహ్లాదకుమారుఁడు మందగమనంబున నమందవినయవివేకంబుల నానరసింహమూర్తిని డగ్గఱి భయభక్తివినయంబులు పెనంగొనఁగా నిలువంబడునంతనే

ఉ. ప్రాభవమొప్ప నుత్కటకృపామతియై కదియంగఁ జీరి సం
శోభిత దృష్టిసంఘములఁ జూచుచు బాలుని మౌళియందు లో
కాభినుతుండు పెట్టె నసురాంతకుఁ డుద్భటకాలసర్పభీ
తాభయదానశస్తమున నగ్గళమంగళహేతుహస్తముల్.

ఇట్లు శ్రీనరసింహమూర్తి యభయదానంబుచేసిన నాకు మారుండు వినయవినమితకంధరుండై యనేకవిధంబుల విను

తించెను. ఆస్తోత్రరాజమునకుఁ బరమకరుణాతరంగితహృదః యుండై పరమేశ్వరుండు సాదరాలోకనంబులం జూచి,

సీ. నీయట్టి సుజ్ఞాన ♦ నిపుణు లేకాంతులు
కోర్కులు నాయందుఁ ♦ గోరనొల్ల
రట్లైనఁ బ్రహ్లాద ♦ యసురేంద్ర భద్రవై
సాగి మన్వంతర ♦ సమయ మెల్ల
నిఖిలభోగంబులు ♦ నీవు భోగింపుము
కల్యాణబుద్ధి నా♦కథలు వినుము
సకలభూతములందు ♦ సంపూర్ణుఁడగు నన్ను
యజ్ఞేశు నీశ్వరు ♦ నాత్మ నిలిపి
ఆ. కర్మచయము లెల్ల ♦ ఖండించి పూజన
మాచరింపు మీశ్వ♦రార్పణముగ
భోగముల నశించుఁ ♦ బుణ్యవ్రతంబులఁ
బాపసంచయములు ♦ పాయు నిన్ను.

మఱియొక్కమాట వినుము.

ఆ. నరుఁడు ప్రియముతోడ ♦ నాయవతారంబు
నీయుదారగీత ♦ నికరములను
మానసించునేని ♦ మఱిసంభవింపఁడు
కర్మబంధచయముఁ ♦ గడచి పోవు.

అని పలికి బ్రహ్మాదుల నాదరించి నరసింహమూర్తి యదృశ్యుండయ్యె. ప్రహ్లాదుఁడు హరపంకజగర్భప్రభృతులకుఁ బ్రణమిల్లిన వార లాతని నాశీర్వదించి తమతమనివాసంబులకుం జనిరి.

ప్రహ్లాదుఁ డంత జనని నూఱడించి భగవద్భక్తిపరాయణుండై సుఖంబుండెను.

ఆర్యబాలకులారా! ప్రహ్లాదుఁడు తండ్రియాజ్ఞమీఱెను గదా. గురువునాజ్ఞ లెక్కసేయక పోయెఁగదా. ఇది శాస్త్రసమ్మతమా? యని ప్రశ్నింపరాదు. ఎవరుగాని ధర్మమార్గమును మీఱినపుడు వారియందుఁ గల మరియాదను వీడుట తప్పుగాదని నిశ్చయింపుఁడు. ప్రహ్లాదుఁడు సామాన్యబాలుఁడు కాఁడనియు, దుష్టుని హింసించుటకు శ్రీహరి యీతని నొకసాధనముగాఁ బుట్టింప నవతరించెననియుఁ దలంపుఁడు. ప్రహ్లాదుని ప్రవర్తనమును శ్రద్ధగాఁ బరికించి తదనుగుణముగాఁ బ్రవర్తింపఁ బ్రయత్నింపుఁడు. ఏయేగుణముల నాప్రహ్లాదుఁడు త్రిలోకవినుతకీర్తి యయ్యెనో, వాని నలవఱచుకొనఁ బ్రయత్నింపుఁడు. ఈచరిత్రపఠనమునకు ఫల మదియే. ఇదియే నే మీకుఁ దెలుపఁదగుమాట. ఇఁక నవ్వాలికథను వినఁ బ్రయత్నపడుఁడు.

ఇది సప్తమస్కంధము.

అష్టమస్కంధము.

గజేంద్ర మోక్షణము.

ప్రహ్లాదచరిత్రమును విని శుకయోగిచంద్రునిం గాంచి పరీక్షిన్మహారాజు ఇట్లు ప్రశ్నించెను. యోగీంద్రా! భక్తవర్యుని చరిత్రమూలముగా శ్రీమన్నారాయణమూర్తి యొనరించిన ధర్మరక్షణము వింటిని. పరమానందభరితుఁడ నైతిని. కాని యింకను బరాత్పరుని దివ్యగాథల నాలకింప నా మది త్వరపడి యెడు. ఆపదుద్ధారకుని యద్భుతచర్యల వినిపింపవే యని ప్రార్థించెను. పరీక్షిన్మహారాజు ప్రశ్నము నాలకించి సంతసించి శుకయోగి యిట్లనియె. రాజేంద్రా! చక్కని ప్రశ్న మొనరించితివి. ఎన్నిమాఱులు ప్రశ్నించినను విసుగులేక భగవచ్చరిత్రము వచింప నిచ్ఛ యుదయించుచునే యుండును. భక్తవరా! వేఱొకయద్భుతగాథను దెలిపెద వినుము.

మనువులు పదునలువురు కదా. అందు నాలవమనువు కాలమున జరగిన కథ వినుము. మను వనఁగా ధర్మాధికారి. ఒక్కొక్కమనువుకాలమున నొక్కొక్క యధికారివర్గ మేర్పడును. ఈనాలవమనువుకాలమున నున్న యధికారులఁ దెల్పెద

నాలవమనువుపేరు తామసుడు. ఉత్తముని కీతఁడు సోదరుఁడు. ఆయుత్తముఁడు మూఁడవమనువు. ఆతని కీతఁడు తమ్ముఁడు. ఈతామసమనువు ధర్మరాజ్యమును బాలించు తఱి కేతు, వృష, నర, ఖ్యాతి ప్రభృతులు రాజులు మనువుకొడుకులు పదుగురుండిరి. దేవతలు సత్యకహరివీరసంజ్ఞ గలవారు. వారల కధిపతి యింద్రుఁడు. వాని పేరు త్రిశిఖుఁడు. జ్యోతిర్వ్యోమప్రభృతులు సప్తర్షులు. ఆకాలమున భగవంతుఁ డగుహరి హరిమేధునకుఁ గొడుకయ్యెను. హరిమేధుని భార్య పేరు హారిణి యనీ. వారికి జనించిన పురుషుఁడు భగవదంశమున దుష్టుల శిక్షించి శిష్టులఁ గాపాడుచుండును. ఆమనువుకాలమున మకరముచేఁ బట్టుపడిన గజరాజును విడిపించి ప్రాణదానముచేసిన భగవంతుని కథయే యిపుడు చెప్పునది. అనుటయు రాజెంతయు నచ్చెరువంది యోగీశ్వరా! ఒకటి జలచరము. ఒక్కటి వనచరము. ఈరెండుజంతువులకుఁ బోరాట మెట్లు గలిగెను. భగవంతుఁ డాయారాటము నెట్లు మాన్పెను. ఘోరాటవిలో భద్రగజమునకుఁ గలిగిన యాపద నెట్లు తొలఁగించి శ్రీహరి తన మహిమను లోకులకుఁ దెలిపెను. ఆకథను విస్తరించి వచించి నాకానందమును గల్పింపుమా యని చేతులొగ్గి ప్రార్థించెను. యోగివర్యుం డానందతరంగితాంతరంగుఁడై,

సీ. రాజేంద్ర విను సుధా ♦ రాశిలో నొకపర్వ
తము త్రికూటం బనఁ ♦ దనరుచుండు

యోజనాయుత మగు ♦ నున్నతత్వంబును
నంతియ వెడలుపు ♦ నతిశయిల్లఁ
గాంచనాయస్సార♦కలధౌతమయము లై
మూఁడు శృంగంబులు ♦ మొనయుచుండుఁ
దట శృంగ బహురత్న♦ధాతుచిత్రితము లై
దిశలు భూనభములు ♦ తేజరిల్లు
తే. భూరిభూజలతాకుంజ♦పుంజములును
మ్రోసి పఱతెంచు సెలయేటి ♦ మొత్తములును
మరగి తిరిగెడు దివ్యవి♦మానములును
జలులఁ గ్రీడించు కిన్నరీ♦చయముగలిగి.

ఎంతయు నాశ్చర్యమును బుట్టించుచు నాపర్వత మెంతయో విఖ్యాతింగాంచెను. అందలి సాంద్రారణ్యములు చూడ భయంకరములుగా నుండును. సింహాదులే యందు జంకి తిరుగుచుండునన నింకఁదక్కుంగల ముక్కుడిమృగముల లెక్కింపనేల? దాని యుపత్యకయందు ఘోరారణ్య మొకటికలదు. దానిమహిమము వర్ణనాతీతము. దానియందుఁ గల ఘోరమృగముల లెక్కింప నొక్కఁడైన జగమున మొనగాఁడు లేఁడు. అందుఁ గొన్నివన్యగజంబులు స్వేచ్ఛమెయిఁ దిరుగుచుండును. మొత్తముగా సంచరించుట వాని వాడుక.

ఒకనాఁ డావన్యగజములగుంపు డప్పిగొని గాఱుమబ్బులం దిరస్కరించు దేహంబులతోఁ గొండలనైనఁ బిండిచేయు పౌరుషములతో బయలువెడలుచుండునపుడు,

సీ. పులులమొత్తంబులు ♦ పొదరిండ్లలోఁ దూఱు
ఘోరభల్లూకముల్ ♦ గుహలు సొచ్చు
భూదారములు నేల ♦ బొఱియలలోఁ డాఁగు
హరిదంతముల కేఁగు ♦ హరిణచయము
మడువులఁ జొరఁబాఱు ♦ మహిషసంఘంబులు
గండశైలంబులఁ ♦ గపులు ప్రాఁకు
వల్మీకములు సొచ్చు ♦ వనభుజంగంబులు
నీలకంఠంబులు ♦ నింగి కెగయు
తే. వెఱచి చమరీమృగంబులు ♦ విసరువాల
చామరంబుల విహరణ♦శ్రమము వాయ
భయదపరిహేల విహరించు ♦ భద్రకరుల
గాలి వాఱిన మాత్రాన ♦ జాలిఁ బొంది.

ఇట్లు సకలసత్త్వభయంకరంబులగు నాయేనుఁగు తండములలో నొక్కకరినాథుండు తన కరేణుకోటితో వెనుకఁ జిక్కెను. ఈశ్వరేచ్ఛ చేఁగదా ప్రపంచము నడుచుచుండును. అవ్వల నయ్యేనుఁగుల మిన్న యొక్కమార్గమునఁ బోవుచుఁ దనచేడియలు వెనుకొనిరాఁగా గహనమున విహరించి విహరించి మిక్కుటంబగు డప్పిచే బాధింపఁబడుచు మహోత్కంఠమునఁ బోయి పోయి

మ. అటఁ గాంచెం గరిణీవిభుండు నవ ఫు♦ల్లాంభోజకహ్లారమున్
నటదిందీవరవారమున్ గమఠమీ♦నగ్రాహదుర్వారమున్
వటహింతాలరసాలసాలసుమనో ♦ వల్లీకుటీతీరమున్
జటులోద్ధూతమరాళచక్రబకసం♦చారంబుఁ గాసారమున్.

ఆపంకజాకరంబుం బొడఁగాంచి సంతసే వాని యానందమునకుఁ బారములేక పోయెను. తాను ముందును దనచేడియలు వెనుకనుగా నందు డిగి యిష్టానుసారము జలములం దావి కమలములఁ దొండములలాగి వైచుచు వానిచే నొకదాని వేఱొకటిగాఁ బ్రహరించుకొనుచు వచింప నలవుపడని వినోదములఁ గాలముఁ గడుపుచుండెను. అట్టితఱి నాసరోవరంబు తన తొంటియందమును గోలుపోయెను. చిన్నదనంబునఁ జెలువము పోవ వెలవెలఁబాఱు చేడియవలెఁ గనఁబడసాగెను. అప్పుడు

సీ. భుగభుగాయతభూరి ♦ బుద్బుదచ్ఛటలతోఁ
గదలుచు దివికి భం ♦ గంబు లెగయ
భువనభయంకర ♦ ఫూత్కారరవమున
ఘోరనక్రగ్రాహ ♦ కోటి బెగడ
వాలవిక్షేప దు ♦ ర్వారజంఝానిల
వశమున ఘుమఘుమా ♦ వర్తమడరఁ
గల్లోలజాలసం ♦ ఘట్టనంబులఁ దటీ
తరులమూలంబులై ♦ ధరణిఁగూల

తే. సరసిలోనుండి పొడఁగని ♦ సంభ్రమించి
యుదరి కుప్పించి లంఘించి ♦ హుంకరించి
భానుఁ గబళించి పట్టుస్వ ♦ ర్భానుపగిది
నొక్క మకరేంద్రుఁ డిభరాజు ♦ నొడిసి పట్టె.

ఆమకర మిట్లు ముందటికాళ్లను బట్టుకొనఁగా హస్తివరుం డుద్దామపౌరుషంబునఁ దొండమున దానిం బైకెత్తి దంత

ములఁ బొడిచి విసరివైచెను. జలగ్రహ మయ్యది యించుకం
తయు వెనుదీయక కరివాలము మూలమును గోరులఁ జీరెను.
మరల నేనుఁగులఱేఁ డద్దానిం దుండమునఁ గొట్టెను. అదియుఁ
బదయుగళమును బీడించెను. ఇట్లు రెండును రేయింబవళ్లును
భేదంబులేక ఘోరంబుగాఁ బోరసాగెను. అత్తఱి

ఆ. మకరితోడఁ బోరు ♦ మాతంగపతిని నొ
క్కరుని డించి పోవఁ ♦ గాళ్లు రాక
కోరి చూచుచుండెఁ ♦ గుంజరీయూథంబు
మగలు దగులు గాదె ♦ మగువలకును.

కొంతకాల మిట్లు పోరాటము సాగఁగా

ఆ. జీవనంబు తనకు ♦ జీవనంబై యుంట
నలవుఁ జలము నంతె ♦ కంత కెక్కె
మకరమొప్పె; డస్సె ♦ మత్తేభమల్లంబు
బహుళపక్షశీత ♦ భాను పగిది.

అంతకంతకు బలంబు సన్నగిల్లుచున్నను మత్తేభంబు లేని బలం
బుఁ దెచ్చుకొని యోపినంత పోరాడుచుండెను. కాని స్థానము
బలము గల మకర మంతకంతకు విజృంభించి

శా. పాదద్వంద్వము నేలమోపి పవనున్ ♦ బంధించి పంచేంద్రియో
న్మాదంబుం బరిమార్చి బుద్ధిలతకున్ ♦ మారాకు హత్తించి ని
ష్ఖేదబ్రహ్మపదావలంబనగతిన్ ♦ గ్రీడించు యోగీంద్రు మ
ర్యాదన్ నక్రము విక్రమించెఁ గరి పా ♦ దాక్రాంతి నిర్వక్రమై.

దుర్దాంతవిక్రమంబునం దన్నుం బట్టి యిట్టట్టు కదలనీక బలము
నఁ దన్ను మించుచుండఁగా నేమియుం జేయందోఁపక

ఉ. ఊహాకలంగి జీవనపు♦టోలమునం బడి పోరుచుఁ మహా
మోహలతానిబద్ధపద♦ముఁ విడిపించు కొనంగ లేక సం
దేహముఁ బొందు దేహిక్రియ ♦ దీనదశం గజముండె భీషణ
గ్రాహదురంతదంతపరి♦ఘట్టితపాదఖురాగ్రశల్యమై.

ఇట్లు,

క. అలయక సొలయక వేసట
నొలయక కరిమకరితోడ ♦ నుద్దండత రా
త్రులు సంధ్యలు దివసంబులు
సలిపెం బో రొక్క వేయి ♦ సంవత్సరముల్.

మ. పృథుశక్తిం గజ మాజలగ్రహముతోఁ ♦ బెక్కేండ్లు పోరాడి సం
శిథిలంబై తసలావు వైరిబలముం ♦ జింతించి మిథ్యామనో
రథ మింకేటికి దీని గెల్వ సరి పో♦రంజాల రాదంచు స
వ్యథమై యిట్లను బూర్వపుణ్యఫలది♦వ్యజ్ఞానసంపత్తితోన్.

శా. ఏరూపంబున దీనిగెల్తు నిట మీఁ♦దే వేల్పుఁ జింతింతు నె
వ్వారిం జీరుద నెవ్వ రడ్డ మిఁక ని♦వ్వారిప్రచారోత్తముం
వారింపం దగువార లెవ్వ రఖిల ♦ వ్యాపారపారాయణుల్
లేరే మ్రొక్కెద దిక్కుమాలిన మొరా ♦ లింపం బ్రపుణ్యాత్మకుల్.

అక్కటా! అనేకగజవర్యములు నన్ను సేవించుచుండఁ బదిలక్షలకరిణీవతంసములకు నాథుండనై యుండితి. అట్టి నేనీ సరోవరమున కేల వచ్చితిని. ఈభయం బేమి చేయునో కదా పరమేశ్వరా! ఇంక నే దేవునిఁ బ్రార్థింతును? ఏపుణ్యాత్ములను వేడుదు? శరణాగతరక్షకులారా రండు. కాపాడుఁ డని యెవ్వరిం దలవంచి మ్రొక్కుదు. ఐనను సకలబ్రహ్మాండనాయకుండై

సర్వాంతర్యామియై సర్వకర్తయై భక్తరక్షణబిరుదమునఁ దేజరిల్లుచుఁ గరుణాపారావారుఁ డన, ఆపదుద్ధారకుఁ డన, దీనజనకల్పభూరుహ మనఁ బొగడఁబడుచుఁ దన మహిమ మెవ్వరికేఁ దెలియ శక్యముగాక విరాజిల్లు నీశ్వరునిం బ్రార్థించెద. ఆపరాత్పరుండు తక్క నింకొరు లెవ్వరు కాపాడఁజాలరు. ఇట్లు కొంతవడిఁ బ్రార్థించి సంశయముతో

క. కలఁ డందురు దీనులయెడఁ
గలఁ డందురు పరమయోగి ♦ గణముల పాలం
గలఁ డందు రన్ని దిశలను
గలఁడు కలం డనెడు వాఁడు ♦ కలఁడో లేఁడో.

అని యిట్లెంత యూహించిన నెంత ప్రార్థించినను గజరాజునకు దిక్కు కానరా దయ్యెను అంతట మనంబున వేఱొక్క మార్గంబు చింతించి యీశ్వరసన్నిధానంబుం గల్పించుకొని భక్తి భరంబుతో నేకాగ్రమానసంబున మహానుభావా!

శా. లా వొక్కింతయు లేదు ధైర్యము విలో♦లం బయ్యెఁ బ్రాణంబులున్
ఠావుల్ తప్పెను మూర్ఛవచ్చెఁ దనువున్ ♦ డస్సెన్ శ్రమం బయ్యెడిన్
నీవే తప్ప నితఃపరం బెఱుఁగ మ♦న్నింపం దగున్ దీనునిన్
రావే యీశ్వర కావవే వరద సం♦రక్షింపు భద్రాత్మకా.

క. విను దఁట జీవులమాటలు
చను దఁట చనరానిచోట్ల ♦ శరణార్థుల కో
యను దఁట పిలిచిన సర్వముఁ
గను దఁట సందేహ మయ్యెఁ ♦ గరుణావార్థీ.

అనియిట్లు తన్ను రక్షింపుమని కుయ్యిడు గజరాజును రక్షింప భగవంతుఁ డాలోచింపసాగెను. ఈగజరాజు భగవత్సన్నిధానంబుఁ గల్పించుకొని కుయ్యిడుచుండఁగా

మ. అల వైకుంఠపురంబులో నగరిలో ♦ నామూలసౌధంబు
పల మందారవనాంతరామృతసరః♦ప్రాంతేందుకాంతోపలో
త్పలపర్యంక రమావినోది యగు నా♦పన్నప్రసన్నుండు వి
హ్వలనాగేంద్రము పాహి పాహి యనఁ గు♦య్యాలించి సంరంభియై.

భక్తరక్షణమే ప్రధానకార్యముగా భావించిన యాపరాత్పరుఁడు శ్రీమన్నారాయణుండు మహాసంరంభంబున

మ. సిరికిం జెప్పఁడు శంఖచక్రయుగముం ♦ జేదోయి సంధింపఁ డే
పరివారంబును జీరఁ డభ్రగపతిం ♦ బన్నింపఁ డాకర్ణకాం
తరధమ్మిల్లము చక్క నొత్తఁడు వివా♦దప్రోత్థితశ్రీకుచో
పరిచేలాంచలమైన వీడఁడు గజ♦ప్రాణావనోత్సాహియై.

పురంబు నిర్గమించి నిజపరికరంబు నెరల నవధరించి యంబరంబునకు నుద్గమించి వేంచేయుచుండఁగా

మ. తనవెంటన్ సిరి, లచ్చివెంట నవరో♦ధవ్రాతమున్ దానివె
న్కను బక్షీంద్రుఁడు వానిపొంతను ధనుః♦కౌమోదకీశంఖచ
క్రనికాయంబును నారదుండు ధ్వజినీ♦కాంతుండు రా వచ్చి రొ
య్యన వైకుంఠపురంబునం గలుగు వా♦రాబాలగోపాలమున్.

ఇట్లు శ్రీమన్నారాయణుండు భక్తరక్షణపరాయణుండై

మ. విను వీధిం జనుదేరఁగాంచి రమరుల్ ♦ విష్ణున్ సురారాతిజీ
వనసంపత్తినిరాకరిష్ణుఁ గరుణా♦వర్ధిష్ణు యోగీంద్రహృ

ద్వనవర్తిష్ణు సహిష్ణు భక్తజనబృం♦దప్రాభవాలంకరి
ష్ణు నవోఢోల్లసదిందిరాపరిచరి♦ష్ణున్ జిష్ణు రోచిష్ణునిన్.

ఈరీతిం బొడఁగాంచి

మ. చనుదెంచెన్ ఘనుఁ డల్లవాఁడె హరిప♦జ్జం గంటిరే లక్ష్మి శం
ఖనినాదం బగు చక్ర మల్లదె భుజం♦గధ్వంసియున్ వాఁడె క్ర
న్నన యేతెంచె నటంచు వేల్పులు 'నమో♦నారాయణాయే'తి ని
స్వనులై మ్రొక్కిరి మింట హస్తిదురవ♦స్థావక్రికిం జక్రికిన్.

శ్రీహరి వారి నమస్కారంబుల నంగీకరింపక పోయిపోయి యప్పంకజాకరంబుం బొడఁగని క్షణమాలసించిన గజేంద్రుఁ డేమగునో యను నాతురంబున

మ. కరుణాసింధుఁడు శౌరి వారిచరమున్ ♦ ఖండింపఁగాఁ బంపె స
త్వరితాకంపితభూమిచక్రము మహో♦ద్యద్విస్ఫులింగచ్ఛటా
పరిభూతాంబరశుక్రమున్ బహువిధ♦బ్రహ్మాండభాండచ్ఛటాం
తరనిర్వక్రముఁ బాలితాఖిలసుధాం♦ధశ్చక్రమున్ జక్రమున్.

హరికరకమలనిర్ముక్తంబగు నాచక్రం బాక్షణంబ చని

శా. భీమంబై తలఁద్రుంచి ప్రాణములఁ బా♦పెం జక్ర మాశుక్రియన్
హేమక్ష్మాధరదేహమున్ జకితవ♦న్యేభేంద్రసందోహమున్
గామక్రోధనగేహమున్ గరటిర♦క్తస్రావగాహంబు ని
స్సీమోత్సాహము వీతదాహము జయ♦శ్రీమోహమున్ గ్రాహమున్.

ఇట్లు సుదర్శన మాగజరాజుపాలిటికి సుదర్శనమై మకరమును జంపఁగానే

క. మకర మొకటి రవిఁ జొచ్చెను
మకరము మఱి యొకటి ధనదు ♦ మాటున డాఁగెన్

మకరాలయమునఁ దిరిగెడు
మకరంబులు కూర్మరాజు ♦ మఱువున కరిగెన్.

ఇంతలో గజరాజు మబ్బుచాటునుండి విడివడిన శీతాంశు క్రియ మకరబాధానిర్ముక్తిం గాంచి వెలుంగఁగా

శా. పూరించెన్ హరి పాంచజన్యముఁ గృపాం♦భోరాశి సౌజన్యమున్
భూరిధ్వానచలాచలీకృత మహా♦భూతప్రచైతన్యమున్
సారోదారశిత ప్రభాచకితప♦ర్జన్యాదిరాజన్యమున్
దూరీభూతవిపన్నదైన్యమును ని♦ర్ధూతద్విషత్సైన్యమున్.

ఇట్లు తనయుత్సాహమును గనఁబఱచి శ్రీహరి పరమాదరంబునఁ జెంతకుం జని

క. నిడుదయగు కేల గజమును
మడువున వెడలంగఁ దిగిచి ♦ మదజలరేఖల్
దుడుచుచు మెల్లన పుడుకుచు
నుడిపెన్ విష్ణుండు దుఃఖ ♦ ముర్వీనాథా!

దేహతాపము పాయఁగనే గజరాజు యథాపూర్వముగా నొప్పెను. అంత మకరము దేవలశాపముక్తింగాంచి క్రూరతర గ్రాహరూపమును మాని తనపూర్వరూపమును దాల్చెను. ఆతఁడు హూహూనామగంధర్వుఁడు. పరమభక్తుఁడు గాన శాపముక్తిం బ్రసాదించిన భగవంతునకు నమస్కరించి తదనుమతి నొంది తనలోకమునకుం బోయెను.

ఆర్యబాలురారా! గజరాజు కథ వినుఁడు. ఈతఁడు తొలిజన్మమున ద్రవిళాధీశుఁడగు నింద్రద్యుమ్నరాజు. పరమ

భక్తుఁడు. మునివృత్తినవలంబించి శైలాగ్రభాగమునఁ దపము చేసెను. తనయాత్మ శ్రీహరినునిచి ధ్యానించుచుండఁగా నగస్త్యుండచ్చోటికేతెంచి తనను గాంచి ప్రత్యుత్థానాదిసత్కారంబు లాచరింపక యున్న రాజుంగాంచి కోపించి మూర్ఖుఁడా! గజయోనిఁబుట్టుఁగాంచు మని శపించెను.

క. మునిపతి నవమానించిన
ఘనుఁ డింద్రద్యుమ్నవిభుఁడు ♦ కాంజరయోనిం
జననం బందెను విప్రులఁ
గని యవమానింపఁ దగదు ♦ ఘన పుణ్యులకున్.

అట్లు కావున నాశాపంబున నింద్రద్యుమ్ననృపతి గజరాజై జన్మించెను. ఆతనిభటులెల్లఁ గరులైరి. రాజు గజరాజైనను శ్రీహరి భక్తివదలక ధ్యానించెను. కాఁబట్టి

ఆ. కర్మతంత్రుఁ డగుచుఁ ♦ గమలాక్షుఁ గొల్చుచు
నుభయ నియతవృత్తి ♦ నుండెనేని
చెడును గర్మ మెల్ల ♦ శిథిలమై మెల్లన
ప్రబలమైన విష్ణు ♦ భక్తి చెడదు.

అంతట శ్రీహరియుఁ దనపరివారంబుతో వైకుంఠమునకుం జనియె. ఈగాథ సకలాపన్నివారకం బగు. అని శుకయోగి యెఱింగించి మఱియు నిట్లు తెలిపెను. రాజా! వినుము. తామసునితమ్ముఁడు రైవతుఁడు. ఆతఁడు మను వయ్యెను. ఆ తరుణమునఁ బ్రతివింధ్యార్జునప్రభృతులు భూపాలకులు. వీరు మనువు నందనులు. హిరణ్యరోముఁడు, ఊర్ధ్వబాహుఁడు, వేద

శీర్షుఁడు లోనగువారు మునులు. భూతరయాదులు దేవతలు. శుభ్రుఁ డనువానిపత్ని వికుంఠాంబ పరమసాధ్వియై యుండ నా దంపతులకు భగవంతుఁడు పుత్త్రుఁడై జన్మించెను. అప్పటిభగ వంతునిపేరు వైకుంఠుం డని, వైకుంఠలోకమును గల్పించి యం దు నివసించెను.

ఆపల చక్షుఃపుత్త్రుఁడగు చాక్షుషుం డనువాఁడు షష్ఠ మమనువయ్యెను. పురుఃపురుషసుద్యుమ్నాదులగు నాతనిపుత్త్రులు భూమీశ్వరు లైరి. మంత్రద్యుమ్నుఁ డింద్రుఁడుగా నుండెను. ఆ ప్యాదికు లమరు లైరి. హవిష్మద్వీరకాదిఘనులు మునులు. వై రాజుఁ డనువానికి సంభూతివలనఁ బుట్టి యజితుఁడను పేరఁ బరఁగి భగవంతుఁడు ధర్మము గాపాడుచుండెను. ఆభగవం తుఁడే కదా కూర్మమై మందరాద్రిని సముద్రజలముల ము నుఁగకుండ మోచి యమరుల కమృతమును బ్రసాదించెను.

క్షీరసాగరమంథనము.

అని పలుక మునీంద్రునకు రాజేంద్రుఁ డిట్లు పలికెను. మ హాత్మా! భగవంతుఁడు సముద్రమునఁ గూర్మావతారమునఁ బ ర్వతము నేల మోచెను? ఆకథ సవిస్తరముగా వచింపు మన యోగీశ్వరుఁడానందమున నిట్లు బదులుచెప్పెను. రాజా! వినుము. దేవతల యాటోపంబును సహింపక దానవులు తపఃప్రభావంబు న గర్వించి శుక్రునాదేశంబున నింద్రాదులఁ బరాభవించిరి.

ఇంద్రాదులు వారధాటికోర్వఁజాలక పోయిరి. వారెల్లం గూడి బ్రహ్మదేవునిపాలి కరిగి తమదుఃఖములఁ జెప్పుకొనిరి. విరించియు వారిదీనాలాపంబుల నాలించి ధైర్యము చెప్పి శ్రీమన్నారాయణు నేకాగ్రమానసంబున వారిఁగూడి ప్రార్థించెను. శ్రీహరి వారియెదుటఁ దోఁచెను. అత్తఱి

సీ. హారకిరీటకే♦యూరకుండలపాద
కటక కాంచీలతా♦కంకణాది
కౌస్తుభోపేతంబుఁ ♦ గౌమోదకీశంఖ
చక్రశరాసన ♦ సంయుతంబు
మరకతశ్యామంబు ♦ సరసిజనేత్రంబుఁ
గర్ణాభరణకాంతి ♦ గండయుగముఁ
గలితకాంచనవర్ణ ♦ కౌశేయ వస్త్రంబు
శ్రీవనమాలికా ♦ సేవితంబు
ఆ. నై మనోహరంబు ♦ నై దివ్యసౌభాగ్య
మైన యతనిరూపు ♦ హర్షమొసఁగఁ
జూచి బ్రహ్మహరుఁడు ♦ సురలును దానును
బొంగి నమ్రుఁ డగుచుఁ ♦ బొగడఁ దొడఁగి.

పెక్కువేదమంత్రంబుల వినుతించి దేవతల కష్టముల విన్నవించెను. ఆమాటల వినియాదిదేవుఁడు గంభీరభాషణంబు లొప్పారుచుండఁగా

క. ఓనలువ యోహరేశ్వర
యోనిటలతటాక్ష యోసు♦రోత్తములారా

దానవులతోడ నిప్పుడు
మానుగఁ బోరామి కలిగి ♦ మనుటేమొప్పన్.

ఏలయంటిరేని వినుఁడు. దానవులు తపోబలగర్వితులు. మీరసమర్థులరు. కావున నిపుడు సంగరముచేయుట పాడిగాదు. కావున నమృతోత్పాదన యత్నముచేయుఁడు. దానమీకొంతలు తీఱు. హృష్టపుష్టాంగుల రగు మిమ్ము వారు గెల్వఁజాలరు. ఈయుపాయము తప్ప వేఱొండు లేదు. వినుఁడావిధాన మెఱింగింతును.

సీ. పాల మున్నీటిలో♦పల సర్వతృణలతౌ
షధములు వైచి ♦ చాల వైచి
మందరశైలంబు ♦ మంథానముగఁ జేసి
తనర వాసుకిఁ దరి ♦ త్రాడుచేసి
నాసహాయతచేత ♦ నలి నందఱును మీరు
తరువుఁడు వేగమ ♦ తంద్రు లగుచు
ఫలము మీఁ దయ్యెడు ♦ బహుళదుఃఖంబులఁ
బడుదురు దైత్యులు ♦ పాపమతులు

ఆ. అలస టేమిలేక ♦ యఖిలార్థములు గల్గు
విషధిలోన నొక్క ♦ విషము పుట్టుఁ
గలఁగి వెఱవవలదు ♦ కామరోషంబులు
వస్తుచయమునందు ♦ వలదు చేయ.

అని యాజ్ఞాపించి యంతర్ధానంబు నొందెను.

అమరు లంత నయ్యానతునాజ శిరసావహించి దాన వులతోఁ గయ్యంబుసేయుట మాని నమస్కరించి ప్రార్థింపవై రోచనియగు బలి దానవుల నుడిపి దేవతల కభయదాన మొసంగెను. దేవతలు కొలఁది దినముల కమృతాహరణ ప్రయత్నము దెలుప నసురు లంగీకరించిరి. సకల లతలను దృణముల నోషధులఁ దెచ్చి క్షీరసాగరమున వైచిరి. మందరపర్వతమును గవ్వముగా నమర్చిరి. వాసుకిని త్రాడుగా నేర్పఱచిరి. ఇట్లు ప్రయత్నంబు చక్కఁగాఁ జేసి యుప్పర్వతంబున దేవదానవులు పట్టి పైకెత్తి తెచ్చుచుండఁగా నాభారంబునకు సైపనోపక పట్టుదలఁగ నది వారిపైఁబడియె. దానఁ గొందఱు మృతినొందిరి. కొందఱు వికలాంగు లైరి. దేవత లప్పుడు బుద్ధిమాని శ్రీహరికడ కేలపోయితి మని చింతించిరి. అంతలో

మ. గరుడారోహణుఁడై గదాదిధరుఁడై ♦ కారుణ్యసంయుక్తుఁడై
హరి కోటిప్రభతో నొహో వెలువడం ♦ డంచుం బ్రదీపించి త
ద్గిరిఁ గేలన్ నలువొందఁగందుకము మా♦డ్కిం బట్టి క్రీడించుచున్
గరుణాలోకసుధన్ సురాసురుల ప్రా♦ణంబుల్ సమర్థించుచున్.

పర్వతరాజమా! సముద్రమునకుం బొమ్మా. ఇది దేవతా కార్యము. లోకములకు మహోపకారము దీనఁ గలుగు. అని యాజ్ఞాపించెను.

పాఠకులారా! కొండను సముద్రమునకుం బొమ్మా యని హరి పలుక నది నడచునా యని శంకింపవలదు. మను

ష్యాజ్ఞవంటిది భగవదాజ్ఞ కాదుకదా. అని యప్రతిహత మనఁ
జను. కావున మనయూహాదులు భగవచ్ఛక్తివిషయమై యు
పయోగింపవు. నాస్తికవాదములం జెవి యొగ్గకుఁడు. ఆవలిచరి
త్రమును వినుఁడు. భగవదాజ్ఞ కాఁగా నాపర్వతము పాలసముద్ర
మునఁ బడియెను. దేవదానవులు వాసుకిని ద్రాడుగా నమ
ర్చిరి. పూన్కి మై దానింబట్టి చిలుకఁ దొడంగిరి. అందుఁ దొ
లుత దేవతలు వాసుకి ఫణముం బట్టుకొనిరి. దానవులు తోఁక
ను బట్టుకొనిరి. శ్రీహరి యాలోచించి దానవుల మాయా
మోహితులను గావించెను. దాన వార లుగ్రమతులై దేవ
తలంగాంచి సురలారా ! మీరు మహత్తరపౌరుషవంతులవలె
వాసుకి ఫణాగ్రమును బట్టుకొనియుండఁగా మేము పిఱికిపం
దలవలెఁ దోఁకఁబట్టుకొనియుందుమా. మేము పరాక్రమ
విహీనులము కాము. కావున మీరు తోఁకఁబట్టుకొనుఁడు.
మేమే ఫణాగ్రభాగమును బట్టుకొందుము. అని పలికిరి. పాప
మా దానవు లిపుడు తమకు రానున్న కీడు నెఱుంగరు. వారిమ
నస్సులు విష్ణుమాయ స్వాధీనమున నున్నవి. ఆమాయ లీ
దానవులఁ దోలుబొమ్మలవలె నాడింపఁబూనెను. ఇఁక నె
ట్లాడవలెనో యట్లాడుదురు.

ఆరీతి దానవులు పలుక దేవత లాఫణమును వదలిరి.
ఆశరులార్చుచు దానిం గైకొనిరి. ఇట్లు తఱచుచుండఁగా దాని
బాధ నోర్వఁజాలకి వాసుకి విడువుఁ డని పలుకుచుండఁగనే

మంథరపర్వత మాసముద్రమున మునిఁగెను. దేవదానవులు చేతులు పిసికికొన మొదలిడిరి. వెంటనే శ్రీమన్నారాయణ మూర్తి మహత్తరకమఠాకృతిం దాల్చెను. దాని యాకార మత్యద్భుతము. అది వీఁపున నిట్టి పర్వతముల నెన్నింటినేఁ దాల్పఁగలఁడు. అప్పుడు **మధుసూదనుండు**

మ. కమఠంబై జలరాశిఁజొచ్చి లఘుస♦త్త్వాశక్తిచందంబునన్
సమదద్రీంద్రము నెత్తె వాసుకి మహా♦నాగంబుతో లీలతో
నమరేంద్రాదులు మౌళికంపములతో ♦ నౌ నౌఁ గదే బాపురే
కమలాక్షా శరణంచు భూదిశలు నా♦కాశంబునన్ మ్రోయఁగన్.

ఆయద్భుతమహత్తరకార్యమును జూచి దివినున్న ఖచరులు తమలోఁదారు

క. తరిగం బ్రాలైన నొకఁడంట
తరిగడవకుఁ గుదురు నొకఁడ ♦ త్రాఁడంట చేరుల్
తరిగవ్వంబును దానంట
హరిహరి! హరి చిత్రలీల ♦ హరిచే యెఱుఁగన్.

అని చెప్పుకొనిరి. పాఠకులారా!

ఆ. జలధిఁ గడవచేయ ♦ శైలంబుఁ గవ్వంబు
చేయ భోగిఁ ద్రాడు ♦ చేయ వరుస
సిరియు సుధయుఁ బడయ ♦ శ్రీవల్లభుఁడు తక్క
నొరుఁడు శక్తిమంతుఁ ♦ డొకఁడు గలఁడె.

వింటిరిక దా!

ఆ. గొల్లవారిబ్రదుకు ♦ గొలుఁతన వచ్చునే
గొల్లరీతిఁ బాల ♦ కుప్పఁ ద్రచ్చి
గొల్లలైరి సురలు ♦ గొల్లయ్యె విష్ణుండు
చేటులేనిమందు ♦ సిరియుఁ గనిరి.

ఇదియే భగవన్మహిమము.

ఆవల దేవాసురులు పట్టుదలలుపూని తఱువఁజొచ్చిరి. ఆ ధ్వని బ్రహ్మాండకటాహమును బ్రద్దలుచేయఁజాలెను. అట్టితఱిని పాలసంద్రమునుండి హాలాహలమను విషముగయించెను. దాని ప్రతాపము వర్ణింప నేరితరము? అది ప్రళయకాలాగ్నిం దిరస్కరించి లోకముల నొక్కొత్తుగా దహించుప బయలుదేరెను. ఆతరుణమున

క. ఒడ్డారించి విషంబున
కడ్డము చనుదెంచి కావ ♦ నధిపులు లేమిన్
గొడ్డేటి మ్రందిరాలన
బిడ్డన నెడలేక జనులు ♦ పృథ్వీనాథా.

అంత దాని యాటోపముం గాంచి యిట్టి మహాపత్సమయంబున రక్షకుఁ డీశ్వరుఁడు కాని వేఱొండు దిక్కు లేదని నిశ్చయించి

మ. చని కైలాసముఁ జొచ్చి శంకరుని వా♦సద్వారముం జేరి యీ
శుని దౌవారికు లడ్డపడ్డఁ దలమం♦చుం జొచ్చి కుయ్యో మొఱో
వినుమాలింపుము చిత్తగింపుము దయన్ ♦ వీక్షింపు మంచంబుజా
సనముఖ్యుల్ గని రార్తరక్షణకళా♦సంరంభునిన్ శంభునిన్.

వారిరాక మున్నే యెఱింగియున్నవాఁడు కావున నీశ్వరుఁడు వారి కవసరమిచ్చెను. దేవతలు సాష్టాంగముగా దండప్రణామంబుల లాచరించి చేతులు మోడ్చి నిలువంబడి

క. కొందఱు కలఁ డందురు నినుఁ
గొందఱు లేఁ డందు రతఁడు ♦ గుణికాఁ డనుచుం
గొందఱు కలఁ డని లేఁ డని
కొందల మందుదురు నిన్నుఁ ♦ గూర్చి మహేశా.

ఆ. మూఁడు మూర్తులకును ♦ మూఁడులోకములకు
మూఁడు కాలములకు ♦ మూల మగుచు
భేద మగుచుఁ దుది న♦భేదమై యొప్పారు
బ్రహ్మ మనఁగ నీవ ♦ ఫాలనయన.

అని వేనవేలు విధంబుల వినుతించి హాలాహల బాధ నెఱింగించిరి.

పరశివుం డామాటలు లాలకించి కరుణారసపరిపూర్ణహృదయుండు కావునఁ దన యర్ధాంగలక్ష్మి యగు గిరిజాదేవిం గాంచి స్మితపూర్వకముగా

క. ప్రాణేచ్ఛ వచ్చి చొచ్చిన
ప్రాణుల రక్షింపవలయుఁ ♦ బ్రభువుల కెల్లన్
బ్రాణుల కిత్తురు సాధులు
ప్రాణంబుల నిమిషభంగు♦రము లని మగువా.

క. పరహితము చేయ నెవ్వఁడు
పరమహితుం డగును భూత♦పంచక ముకుఁకుం

బరహితమె పరమధర్మము
పరహితునకు నెదురు లేదు ♦ పర్వేందుముఖీ.

క. హరి మది నానందించిన
హరిణాక్షి జగంబులెల్ల ♦ నానందించున్
హరియును జగములు మెచ్చఁగ
గరళము వారించుటొప్పుఁ ♦ గమలదళాక్షీ.

అని ప్రాణేశ్వరుఁ డాదరంబునఁ బలుక నాసర్వమంగళాంబ సవ్వాచుఁ దన సమ్మతిం దెల్పెను.

పాఠకులారా!

క. మ్రింగెడు వాఁడు విభుం డని
మ్రింగెడు నది గరళ మనియు ♦ మే లని ప్రజకున్
మ్రింగు మనె సర్వమంగళ
మంగళసూత్రంబు నెంత ♦ మది నమ్మినదో.

ఇట్లు పార్వతి తనసమ్మతిం దెలుపఁగనే భగవంతుఁ డాక్షణంబ లేచి దేవతాధిపులు పరమసేవకులై వెంటరాఁగాఁ బోయి పోయి యవార్యవీర్యంబునఁ నెదురులేక విజృంభించు నాహాలాహాలంబును ఫలమువలెఁ బట్టి మ్రింగెను. ఆవిషజ్వాలలా మహాదేవునకు నించుకంతయు బాధకల్గించినవి కావు. ఆవిషమును గుక్షినిడిన లోకములు నశించు నని యెంచి కంఠమున నుంచెను. దానఁ గంఠము నల్లనయ్యెను. కావుననే గరళకంఠుఁ డను పేరీశ్వరునకు వచ్చెను.

అవ్వల దేవాసురు లాపాలకడలిం దరువసాగిరి. అందుఁ గామధేనువు పుట్టెను. మునులు పుచ్చుకొనిరి. ఉచ్చైశ్శ్రవమును హయము ముద్భవించెను. బలి దానవుఁడు గ్రహించెను. ఐరావతము జనించెను. ఇంద్రుఁ డంగీకరించెను. కల్పవృక్షము పుట్టెను. దేవతలాదరించిరి. అప్సరోబృందము వెడలివచ్చెను. స్వర్గవాసు లాదృతిం దోడ్కొనిపోవ నుంకించిరి. చంద్రుఁ డుదయించెను. బ్రహ్మ యంబరమున యథాపూర్వముగ నెలకొన నియమించెను. మహాలక్ష్మి ప్రభవిల్లెను. ముకుందునకుఁ దగు నని యెల్లరనిరి. వారుణిదేవి యగపడియె. అసురు లాను గారవించిరి. అంతఁ దరువం దరున నమృతకలశముచేఁ గొని ఆయుర్వేది వెడలివచ్చెను. రాక్షసు లాటోపంబున నాకలశమున కీసికొనిరి. దేవతలు గుటకలు మ్రింగుచుండిరి. శ్రీహరీ! ఇంక మాగతి యేమని మొఱపెట్టుకొనిరి. దానవు లందు నొకనిచేతినుండి వేఱొకనిచేతి కాకలశము మాఱుచుండెను.

శ్రీహరి మోహినీరూపమును దాల్చుట

అంతట శ్రీహరి యిఁకఁ దడవుచేయరా దని యూహించి జగన్మోహనమగు నాకార మొప్పారు మోహిని యయ్యెను. ఆమెరూపమును వర్ణింప నశక్యము. ఆరూపమును జూడఁగానే యొడలెఱుంగక యాయమృతకలశము నొసంగి దీనిని మాకును దేవతలకుఁ బంచి యిమ్ము. పంక్తిగాఁ గూరుచుండుదుము. అని పలుక నా మోహినియుఁ జిఱునవ్వున

క. సుందరు లగు పురుషులఁ గని
పొందెదరు నాయందు నిజము ♦ పుట్టునె మీకున్
బృందారకరిపులారా
చెందరు కామినుల విశ్వ♦సింపరు పెద్దల్.

ఐనను నా నేర్చువిధంబునఁ బంచి యిచ్చెద. ఓపిక మెయిఁ గూరుచుండఁగలరే అని పలికెను. ఆర్యబాలకులారా!

క. ఆశాంతాలోకనములు
నాశీతలభాషణములు ♦ నాలాలితనుల్
రాశిపరంపర లగుచున్
బాశములై వారి నోళ్లు ♦ బంధించె (జూఁడీ).

వారూరకుండుటం గాంచి యాసుందరి మందమందగమనంబున దేవతల నొకపంక్తిగ నసురుల నొకపంక్తిగఁ గూరుచుండఁ జేసి యిదిగో వచ్చెద. ఆతురపడకుఁడీ దానవులారా! యని యాశ్వాసించుచు దేవతల కమృతమును బోయుచుండఁగా రాహువు కామరూపంబున దివిజుల నడుమంగూరుచుండి త్రాగుచుంటఁ గాంచి రవిశశాంకులు తెలుప శ్రీహరి చక్రము గంఠము ఛేదింప నజుఁడు వియద్భాగంబున గ్రహపంక్తి గుండ నాజ్ఞాపించెను. ఒక్కబొట్టు మిగలకుండ నమృతమును దివిజులకుం బోసి పాత్రము నక్కడఁ బాఱవైచి హరి యథాపూర్వరూపమున నలరారెను.

అవ్వల దేవదానవులకుఁ బోరు ఘోరంబుగా సాగెను. అమృతపానంబున దివిజులు రాక్షసుల గెల్చిరి. శ్రీహరి సాయ

మై యుండెను. రక్కసులోడి పాఱిరి. పాతాళంబు వారికి శరణమయ్యెను.

వామన చరిత్రము.

అని ఇట్లు శుకయోగి తెలుపఁగా రాజు పరమానంద మున యోగీంద్రా! బలిచక్రవర్తిని యాచించి భగవంతుఁ డింద్రునకు స్వర్గము నిచ్చె నని విందు. ఆచరిత్రమును విన వేడుక య్యెడు నన యోగి యిట్లనియె. రాజేంద్రా! పరమభక్తుఁడవు. కావున విష్ణుగాథల నాలకింపఁ గోరెదవు. విను మాచరితము నెఱింగించెద.

బలి పురుహూతునిచే నోడింపఁబడి శుక్రుని నాశ్రయిం చి తదుపదిష్టమార్గంబున విశ్వజిద్యాగ మొనరించెను. అగ్నినుండి దివ్యకాంచనరథము, సూర్యాశ్వములఁ దిరస్కరించు గుఱ్ఱము లు, కంఠీరవధ్వజము, మహత్తరదివ్యధనువు, తూణీరద్వయము, అభేద్యవజ్రకవచము వెడలివచ్చెను. వాని సాయమున నమ ర్త్యులతోఁ బోరాడి గెల్చెను. దేవేంద్రుఁ డోడిపాఱెను. స్వర్గము బలివశముననుండెను. దేవతలు పడరానియిడుములఁ బడుచుం డిరి. శచీదేవి దుఃఖాక్రాంతహృదయ యయ్యెను.

అదితి కశ్యపునిఁగాంచి తనకొడుకుల వగల నెఱింగిం చెను. ఆమునివరుఁ డూహించి పయోభక్షణంబను వ్రతము నామెకు నుపదేశించెను. దాని నాచరించెను. శ్రీనారాయణ

మూర్తి కనంబడినంతనే భక్తినమ్రకంధరయై చేతులు ముకుళించి వినుతించి మహాత్మా!

ఆ. అసురవరులు సురల ♦ నదలించి బెదరించి
నాక మేలుచున్న ♦ నాఁటనుండి
కన్నకడుపు గానఁ ♦ గింటఁ గూరుకురాదు
కడుపు పొక్కుమాన్పి ♦ కావ వయ్య.

అని ప్రార్థించెను. భగవంతుఁడామె వాంఛితంబు విని సాదరంబుగా అవ్వా!

మ. బలిమిన్ దైత్యులఁజంపరాదు వినయో♦పాయంబునం గాని సం
చలనంబొందరు నేను నీనియతికిన్ ♦ సద్భక్తికిన్ మెచ్చితిన్
బలివిద్వేషియు నానిలింపగణముం ♦ బౌలోమియున్ మెచ్చ దై
త్యులరాజ్యంబు హరింతు నింద్రునకు ని♦త్తున్ దుఃఖ మింకేటికిన్.

అని పలికి యదృశ్యుం డయ్యెను. అదితియుఁ గొంతకాలము గర్భముందాల్చి భగవంతునిఁ గుమారునిఁగాఁ గనెను. ఆకాలము పరమపవిత్రము. పాఠకులారా!

మ. రవి మధ్యాహ్నమునం జరింప గ్రహతా♦రాచంద్రభద్రస్థితిన్
శ్రవణద్వాదశినాఁడు శ్రోణనభిజి♦త్సంజ్ఞాతలగ్నంబునన్
భువనాధీశుఁడు పుట్టె వామనగతిం ♦ బుణ్యవ్రతోపేతకున్
దివిజాధీశ్వరు మాతకుం బరమపా♦తివ్రత్యవిఖ్యాతకున్.

ఇట్లు పుట్టిన యామహాత్మునకు వామన నామం బిడిరి. కొలఁదికాలమున కావిభున కుపనయనము చేసిరి. స్వర్గమున నున్న బలియొద్ద కెల్ల యాచకులు పోవుచుండ వారితోడ

వామనుఁడు పోయెను. ఆతరుణమున బలిచక్రవర్తి యజ్ఞమును జేయుచుండెను. భూసురులంగూడి మఖవాటికం జొచ్చెను. ఆ మహనీయరూపముంగాంచి యచ్చటివా రచ్చెరువొందిరి. అంత వామనమూర్తి మెల్లమెల్లన దానవచక్రవర్తింజేరి సులలితవాగ్భణితియలర

మ. ఇతఁడే దానవచక్రవర్తి సురలో♦కేంద్రాగ్ని కాలాది ది
క్పతిగర్వాపనయప్రవర్తిగతలో♦భస్ఫూర్తి నానామఖ
వ్రతదానప్రవణానువర్తిసుమనో♦రామామనోభేదనో
ద్ధతచంద్రాతపకీర్తి సత్యకరుణా ♦ ధర్మోల్లసన్మూర్తితాన్.

అని పలికి కుశపవిత్రాక్షతసంయుతంబగు దక్షిణహస్తంబు సాఁచి పరమాదరంబున దీవించెను. ఆవటువును జూచి యామహనీయు నందుఁ గనుపట్టు మహత్తరతేజస్సును గాంచి యుబ్బురపడి బలి పీఠమునుండి డిగ్గి నమస్కరించి పాదంబులు కడుగ బంగారుకలశంబుగొని భార్యజలములు పోయఁ దాఁ గడిగి తడియొత్తి యాజలము మస్తకమునఁ జల్లుకొనుచు మహాభక్తివినయములు తోఁపఁగా

మ. వడుగా యెవ్వరివాఁడ వెవ్వఁడవు సం♦వాసస్థలం బెయ్యది
య్యెడకున్ నీవరుదెంచుటన్ సఫల మ♦య్యెన్ వంశమున్ జన్మమున్
గడుధన్యాత్ముఁడనైతి నీమఖముయో♦గ్యం బయ్యె నాకోరికల్
గడ దేఱెన్ సుహుతంబులయ్యె శిఖులుం ♦ గల్యాణ మిక్కాలమున్.

అని యంతతో నిలువక పైఁబైఁబొంగు నుల్లాసంబున

మ. వరచేలంబులొ మాడలో ఫలములో ♦ వన్యంబులో గోవులో
హరులో రత్నములో రథంబులొ విమృ♦ష్టాన్నంబులో కన్యలో
కరులో కాంచనమో నికేతనములో ♦ గ్రామంబులో భూములో
ధరణీఖండమొ కాక యేమడిగెదో ♦ ధాత్రీసురేంద్రోత్తమా.

అని ప్రశ్నించెను. ఆమాటలు విని వామనమూర్తి తన సర్వజ్ఞత్వ సర్వనియంతృత్వములు బయలుపడునట్లుగా

సీ. ఇదినాకు నెలవని ♦ యేరీతిఁ బలుకుదు
నొకచోట నక యెందు ♦ నుండ నేర్తు
నెవ్వనివాఁడ నం ♦ చేమని పలుకుదు
నాయంత వాఁడనై ♦ నడువ నేర్తు
నీనడవడి యని ♦ యెట్లు వక్కాణింతుఁ
బూని ముప్పోకలఁ ♦ బోవ నేర్తు
నది నేర్తు నిది నేర్తు ♦ నని యేల చెప్పంగ
నేరుపు లన్నియు ♦ నేన నేర్తు

తే. నొరులుగారు నాకు ♦ నొరులకు నేనౌదు
నొంటివాఁడఁ జుట్ట ♦ మొకఁడు లేఁడు
సిరియుఁ దొల్లి గలదు ♦ చెప్పెద నాయింకి
సుజనులందుఁ దఱచుఁ ♦ జొచ్చి యుందు.

బలిచక్రవర్తీ! మీవంశము సద్వంశము. ప్రహ్లాదుఁడు జగద్విఖ్యాతకీర్తికదా. మహాదాతవగు నిన్ను నేనీవఱకు యాచించినది లేదు. నేను బ్రహ్మచారిని. ఎక్కువలు కోరఁదగనిదికదా యీ యాశ్రమము. కాఁబట్టి

ఆ. ఒంటివాఁడ నాకు ♦ నొకటి రెండడుగుల
మేర యిమ్ము సొమ్ము ♦ మేర యొల్ల
గోర్కిదీఱ బ్రహ్మ ♦ కూఁకటి ముట్టెద
దానకుతుకసాంద్ర ♦ దానవేంద్ర.

అని పలికి యూరకుండెను. ఆపలుకుల కానందించి బలిచక్రవర్తి బరమాదరంబున

ఆ. ఉన్నమాటలెల్ల ♦ నొప్పును విప్రుండ
సత్యగతులు వృద్ధ ♦ సమ్మతంబు
లడుగఁ దలఁచి కొంచె ♦ మడిగితి వోచెల్ల
దాతసొంపు పెంపుఁ ♦ దలఁప వలదె.

వత్సా! కేవల మర్భకుఁడవు. కావున నేమడుగవలయునో యెఱుంగవు.

మ. వసుధాఖండము వేఁడితో గజములన్ ♦ వాంఛించితో వాజులన్
వెసనూహించితొ కోరితో యువతులన్ ♦ వీక్షించి కాంక్షించితో
పసిబాలుండవు నేరవీవడుగ నీ ♦ భాగ్యంబు లీపాటిగా
కసురేంద్రుండు పదత్రయం బడుగ నీ ♦ యల్పంబు నీనేర్పునే.

అని పలుకఁగా విని కపటనాటకసూత్రధారుఁ డగు వామనమూర్తి

మ. గొడుగో జన్నిదమో కమండలువొ నా ♦ కున్ ముంజియో దండమో
వడుగే నెక్కడ? భూములెక్కడ? కరుల్ ♦ వామాక్షులశ్వంబు లె
క్కడ? నిత్యోచితకర్మ మెక్కడ? మదా ♦ కాంక్షామితం బైన మూఁ
డడుగుల్ మేరయత్రోవ కిచ్చు టది బ్ర ♦ హ్మాండంబు నాపాలికిన్.

ఇంతియకాక మఱియొక్క కారణంబు గలదు. అదియే ముఖ్యము. ఆలకింపుము.

క. వ్యాప్తింబొందక వగవక
ప్రాప్తంబగు లేశమైనఁ ♦ బదివే లనుచుఁ
దృప్తిం జెందని మనుజుఁడు
సప్తద్వీపముల నైనఁ ♦ జక్కంబడునే.

మహారాజా! దాతృసొంపు పెంపుతలఁపవలదే యంటివి. నిజమే కాని

ఆ. నీవు రాజవనుచు ♦ నిఖిలంబు నడుగుట
దగవుగాదు నాకుఁ ♦ దగినకొలఁది
యేను వేఁడికొనిన ♦ యీపదత్రయము
జాలదనక యిమ్ము ♦ చాలుఁజాలు.

అన్నంతనే బలి దానవచక్రవర్తి మనంబునఁ బొంగు నుత్సాహంబున రమ్మని యుర్వీదానంబు చేయఁ బూనెను. ఆమాటల వైఖరిం గనిపెట్టి శుక్రాచార్యుఁడు బలిని నివారించి యిట్లుపలికెను. దానవేంద్రా! ఈతఁడు విప్రుఁడుకాఁడు. దేవతాకార్యంబు నెఱవేర్పంబూని హరి యీరూపమున వచ్చినవాఁడు. ఈతని కపటమెఱుంగక యిత్తునంటివి. నీచే దానంబుఁ గొని లోకత్రయ మాయింద్రున కిచ్చును. మరల నీవెట్లు బ్రదికెదవు? నిన్ను నమ్మియున్న దానవుల నెట్లు కాపాడఁజాలుదువు. మాట యిచ్చితి. ఎట్లు మానవచ్చు ననకుము. విశేషశాస్త్రము సామాన్యశాస్త్రమును బాధించును. కావున

ఆ. వారిజాక్షులందు ♦ వైవాహికములందుఁ
బ్రాణవిత్తమాన ♦ భంగమందుఁ
జకితగోకులాగ్ర ♦ జన్మరక్షణమందు
బొంకవచ్చు నఘము ♦ పొందఁ దధిప.

అని మఱియుఁ బెక్కుభంగులఁ దెలిపెను. ఆమాటలు చెవులకు ములుకులవలెఁ దోఁపఁగా బలి చేతులు మోడ్చి ఆచార్యా!

శా. కారే రాజులు రాజ్యముల్ గలుగవే ♦ గర్వోన్నతిం బొందరే
వారేరీ సిరిమూటఁగట్టుకొని పో♦వం జాలిరే భూమిపైఁ
బేరైనం గలదే శిబిప్రముఖులుం ♦ బ్రీతిన్ యశఃకాములై
యీరే కోర్కులు వారలన్ మఱచిరే ♦ యిక్కాలమున్ భార్గవా.

మఱియొక్కమాట యాలకింపుము.

శా. ఆదిన్ శ్రీసతి కొప్పుపైఁ దనువుపై ♦ నంసోత్తరీయంబుపైఁ
బాదాబ్జంబులపైఁ గపోలతటిపైఁ ♦ బాలిండ్లపై నూత్నమ
ర్యాదం జెందు కరంబు క్రిందగుట మీఁ♦దై నాకరంబుంట మేల్
గాదే రాజ్యము గీజ్యమున్ సతతమే ♦ కాయంబు నాపాయమే.

నానిశ్చితార్థమును వినుఁడు.

మ. నిరయంబైన నిబంధమైన ధరణీ ♦ నిర్మూలనంబైన దు
ర్మరణంబైనఁ గులాంతమైన నిజమున్ ♦ రానిమ్ము కానిమ్ము పో
హరుఁడైనన్ హరియైన నీరజభవుం ద♦భ్యాగతుండైన నౌఁ
దిరుగన్ నేరదు నాదుజిహ్వ వినుమా ♦ ధీవర్య! యింకేటికిన్.

క. మేరువు తలక్రిందైనను
బారావారంబు లింకఁ ♦ బాఱిన లోలో
ధారుణి రజమైపోయినఁ
దారాధ్వము బద్ధమైనఁ ♦ దప్పక యిత్తున్.

అనిన శుక్రుం డాగ్రహించి రాజేంద్రా! నీవు మేలుగోరి చెప్పి, నమాటలు వినవైతివి. కావున గురువాక్యోల్లంఘనఫల మనుభ వింపుము. శీఘ్రకాలమునఁ బదభ్రష్టుఁడవు కాఁగలవు. అని శా పం బిచ్చెను. ఇట్లు శాపమును బడసియు రాజు తనమాటను మరలింపఁబూనఁడయ్యెను. ఔరా! సత్యవాక్నిరతి. కాఁబట్టియే

ఆ. బ్రదుకవచ్చుఁ గాక ♦ బహుబంధనములైన
వచ్చుఁ గాక లేమి ♦ వచ్చుఁ గాక
జీవధనము లైనఁ ♦ జెడుఁ గాక పడుఁ గాక
మాట తిరుగ లేరు ♦ మానధనులు.

అని పెద్దలు పల్కిరి. అంతలో నామహామహునిభార్య వింధ్యా వళి వటునిపాదములు కడుగ సువర్ణకలశమునఁ బావనజలముం గొని వచ్చెను. దానికిం బరమానందభరితుఁడై దానవచక్ర వర్తి భక్తిభరమున

క. రమ్మా మాణవకోత్తమ
లెమ్మా నీవాంఛితంబు ♦ లేదన కిత్తుం
దెమ్మా యడుగుల నిటురా
నిమ్మాకడుకంగవలయు ♦ నేటికిఁ దడయన్.

అని ప్రార్థించి వటువు పాదంబులఁగడిగి తత్పావనజలంబు శిరం బునఁ జల్లుకొని యాచమనంబుచేసి దేశకాలాదిపరిగణనంబు సలిపి యించుకంతయు ఖేదమునొందక మహానందంబున

శా. 'విప్రాయ ప్రకటవ్రతాయభవతే ♦ విష్ణుస్వరూపాయ వే
దప్రామాణ్యవిదే త్రిపాదధరణిం ♦ దాస్యామి' యంచుం గ్రియా

త్రిపురుండై దనుజేశ్వరుండు వడుగుం ♦ జే సాఁచి పూజించి బ్ర
హ్మప్రీతమ్మని దారవోసె భువనం ♦ బాశ్చర్యముం బొందఁగన్.

ఆతరుణమ్మున

ఆ. నీటిధారఁబడఁగ ♦ నీక యడ్డంబుగాఁ
కలశరంధ్రమాపఁ ♦ గాను దెలిసి
హరియుఁ గావ్యనేత్ర ♦ మటఁ గుశాగ్రంబున
నడువ నేకనేత్రుఁ ♦ డయ్యె నతండు.

ఆవల బలియిచ్చిన పదత్రయమాత్రభూదానంబుఁ బరిగ్రహించి పరమానందంబు నొంది యావామనమూర్తి చక్రవర్తిం జూచి రాజేంద్రా!

క. క్షితి దానమిచ్చు నతఁడును
నతికాంక్షఁ బరిగ్రహించు ♦ నతఁడును దురిత
చ్యుతులై శతవత్సరములు
శతమఖలోకమునఁ గ్రీడ ♦ సల్పుదు రెలమిన్.

అని పలికి భూదానముం బుచ్చుకొంటి నని సంశయింపకుమా యని హెచ్చరించెను. అంతట నమ్మాయావటుండు

శా. ఇంతింతై వటుఁ డింతయై మఱియుఁ దా ♦ నింతైన భూవీథిపై
నంతై తోయదమండలాగ్రమున క♦ల్లంతై ప్రభారాశిపై
నంతై చంద్రుని కంతయై ధ్రువునిపై ♦ నంతై మహర్వాటిపై
నంతై సత్యపదోన్నతుం డగుచు బ్ర♦హ్మాండాంతసంవర్ధియై.

అట్టి లోకంబు లావరించి యొకపాదంబున భూమిని, వేఱొక యడుగున నితరభాగంబు నావరించి మూఁడవయడుగున కేమి

చూపెదవో చెప్పుమా యని బలి నడిగెను. ఆమాటలకు జంకక విసుగునొందక భక్తిభారంబున

ఆ. సూనృతంబుగాని ♦ నుడియదు నాజిహ్వ
బొంకఁజాల నాకు ♦ బొంకులేదు
నీతృతీయపదము ♦ నిజము నాశిరమునఁ
నెలవుచేసి పెట్టు ♦ నిర్మలాత్మ.

అని పలికిన మెచ్చి శ్రీహరి యాతని ననుగ్రహించి పాతాళంబుననుండ నాజ్ఞాపించెను. బలియింటఁ దాఁ గావలిగాచుచుండ నంగీకరించెను. దేవత లంత వామనమూర్తిం గొని యమరావతి కరిగిరి. ఇంద్రుఁడు యథాపూర్వముగఁ బాలించుచుఁ ద్రిభువనాధిపతియన విఖ్యాతిం బడసి యుండెను.

ఇది అష్టమస్కంధము.

నవమస్కంధము.

అంబరీషోపాఖ్యానము.

పరీక్షిన్నరేంద్రుఁడు శుకయోగిం గాంచి మహాత్మా! వామనమూర్తిమహిమమును వింటిని. కాని యింతతో సంతృప్తి నొందుదమను నూహ కలుగుకున్నయది. ఇంకను భగవన్మహిమమును వినఁగోరెద నని పలుక యోగిచంద్రుఁ డిట్లనియెను. రాజేంద్రా! నీవంటి పరమభాగవతోత్తమునకు విష్ణుకథాశ్రవణమునఁ దృప్తియుండునా. ఎంత విన్నను అంత యుత్సాహమింకను వినవలె నని కలుగుచుండును. కావున నా తెలిసినంతవఱకు భగవన్మహిమముఁ దెల్పెదను. భగవద్భక్తునిచరిత్రమును వినుము.

నాభాగునితనయు నంబరీషుఁ డనుట విఖ్యాతమే కదా. ఆతనియందప్రతిహతమగు బ్రాహ్మణశాపము వ్యర్థమయ్యెను. ఇదియే చిత్రము. ఆవిషయమును దెల్పెద. సావధానుఁడవు కమ్ము. నాభాగునకు నంబరీషుఁడు కుమారుఁ డయ్యెను. ఆతఁడు సుగుణగరిష్ఠుఁడు. కాఁబట్టి

సీ. చిత్తంబు మధురిపు ♦ శ్రీపాదములయంద
పలుకులు హరిగుణ♦పఠనమంద
కరములు విష్ణుమం♦దిరమార్జనములంద
శ్రవములు హరికథా♦శ్రవణమంద
చూపులు గోవింద♦రూప వీక్షణమంద
శిరము కేశవ నమ♦స్కృతులయంద
పదము లీశ్వరు గేహ♦పరిసర్పణములంద
కామంబు చక్రి కైం♦కర్యమంద

తే. సంగ మచ్యుతజనతను♦సంగమంద
ఘ్రాణ మసురారి భక్తాంఘ్రి ♦ కమలమంద
రసన తులసీదళములంద ♦ రతులు పుణ్య
సంగతులయంద నారాజ♦చంద్రమునకు.

ఇట్టి యభ్యాసములవలన రాజర్షి యనుపేరాయంబరీషునకుం గల్గెను. అమ్మహారాజు సదా హరిధ్యానము చేయుచుండుటం బట్టి

ఆ. అతని కిహము మానె ♦ హరులందుఁ గరులందు
ధనములందుఁ గేళి♦వనములందుఁ
బుత్రులందు బంధు♦మిత్రులయందును
బురమునందు నంతి♦పురమునందు.

అట్లు లౌట శ్రీమన్నారాయణమూర్తి కరుణించి యంబరీషునకుఁ దన చక్రమునిచ్చెను. అదియే ప్రతిభటశిక్షణంబును నిజజనరక్షణంబును జేయుచుండెను. కాన నారాజర్షి రాజ్యము పూజ్యభంగి నలరారుచుండె.

ఆయంబరీషుఁడు హరిభక్తితత్పరత్వమున ద్వాదశీవ్రతము చేయఁబూనెను. ఒక్క సంవత్సరి మా వ్రతము చేయ సంకల్పించెను. భార్యయు సంతోషమున భర్తతో నావ్రతముచేయ సమ్మతించెను. వ్రతాంతమునఁ గార్తికమాసంబున మూఁడురాత్రు లుపవసించి కాళిందీసలిలంబుల స్నానమొనరించి మధువనంబున మహాభిషేకవిధానంబున విహితపరికరసంపన్నుండై హరి నభిషిక్తుం జేసి మనోహరగంధంబు లర్పించి విమలపావనతమకుసుమంబు లర్పించి మహాభక్తిచే ఆఱు న్యర్బుదముల గోవుల సద్బ్రాహ్మణులకు దానమిచ్చి మృష్టాన్నము వారికిం బెట్టి తాను పారణముచేయఁబూనెను. ఆసమయమున దుర్వాసుఁ డరుదెంచెను. తద్దర్శనమునఁ గృతార్థుఁడనైతి నని తలంచి యాతిథేయసత్కారము లొనరించి కుశలప్రశ్నంబుఁ గావించి 'మహాత్మా! యీ దాసునింటభుజింపుమా' యని ప్రార్థింప నమ్ముని యంగీకరించెను.

దుర్వాసుఁ డప్పుడ కాళిందికింబోయి స్నానమొనరించి జపము చేసికొనుచు రాక తడవుచేసెను. అర్థముహూర్తమే ద్వాదశి యవశిష్టముగ నుండెను. ఆలోపలఁ బారణచేయవలయు ననుని మముండుటంబట్టియు మునిరాకముందే భుజించుట పాడిగామియుఁ దలంచి విద్వజ్జనంబులఁ బిలుపించి ప్రాంజలియై మహర్షి చేష్టితం బెఱింగింప వారూహించి శాస్త్రంబులం బరికించి 'రాజేంద్రా!'

ఆ. అతిథిపోయి రామి ♦ నధిప యీద్వాదశి
పారణంబు మానఁ ♦ బాడిగాదు
కుడువకుంట గాదు ♦ కుడుచుటయును గాదు
సలిలభక్షణంబు ♦ సమ్మతంబు.

అని' ధర్మసందేహంబు పాపిరి. రాజగ్గియు వారియానతిం గొని జలపారణంబు చేసి మునిరాకకెదురుచూచుచుండఁగా మర్వాసుఁ దరుదెంచి రాజు చేష్టితమును బుద్ధినెఱింగి కూడఁబుట్టిన క్రోధము రెండింతలుకాఁగా క్షుద్బాధపీడించుచుండఁగా 'రాజా! గర్వము న విఱ్ఱవీఁగి ననుఁదిరస్కరించితివి, ధర్మభంగ మొనరించితివి, దుష్కర్ముఁడవు, నాకోపమురుచి యించుక చూతువుగాక' అని యాగ్రహమున జటమొదలంటఁగాఁ బెఱికి దానియం దొకకృత్య యుత్పత్తికాఁగా శూలహస్తయగు నాశక్తిని రాజుపైకిం బంపెను. ఆశక్తియు నాటోపంబున రాజు శిక్షింపఁ గవిసెను.

ఆ. ఆప్రకార మెఱిఁగి ♦ హరి విశ్వరూపుండు
వెఱ్ఱితపసి చేయు ♦ వేడబంబుఁ
జక్కఁబెట్టు మనుచుఁ ♦ జక్రంబుఁ బంచిన
వచ్చె నదియుఁ బ్రళయ♦వహ్నిపగిది.

ఆచక్రమవార్యవిక్రమంబున మృత్యువుంబోని మునివృత్యను క్షణమాత్రమున దహించి ముని వెంటం బడఁగా నాతఁడు భీతిల్లి యెందెందో తిరిగితిరిగి యెవ్వారెవ్వరినో యాశ్రయించి తుదకు సంరక్షించువా రెవ్వరును లేరని తెలిసికొని త్రిమూర్తులలో

నిరుపురం గాంచి హరివలని లాభముంగానక శ్రీహరిం జేరి-
ప్రార్థింపఁగా నామహాపురుషుఁడు 'మునీంద్రా!

ఆ. నాకు మేలుగోర ♦ నాభక్తులకకాని
భక్తజనుల కేన ♦ పరమగతియు
భక్తుఁ డెందుఁ జనినఁ ♦ బఱిపెంగ వెను వెంటఁ
గోవు వెంటఁ దగులు ♦ కోడె భంగి.

కాఁబట్టి, చెప్పెదను

క. అదెవో బ్రాహ్మణ నీవును
సదయుఁడు నాభాగసుతుఁడు ♦ జనవినుతగుణా
స్పదుఁ డచ్చో నభయమొసఁగని
మది సంతసపఱచి వేఁడు♦మా శరణంబుల్.'

అని ప్రోత్సహించెను. మునియు నాయంబరీషుని పాలికింబోయి పాదంబులపైఁ బడి లేవకుండఁగా మునిపతి తనపాదముల స్పృశించెఁ గదా యని భీతిం జెంది కరంబులు ముకుళించి భక్తిపరవశుండై నిలువంబడి

ఆ. కమలలోచనుండు ♦ ఖలుల శిక్షింపంగ
బాలుచేయ నీవు ♦ పాలుపడితి
వైన నింకఁ జాలు ♦ నాపన్నుఁడైయున్న
తపసిఁగావు మీవు ♦ ధర్మవృత్తి.

అని ప్రార్థించెను. అంతతో నూరకుండక భగవంతుం దలంచి

ఆ. విహితధర్మమందు ♦ విహరింతు నేయేని
ఇష్టమైన ద్రవ్య ♦ మిత్తునేని

ధరణిసురుఁడు మాకు ♦ దైవతం బగు నేని
విప్రునకు శుభంబు ♦ వెలయుఁ గాక.

అనఁగానే చక్రము మునిని బాధింపక భగవంతుని కడకరిగెను. దుర్వాసుఁడు గర్వముడిగి మెల్లనిమాటల నారాజర్షి దీవించి

మ. నరనాథోత్తమ మేలుచేసితి కదా ♦ నాతప్పు మన్నించి శ్రీ
హరిపాదాబ్జము లింతముట్టఁగొలుతే ♦ యాశ్చర్యమా నెన్న చో
నరుదం ద్రే నినుబోఁటి సాధునకుఁ దా♦నై యిచ్చుటల్ కాచుటల్
సారిదన్ నైజగుణంబులై పరసవ♦చ్చుంగాదె భద్రాకృతిన్.

అన విని రాజర్షి మహర్షిం బ్రార్థించి యిష్టమృష్టాన్నంబుం బెట్టినం గుడిచి పరమానందంబున

శా. కంటిన్ నేఁటికి నిన్ను నీవచనముల్ ♦ కర్ణద్వయిన్ బ్రీతిగా
వింటి న్నన్నముఁ గొంటి నీగృహమునన్ ♦ వేదక్రియన్ ఫలం బబ్బె నే
మంటిం బోయెద నీచరిత్రమమరుల్ ♦ మర్త్యుల్ సుఖాసీనులై
మింటన్ మేదిని సన్నుతింపఁగల రీ♦ మీఁదన్ నరేంద్రాగ్రణీ.

అని తన దారింబోయెను. రాజర్షియు యథావిధి వ్రతము సంపూర్తినొందించి భగవద్భక్తాగ్రేసరుండన నెగడి సుఖంబుండెను.

అని పలికి మఱియు యోగీంద్రుఁ డిట్టు లనియెను. రాజచంద్రమా భగవద్భక్తుల మాహాత్మ్యమును వింటివికదా. భగవంతుని మహిమ మపారము. ఒకప్పుడు భక్తులద్వారా ధర్మము నిలుచునట్లు చేయుచు నొకప్పుడు తానే యవతరించి దుష్టులం జెండి శిష్టులం గాంచి ధర్మసంరక్షణ మొనరించుచుండు

నాభగవంతుని యొత్త్వ మెఱుంగ శక్యముకాదు. దీని కుదాహ రణముగా శ్రీరామావతారమును దెల్పెద వినుము.

శ్రీరామచరిత్రము.

ఇక్ష్వాకువంశము భువనవిఖ్యాతము. అందు విఖ్యాత భూపాలురు పెక్కండ్రుగలరు. వారిలో దశరథుఁ డొక్కరుఁ డు. ఆయనకు ముగ్గురుభార్యలు. కౌసల్యాసుమిత్రాకైకలని వారి పేరులు. ఆభార్యలందొక్కరుకకైనను సంతానము లేకుం డెను. ఆకొఱఁత చిరకాల మాభూపాలుని బాధించుచుండెను. మునలిముప్పున మహర్షులయాజ్ఞ నారాజు పుత్రకామేష్టి చే సెను. ఆమఖమున నగ్నిదేవుఁడు పరమపవిత్రపాత్రమునఁ బర మాన్నముఁ గొని వచ్చి రాజున కిచ్చెను. ముందే దేవతలు ప్రార్థింప శ్రీహరి మనుజరూపమున నవతరించి రావణు జంప నిశ్చయించియే యుండెను. కాఁబట్టి యాపాయసమునఁ దా నిమిడియుండెను. అగ్నిదేవుఁడు పాయసము నియ్యఁగనే దశ రథుఁ డాపాయసమును గౌసల్యకు సగము కైకకు సగ ము నిచ్చెను. వారిరువురు దశరథుభావ మెఱింగి తమతమభాగ ముల నర్ధమాత్రము ప్రీతిచే సుమిత్రకొసంగిరి. ఆపాయసభక్ష ణమున వారు చూలాండ్రుగఁ గనఁబడిరి.

తొమ్మిదినెలలు నిండఁగనే కౌసల్యాదులు ముగ్గురు పుత్రులం గాంచిరి. కౌసల్య కొడుకుపేరు శ్రీరాముఁడు. కైక

కొడుకు నామము భరతుఁడు. సుమిత్ర కొడుకు లిరువుర నామములు లక్ష్మణశత్రుఘ్నులు. అందు రామలక్ష్మణు లుద్ధులై యుండిరి. భరతశత్రుఘ్ను లుద్ధులై యుండిరి. దశరథుఁ డాకొడుకుల నల్వురం గాంచి పరమానందాంబుధి నోలలాడుచుండెను. కొంతకాల మాయానందమునకు మేర లేకుండెను. వారికి వేదాది విద్యల నేర్పించెను. ఉపదేశమాత్రముననే వారు సకలవిద్యల గ్రహించిరి. ఈడుజోడు బాలురం గూడి యాడుకొనుచుండిరి.

ఒకానొక దినమున దశరథుఁడు కొలువు సేయుచుండఁగా విశ్వామిత్రుఁ డరుదెంచి యథావిధిఁ బూజితుఁడై కూరుచుండి కుశలప్రశ్నానంతరము 'దశరథా! నేనొక యజ్ఞము చేయుచుండ నొకవిఘ్నము గల్గినది. నీసహాయమును గోరి వచ్చితి. తద్విఘ్ననివారణార్థము భగవత్స్వానని రామునిం బంపుమా' యని వేఁడెను. వసిష్ఠముని యనుమతి రాజందుల కంగీకరించెను. రామలక్ష్మణులం దోడుకొని మునిజనపదములం జూపుచుఁ దాటక యుండు వనముఁ జొచ్చి యందున్న తాటక పైకి రాఁగా రామునిచేఁ జంపించి తనయాశ్రమమునకుం బిలుచుకొని పోయి యజ్ఞ మారంభించెను. మారీచ సుబాహువు లరుదెంచి రక్తవర్షమును గురియింప రామలక్ష్మణు లాదానవులపై శరవర్షమును గురిపించుచుండ రాముఁడు విక్రమించి సుబాహువును బొలి

బొలియించి మారీచుని వాయవ్యాస్త్రమునఁ జిమ్మఁగా నతఁడు సంద్రమునఁ బడి యెట్లో బ్రదికెను.

విశ్వామిత్రుఁ డంత రామలక్ష్మణులం దోడుకొని మిథిలానగరమునకుం బోవ రాముఁడు హరచాప భంగ మొనరించి సీతం బెండ్లియాడెను. ఊర్మిళ లక్ష్మణునకుఁ గళత్ర మయ్యెను. భరతునకు మాండవి పత్ని. శత్రుఘ్నునకు శ్రుతకీర్తి దార యయ్యెను. వారు వివాహానంతర మయోధ్యకరుగుచుఁ ద్రోవలోఁ బరశురాముని భంగపఱచి వైష్ణవశరాసనంబు రాముఁడు గ్రహింప సుఖముగఁ బురప్రవేశ మొనరించిరి.

భరతుఁడు సోదరుంగూడి మేనమామయింటి కరిగెను. దశరథుఁడు రామచంద్రుని యువరాజుఁ జేయ నిశ్చయించుకొనఁగా భరతునిమాత కైకి మంథర యనుపరిచారికచేఁ బురికొల్పఁబడి మున్నిచ్చిన రెండువరముల నిపుడిమ్మని దశరథు నడుగుచు నొకవరమునకు రాముని వనములకుఁ బంపుటయు, రెండవవరమునకు భరతుని యువరాజుఁ జేయుటయుఁ దన కిష్టములని కోరెను. సత్యపాశబద్ధుఁడు కాన నేమియు ననలేక కొడుకు నడవులకుం బంపఁజాలక పరితపించుచుండ రాముఁ డెఱింగి సీతను లక్ష్మణుందోడుకొని వనములకుం బోయెను. దశరథుఁడు రామవియోగమున కోర్వఁజాలక మరణించెను.

భరతుఁ డయోధ్యకు వచ్చి తండ్రికిఁ బరలోకక్రియలు చేసి చిత్రకూటమున కేగి యన్నను బ్రార్థించి యతఁడు రా సమ్మ

తింపకపోఁగా శ్రీరామచంద్రుని పాదుకలఁ బ్రార్థించి వానిపై రాజ్యభారమునిచ్చి నందిగ్రామమునందుండి రాజ్యమును బాలించు చుండెను. రాముఁ డంతఁ జిత్రకూటమును వదలి దండకారణ్యమును బ్రవేశించి విరాధాదిదుష్టదానవులఁ జంపుచుఁ బోయి పంచవటీతీరమున నొకపర్ణశాల నిర్మించి యందుండి రావణు చెల్లెలు శూర్పణఖ వచ్చి తన్నుఁ గామింప సోదరునిచే దాని ముక్కుచెవులు కోయించి యామెకు సాయముగాఁ దన్ను దండింపవచ్చిన ఖరదూషణాది దుష్టదానవులఁ జంపెను.

రావణుఁ డావార్త శూర్పణఖనుండివిని భీతుఁడై మారీచుని మాయాహరిణముఁ గమ్మని పంచి తా నందొకచో నుండెను. సీతమ్మ ఆ హరిణమును దెచ్చి యిమ్మని యడుగ రాముఁడు దానివెంట నంటి దూరముగాఁ బోయి యది మాయ యని తోఁప బాణప్రయోగముచేయ నది ప్రాణముల వదలుచు రాముని కంఠస్వరము ననుకరించు నాదమున నక్కటా! లక్ష్మణా! యని యార్చి చచ్చెను. ఆనాదము విని సీత దూఱఁగా లక్ష్మణుఁ డచటికిఁ బోవ రావణుఁడు సన్న్యాసి వేషమున వచ్చి సీత నెత్తుకొనిపోవుచు నామె విడిపింప వచ్చిన జటాయువుం జంపి లంకకుం బోయెను. రాముఁ డనుజుంగూడి వచ్చి సీతం గానక పంపాసరః ప్రాంతమునకుం బోయి సుగ్రీవునితోఁ జెలిమి చేసి యతనియన్నయగు వాలి నొక్కకూలం గూలనేసి కపిరాజ్యమునకుఁ బట్టభద్రుని సుగ్రీవునిం జేసెను

ఆకపిపతి వనచరుల నాల్గుదెసల సీతను వెదుకం బంపెను. హనుమదంగదాదులు దక్షిణదిక్కునకుం బోయిరి. హనుమ సాగరమును లంఘించి లంకం గలయందిరిగి యశోకవృక్షము క్రిందనున్న జానకిం గాంచి మాటలాడి ముద్రికయొసంగి యామె రామునకుం జూప నొసంగిన యానవాలును గైకొని తనరాకం దెలుప వనభంగము గావించి యక్షకుమారాదులం బొలియించి యింద్రజిత్ప్రయుక్త బ్రహ్మాస్త్రమునబద్ధుండై రావణుని దర్శించి నీతి నుపదేశించి తనతోకం గాల్పంగా నాగ్రహించి లంకం గాల్చి రాముని గానంబోయి సీతాకుశల వార్తం జెప్పెను.

రామాదులు బలసమేతులై లవణసాగరముకడకుం బోయి త్రోవ యిమ్మని ప్రార్థించిరి గాని యాసముద్రుండు బదులు పల్కకుండెను. రాముం డాగ్రహించి బాణప్రయోగము చేయంబూన నాసాగరుండు ప్రత్యక్షమై తనపై సేతువుం గట్ట ననుమతింపం బర్వతాదులు వైచి సేతువుం గపులు కట్టంగా నందఱు సాగరము నుత్తరించి లంకానగరప్రాంతమున విడిసిరి. వానరు లానగరము నావరించి ప్రాకారాదులంగూల్చి నానావిధంబులం బాడుచేసిరి. దానికిం గోపించి రావణుండు పంపిన ధూమ్రాక్షాదిదానవులం బొలియించిరి.

పిదప నతికాయుండు యుద్ధమునకు రాంగా లక్ష్మణుండు సంహారించెను. కుంభకర్ణుండు మహాహవ మొనరించి రాముని

చేతఁజచ్చెను. ఇంద్రజిత్తు లక్ష్మణుని మార్కొని తా సురలోకమున కరిగెను. తనవార లనిఁబడ రావణుం డాగ్రహించి సంగరరంగమునకు రాఁగా నింద్రుఁడు రామునకుఁ దన రథమును మాతలితోఁ బంపెను. దాని నెక్కి రాముఁ డాహవోన్ముఖుం డయ్యెను. రామరావణులు తలపడిరి. ఆసంగ్రామము మహాఘోరరీతిని గనుపట్టెడు. అపుడు శ్రీరామమూర్తి మహాగ్రహమున రూక్షనాదమున

మ. చపలత్వంబున డాఁగి హేమమృగముం ♦ సంప్రీతిఁ బుత్తెంచుటో
కపటబ్రాహ్మణమూర్తివై యబల నా♦కాంతారమధ్యంబునం
దపలాపించుటయో మదీయశితది♦వ్యామోఘబాణాగ్నిసం
తపనం బెగతి సోర్చువాఁడవు దు♦రంతం బెంతయుం రావణా.

అని పలుకుచు నంతకంత కుప్పొంగురోషంబున

మ. బలువింటం గుణటంకృతంబు నిగుడం ♦ బ్రహ్మాండభీమంబుగాఁ
బ్రళయోగ్రానలసన్నిభం బగు మహా♦బాణంబు సంధించి రా
జలలాముం డగురాముఁ డేసె ఖరభా♦షాశ్రావణుం దేవతా
బలవిద్రావణు వైరిదారజనగ♦ర్భస్రావణుం రావణుం.

ఆబాణంబున రావణుండు దెగియె. రాక్షసాంగనలు దిక్కేది విలపించిరి. విభీషణుఁడు రామునిప్రోత్సాహమున పగయుడిగి యన్నకు నౌర్ధ్వదైహిక క్రియలొనరించి పట్టాభిషిక్తుఁడై సీతం దోడ్కొనివచ్చి రామున కప్పగించెను. రాముఁ డాభూజాతం

గాంచి తద్విమలమతి నెఱుంగుహాఁడు కాన నామెవలన దోషంబు లేదని భావించియు నగ్నిశుద్ధం గావించి పరిగ్రహించెను. అంతట విభీషణాదులు తోడ రాఁబుష్పకము నెక్కి మున్ను చూచిన స్థలములు మాటియుంచుట సీతకుఁ జూపుచు నయోధ్యఁ జేరెను. భరతుఁడు ముందే యెదుర్కొని రాజ్యభారం బప్పగించెను. అందఱును రాముంగూడి యయోధ్యానగరంబుఁ బ్రవేశించిరి. రాముఁడు జనుల కభివాదనంబు చేసి పెద్దలకు వందనము లొనరించి వారియాశీస్సులం బడసి దశరథవిహీనమగు నంతఃపురమును చింతాభరంబునఁ బ్రవేశించెను.

వసిష్ఠాదులు సుముహూర్తమున శ్రీరామచంద్రుని సింహాసనాసీనుం గావించి చతుస్సముద్ర పావన నదీజలంబుల నభిషేకించిరి. భరతుఁడు రాజ్యవిశేషముల విన్నవించెను. పౌరులెల్లఁ బరమానందభరితులై రాముం గొల్చిరి. ఆకాలమందు.

సీ. పొలఁతులవాలుచూ♦పులయంద చాంచల్య
మబలలనడుముల♦యంద లేమి
కాంతాలకములంద ♦ కౌటిల్యసంచార
మతివలనడపుల♦యంద జడిమ
ముగుదలపరిరంభ♦ములయంద పీడన
మంగనాకుచముల♦యంద పోరు

పడఁతులరతులంద • బంధసద్భావంబు
సతులఁ బాయుటలంద•సంజ్వరంబు
తే. ప్రియులం ప్రియురాండ్రమనముల • బెరసి తార్పు
లంద చౌర్యంబు వల్లభు•లాత్మసతుల
నాఁగి క్రొమ్ముళ్ళు వట్టులం • దక్రమంబు
రామచంద్రుఁడు పాలించు • రాజ్యమందు.

ఇది నవమస్కంధము.

దశమస్కంధము.

పూర్వభాగము.

శ్రీకృష్ణచరిత్రము.

అని యిట్లు శుకయోగి తెలుపఁగా హర్షించి పరీక్షిన్నరేంద్రుఁడు మహాత్మా!

క. శీలము గల యదుకులమున
నేలా పుట్టెను మహాత్ముఁ డీశుఁడు విష్ణుం
డేలీల మెలఁగె నేయే
వేళల నేమేమి చేసె వివరింపు తగన్.

అని ప్రశ్నించుచు యోగివర్యా! మునుపు బలరాముఁడు రోహిణీదేవిపుత్రుఁడని చెప్పితిరి. ఆమహాత్ముఁడు దేవకీదేవి కడుపున నెట్టు లుండెను? తనతండ్రి యిల్లు వదలి గోవిందుఁడు మంద కేలపోయెను? ఎందుండి యేయేకార్యముల నొనరించెను. నాకీవిషయములఁ జక్కఁగా వినిపించు కృతార్థునిగా నొనరింపుమా యని ప్రార్థించెను. శుకయోగియు సంతోష బాష్పాకులితేక్షణుఁడై రాజా! ధన్యుఁడవు. ధన్యుఁడవు. ధన్యుఁడవు. భగవత్కథాశ్రవణమున నిన్ను మించిన యసంతృప్తుల నేఁ జూడలేదు. నీజన్మమే పవిత్రతమము. ఇఁక శ్రీకృష్ణచరిత్రమును వినుము. ముక్తి కరతలామలక మగును.

మహారాజా! కొంతకాలము క్రిందట రాజలాంఛనములఁ దాలిచి దైత్యులు భూమి నాక్రమించిరి. ధర్మమును దాఱుమాఱు చేసిరి. వారిభారమును మోయఁజాలక భూమి దుఃఖాక్రాంతయై బ్రహ్మకడకుం బోయి విలపించెను. బ్రహ్మయు భూమిందోడుకొని శ్రీహరిచెంతకుం బోయి భూమివగలఁ దెలిపెను. హరి తానవతరింపఁబూని దేవతలంగాంచి మీరును భూమి నవతరించి నాకు సాయముగా నుండుఁడని యాజ్ఞాపింప వారట్లు చేయఁజనిరి. భూదేవియుఁ దనకష్టము వాయునన్న యాదరంబునఁ బనివినియెను.

పరీక్షిన్మహారాజా! మథురాపురము యాదవులకు నివాసము. అందు శూరసేనుఁడు విఖ్యాతిగాంచి యుండెను. ఆతని కొడుకు వసుదేవుఁడు. ఆతఁడు దేవకీదేవిం బెండ్లియాడెను. ఆదేవకి కంసునకుఁ దోడఁబుట్టువని యెఱుంగుము. వసుదేవుఁడు దేవకిం దోడుకొని రథమెక్కి పయనము సాగించెను. అత్తఱిఁ గంసుఁ డుల్లాసియై చెల్లెలు మఱఁదియు రథముపైఁ గూరుచుండఁగా గుఱ్ఱములపగ్గములు చేనంది రథము తోలుచుండెను. శుభవాద్యములు మ్రోయుచుండెను. నగరమును దాఁటి చనుచుండునపుడు కంసునిమనముభీతిల్లు నట్టులుగా

క. తుష్టయగు భగిని మెచ్చఁగ
నిష్ఠుఁడవై రథము గడపె • దెఱుఁగవు మీఁదన్
శిష్టయగు నీతలోదరి
యష్టమగర్భంబు నిన్ను • హరియించుఁ జుమీ.

అని యాకాశవాక్కు స్పష్టముగా ముమ్మాఱులు వినఁబడియెను. ఆమాటల కులికిపడి పగ్గముల విడిచి పెట్టి భయంకరకృపాణమును బాణిం దాల్చి దేవకీదేవిం జంపఁ బ్రయత్నించెను. వసుదేవుఁ డాతని వేగిరపాటుం జూచి తడవు సేసినఁ గార్యము చెడు నని యెంచి దుష్టాత్ము నీతని సాంత్వనములఁ జక్కఁ బెట్టుటయే యిపుడు చేయఁ దగు పని యని సంభావించి మెల్లగా ననునయించుచు భోజరాజా;

ఉ. అన్నవు నీవు చెల్లెలికి ♦ నక్కట మాడలు చీర లిచ్చుటో
మన్నన చేయుటో మధుర♦మంజుల భాషల నాదరించుటో
మిన్నుల మ్రోతలే నిజము ♦ మే లని చంపకుమన్న మాని రా
వన్న సహింపుమన్న తగ♦దన్న నినున్ శరణంబు వేఁడెదన్.

మఱొక్కమాట

మ. చెలియల్ కన్నియ ముద్దరా లబల నీ♦సేమంబ చింతించు ని
ర్మల దీక్షన్ బయలాడు మాటలకు నై ♦ మర్యాదఁ బోఁదట్టి స
త్కులజాతుండవు పుణ్యమూర్తి వకటా! ♦ కోపంబు పాపంబు నె
చ్చెలి నోహో తెగవ్రేయఁ బాడి యగునే ♦ చింతింపు భోజేశ్వరా.

మహారాజవు. నీ విట్టిపాప మొనరించిన నీపాలనమునకు లోఁబడిన మానవు లేమందురో యని యించుక యూహింపుము. దేహ మిది స్థిరము కాదు. నీటిబుగ్గవంటిది సుమీ. దీని నమ్మి శాశ్వతకీర్తిని బోఁగొట్టుకొనఁ బ్రయత్నింపకుము. పరహింస మహాపాపము సుమా. దానిని మించిన ఘోరకార్యము వేఱొకటి లేదు.

క. కావునఁ బరులకు హింసలు
కావింపఁగ వలదు తనకుఁ ♦ గల్యాణముగా
భావించి పరుల నొంచినఁ
బోవునె తత్ఫలము పిదపఁ ♦ బొందక యున్నే.

అని పలికి మఱియొక్కయుక్తి యాత్మకుఁ దగుల నిట్టు లనియె. రాజేంద్రా! ఆకాశవాక్కు నీచెలియలియష్టమగర్భము నిన్ను హరించు నని కదా వినఁబడియె. ఎనిమిదవసంతానమే కాదు. పుట్టినబిడ్డల నెల్ల నిచ్చుచుందును. ఆసంతానముల నీయిష్టానుసారముగా వధింపుము. ఇదియె కదా నీకోరిక. నీచెలియలు నీమేలు గోరునది. నీనాశనమును గోరునా అని యెన్నియో నీతు లుపదేశింపఁ గంసుఁ డెట్టకేల కంగీకరించి దేవకిని జంపమానెను.

ఆవల దేవకీదేవి ప్రతియేటఁ గన్నకొడుకుల నాలుగుర కంసున కర్పించెను. వాఁడు నిశితకరవాలమున వారిం జంపెను. ఏడవగర్భము కొలఁది కాలముననే పోఁగొట్టెను. భగవంతునియాజ్ఞ యోగమాయ దానిం గొని చని రోహిణీదేవి గర్భమున నునిచెను. గర్భము పోయె నని యెల్లరు చెప్పుకొనిరి. కంసుఁ డావార్త నాలించెను. రోహిణి యవ్వల మహాపురుషుని బలరామునిం గాంచెను. గర్భము సంక్రమింపఁజేయుట సంకర్షణుఁ డను పేరఁ బరఁగెను. అవ్వల దేవకీదేవి యెనిమిదవగర్భమును దాల్చెను. దేవకీవసుదేవు లాసమయమున నద్భుతరీతి

వెలింగిరి. చూచువారెల్ల నిది యద్భుతముగ నున్నదే యని యూహించుచుండిరి. ఆతరుణమున వారిని గంసుఁడు కారాగారమున నునిచి కావలివారిని నియమించి కడు జాగరూకుఁడై యుండెను. నెలలు తొమ్మిదియు నిండెను. ఎప్పుడు ప్రసవించునో యని కంసుఁడు లేచియుండెను. ఆతరుణముననే గోకులమున నున్న నందునిభార్య యశోద గర్భమును ధరించెను. ఆమెకు నవమాసములు నిండెను.

ఆసమయమున దేవత లదృశ్యాకారముల నరుదెంచి దేవకీగర్భస్థుఁడగు పురుషోత్తముని బహువిధంబుల వేదవాక్యల వినుతించి త్వరగా నవతరించి కంసాదిదుష్టదానవులఁ జంపి ధర్మరక్షణ మొనరింపుమా యని ప్రార్థించి తమతమ నెలవుల కరిగిరి. బ్రహ్మాదు లిండ్లకుం బోవుచుఁ బ్రీతితో దేవకిం గాంచి

మత్తకోకిలను. తల్లినీ యుదరంబులోనఁ బ్ర♦ధానపూరుషుఁ డున్నవాఁ
డెల్లి పుట్టెడుఁ గంసుచే భయ♦మింత లేద నిజంబుమాఁ
కెల్లవారికి భద్ర మయ్యెడు♦ నింక నీ కడుపెప్పుడుం
జల్లగావలె యాదవావళి♦ సంతసంబును బొందఁగన్.

అని దీవించి వెళ్లిరి.

శ్రీకృష్ణావతారము.

అంత శుభదివసంబున నడిరేయి రోహిణీనక్షత్రమున దేవకీదేవి ప్రసవించెను. ఆతరుణమునఁ గావలికాచువారి కెల్ల

నోడలు తెలియకుండ నిద్ర యావరించెను. కంసు నాజ్ఞను వారెఱుంగక హాయిగా నిదురించిరి. చీమ చిటుక్కుమన్న వినఁబడు నాకాలమున దేవకీదేవి ప్రసవవేదన ననుభవించుచుండ నొక్కప్రాణియైన నెఱుఁగకుండెను. భగవంతుఁడు భక్తరక్షణాదృతి నవతరించెను. ఆగర్భమున వాయువు నిండియుండెను గాని తొమ్మిదినెలలు భగవంతుఁ డందు లేఁడు. ఆమహాత్మునకు జన్మదుఃఖము కలుగునా. ప్రసవకాలమున దేవకికి స్మృతి లేకుండెను. వాయువు వెడలిపోయెను. భగవంతుఁడు చిన్నిశిశురూపమున భూమినుండెను. అప్పుడు ప్రపంచమున మహాహ్లాసకరములగు గుఱుతులు కనంబడియెను. సముద్రము లుప్పొంగెను. మలయవాయువులు వీచెను. దేవతలు పూలవానఁ గురియించిరి. గంధర్వు లాడిరి. అచ్చరమిన్నలు నృత్యమొనరించిరి. అప్పుడు

సీ. జలధరదేహు నా♦జానుచతుర్బాహు
 సరసీరుహాక్షు వి♦శాలవక్షుఁ
జారుగదాశంఖ♦చక్రపద్మవిలాసుఁ
 గంఠకౌస్తుభమణి♦కాంతిభాసుఁ
గమనీయకటిసూత్ర♦కంకణకేయూరు
 శ్రీవత్సలాంఛనాం♦చితవిహారు
నురుకుండలప్రభా♦యుతకుంతలలలాటు
 వైదూర్యమణిగణ♦వరకిరీటు

తే. బాలుఁ బూర్ణేందురుచిజాలు ♦ భక్తలోక
పాలు సుగుణాలవాలుఁ ♦ గృపావిశాలుఁ
జూచి తిలకించి పులకించి ♦ చోద్యమంది
యుబ్బి చెలరేఁగి వసుదేవుఁ ♦ డుత్సహించె.

పాప మావసుదేవుఁ డాతటి స్నానముచేయ వీలుపడమి నానందాబ్ధినిమగ్నుఁడై విప్రులకుఁ బదివేల ధేనువుల మానసమున దారవోసెను. ఈకారాగారనివాసవిముక్తి యయినపిదప నిచ్చెద నని సంకల్పించెను. అంతలో నవ్వసుదేవునకు దివ్యజ్ఞానము పొడసూపఁగాఁ బాలగోపాలుని బహువిధముల వినుతించెను. దేవకియు భర్త వినుతించినట్లే వినుతించెను. ఆస్తోత్రములకు భగవంతుఁడు సంతోషించి వారిపూర్వజన్మవృత్తాంతమును దెలిపి తనకృత్యము నెఱింగించి వారపుడు చేయఁదగు కృత్యమును జక్కఁగాఁ దేటపఱచి నిజరూపంబు వదలి యథాపూర్వముగ బాలుని రూపమును గ్రహించి యుండెను.

వసుదేవుఁ డాభగవంతునాజ్ఞను దల ధరియించి పాపని పుడిసెటిలో నిడుకొని కాలిసంకెళులు తమంతట విడిపోవ, గారాగారద్వారంబు చెంతకుం జని యందొడలెఱుంగక నిదురించు ద్వారపాలకులం గాంచి వెఱగంది ద్వారములు తమంతన ద్రోవనీయ నబ్బురపడుచుం బోయెను. యమునానది యిరుదరులు కనఁబడకుండఁ బ్రవహించుచుండియు నావసుదేవునకు

వెంటనే త్రోవ నొసంగెను. ఆరాత్రియందే నందునిభార్య యశోద యాడుపడుచుం గనియె. ఆశిశువును జూచి చూడకమునుపే నిద్రాభరంబున మేనుమఱచిన దయ్యె. ఇంతలో వసుదేవుఁడా శ్రీకృష్ణుం గొనిచని నందు మందిరంబున యశోద ప్రక్కన నిడి యాకొమరితం గైకొని వడివడి నరుదెంచెను. యశోదకుఁ గొమరిత పుట్టుట కాని యామె నెత్తుకొని కొడుకు నిడి వసుదేవుఁడు పోవుటగాని తెలియక పోయెను. మేల్కాంచి తనకుఁ గలిగిన పుత్త్రుఁడే యని తలఁచెను.

వసుదేవుఁ డాబాలికం గొని కారాగృహమును బ్రవేశింపఁగనే ద్వారములు యథాపూర్వముగా మూయఁబడియెను. బాలిక కావుకా వని యేడ్చెను. కావలివారు మేల్కాంచిరి. పదములు తడఁబడఁగా బరులెత్తి దేవకిఁ బిడ్డఁ గనె నని కంసునకుం దెల్పిరి. కంసుఁ డులికిపడెను. నిశ్చేష్టుఁ డయ్యెను. కొంతవడికిఁ దెలివి గల్గఁగాఁ గరవాలమును గైకొనియెను. వెండ్రుకలు వీడఁగాఁ బైచీర వ్రేలి యాడఁగాఁ బురిటింటికిం బరుగిడెను. శిశువుఁ గదియఁ జనుచుండెను. అంత దేవకి యడ్డంబు వచ్చి కన్నీరు మున్నీరుగాఁ బ్రవహించుచుండ,

ఉ. అన్న శమింపుమన్న తగ ◆ నల్లుఁడు గాఁ డది మేనగోడలా
మన్నన చేయుమన్న విను ◆ మానినిఁ జంపుట రాచపాడిగా
దన్న సుకీర్తివై మనఁగ ◆ దన్న మహాత్ములు పోవు త్రోవఁ బో
వన్న భవత్సహోదరిఁ గ ◆ దన్న నినున్ శరణంబు వేఁడెదన్.

అన్నా! ఇంచుక యాలోచింపుము.

క. కట్టా యార్గురుకొడుకులఁ
బట్టి వధించితివి గాదుఁ ♦ బడుచిది కోడల్
నెట్టన చంపఁగ వలెనే
కట్టఁడివి గదన్న యన్న ♦ కరుణి పగదే.

మఱొక్కమాట.

క. పుత్త్రుఁడు నీ బ్రదుకునకును
శత్రుం డని వింటి గాన ♦ సమయింపఁ దగుం
బుత్త్రులకు నోచ నైతిని
బుత్త్రీదానంబు చేసి ♦ పుణ్యము గనవే.

అని ప్రార్థించుచు నడ్డముగాఁ బోయి శిశువు నెత్తికొని పయ్యెద కొంగు కప్పెను. కంసుం డామాట లాలింపక క్రూరత్వమున నామెచేతినుండి యొడిసిపట్టుకొని వడిం బెడిసిపడం బుడమి పయిం బడ వైచెను. ఆబాలికయుఁ గంసుఁ డనుకొన్నరీతి నేలం బడక మింటి కెగసి దివ్యమాలికావిభూషితాంగయై మింటనుండి కంసునిం గూర్చి మూర్ఖా!

ఉ. తెంపరివై పొరిం బొరిని ♦ దేవకి బిడ్డలఁ జిన్నికుఱ్ఱలన్
జంపితి వంతనైన నుప♦శాంతి వహింపక తాలమీఁద నొ
ప్పింపఁగ నిస్సిరో యిదియు ♦ బీరమె నాపరసన్ జనించి నిన్
జంపెడి వీరుఁ డొక్కఁ డెస ♦ సత్కృతినొందెడువాఁడు దుర్మతీ.

అని పలికి దేవగణసంస్తూయమానయగుచు నదృశ్యయయ్యెను. అంతఁ గంసుఁ డాపలుకులకు సిగ్గుపడి భయపడి

యింటికిం జని మఱునాఁడు దేవకీవసుదేవుల రావించి సగౌరవ ముగా నాదరించి వినయ ముట్టిపడ

ఉ. పాపుఁడ బాలఘాతకుఁడ ♦ బంధువిరక్తుఁడ దుష్టచిత్తుఁడన్
గోపనుఁడన్ జరన్మృతుఁడ ♦ క్రూరుఁడ బ్రాహ్మణహంతభంగిమీ
పాపలఁ జంపితిన్ బయల్ ♦ పల్కులు నమ్మితి సాధులార! నా
పాపము లెగ్గడింపక కృ ♦ పాపరులై కనరే శమింపరే.

అని ప్రార్థించెను. పాదములపై వ్రాలి లేవకుండెను. వారిరువు రాతనిదైన్యమును గాంచి ప్రశమితకోపులైరి. విధివశమునకు మన మేమిచేయఁగలము లెమ్మా యని భీతిఁ బాపిరి. అత్తఱి వసుదేవుఁడు కంసుననుమతి దేవకిం దోడ్కొని నిజ మందిరంబున కరిగి సుఖముండెను.

అట నందుఁడు తనకుం గొడుకు పుట్టె నని విని మహానందంబునం బొదలి జాతకర్మకృత్యము నొనరించెను. గోకులమున నున్నవారెల్ల యశోదం జూడవచ్చి యాయర్భకుని వైఖరిం గన్నులారఁ గాంచి హర్షించిరి. కొందఱు

ఆ. ఏమి నోముఫలమొ ♦ యింత ప్రొద్దొకవార్త
వింటి మబలలార! ♦ వీను లలర
మనయశోద చిన్ని ♦ మగవానిఁ గనెనఁట
చూచి వత్త మమ్మ ♦ సుదతులారా.

అని యొండొరులం బిల్చుకొనుచుఁ బోయి యుబ్బురపాటున నాబాలకుం గాంచి యశోదానందులయదృష్టమును గొనియాడిరి. అప్పు డాతలోదరు లెల్ల

కం. జోజో కమలదళేక్షణ
జోజో మృగరాజమధ్య ♦ జోజో కృష్ణా
జోజో పల్లవకరపద
జోజో పూర్ణేందువదన ♦ జోజో యనుచున్.

పాడి దీవించిరి.

రోహిణియు మగశిశువును గనట విని నందుఁడామెకు వస్త్రభూషణాదుల నిచ్చి యాదరించెను. పిదప నందుఁడు మధురకుం జని కంసున కిచ్చుకప్పము నిచ్చి వసుదేవుం గానంబోవ నాతం డానందు నాదరించి కుశలప్రశ్నపూర్వకముగా మాటలాడుచు నతనియదృష్టమును బొగడుచు

క. నీకాంతయొద్ద నీవును
నీకాంతయు గారవింప ♦ నినుఁ దండ్రిగ నా
లోకించుచు నీవాఁందను
నాకొడుకున్నాఁడు నంద ♦ నందాన్వితుఁడై.

అని పలుక నందుఁ డామాటకుఁ దృప్తుఁడు కాక ఆర్యా!

శా. నీకున్ దేవకికిన్ జనించిన సుతా♦నీకంబుఁ దోడ్తోడ ము
న్నీ కంసుండు వధించె మీసుతఁ దుదిన్ ♦ హింసింపఁ జేఁ దప్పి తా
నాకాశంబున కేగె బాల యది దై♦వాధీన మాపద్దశన్
శోకం బందుటె తజ్జ్ఞుఁ డూఱడుము నా♦నూనుండు నీసూనుఁడే.

అని బదులుచెప్పెను. వసుదేవుఁడు కాలోచితముగా నీవిఁకఁ ద్వరగా వ్రేపల్లియకుం బొమ్ము. అనేకోత్పాతములు తోఁచెడు జాగరూకుఁడవై యుండు మని హెచ్చరించి పంపెను.

యింటికిం జని మఱునాఁడు దేవకీవసుదేవుల రావించి సగౌరవ ముగా నాదరించి వినయ ముట్టిపడ

ఉ. పాపుఁడ బాలఘాతకుఁడ ♦ బంధువిరక్తుఁడ దుష్టచిత్తుఁడన్
గోపనుఁడన్ జరన్మృతుఁడ♦ క్రూరుఁడ బ్రాహ్మణహంతభంగిమీ
పాపలఁ జంపితిన్ బయలఁ♦పల్కుల నమ్మితి సాధులార! నా
పాపము లుగ్గడింపక కృ♦పాపరులై కనరే శమింపరే.

అని ప్రార్థించెను. పాదములపై వ్రాలి లేవకుండెను. వారి రువు రాతనిదైన్యమును గాంచి ప్రశమితకోపులైరి. విధివశ మునకు మన మేమిచేయఁగలము లెమ్మా యని భీతిఁ బాపిరి. అత్తఱి వసుదేవుఁడు కంసుననుమతి దేవకిం దోడ్కొని నిజ మందిరంబున కరిగి సుఖముండెను.

అట నందుఁడు తనకుం గొడుకు పుట్టె నని విని మహా నందంబునం బొదలి జాతకర్మకృత్యము నొనరించెను. గోకుల మున నున్నవారెల్ల యశోదం జూడవచ్చి యాయర్భకునివైఖరిం గన్నులారఁ గాంచి హర్షించిరి. కొందఱు

ఆ. ఏమి నోముఫలమొ ♦ యింత ప్రొద్దోకవార్త
వింటి మబలలార! ♦ మీను లలర
మనయశోద చిన్ని ♦ మగవానిఁ గనె నఁట
చూచి వత్త మమ్మ ♦ సుదతులారా.

అని యొండొరులం బిల్చుకొనుచుఁ బోయి యబ్బురపాటున నాబాలకుం గాంచి యశోదానందులయదృష్టమును గొని యాడిరి. అప్పు డాతలోదరు లెల్ల

కం. జోజో కమలదళేక్షణ
జోజో మృగరాజమధ్య ♦ జోజో కృష్ణా
జోజో పల్లవకరపద
జోజో పూర్ణేందువదన ♦ జోజో యనుచున్.

పాడి దీవించిరి.

రోహిణియు మగశిశువును గనుట విని నందుఁడామెకు వస్త్రభూషణాదుల నిచ్చి యాదరించెను. పిదప నందుఁడు మధురకుం జని కంసున కిచ్చుకప్పము నిచ్చి వసుదేవుం గానంబోవ నాతం డానందు నాదరించి కుశలప్రశ్నపూర్వకముగా మాటలాడుచు నతనియదృష్టమును బొగడుచు

క. నీకాంతయొద్ద నీవును
నీకాంతయు గారవింప ♦ నినుఁ దండ్రిగ నా
లోకించుచు నీనందను
నాకొడుకున్నాఁడు నంద ♦ నందాన్వితుఁడై.

అని పలుక నందుఁ డామాటకుఁ దృప్తుఁడు కాక ఆర్యా!

శా. నీకున్ దేవకికిన్ జనించిన సుతా♦నీకంబుఁ దోడ్తోడ ము
న్నీ కంసుండు వధించె మీసుతఁ దుదిన్ ♦ హింసింపఁ జేఁ దప్పి తా
నాకాశంబున కేగె బాల యది దై♦వాధీన మాపద్దశన్
శోకం బందుట తజ్జ్ఞుఁ డౌటదుము నా♦నూనుండు నీనూనుఁడే.

అని బదులుచెప్పెను. వసుదేవుఁడు కాలోచితముగా నీ విఁకఁ ద్వరగా వ్రేపల్లియకుం బొమ్ము. అనేకోత్పాతములు తోఁచెడు జాగరూకుఁడవై యుండు మని హెచ్చరించి పంపెను.

నందుఁ డింటికిం బోవుచు నదృష్టపూర్వంబులైన యుత్పాతం బులం గాంచి వసుదేవునిపలుకు లన్వర్థము లని తలంచుచు నిం టికిం బోయెను.

పూతన వ్రేపల్లెకుం బోవుట.

కంసుఁడు తనమంత్రులం గూడి యాబాలిక పలికిన పలుకుల వినిపించి కర్తవ్య మాలోచించెను. వారేవో దంబ ములు పలికి యాకసము నెగురఁదన్నుదు మనియు, భూమిని జుట్టి చంకలోఁ బెట్టుకొందుమనియుఁ బలికిరి. కొలఁదిదినము లకే కంసుఁడు పూతన యను రక్కసిం బిలిచి పల్లెపల్లెలు కనుఁ గొనుచుం బోయి విచిత్రసంతానము గనంబడినఁ జంపి రమ్మని పంచెను. అదియు సుందరాంగమున విషపూరితవక్షోరుహయై వ్రేపల్లెకుం బోయి యీయింట నాయింటనున్న బాలకులం జూచుచు యశోదయింటికి వచ్చి బాలునిం గాంచెను. పూతన యిల్లుచొరఁగనే బాలకుఁ డాఁకలిగొన్నకరణి నేడ్చెను. అంత లో నిదురించెను. అంతలో నవ్వెను. అట్టితఱి బూతన నుయ్యా లకడఁ జేరి యశోద వల దమ్మా పిల్లవాఁడు క్రొత్తవారింజూచిన నేడ్చు నను నంతలోఁ ద్వరపడి బాలు నెత్తుకొని ముద్దాడి నాక న్నతండ్రీ!

క. నా చనుఁబా లొకగ్రుక్కం
డో చిన్నికుమార త్రావు ♦ మొయ్యన పిదపన్

నీచెలువ మెఱుఁగ వచ్చును
నాచెలువము సఫలమగును ♦ నలినదళాక్షా.

అని ముద్దాడుచుఁ బాలు ద్రావ మొదలిడెను. యశోద వలదనుచున్నను బాప మాపూతన యూరకుండ దయ్యెను. పూతన స్పృశింపఁగనే బాలుఁడు

సీ. మేల్కాన్న తెఱఁగున ♦ మెల్లన కనువిచ్చి
క్రీఁగంటఁ జూచుచుఁ ♦ గదికి నీల్గి
యావులించుచుఁ జేతు ♦ లాదరంబునఁ జాఁచి
మొదిగిలి యాఁకొన్న ♦ యోజనూఁది
బిగి చన్నుఁ గవఁ గేలఁ ♦ బీడించి కబళించి
గ్రుక్క గ్రుక్కకు గుటుఁ♦గుటుకు మనుచు
నొకరెండు గ్రుక్కల ♦ నువిదప్రాణంబులు
సైతము మేనిలో ♦ సత్వమెల్లఁ
తే. ద్రావె నదియును గుండెలు ♦ తల్లడిల్లఁ
జిమ్మఁ దిరుగుచు నిలువక ♦ శిరము వ్రాల
నితరబాలురక్రియ వాఁడ ♦ వీవు గావు
చన్ను విడువుము విడువుము ♦ చాలు ననుచు.

వాపోవుచు క్షణమాత్రమున నేలం గూలెను. దాని యాకారము మహావికృతమై చూచువారల కడ లొందవించెను. అది పడినను దానివక్షమునుండిన బాలు నెత్తుకొని స్వస్త్యయనముచేయించి నందుఁ డానందపరవశుఁ డయ్యెను. వ్రేపల్లియలోనివా రంద ఱిది యేమి యబ్బుర మని గుసగుసలు పోసాగిరి.

ఆర్య బాలకులారా! విషసహితసన్యపానమున శిశువు మృతి నొందకుండుట యెట్లని మీకుం దోఁపవచ్చుఁ గాని దానికి సమాధానముగా భాగవతమునందు

క. విషధరరిపుగమనునకున్
విషగళసఖునకును విమల ♦ విషశయనునకున్
విషభవ భవ జనకునకున్
విషమిచ్చిన విషముఁ గొనుట ♦ విషమే తలఁపన్.

అని వ్రాయఁబడిన పద్యమే హృద్యమగు సమాధానము. భగవంతునకుఁ జేయ శక్యములు గాని కార్యము లుండవు. ఇన్నివిధములఁ గనఁబడు సృష్టి చేసిన మహాత్మున కీస్వల్పకార్య మొనరించు టొక లెక్కయా. కాఁబట్టి సందియ మొందఁ బనిలేదు. తర్వాతికథ నాలకింపుఁడు.

శకటాసురునిఁ గృష్ణుఁడు కాలఁ దన్నుట.

కొలఁది దినములు సుఖముగాఁ గడచెను. పూతన మృతి యెట్లో కంసుని చెవి కెక్కెను. దాన మఱింత వాని మది బెదరుఁగాంచెను. బాలికపలుకులు సత్యము లని తోఁచెను. కాఁబట్టి విశ్వాసపాత్రుఁడయి తనకార్యముల నిర్వహింపఁ గంకణము గట్టుకొన్న శకటాసురుం జీరఁ బంచి కృత్యమును చెప్పి పంపెను. వాఁడు సకలమాయాకోవిదుఁడు. బాలగోపాలు నెత్తుకొని పోయి పాలియించఁ దగు నని యూహించెను. కాని య

ది శక్యమా? పూతనగతి యేమాయె నని తలంపఁ దయ్యెను. మృతి చేరువకు రాఁగా నూహలు పనికిరావన్న సామెత తప్పదు గద.

గోకులమున శ్రీకృష్ణుఁ డొదిగిలఁబడ నేర్చె నని యశోద పండుగు చేయ నెంచి భర్తకుం దెలుప నందుఁ డానందించి బంధువుల రప్పించి బ్రాహ్మణులను బిలిపించి వారి యాశీర్వాదములఁ గైకొని మృష్టాన్నదానంబున బంధువుల నానందింపఁ జేసెను. శ్రీహరికిఁ దల్లి పాలిచ్చి పడుకొనఁ జేసెను. సువాసినీపూజ చేయు సందడిలో నుండెను. కృష్ణుని చెంత నెవ్వరు లేకుండిరి. అంతలో బాలుఁ డాఁకొన్న చందమున లేచి పాదము పైకెత్తియుండెను. శకటాసురుఁ డరుదెంచి బాలకృష్ణు నెత్తుకొని పోవ నుంకింప నాదానవునిఁ గాలఁ దన్నెను. శ్రీహరి పాద తాడనమున నాశకటము తుత్తుమురై ధరఁ బడియెను. అందున్న ఘోరపదార్థములు చెదరి నేలం బడియెను. శకటము శకలములై మహాధ్వని గలుగ ధరం బడియెను. అందఱాధ్వని విని యులికిపడి యరుదెంచిరి. దిగులుపడిరి. ఇదేమి యాగడ మని చింతించిరి. బాలునకు గొప్ప గండము తప్పె నని సంతసించిరి. ఎట్టులీ బాలుఁ డీశకటమును దన్నె నని పలుభంగుల నూహించిరి. సమాధానము తోఁపమిఁ గొందఱు దైవగతిగాని వేఱొక్కటి కా దని పెదవులు విఱిచిరి. ఏల యీయూహలని కొంద ఱూరకుండిరి.

ఇంతలో యశోద యరుదెంచి విఱిగిపడియున్న శకట మును గాంచి ఆఁకలిగొని యేడ్చు చిన్నికుమారుని దిలకించి మహాప్రీతి

ఆ. అలసితివి గదన్న ♦ యాఁకొంటివి గదన్న
మంచి యన్న యేడ్పు ♦ మాను మన్న
చన్ను గుడుపుమన్న ♦ సంతసపడుమన్న
యనుచుఁ జన్నుఁగుడిపె ♦ నర్భకునకు.

నందాదు లాకార్యమును జూచి బాలునకు గ్రహము సోఁకె న ని దానిఁ దొలఁగింప బ్రాహ్మణులచే స్వస్త్యయనము చేయించిరి. బాలకృష్ణుఁడు పాలుగ్రోలి తృప్తుఁడై నిదురించెను. గోపికలు తాంబూలములు తీసికొని బాలు నాశీర్వదించి తమతమగృహ ముల కరిగిరి.

తృణావర్తుఁడు శ్రీకృష్ణు నెత్తుకొని పోవుట.

ఒక్కనాఁడు యశోదాదేవి తన కొమరుని దొడలపై నిడుకొని ముద్దాడి మేనెల్ల నివురుచుండఁగా నామె భరింప లేనంత బరువుగా శిశువు దేహము తోఁచెను. ఆబరువు మో యఁజాలక క్రిందఁ బరుండఁబెట్టి యిదేమిచోద్యము! వీఁడు సామాన్యుఁడగు పురుషుఁడు కాఁడు. భూభారమును హరింపఁ బుట్టిన మహాపురుషుఁ డని తోఁచెడిని. అని యూహించుచుం డెను. ఇంతలోఁ గంసునిపంపున నొకదానవుఁడు తృణావర్తుఁ డనువాఁడు సుడిగాలియై వచ్చి దుమ్ముచే నచ్చట నుండు గోపి

కల నయనంబుల నాచ్ఛాదించి యొక్కయెత్తున బాలు నెత్తు కొని పైకెగసెను. బాలునిం గానక యందఱు చేతులఁ బిసికి కొనుచుండిరి.

ఆదానవుఁ డాబాలునెత్తుకొని పైకెగసెను గాని యతఁడు పెద్దకొండవలెఁ దోఁపఁగా నాభారమునకుఁ దాళఁ జాలకపోయెను. ఇంతలో గోపాలుఁడు వానిం బట్టుకొని వ్రేలాడఁ జొచ్చెను. మఱింత బరువుకాఁగా వాఁడు కొండపడినట్లు క్రిందఁబడెను. పడినంతనే రక్తధారలు ముఖమునుండి ప్రవహింప విగతప్రాణుఁ డయ్యెను. ఆవింత చూచి యంద ఱచ్చెరు వందిరి. తమపూర్వజన్మపుణ్యవిశేషంబున నీకుమారుఁడు గల్గె ననియు, నెత్తుకొని ముద్దాడు భాగ్యము తమకు లభించె ననియుఁ దలంచిరి. ఇట్టి యుత్పాతము లెన్నివచ్చినను శ్రీకృష్ణున కపకారము కలుగదనియుఁ దలంచిరి. కొలఁదికాలము జరిగెను

మఱొకనాఁడు తల్లి పాలిచ్చుచుఁ గృష్ణునిముఖము నిరీక్షించెను. బాలు డావులించెను. ఆతనివదనమున సాగరములు ద్వీపములు కులశైలములు భూచక్రము. అవి యివి యన నేల సకలబ్రహ్మాండములు కనఁబడియెను. యశోద తబ్బిబ్బుచెంది కన్నులు మోడ్చి యిదేమి కలయా. నిక్కువమా యని యూహించెను. ఉత్తరక్షణమున భగవన్మాయచే నావార్త మఱచెను.

బలరామకృష్ణులు క్రీడించుట.

ఒక్కనాఁడు గర్గముని యరుదెంచిన నందుఁడు కులగురువగు నామునికి నమస్కరించి కుమారులం జూపి సంస్కారము లొనరింపవే యని ప్రార్థించెను. ఆముని వారిమహిమమును దెలిపి బలరాముఁ డనంతుఁడని, శ్రీకృష్ణుఁడు శ్రీమన్నారాయణమూర్తి యని వివరించి యథోచితసంస్కారములు జరిపి తనగృహమున కరిగెను. బలరామకేశవు లంత సరి యీడుబాలురతో నాడుకొనఁ బూనిరి. వరుసఁగా గృహమును దాటిపోవ నీడు వచ్చెను. వీథులలోఁ బొరుగిండ్లలో నాడుకొనుట కలవాటుపడిరి. ఆవల శ్రీకృష్ణుఁడు మాత్రము గోపికాగృహముల వెన్నదిన నారంభించెను. బాలచేష్టలచే వారి నానందపఱచుచుఁ గలఁతనొందఁ జేయుచుండెను. కొంతకాలమునకు వారితని చర్యల కులికి యశోదకడ కరుదెంచి తల్లి!

క. బాలురకుఁ బాలు లేవని
బాలెంతలు మొఱలుపెట్టఁ ♦ బకపక నగి యీ
బాలుం డాలను చేయుచు
నాలకుఁ గ్రేపులను విడిచె ♦ నంభోజాక్షి.

ఇంతియ కాదు.

క. మీపాపఁడు మాగృహముల
నాపోవఁగఁ బాలు ద్రావ ♦ నగపడకున్నన్

గోపించి పిన్నపడుచుల
వాపోవంగఁ జిమ్ముకొనుచు ♦ వచ్చెం దల్లీ.

అని యెన్నియో భంగులం జెప్పిరి. చిట్టచివఱకు

క. ఓయమ్మ నీకుమారుఁడు
మాయిండ్లను బాలు పెరుఁగు ♦ మననీఁ డమ్మా
పోయెద మెక్కడి కైనను
మాయన్నల సురభులాన ♦ మంజులవాణీ.

అని తమభావముల స్పష్టపఱచిరి. ఆమాట లాలించి యశోద కొడుకు నేమియు ననలేఁక వారిమాటలం దిరస్కరింపఁజాలక యాదరముతో

తే. అన్య మెఱుఁగఁడు తనయంత ♦ నాడుచుండు
మంచివాఁ డీతఁ డెగ్గులు ♦ మానరమ్మ
రామలార త్రిలోకాభి ♦ రామలార
తల్లులారా గుణవతీసు ♦ తల్లులారా.

యని వారల నభ్యర్థించి సాగనంపెను. ఒక్కనాఁడు కృష్ణుఁడు మన్నుదినుచున్నవాఁ డని బాలకులెల్ల యశోదకుం దెల్పిరి. బలరాముఁడు నౌ ననెను. తల్లి కొడుకుం జీరి యన్నా! మన్నేటికి భక్షించెదవు. మఱివస్తువులు లేవా నాయనా? ఇదేటి యాహారము రా యని బుజ్జగింపు మాటల నడిగెను. బాలుఁ డమ్మా! మన్నుదినుటకు నేనేల వెఱ్ఱివాఁడనా. ఆఁకొంటినా. వీరి మాటలు నమ్మకుమా నన్నుం గొట్టింప వీ రిట్లు చెప్పుచున్నవారు. నామాటలు నమ్మకున్న నానోరు వానసచూచి తప్పున్న

దండింపుమా యని పలికి నోరు తెఱచి చూపఁగా నందు సకల బ్రహ్మాండములు కనఁబడియెను. యశోద కనుంగొని తనమదిని

మ. కలయో వైష్ణవమాయయో యితరసం♦కల్పార్థమో సత్యమో
తలఁపఁగ నేరకయున్నదాననొ యశో♦దాదేవిఁ గానో పర
స్థలమో బాలకుఁ డెంత యీతనిముఖ♦స్థంబైన యజాండంబు ప్ర
జ్వలమై యుండుట కేమిహేతువొ మహా♦శ్చర్యంబు చింతింపఁగన్.

అని నిశ్చయించెను. అంతలో భగవన్మాయ తనుం గప్పు నూరకుండెను.

ఒక్కనాఁడు యశోద బాలునకుఁ బా లిచ్చి దధిమథనము చేయుచుండెను. అంతలోనే బాలుఁడు దధిభాండముల శకలంబులుగ నొనరింపంగాంచి బాలుంగానక చని వేఱొకయింటిలో ఱోలుతిరుగవేసి దానిపై కెక్కి యుట్టిమీఁద నున్న వెన్నఁ దినుచున్న తుంటరికొడుకును గృష్ణుని

మ. కని చేతన్ సెలగోలపట్టుకొనుచుం ♦ గా నిమ్ము కా నిమ్ము రా
తనయా యెవ్వరియందుఁ జిక్కుపడ నే ♦ దండంబునుం గాన నే
వినివారంబును బొందనే నెఱపునే ♦ విభ్రాంతియుం జెందము
న్ననియో నీవిటు నన్నుఁ గైకొనమి నేఁ ♦ డాకీతి సిద్ధించునే.

అని హెచ్చరించి తనకొడుకునడవడిం దలంచి తనమనంబు నందు

సీ. బాలుఁ డీతం డని ♦ భావింతు నందునా
యే పెద్దలును నేర ♦ రీ క్రమంబు
పలుపెఱుంగుటకు నై ♦ వెఱపింతు నందునా
కలిగి లేకొక్కఁడు ♦ గాని లేఁడు

వెలుపుతో నాబుద్ధి ♦ వినిపింతు నందునా
తనుc దానయ్యె బుద్ధి ♦ తప్పకుండు
నొండెఱుంగక యింట ♦ నుండెడి నందునా
చొచ్చి చూడని దొక ♦ చోటు లేదు
ఆ. తన్ను నెవ్వరైనc ♦ దలపోయc బాలెడి
యోజ లేదు భీతి ♦ యొకటి యెఱుcగc
దెలుపు నూరకుండc ♦ దెక్కునక్కులాడుc
బట్టి శాస్తిచేయు ♦ భంగి యెట్లు.

అని తలంచి సెలగోల జళిపించుచుc బరువెత్తు బాలుంగూడం
జని

సీ. స్తంభాదికంబులు ♦ తనకు నడ్డంబైన
నిట్టట్టు చని పట్టు ♦ నీనివాని
నీతప్పు సైరింపు ♦ మింక దొంగిలcబోవ
నే నని యనుచుట్టు ♦ నేడ్చువానిc
గాటుక నెఱయంగc ♦ గన్నులు నులుముచు
నెడలు కన్నీటితో ♦ నెగచువాని
నేడెన వచ్చునో ♦ యిది యని పలుమాఱు
నురుcగుచుc గ్రిcగంటc ♦ జూచువానిc
ఆ. గూడc బాటి పట్టు♦కొని వెఱపించుచు
జిన్ని వెన్నదొంగ ♦ చిక్కె ననుచు
నలిగి కొట్టc జేతు♦లాడక పూcబోcడి
కరుణసోడ బాలుc ♦ గట్టc దలcచి.

మెల్ల మెల్లన పరిహాసము తోcపc జేయునట్లుగా

క. వీరిద్దరు శ్రీకృష్ణులు
 గారా యెన్నఁడును వెన్నఁ ♦ గాన రఁట కదా
 చోరత్వం బించుకయును
 నేరరఁట ధరిత్రి నిట్టి ♦ నియతులు గలవే.

నాయనా! ఇం కెందుఁబోయెదవు? అని పలుకుచు నొక త్రాటితో ఱోటికిఁ గట్టివేసెను. బాలుఁ డూరకుండఁగాఁ దల్లి యిట్లే కొంతసేపుండ నిచ్చిన బుద్ధి వచ్చునని యింటికిం బోయెను. బాలుఁడు ఱోలు నీడ్చుకొని మద్దిచెట్లజంట యుండు చోటికిం బోయెను.

అట రెండు మద్దిచెట్లుండెను. అవి సాధారణవృక్షములుగావు. నలకూబరమణిగ్రీవు లను యక్షులు శాపవశమున నిట మద్దిచెట్లుగాఁ బుట్టిరి. వారు కుబేరుని కొడుకులు. అహంకారమున వెండికొండమీఁదఁ జేడియలంగూడి మందాకినీతరంగంబులఁ గ్రీడించుచుండ నారదముని యట నరుగుదెంచెను. ఆచేడియలు వలువలు ధరించిరి. సురాపానమున నొడలెఱుంగని నలకూబరమణిగ్రీవులు మాత్రము వివస్త్రులై యుండిరి. వారిం గాంచి నారదుఁడు

శా. సంపన్నుం డొరుఁ గానలేఁడు తనువున్ ♦ సంసారమున్ నమ్మి హిం
 సింపం జూచు దరిద్రుఁ డెత్తుపడి కు♦క్షింభూతుఁ డై చిక్కి హిం
 సింపం డన్యుల నాత్మకున్ సములుగాఁ ♦ జింతించు నట్లౌటఁ ద
 త్సంపన్నాంధున కంజనంబు వినుమీ ♦ దారిద్ర్య మూహింపఁగన్.

అని ప్రతీతం బగు గీతంబుం బాడి వారలం బిల్చి మీరు శ్రీమ

దాంధులరు గాన భూలోకంబున నర్జునతరువులై జనింపుఁ డని శపించి యచ్చో నూఱుదివ్యసంవత్సరము లుండి యటమీఁద గోవిందదేహస్పర్శనంబున ముక్తులరై సురలోకము నొందుఁ డని పలికి తన యిచ్ఛం బోయెను.

ఆవృక్షములకు శాపవిమోచనకాలము వచ్చెను. కావున శ్రీహరి యచటికి ఱోటి నీడ్చుకొనిపోయి యావృక్షముల నడుమ దానుండి యవ్వలికిం బోవ నీడ్చెను. ఆయులూఖల మానడుమ పట్టినంత లావు గలది కాన నాచెట్లు నేలం గూలెను. అందుండి వెడలివచ్చి యానలకూబరమణిగ్రీవులు భగవంతునిం బొగడి యనుమతులై తమలోకంబునకుం బోవుచు

శా. నీపద్యావళు లాలకించు చెవులున్ ♦ నిన్నాడు వాక్యంబులున్
నీపేరం బనిచేయు హస్తయుగముల్ ♦ నీమూర్తిపైఁ జూపులున్
నీపాదంబులపొంత మ్రొక్కు శిరముల్ ♦ నీసేవపైఁ జిత్తముల్
నీపై బుద్ధులు మాకు నిమ్ము కరుణన్ ♦ నీరేజపత్రేక్షణా.

అని యభ్యర్థించి తమయిచ్ఛం బోయిరి. ఆచోటికిం బోయి నందాదు లాయద్భుతకృత్యమును గాంచి యబ్బురపడిరి కాని బాలుఁడు దేవపాలకుఁ డని మాత్ర మెఱుంగఁ జాలరైరి. విష్ణుమాయ వారలం గప్పి యుండెను.

కొలఁదిదినముల కొకచోట నందాదులు చేరి గోకులమునఁ దోఁచిన యుత్పాతముల నెంచిరి. ఇచ్చోట నుండుట

మేలా యని విమర్శించిరి. అందొక వృద్ధగోపకుఁడు తనయెఱు
క మెఱసి వ్రేపల్లియం గల కష్టములఁ దేటపఱచి

క. కసవు గలదిరవు పసులకు
లసదద్రినదీమహీజ♦లతికావళి పెం
పెసఁగును గాఁపురమునకును
బొసఁగును బృందావనంబు ♦ పోదఁ దచ్చటికిన్.

అని హెచ్చరించెను. ఆమాట సర్వజనసమ్మత మయ్యెను. ఆది
నంబ నందానమతి బృందారకు లమృతవారాశికడ కరిగినట్లు
గోపకులు పయనంబు సాగించిరి. బలరామకృష్ణులను దల్లులు
తొడలపై నునిచికొని సంతోషమున రథ మెక్కి వెడలిరి. బృం
దావనమునం బ్రవేశించి యందలి శీతలచ్ఛాయలఁ బరితృప్తి
నివసించిరి. గోవు లందలి పావననిర్మలజలంబులం ద్రావి చల్లని
మ్రాఁకుల నీడలఁ బరుండి యతిమృదులతృణముల మేసి నీరో
గములై యొప్పారెను. బలరామకృష్ణులు తోడిగోపబాలురం
గూడి హాయిగాఁదిరుగుచు గోవుల మేపుచు విహరించుచుం
డిరి. అబృందావనమున నుండి మానవుల హింసించు వత్సాసుర
బకాసురుల వధియించి శ్రీకృష్ణుఁడు వనము నిర్భయముగా
నలరంజేసెను.

బ్రహ్మ గోగోపకుల నంతర్ధానము చేయుట.

ఒక్కనాఁడు శ్రీకృష్ణుఁ డెల్లరంగూడి వనమునకుం బో
యి చల్దు లారగించుచుండ నామహామహుని మహిమము నెఱుం

గఁగోరి బ్రహ్మ గోవులను గోపకులను దనశక్తిమెఱసి యంతర్థా
నము చేసెను. శ్రీహరి యావృత్తాంత మెఱింగి సాయంకాలము
గోవులతో గోపకులతో నింటికింబోయెను. ఈగోపకులు గోవులు
శ్రీకృష్ణేచ్ఛాకల్పితరూపముల నలరియించుకే నేవిధమున భేద
ము లేకయుండ నెవ్వరుగాని తెలిసికొనఁ జాల కుండిరి. ఒ
క్కసంవత్సర మీ ాకరణి గడచెను. బ్రహ్మయద్భుతశక్తి నావనంబు
న నున్న గోవులకు గోపకుల కావత్సరము క్షణమాత్రముగాఁ
దోఁచెను. ఒక్కనాఁడు విరించి వనంబున కరుదెంచి యం
దొక్కచోట

సీ. తన కన్యములు లేక ♦ తనరారి మున్మాల
విభుఁడయ్యుఁ గ్రేపుల ♦ వెదకువాని
నఖిలజ్ఞుఁడై యొక్కఁ ♦ డయ్యు నజ్ఞాకృతిఁ
జెలికాండ్రఁ బెక్కండ్రఁ ♦ జీరువాని
బహిరంతరాద్యంత♦భావశూన్యుం డయ్యు
నంతంత వడుగుచో♦ప్పరయువాని
గురుగభీరుండయ్యు ♦ గుఱుపులు వాఱుచు
నట్టిట్టుఁ బాతర ♦ లాడు వాని

ఆ. జాతిరహితుఁ డయ్యు ♦ జతురగోపార్భక
భావమెల్ల నచ్చు ♦ పడినమేని
చెలువువాని హస్త ♦ శీతాన్నకబళంబు
వానిఁ గాంచె నపుడు ♦ వాణిమగఁడు.

కాంచి రాయంచ డిగ్గి భక్తియుక్తుఁడై ప్రణామసహస్రంబు

లోనరించి బహుభంగుల వినుతించి తనచేసిన యపరాధం బు క్షమింపఁ బ్రార్థించి గోవుల గోపాలకుల విడిపించి భగవం తుననుమతిని బడసి వానిం జూడి పోవుచుఁ బ్రాంజలియై శ్రీ కృష్ణపరమాత్మను గన్నులారఁ దిలకించి పులకాంచితసర్వాంగుఁ డగుచు

సీ. శంపాలతికతోడి ♦ జలదంబుకైవడి
మెఱుఁగు టొల్లియతోడి ♦ మేనివానిఁ
గమనీయమృదులాన్న ♦ కబళవేత్రవిషాణ
వేణుచిహ్నంబుల ♦ వెలయువాని
గుంజావినిర్మిత ♦ కుండలంబుల వాని
శిఖిపింఛవేష్టిత ♦ శిరమువాని
వనపుష్పమాలికా ♦ వ్రాతకంఠము వాని
నలినకోమలచర ♦ ణముల వానిఁ

ఆ. కరుణ గడలుకొనిన ♦ కడకంటివాని గో
పాలబాలుభంగిఁ ♦ బరఁగువాని
నగుమొగంబువాని ♦ ననుఁ గన్న తండ్రిని
నిను భజింతు మ్రొక్కి ♦ నీరజాక్ష.

మ. నిను హింసించిన పూతనాదులకు ముక్తి ♦ నీమేటి సంకేత మి
చ్చిన నీకుం బరదారపుత్రగృహగో ♦ స్త్రీప్రాణదేహాదు లె
ల్లను వంచింపక యిచ్చు గోపకులకున్ ♦ లక్షింప నే మిచ్చెదో
యని సందేహము తోఁచుచున్నది ప్రప ♦ న్నానీకరక్షామణీ.

అని వినుతించి తనలోకమునకుం బోయెను. భగవన్నిర్మితగోగో పకులా భగవంతునియందే విలీనతనొంద బ్రహ్మ యాచ్ఛాదిం

చిన గోవులు గోపకులు యథారీతి నిండ్లకుం బోవ నంతయుఁ బూర్వపురీతి నుండెను.

ఒక్కనాఁడు బలరామకృష్ణులు వనమున గోవుల మేపుచుండ గార్దభాకారుండగు ధేనుకాసురుండు పొడసూప వాని బలరాముఁడు వధించెను. ఇట్లు దానవత్రయము నశింప నావన మెల్ల సర్వజనసులభగమ్య మయ్యెను. కాని యమునానదియం దొక్కచోటు జనుల కగమ్యమై యుండెను. ఆవిషయము శ్రీహరిమనమునఁ దోఁచెను. గోపాలకులం బిల్చుకొని తాను మాత్రమే గోవులం దోలుకొని శ్రీకృష్ణుఁడు వనమునకుం బోయెను. బలరాముఁ డాదినమున నింట నుండెను. వేణువు లూదుచు గోపాలురు శ్రీకృష్ణు ననుసరించి వనమున విహరించుచుండిరి. గోవు లిచ్ఛానుసారము మేయుచుండెను. హరి తనమనమున నేఁ డీకాళీయుని మడంపఁ దగు నని యూహించెను. వెంటనే గోవు లాప్రాంతమునకే మేయుచుఁ బోవసాగెను. గోపాలకులు వానివెంట హరింగూడి పోవుచుండిరి. మెల్లమెల్లన నెల్లరా మడుపును సమీపించిరి.

శ్రీకృష్ణుఁడు కాళీయఫణిని మర్దించుట.

ఆమడుఁగు కాళీయనాగవిషమున దూషితమై యేజంతువైనను దనచెంతకు రాఁజాలకుండ నంత భయమును గల్గించుచుండెను. ఆవిషవాయువు సోఁకినంత నాకాశమునఁ బోవుపక్షులు గిరగిరఁ దిరిగి దానిలోఁబడి చచ్చుచుండును. ఏజంతువులు

కానియామడుఁగునకు నీరుఁద్రావఁ బోవకుండును. ఇఁక మనుజులమాట యిటఁ జెప్పనేటికి? ఆచోటికి గోవులు పోఁగానే గోపాలకులలోఁ గొందఱు వాని మరలింపఁ జూచిరి. కృష్ణమూర్తి వారిని వారించి వేణునాద మొనరింప నవియన్నియు నొక్కచోటఁ జేరి చల్లనినీడఁ బరుండెను. ఇదియ సుసమయ మని తలంచి యెవ్వరికిం జెప్పక యామడుఁగు నొడ్డున విశాలకదంబమహీరుహము తన కొమ్మలచే నలుప్రక్కల నావరించి యుండఁగా నందొక్కశాఖమడుఁగు ప్రక్కకు సాగి ఆవిషవాయువులుసోఁకుటఁ గాలినట్లుండుదాని నెక్కి యందు దుముక భావించి

మ. కటి చేలంబు బిగించి పింఛమునఁ జ♦క్కం గొప్పు బంధించి దో
స్తటసంస్ఫాలన మాచరించి చరణ♦ద్వంద్వంబుఁ గీలించి త
త్కుటశాఖాగ్రముమీఁద నుండి యుఱికెన్ ♦ గోపాలసింహంబు ది
క్తటముల్ మ్రోయ హ్రదంబులో గుబగుబ♦ధ్వానం బనూనంబుగన్.

ఆధ్వని చెవిసోఁకగనే యెవ్వఁడో మూర్ఖబాలుఁడు నామడుఁగుఁ జొచ్చి కలఁచుచున్నవాఁ డని భూరితరరోషావేశంబునఁ దనచుట్టములం గూడి నీరు వెడలివచ్చి యీఁదుచున్న గోపాలకృష్ణునిం జుట్టుకొనియెను. ఇంచుకేని కదలకుండఁ జేసెను. దంతపాటవముకొలఁదిఁ గఱచెను. తన శక్తిసంతయుఁ గనంబఱచి బాధించెను. శ్రీహరియు దాని శక్తిఁ గననెంచి నిశ్చేష్టునికైవడి నుండెను. బాలురాయవస్థలోనున్న కృష్ణునింగాంచి భీతిల్లిరి. కొందఱు పరువిడి నందాదులకుం దెల్పిరి. యశోదాదు

లతోఁ జెప్పుచుఁ జెప్పుచుఁ గృష్ణుని స్థితియెట్లుండునో యని పరువిడిరి. పాప మా బాలకులకు శ్రీహరిమహిమ మిసుమంత యుఁ దెలియ లే దని చెప్పుట తప్పని నాకుం దోఁపలేదు.

నందాదు లావార్త యాలించినంతనే నోట మాటరా మి నేమియుఁ జెప్పక యెవరితోవస వారు పరుగిడిరి. కాళీ యఫణి కృష్ణునిం గఱచుచున్న దన్నమాట విన్న యశోదాదుల ప్రాణములు మీదివి మీఁదికే యెగసిపోయెను. ఒక్కరికైనను నోట తడిలేదు. స్మృతి యనుమాటయే లేదు. ఎటుపోవలయు నో తెలియకుండగాని యూద అచ్చటికే పోయిరి. బలరాముఁ డొక్కఁడు మాత్రము శ్రీహరిమహిమలు నెఱుంగుం గాపున వారి నూఱడిలంజేయుచు ధీరుఁడై పోయెను. తక్కుంగలవారి లో నొక్కఁడైన ధీరుఁడు లేకుండెను. యశోదాదులు కుయ్యో మొఱ్ఱో యని విలపింప సాగిరి. బలరాముఁ డించుక సుస్వరం బున హెచ్చరించెను.

అంతట శ్రీకృష్ణుఁడు మేను పెంచెను. ఫణిదంతములు శకలంబు లయ్యెను. నాగముమేనిశక్తి నశించెను. భగవం తుని మేను సోఁకినకతన నతఁడు నిశ్చేష్టుఁడు కాఁ జొచ్చెను. బ్రదుకుదునన్న యాశ తొలఁగి పోపుచుండెను. అంతట

సీ. ఘనయమునానదీ♦కల్లోలఘోష-బు
 సరసమృదంగఘో♦షంబు గాఁగ
సాధుబృందావన♦చరచంచరీక గా
 నంబు గాయకసుగా♦నంబు గాఁగఁ

కలహంససారస♦కమనీయమంజుళ
బృందములు తాళశ♦బ్దములు గాఁగ
దివినుండి వీక్షించు ♦ దివిజగంధర్వాది
జనులు సభాసీన♦జనులు కాఁగఁ

తే. బద్ధరాగాగ్రరత్నప్ర♦భాసమాన
మహితకాళియఫణిఫణా♦మంటపమున
నళినలోచనవిఖ్యాతి ♦ నర్తకుండు
నిత్యనైపుణమునఁ జేర్చి ♦ నృత్యమాడె.

ఆనర్తనమున మఱింత నాభుజగము చేష్టలు మానెను. మృతిగల్గక తప్ప దని రక్తము గ్రక్కెను. ఆగతి వీక్షించి యాభుజగరాజపత్నులు భగవంతునిఁ జేరి నమస్కరించి బహుభంగులఁ బ్రార్థించుచు

ఉ. ఆకులమయ్యె భోగ మిదె ♦ యౌఁదల లన్నియు వ్రస్సెఁ బ్రాణముల్
రాకల పోకలం బొలిసె ♦ రాయిడిపెట్టక మా నిజేశుపై
నీకరుణాకటాక్షములు ♦ నిల్పఁగదే తగ నో సమస్తలో
కైకశరణ్య యో యభయ♦కారణ, యో కమలామనోహరా!

ఆ. మమ్ముఁ బెండ్లిచేయు♦మాప్రాణవల్లభు
ప్రాణ మిచ్చి కావు ♦ భక్తవరద
నీవు చేయు పెండ్లి ♦ నిత్యంబు భద్రంబు
పిన్ననాఁటిపెండ్లి ♦ పెండ్లి గాదు.

అని విన్నవింప భగవంతుఁడు వారిదీనాలాపంబు లాలకించి కాళీయఫణి ననుగ్రహించి తననృత్యంబుఁ జాలించి యెల్లరు వినుచుండఁగా ఫణిపతితో

క. గోవర్గముతో మనుజాలు
త్రావుదు రీమడుఁగు నీరు ♦ దగ నిం దుండన్
నీవును నీబాంధవులును
నివనితలం సుతులుఁ జనుఁడు ♦ నేఁ డంబుధికిన్.

అని యాజ్ఞాపింప శ్రీహరియానతి శిరసావహించి చన నుంకించి పాదములకడ నిలువఁగా నతనిభావ మెఱింగి శ్రీకృష్ణపరమాత్మ

ఆ. గరుడభీతి రమణ♦కద్వీప మొల్లక
మడువుఁ జొచ్చితీవు ♦ మత్పదాబ్జ
లాంఛనములు నీత♦లను నుంటఁ జూచి యా
పక్షిరాజు నిన్నుఁ ♦ బట్టఁ డింక.

అని యనుగ్రహించిన నాతండు సపరివారుండై యమునానదీజలమార్గంబుననే చని రత్నాకరద్వీపంబునకుం బోయెను. శ్రీకృష్ణుఁడు జలము వెడలి రాఁగా నందాదు లానందపరవశు లైరి. భగవంతుఁడు తనమాయచే వారి నాచ్ఛాదింప, వారు భగవంతుఁ డని మఱచి కుమారుఁగా భావించి ముద్దాడిరి. పిదప బృందావనమున నిర్బాధకముగా నందఱు కొలఁదిదినములు గడపిరి. బలభద్రుఁడు ప్రలంబాసురుం గూలిచించి తనపరాక్రమంబు నెఱపెను. ఒకనాఁడు దావాగ్ని చుట్టుకొనఁగా నందున్న గోపకు లెల్ల భయభ్రాంతులై శ్రీకృష్ణుం జేరి

శా. నీమట్టాలకు నాపదల్ గలుగునే ♦ నేమెల్ల నీవార మ
న్యాచారంబు లెఱుంగ మీశుఁడవు మా ♦ కాభీలదావాగ్ని నేఁ

డేచందంబున నింకఁ దాఁటుదుము మ♦మ్మీక్షించి రక్షింపవ
న్నా చంద్రాభ! విపన్నులన్ శిఖివితా♦నచ్ఛన్నులన్ ఖిన్నులన్.

అని ప్రార్థింపఁ దనయనూనశక్తి తేటపడ నాదావాగ్నిని మ్రింగి వారల విగతదుఃఖస్వాంతులనుగా నొనరించెను. ఇట్లు సకలాపదల శ్రీహరి తొలఁగింప నందాదు లానందపరవశులై బృందావనమున నుండిరి. ఏకార్యము గాని శ్రీకృష్ణునను మతిలేక సాగకుండెను.

నందాదు లింద్రయాగము చేయఁ బూన హరి నివారించుట.

నందాదులు గుమిఁగూడి యింద్రయాగము చేయఁబూని శ్రీకృష్ణునికడకు వచ్చి తెలిపిరి. శ్రీహరి యింద్రయాగము వలదని పలుకుచు

క. కర్మమునఁ బుట్టు జంతువు
కర్మముననె వృద్ధిఁబొందుఁ ♦ గర్మమునఁ జెడుం
గర్మమె జనులకు దేవత
కర్మమె సుఖదుఃఖములకుఁ ♦ గారణ మధిపా.

క. కర్మములకుఁ దగుఫలములు
కర్ములకు నిడంగ రాజు♦ గాని సదాని
ష్కర్ముఁడగు నీశ్వరుండును
గర్మవిహీనునకు రాజు ♦ గాఁడు మహాత్మా.

అని యనేకవిధంబుల ధర్మంబు లుపదేశించెను. మఱియుఁ బర్వతమునకు విప్రప్రవరులకు మఖము చేయుట మంచి బుద్ధి

యనియు హెచ్చరించెను. ఇంద్రయాగమునకుఁగా సేకరించిన వస్తువులతో నీకార్యంబు చేయుట మంచిది. కాఁబట్టి

శా. గంధాలంకరణాంబరావళులచేఁ ♦ గై చేసి యిష్టాన్నముల్
బంధుశ్రేణియు మీరలుం గుడిచి నా ♦ భాషారతిన్ వేడుకల్
సంధిల్లన్ గిరిగోద్విజానలనమ♦స్కారంబు గావింపుఁ డో
జం ధర్మం బని తోఁచె నేని జనకా ♦ జన్మంబు ధన్యం బగున్.

అనియు నుండలించెను. ఆవచనంబులు మేలు మే లని యంద ఱంగీకరించిరి. పర్వతమునకు బహువిధపూజ లొనరించి నైవే ద్యము లర్పించిరి. దాన భగవంతుఁడు పరితృప్తి నొందెను. గోవుల నలంకరించిరి. విప్రులఁ బూజించిరి.

ఆరీతి నింద్రుఁడు డెలెంగి మహాగ్రహంబున మేఘంబుల రావించి గంభీరభాషణంబుల

శా. ఉద్యత్సంపద నమ్మి నందతనయో ♦ ద్యోగరేబునన్ వెట్టులై
మద్యాగంబు విసర్జనీయమని రీ ♦ మర్త్యుల్ వడిన్ మీరు మీ
విద్యుద్వల్లులఁ గప్పి గర్జనములన్ ♦ వేధించి గోవుల్ జనుల్
సద్యోమృత్యువుఁ బొంద రాల్ కురియుఁడీ ♦ శౌర్యం బవార్యంబుగన్.

అని యాజ్ఞాపింపఁగా మేఘంబులు భయంకరారావంబుఁ గావించుచుం బోయి యంబరంబు నెల్ల నావరించి పాషాణ వర్షంబుఁ గురియింప గోపకులాతురతం బొంది నిలువఁజాలక పుండరీకాక్షుకడకుం బోయి గోవులపరితాపంబులను స్వాంతం బులు పల్లటిల్లఁగా

ఉ. అక్కట వానఁ దోఁగి వ్రజ ♦ మాకులమయ్యెఁ గదయ్య కృష్ణ నీ
వెక్కడనుంటి వింత తడ ♦ వేల సహించితి నీపదాబ్జముల్
దిక్కుగ నున్నగోపకులు ♦ దీనత నొంద భయాపహారివై
గ్రక్కునఁ గాన కిట్లునికి ♦ కారుణికోత్తమ నీకుఁ బాడియే.

గోవర్ధనాద్రిని గృష్ణుఁ డెత్తుట.

అని విన్నవింపఁగా విని శ్రీహరి వారిభయం బుడిపి యొక్క కరంబున నవలీల నాపర్వతంబు నెత్తి ఛత్త్రాకారంబుగా వారి కమర్చి నవ్వుచు దీను లగువారిం గాంచి

శా. బాలుం డీతఁడు కొండ దొడ్డది మహా♦భారంబు సైరింపఁగాఁ
జాలండో యని దీని క్రింద నిలువన్ ♦ శంకింపఁగాఁ బోల దీ
శైలాంభోనిధి జంతుసంయుత ధరా ♦ చక్రంబు పైఁబడ్డ నా
కే లల్లాడదు బంధులార నిలుఁడీ ♦ క్రిందం బ్రమోదంబునన్.

అని పలికెను. శ్రీహరి పలుకుల నమ్మి యందఱా పర్వతము క్రిందికిం బోయిరి. ఏడహోరాత్రములు పర్వతమును గేల ధరించెను. గిరిభేది సిగ్గుపడి మేఘంబుల వర్షింప మానుఁ డని పలికెను. వాన తగ్గెను. గోపకు లెల్ల హర్షంబునం బొదలిరి. గోపకులు నందునిం గాంచి కృష్ణునింగూర్చి

సీ. కన్నులు తెఱవని ♦ కడుఁ జిన్నిపాపఁడై
దానవిచనుఁబాలు ♦ త్రాగి చంపె
మూఁడవనెలవాఁడు ♦ ముద్దులబాలుఁడై
కోపించి శకటంబుఁ ♦ గూలఁ దన్నె

నేఁడాది సుతుఁడై ♦ యెగసి తృణావర్తు
మెడఁబట్టుకొని కూల్చి ♦ మృతునిఁ జేసె
దల్లి వెన్నలకునై ♦ తను ఱోలఁ గట్టినఁ
గొమరుఁడై మద్దులఁ ♦ గూలనీడ్చెఁ
తే. బసులఁ గ్రేఁపులఁ గాచుచు ♦ బకునిఁ జీరి
వెలఁగతో వత్స దైత్యుని ♦ వ్రేసి గడపె
సబలుఁడై ఖరదైత్యుని ♦ సంహరించె
నితఁడు కేవలమనుజుఁడే ♦ యెంచిచూడ.

క. ఓనంద గోపవల్లభ
నీనందనుఁ డాచరించు ♦ నేర్పరితనముల్
మానవులకు శక్యంబులె
మానవమాత్రుండె నీకు♦మారుఁడు తండ్రీ.

అని వినుతించిరి. నందుఁ డాత్మను గర్గమహాముని పల్కుల దలంచి వారలకుం దెలుప వారు కృష్ణుఁ డనంతుఁ డని పూజించిరి. ఇంద్రుఁడు శ్రీకృష్ణుని వినుతించి ప్రార్థించి తదాజ్ఞ శిరసునఁ దాల్చి పోయెను.

శ్రీహరి యద్భుతగానము.

కొంతకాలమునకు సకలజనామోదకరంబగు శరత్కాలము వచ్చెను. చంద్రుఁడు తన యసమానజ్యోత్స్నావితానమునఁ బ్రపంచము నావరించి మహానంద మొట్టిపారికైన నిచ్చుచుండెను. అత్తఱిఁ బుండరీకాక్షుండు బృందావనంబున నొకచోటఁ గూరుచుండి జగన్మనోహరంబుగా గానము చేసెను.

ఆమురళీగానము పాషాణములకేని చపలతంగూర్పక మానదన నింక గోలోకమునుండి శ్రీకృష్ణప్రీతికై యవతరించిన గానప్రియులగు గోపికలమాట యిక్కఁ జెప్పనేటికి? ఆగానము విశేషించి యాసుదతుల శ్రుతిపుటముల ద్వారా మదులఁ బ్రవేశించెను. ఏపనిచేయుచున్నవా రాపనిని వదలి యెవ్వరికిం జెప్పక యుచటికిం బరుగిడిరి. ఔరా! ఏమి యాభగవన్మాయామహిమము!

ఆ. బాంధవమున నైనఁ • బగనైన వగనైనఁ
ప్రీతి నైనఁ • బ్రాణభీతి నైన
భక్తి నైన హరికిఁ • బరతంత్రులై యుండు
జనులు మోక్షమునకుఁ • జనుదు (రు తుది)

అనుట సుప్రసిద్ధమే కదా! ఇట్లు తనగానమును విని వచ్చిన యాచేడియలం గాంచి శ్రీహరి యుల్లస న్మధురస్వరం బుల్లసిల్లఁగా కాంతలారా! మీ రిటువచ్చుట పాడియా

సీ. ప్రాణేశుఁ డెఱిఁగినఁ • బ్రాణంబునకుఁ దగు
దండించు నెఱిఁగిన • ధరణివిభుఁడు
మామ యెఱింగిన • మనువెల్లఁ జెడిపోవుఁ
దలవరి యెఱిఁగినఁ • దగులు చేయుఁ
దలిదండ్రు లెఱిఁగిన • దలలెత్తకుండుదు
రేరా లెఱింగినఁ • నెత్తిపొడుచు
న్నాత్మజు లెఱిఁగిన • నాదరింపరు చూచి
బంధువు లెఱిఁగిన • బహి యొనర్తు
ఆ. లితరు లెఱిఁగిరేని • యెంతయుఁ జులుకఁగాఁ
జూతు రిందు నందు • సుఖము లేదు

యశము లేదు నిర్భ ♦ యానందమును లేదు
జారుఁ జేరఁ జనదు ♦ చారుముఖికి.

మఱొక్క చక్కనిమాట

క. నడవడి కొఱ గాకున్నను
బడుగైనఁ గురూపియైనఁ ♦ బామరుఁ డైనన్
జడుఁడైన రోగియైనను
విడుచుట మరియాద గాదు ♦ విభు నంగనకున్.

అనిన విని యావల్లవాంగనలు భక్తిపరతంత్రలై

మ. అకటా! నమ్మితి మేము కూర్మిరుఁ డని ని ♦ న్నర్థించె మాయిండ్లలో
సకలవ్యాప్తుల డించి నీపదసరో ♦ జాతంబు లర్చింపఁ జొ
క్కక యేతెంచితి మీకుఁడా ధృతుఁడవు మో ♦ క్షాసక్తులం గాచుపో
లికఁ గావం దగుఁ గావవే విడువ మే ♦ లే కాంతలన్ భ్రాంతలన్.

శ్రీకృష్ణా!

సీ. నీపాదకమలంబు ♦ నెమ్మి డగ్గరఁ గాని
తరలిపోవంగఁ బా ♦ దములు రావు
నీకరాబ్జంబులు ♦ నెఱినంటితివఁ గాని
తక్కినపనికి హ ♦ స్తములు సాగవు
నీవాగమృతధార ♦ నిండఁ గ్రోలఁగఁ గాని
చెవు లన్యభాషలు ♦ చేరి వినవు
నీసుందరాకృతి ♦ నియతిఁ జూడఁగఁ గాని
చూడ నన్యంబులఁ ♦ జూడ్కి కవలు

ఆ. నిన్నుఁ గాని పలుక ♦ నేరవు మాజిహ్వ
లొల్ల ననుచుఁ బలుక ♦ నోడ వీవు

మామనంబు లెల్ల ♦ మఱపించి డాఁగిలి
తేమి చేయువార ♦ మింకఁ గృష్ణ.

అని పలుకునంతలో శ్రీహరి వారిం బరీక్షింపఁగోరి యదృశ్యుం డయ్యెను. అత్తఱి నామత్తకాశినులు తత్తఱంబున నిందు నందు వెదకుచు విభ్రాంతలు గావున

సీ. పున్నాగ కానవే ♦ పున్నాగవందితు
దిలకంబ కానవే ♦ తిలకనిటలు
ఘనసార కానవే ♦ ఘనసారశోభితుఁ
బంధూక కానవే ♦ బంధుమిత్రు
మన్మథ కానవే ♦ మన్మథాకారుని
వకుళంబ కానవే ♦ వంశధరునిఁ
జందన కానవే ♦ చందనశీతలుఁ
గుందంబ కానవే ♦ కుందరదను

తే. నింద్రభూజము కానవే ♦ యింద్రవిభవుఁ
గువలవృక్షమ కానవే ♦ కువలయేశుఁ
బ్రియకపాదప కానవే ♦ ప్రియవిహారు
ననుచుఁ గృష్ణుని వెదకి ర ♦ య్యబ్జముఖులు

అనుచు వెదకుచు శ్రీహరిచరణాంబుజంబు లాభూతలంబున నంకితంబులై యుండఁ గాంచి మహాభక్తియుఁ బ్రేమము తనరారుచుండఁగా

సీ. ఈచరణంబులే ♦ యిందువిభానన
సనకాదిమునియోగ ♦ సరణి నొప్పు
నీపాదతలములే ♦ మొలనాఁగ శ్రుతివధూ
సీమంతవీథులఁ ♦ జెన్ను మిగులు

నీపదాబ్జంబులే ♦ యిభకులోత్తమయాన
పాలేటిరాచూలి ♦ పట్టుఁగొమ్మ
నీసుందరాంఘ్రులే ♦ యిందీవరేక్షణ
ముక్తికాంతామనో ♦ మోహనంబు
ఆ. నీయడుగులరజమె ♦ యింతి! బ్రహ్మేశాది
దివిజవరులు మౌళి ♦ దిశలఁదాల్తు
రనుచుఁ గొంద అబల ♦ లబ్జాక్షుఁ దేగిన
క్రమముఁ గనియు నతనిఁ ♦ గానరైరి.

మరలి వారెల్ల నిండ్లకుం జనిరి. శ్రీకృష్ణుఁడు సర్వగతుఁడు గావున వారిభర్తలఁ దనరూపమునఁ గనంబడఁజేసి వారి సంతాపముల నివారించెను. జలక్రీడల రాసక్రీడల నిరంతరంబు వారిభర్తలు శ్రీకృష్ణరూపంబుల వారికిం గనంబడుచుండిరి. ఇట్లు సర్వాంతర్యామి యగు శ్రీకృష్ణపరబ్రహ్మ మలరారుచుండెను.

కొంతకాలమునకు శ్రీహరి వృషభాసురుం జంపి కేశివ్యోమదానవులం బొలియించి బృందావనప్రాంత్యముల దానవసంచారము లేకుండఁజేసి యందలి ప్రజల నెల్ల సంతోషపరవశులఁగా నొనరించెను. పిదపఁ గొన్ని నెల లించు కంతయు భీతిగాని విచారముగాని లేక నందాదు లానందమునకు నిదానమగు శ్రీకృష్ణునిచేష్టలం గాంచుచు హాయిగాఁ గాలమును గడపుచుండిరి. ఒక్కనాఁడు నారదముని శ్రీహరిచెంతకు వచ్చి కంసాదిదానవవధంబు చేయుట ముఖ్యకర్తవ్యం బని నొక్కి

చెప్పిపోయెను. గోపాలబాలునిచిత్తమున నాయూహ కల్గెను. వెంటనే కంసునిమదిని శ్రీహరిని బిలిపించి చంపింపఁ దగు నను నుద్యమము పొడసూపెను. అక్రూరుఁడు తనకు మిత్రుఁడౌట నాతనిం బిలువంబంచి మథురానగరంబున కరిగి బలరామకృష్ణు లం దోడుకొని రమ్మని యాజ్ఞాపింప నాతం డామాటలఁ బర మాదరంబునఁ దలపై నిడుకొని పయనము సాగించెను.

అక్రూరుఁడు బృందావనమున కరుదెంచుట.

పయనము చేయుచు మార్గమునఁ దనలో

శా. ఎట్టి తపంబు చేయఁబడె ♦ నెట్టి చరిత్రము లబ్ధమయ్యెనో
యెట్టి ధనంబు లర్హులకు ♦ నీఁబడెనో తొలిబామునందు నా
యట్టి వివేకహీనునకు ♦ నాదిమునీంద్రులు యోగదృష్టులం
బట్టఁగ లేని యీశ్వరుని ♦ బ్రహ్మమయుం హరిఁ జూడఁ గల్గెడిన్.

ఉ. మాపటివేళ నేను జని ♦ మాధవుపాదసమీపమందు దం
డాపతితుఁ డనైన తతఁ ♦ డాశుగ కాలభుజంగ వేగసం
తాపిత భక్తలోకభయ♦దారణమైన కరాబ్జమూఁదలన్
మోపి హసించి నా కభయముం♦గృపతోడుత నీయఁ గుంతునే.

అని తలంచుచు బృందావనముఁ బ్రవేశించి రథంబు దిగి యందు

మ. కనె నక్రూరుఁడు పద్మనేత్రులను రం♦గద్గోత్రులన్ ధేనుదో
హనవాటీగతుల న్నలంకృతుల ను♦ద్యద్భాసులం బీతనీ
లనవీనోజ్జ్వలవాసులన్ గుసుమమా♦లాధారులన్ ధీరులన్
వనితాకాములఁ గృష్ణరాముల జగ♦ద్వంద్యక్రమోద్దాములన్.

కనినంతనే వారిపాదములకు భక్తివినయంబులు పెనఁగొన నమస్కరించెను. అంత భక్తవత్సలుండగు శ్రీహరి యక్రూరు నతివాత్సల్యమునఁ గౌఁగిలించుకొనియె. బలభద్రుండు నతనిఁ గౌఁగిలించుకొని కుశలం బడిగెను. అంత రామకృష్ణులు తమగృహమున కాతనిం గొనిపోయి యాతిథేయసత్కారము లాచరించి మృష్టాన్నమున సంతుష్టుం జేసిరి. అంత నందుఁడును యథోచితముగ నాతని నాదరించి ఆర్యా!

క. చెలియలు మొఱ యిడ నల్లుర
ఖలుఁడై గొరికొనిన యట్టి ♦ కంసుఁడు బ్రదుకం
గలఁడే మనికి దశార్హుల
కిలపై మీసేమ మింక ♦ నేమని యడుగన్.

అని ప్రశ్నించెను. ఆవల నక్రూరుండు తగినట్లు సంభాషించి తా వచ్చిన కార్యం బెఱింగింప శ్రీహరి సమ్మతించెను. ఆవలఁ బ్రయాణసన్నాహము చేయఁబడియె. అక్రూరునియరదంబుపై రామకృష్ణులు కూరుచుండి మధురానగరంబుఁ గానఁబోయిరి. అంత నక్రూరుఁడు తన యింటికి వేంచేయుఁ డని ప్రార్థింప శ్రీహరి కంసవధానంతర మరుదెంతు. ఇపుడు పొమ్మని యక్రూరుని సాగనంపి యపరాహ్ణంబున బలభద్రగోపాలురం గూడి మధురం బ్రవేశించుచుండఁగా గోపాలకృష్ణునిఁగన్నుల కఱవు దీఱఁ గాంచిన సుందరు లితరకాంతలం బిల్చుచు మహానందంబునఁ జూచుచుఁ దమలోఁ దమరు

సీ. వీఁడటే రక్కసి ♦ విగతజీవఁగఁ జన్ను
బాలు ద్రావినమేటి ♦ బాలకుండు
వీఁడటే నందుని ♦ వెలఁదికి జగమెల్ల
ముఖమందుఁ జూపిన ♦ ముద్దులాఁడు
వీఁడటే మందలో ♦ వెన్నలు దొంగిలి
దర్పించి మెక్కిన ♦ దాఁపరీఁడు
వీఁడటే యులయించి ♦ వ్రేతలమానంబు
చూఱలాడిన లోక ♦ సుందరుండు

తే. వీఁడు లేకున్నఁ బుర మట ♦ వీస్థలంబు
వీనిఁ బొందనిజన్మంబు ♦ విగతఫలము
వీనిఁ బలుకని వచనంబు ♦ విహగరుతము
వీనిఁ జూడని చూడ్కులు ♦ వృథలు వృథలు.

అని చెప్పుకొనుచుఁ దృప్తినొందని నేత్రములం జూచిరి.

ఆతరుణమున నగరద్వారంబునుండి రాగకారుండగు నొక్క రజకుఁడు వచ్చుచుండెను. వానిం జూచి శ్రీహరి

ఉ. విందులమై నరేశ్వరుని ♦ వీటికి వచ్చితి మేము మాకు మా
మందలలోనఁ గట్టుకొన ♦ మంచిపటంబులు లేవు నీముడిఁ
సుందరధౌతచేలములు ♦ శోభిలుచున్నవి తెమ్ము నిన్ను మే
లందెదు నిమ్ము రాజుదెస ♦ నల్లుర మోరజకాన్వయాగ్రణీ.

అన రోషించి వాఁడు తిరస్కరింపఁ గృష్ణుం డతని సంహరించి వలసిన వస్త్రంబుల నన్నయుఁ దానుం గట్టుకొని మిగిలినవానిని గోపకుల కొసంగి నగరమునఁ బోవుచుండ నొక తంతువాయ కులజుఁ డా దేవకీపుత్రరత్నముం గాంచి యతిమృదువస్త్రాభరణ

ములనొసంగ నాహరి ధరించి వాని నాదరంబునఁ గాంచి యనంతైశ్వర్యంబు ననుగ్రహించి సారూప్యంబుఁ గటాక్షించెను. పిదప వారటనుండి సుదాముఁ డనుమాలాకారునింటికిం బోయిరి. వాఁడు భక్తిఁ బూజించి సుగంధికుసుమదామకంబు లొసంగ వానిన్ ధరించిరి. వానిభక్తికి మెచ్చి శ్రీహరి వరమేమికోరెద వనఁగా వాఁడు

క. నీపాదకమలసేవయు
నీపాదార్చకులతోడి ♦ నెయ్యము నితాం
తాపారభూతదయయును
దాపసమందార నాకు ♦ దయచేయఁ గదే.

అని ప్రార్థింప సంతోషించి బలాయుఃకీర్తిసంపద లొసంగి యటనుండి వెలువడి పయనము సాగించుచుండఁ గుబ్జయను లేమ కనఁబడెను. కృష్ణుఁ డీలేపన మెవ్వరికిఁ గొనిపోయెదు? నీ వెవ్వతెవు? మాకిమ్ము. నీవు చక్కనగుచు నివ్వటిల్లెద వన నాకుబ్జయు

ఉ. చక్కనివాఁడవౌదు పర ♦ సంబుల నొంపకు మెల్లవారికిం
జక్కఁదనంబు లెక్కడివి? ♦ చారుశరీర త్రివక్ర యంద్రు నే
నిక్కము కంసుదాసిని ని♦నిర్మలలేపనవిద్యదాన నై
మిక్కిలి రాజు మెచ్చఁ దగ ♦ మీరు విలేపనముల్ ధరింపరే.

అని యొసంగిన వాని ధరించి వాని పాదములపైఁ దనపాదములుంచి కృష్ణుఁడు దానిం బట్టి చక్కఁగ నెత్తిన మువ్వంకలు మాని యాలేమ చక్కనై మనధుబాణముక్రియ నలరి మహాత్మా! నాయింటికి విచ్చేయు మని ప్రార్థింప వచ్చిన కార్యముం దీ

ర్చి యవ్వల నరుదెంతు నని మాట యిచ్చి విపణిమార్గంబునఁ బోవుచుఁ బౌరు లొసంగు కానుకల నంగీకరించుచు ధనుశ్శాలకుం బోయి యందొకధనుస్సును గని సంధింపఁబూన నది శబ్దించుచు శకలంబు లయ్యెను. అంత సూర్యుఁ డస్తమించెను. నందాదు లొకచోట విడిసి యారాత్రి గడపిరి.

మఱునాఁడు కాల్యములు తీర్చి నందాదులు తమకు తెచ్చిన కానుకలను గంసున కర్పించి తదనుమతులై యథార్హాపీఠముల నుపవిష్టులైరి. రామకృష్ణు లలంకృతులై మల్లదుందుభినిస్వనంబు విని రంగద్వారముకడకుం జని కువలయాపీడమను మదగజంబును గాంచిరి. అది కంసునిచే శ్రీకృష్ణుం జంపఁ బెంపఁబడినది. దానిని కుంజరపాలకుఁడు రామకృష్ణులమీఁదికిం దోలుచుండెను. కృష్ణుండు వానియుద్యమం బెఱింగి పరాక్రమంబున నొక్కనిమేషమున దానిం బొలియంజేసి రంగస్థలమును బ్రవేశింప వారి నిరువురంగాంచి కంసుఁ డులికిపడియెను. కువలయాపీడవధవార్త ముందే యాతనిచెవులఁ జొరఁబడియే యుండెను.

పుణ్యమూర్తులగు రామకృష్ణులు సభలోనికి వచ్చుచుండఁగాఁ బౌరు లానందపరవశులై వారలం గాంచి హర్షించి వినుతించిరి. వారు సభలోఁ బ్రవేశింపఁగనే వారితోఁ బోరాడఁ జాణూరముష్టికు లను మల్లు లిద్దఱు నిలువఁబడియుండిరి. అందుఁ జాణూరుండు సోదరులం గాంచి గంభీరరవంబున

మ. వనమార్గంబున గోపబాలకులతో ♦ వత్సంబులన్ మేపుచున్
వెనఁగన్ మిక్కిలి నేర్చినారనుచు నీ ♦ పృథ్వీజనుల్ చెప్ప మా
మనుజేంద్రుం డిట మమ్ముఁ జేరఁ బనిచెన్ ♦ మల్లాహవక్రీడకున్
జనదే కొంత పరాక్రమింప మనకున్ ♦ సభ్యుల్ విలోకింపఁగన్.

ఇం కొక్కమాట

మ. జవసత్త్వంబులు మేలె సాము గలదే ♦ సత్రాణమే మేను భూ
ప్రవరుం బోనన మిమ్మునంగవలె నే ♦ పాళీ లభీష్టంబులే
పవివో కాక కృతాంతదండకమవో ♦ ఫాలాక్షునేత్రాగ్నివో
నవనీతంబుల ముద్ద గాదు మెసఁగన్ ♦ నాముష్టి గోపార్భకా.

ఇట్లు పలికిన వానిగర్వోక్తులన్ విని శ్రీహరి తనలో నవ్వు గొనుచు

ఉ. సాములు లేవు పిన్నలము ♦ సత్త్వము గల్దన రాదు మల్లసం
గ్రామవిశారదుల్ కులిశ♦కర్కశదేహులు మీరు మీకడన్
ఏము చరించు టెట్లు ధర♦ణీశునివేడ్కలు చేయువారముం
గాము వినోదముల్ సలుపఁ ♦ గా దనవచ్చునె యొక్కమాటికిన్.

అని పలుకఁగా విని చాణూరుం డాగ్రహించి గర్వము తన్ను ముంపఁగా

క. ప్రల్లద మేటికి గోపక
బల్లిదుఁడను లోకమందుఁ ♦ బ్రఖ్యాతుఁడ నా
చల్లడము క్రిందఁ దూఱని
మల్లురు లే రెందు ధరణి♦మండలమందున్.

ఇంతియు గాదు.

సీ. చలమున ననుడాసి ♦ జలరాశిఁ జొర రాదు
నిగిడి గోత్రముదండ ♦ నిలువరాదు

కేడించి కుంభిని ♦ క్రిందికిఁ బోరాదు
మనుజసింహుఁడ వని ♦ మలయరాదు
చేరినఁ బడవైతుఁ ♦ జేయి చాఁపఁగ రాదు
బెగసి నాముందటఁ ♦ బెరుఁగరాదు
భూనాథహింసకుఁ ♦ బోరాదు నను మీఱి
శోధింతు గానలఁ ♦ జొరఁగరాదు
ఆ. ప్రబలమూర్తి ననుచు ♦ భాసిల్లఁగా రాదు
ధరఁ బ్రబుద్ధుఁడ వని ♦ తలఁపరాదు
కల్కితనము చూపి ♦ గర్వింపఁగా రాదు
తరముగాదు కృష్ణ ♦ తలఁగు తలఁగు.

అదిగాక నీవు శ్రీహరి నని భావింతువేమో!

సీ. మహిమతో నుండంగ ♦ మధురాపురము గాని
పాలుపార వైకుంఠ ♦ పురము గాదు
గర్వంబుతో నుండఁ ♦ గంసునిసభ గాని
సంసారరహితుల ♦ సభయుఁ గాదు
ప్రకటించి వినఁగ నా ♦ బాహునాదము గాని
నారదువీణాస్వ ♦ నంబు గాదు
చదురు లాడఁగ మల్ల ♦ జనవిగ్రహము గాని
రమతోడి ప్రణయవి ♦ గ్రహము గాదు
తే. వెలసి తిరుగంగ ♦ వేదాంతవీధి గాదు
మొఱఁగి పో మునిమనముల ♦ మూల గాదు
పాఁగి నడువంగ భక్తుల ♦ జాడ గాదు
శౌరి నాప్రోల నీ వెందుఁ ♦ జనియె దింక.

అని భయంకరసింహనాదంబు చెలఁగఁ బలికిన విని శ్రీహరి నవ్వుచు నీతో నేఁ బోరాడెద. బలరాముఁడు ముష్టికునితోఁ బోరాడెడు నని పలికి వానిని మార్కొనియె. ఇట్లు తలఁపడి పట్టు లచ్చెరు వందఁ బోరాడి ముహూర్తమాత్రంబున హరి చాణూరుని, బలరాముఁడు ముష్టికునిం బొలియించిరి.

కంసవధము.

ఆకృత్యముం గాంచి కంసుండు మంత్రులంజూచి యాగ్రహంబున

ఉ. వల్లవబాలురన్ నగరివాకిటికిన్ వెడలంగఁ ద్రొబ్బుఁడీ
గొల్లల ముట్టికోల్ కొనుఁడు ♦ క్రూరుని నందునిఁ గట్టుఁ డుర్వికిం
దెల్లముగాఁగ నేఁడు వసు♦దేవునిఁ జంపుఁడు తండ్రి గాఁడు వీఁ
డెల్లవిధంబులం బరుల ♦ కిష్టుఁడు కావకుఁ డుగ్రసేనునిన్.

అని యింక నేమో కాఱులాడుచున్న కంసునితులువపలుకుల కాగ్రహించి

శా. జంఘాలత్వముతో నగోపరిచర ♦ త్సారంగహింసేచ్ఛను
ల్లంఘింపన్ గమకించు సింహము క్రియన్ ♦ లక్షించి పౌరప్రజా
సంఘాతంబులు తల్లడిల్ల హరి కం♦సప్రాణహింసార్థియై
లంఘించెన్ దమగంబుమీఁదికి రణో♦ల్లాసంబు భాసిల్లఁగన్.

అట్లు లంఘించి యెల్లరు నిశ్చేష్టులై కనుంగొనుచుండఁగా

శా. పక్షీంద్రుం డురగంబుఁ బట్టు విధ మొ♦ప్పం గేశబంధంబు లో
కక్షోభంబుగఁ బట్టి మౌళిమణు లా♦కల్పాంతవేళాపత
న్నక్షత్రంబులభంగి రాల రణసం♦రంభంబు డిందించి రం
గక్షోణిం బడఁ ద్రొబ్బెఁ గృష్ణుఁడు వెసం ♦ గంసున్ నృపోత్తంసునిన్.

క్రిందఁబడి పంచత్వంబునొందినకంసుని శ్రీకృష్ణుఁ డీడ్చెను. కంసునితేజస్సు శ్రీహరిలోఁ బ్రవేశించెను. కంసుసోదరుల న్యగ్రోధగహ్వాలనువారల బలరాముఁడు వధించెను. ఆసమయమున

క. చేతులఁ దాళము లొత్తుచుఁ
 జేతోమోదంబుతోడ ♦ సిగముడి వీడం
 బాతరలాడుచు మింటను
 గీతము నారదుఁడు పాడెఁ ♦ గృష్ణా యనుచున్.

ఆవల శ్రీహరి వసుదేవుని జెఱనుండి విముక్తుని గావించి యుగ్రసేనునకుఁ బట్టంబుఁ గట్టి చెఱసాలనున్నరాజులవిడిపించి గోపికలకడ కుద్ధవునిం బంచి తమకుశలవార్తాశ్రవణమున వారిసంతాపంబులు మాన్చి యక్రూరునింటికిం జని యందు మృష్టాన్నంబుల భుజించెను. సంతృప్తి నొందినశ్రీహరిం గాంచి యక్రూరుఁడు భక్తిభరంబునఁ జేతులు ముకుళించి

శా. ఏపుణ్యాతిశయప్రభావమున నో ♦ యీజన్మమం దిక్కడన్
 నీపాదంబులు కంటి నిన్నెఱిఁగితిన్ ♦ నీవుం గృపాళుండవై
 నాపై నక్కఱఁజేసి మాన్పఁగదవే ♦ నానాధనాగారకాం
 తాపుత్రాదులతోడిబంధనము భ♦ క్తవ్రాతచింతామణీ.

అని వినుతించిన శ్రీహరి యతనిం గటాక్షవీక్షణంబుల వీక్షించెను. అంతటఁ గొంతకాలమందే యుండుబుద్ధి పొడమ శ్రీకృష్ణుఁడు నందాదులతో నివసించెను. మధురానగరమున నందాదులు గోపాలబాలుఁడు నివసించియున్నవా రనువార్త యెల్లయెడల

వ్యాపించెను. జరాసంధునికొలువుకూటమునఁ గంసపత్నులనుండి యావార్త వినఁబడఁగా వాఁడు మండిపడి

జరాసంధుఁడు మధురాపురిని ముట్టడించుట.

శా. ఏమీ కృష్ణుఁడు కంసునిన్ రణములో ♦ హింసించెనో చెల్ల నా
సామర్థ్యంబుఁ దలంపఁ డించుకయు ను♦చ్చండప్రతాపానలో
ద్దామార్చుల్ వడి నేఁడు గాల్చు యదుసం♦తానాటవీవాటికన్
భూమిం గ్రుంగిన నింగిఁ బ్రాఁకిన మహాం♦భోరాశిలోఁ జొచ్చినన్.

పుత్రికలారా! యాదవు లిఁక భూలోకమున నుండఁజాలరు. పొండు. అని వారి నంతఃపురమున కనిచి చతురంగబలము లసంఖ్యాకములుగాఁ దన వెంట రాఁగాఁ జని మధురానగరమును ముట్టడించెను. ఆవార్త నాలించి శ్రీహరి తనలో

శా. ఐదు న్నాలుగు నాఱు రెండు నిరుమాఱ♦క్షౌహిణుల్ చుట్టి సం
ఛాదించెం గుఱి యెల్ల మాగధుఁడెదన్ ♦ సామంబు దానంబు సం
భేదంబుం బనిలేదు దండవిధితో ♦ భిల్లం బ్రయోగించి యీ
భూదేవీవర (పృథు) భారమెల్ల నుడుపం ♦ బోలున్ జయోద్యోగినై.

ఇంతియ కాక,

క. ఏ నవతరించు టెల్లను
మానుగఁ జతురంతధరణి♦మండలభరముల్
మానుపుకొఱకుం గాదే
పూనెద నిది మొదలు దగిలి ♦ భూభరముడుపన్.

అని తలంచి యాసమయమున నంబరమునుండి సపరికరములుగా వచ్చిన రథంబులను రెంటినిం గాంచి దైవయోగంబునఁ దనుం జేరవచ్చిన బలరాముని జూచి

శా. కంటే రామ! రథంబు లాయుధములున్ ♦ గాఢప్రకాశంబులై
మింటన్ వచ్చెను వీనిఁ గైకొని సుల్ ♦ మెచ్చన్ నృపశ్రేణులన్
బంటింపం బనిలేదు చెప్పుము ధరా♦భారంబు వారింపు మీ
వెంటన్ నీయవతారమున్ సఫలమౌ ♦ వేవేగ లె మ్మాజికిన్.

అని పలికి యన్నయుఁ దానును గవచాదిపరికరధరులై రణంబునకు వెడలిరి. శ్రీహరి రణాంగణమును జేరి పాంచజన్యమును బూరింప మాగధుండు చేరవచ్చి శ్రీహరిం గని యనాదరంబున

సీ. ఆదలించి రొప్పంగ ♦ నాలమందలు గావు
గంధగజేంద్రసం♦ఘములు గాని
పరికించి వినఁగ నం♦భారవంబులు గావు
వాజీంద్రహేషార♦వములు గాని
పదహతిఁ గూల్పంగఁ ♦ బ్రాఁతబండ్లివి కావు
నగసమానస్యంద♦నములు కాని
ప్రియము లాడంగ నా♦భీరలోకము గాదు
కాలాభవైరివ♦ర్గంబు గాని
తే. యార్ప వనవహ్ని గాదు బా ♦ ణాగ్ని గాని
మరియు బృందావనము గాదు ♦ మొనలు గాని
యమునఁ గాదు నటింప ఘో ♦ రాజి గాని
పోరు నీకేల గోపాల ♦ పొమ్ము పొమ్ము.

ఇంకొక్కమాట విను.

మ. తరుణిం జంపుటయో బకుం గెడపుటో ♦ ధాత్రీజముల్ కూల్చుటో
ఖరముం ద్రుంచుటయో ఫణిం బఱపుటో ♦ గాలిన్ నిబంధించుటో
గిరి హస్తంబునఁ దాల్చుటో లయమహా♦గ్నిస్ఫారదుర్వారదు
ర్ధరబాణాహతి నెట్లు నిల్చెదవు స ♦ ప్రాణుండవై గోపకా.

ఇంతతోఁ దృప్తి నీకుఁ గాదేని.

సీ. గోపికావల్లకీ ♦ ఘోషణంబులు గావు
సింజనీరవములు ♦ చెవుడుపఱచు
పల్లవీకరము క ♦ వారిధారలుఁ గావు
శరవృష్టిధారలు ♦ చకుముసేయు
ఘోషాంగనాపాంగ ♦ కుటిలాహతులుగావు
నిసితాసినిహతులు ♦ నిగ్రహించు
నాభీరకామినీ ♦ హస్తాబ్జములు గావు
ముష్టిఘాతంబులు ♦ మురువుడించు

ఆ. నల్ల వ్రేపల్లె గాదు ఘో ♦ రావనీశ
మకరసంఘాతసంపూర్ణ ♦ మగధరాజ
వాహినీసాగరంబిది ♦ వనజనేత్ర
తెలిసి నిను దీవికై వడి ♦ నేఁడు ముంచు.

అని పలుక శ్రీహరియు వానిం దూలనాడెను. పోరు ఘోరంబుగా సాగెను. బలరాముఁడు జరాసంధుం బట్టుకొని ముష్టిఘాతంబులఁ గంఠగతప్రాణుంజేసి చంప యత్నింప శ్రీహరి వలదని వారించి మంచిమాటలాడి వాని సాగనంపెను. వాఁడు సిగ్గుపడి యింటికిం బోయి మరలఁ జతురంగంబులం గూర్చుకొని వచ్చి యోడిపోయి యిట్లు పదునేడుపర్యాయము లోడి పదునెనిమిదతడవ యుద్ధమునకు గా నుద్యోగించుచుండెను.

అంతలో నారదముని కాలయవనుకడకుం బోయి "పరాక్రమనిధీ! లోకమునఁ గల రాజుల నోడించితి నని డంబములు పలుకుచుందువుగదా. యాదవులలో నొకవీరుఁడు ప్రతాపము

న నాకెదురు లేదని విఱ్ఱవీఁగుచుండ భీతిల్లితివో! ఏమో కాని నీ వేల యుద్ధమునకుం బోవకున్నవాఁడ" వని హెచ్చరించెను. వాఁడు సభలోనుండి విననటచే మఱింత మండిపడి నారదమునీ! ఆయాదవపేరునిమహత్త్వ మించుక వినిపింపుమా యని ప్రశ్నింప నాముని

సీ. నీలజీమూతసం♦న్నిభశరీరము వాఁడు
తామరసాభ నే♦త్రములవాఁడు
పూర్ణేందుబింబంబుఁ ♦ బోలెడు మోమువాఁ
డున్నతదీర్ఘ బా♦హువులవాఁడు
శ్రీవత్సలాంఛనాం♦చిత మహోరము వాఁడు
కౌస్తుభమణిపద♦కంబువాఁడు
శ్రీకరపీతకౌ♦శేయచేలమువాఁడు
మకరకుండలదీప్తి ♦ ములయువాఁడు
తే. రాజ! యింతింతవాఁ డన ♦ రానివాఁడు
మెఱసి దిక్కుల నెల్లను ♦ మెఱయువాఁడు
తెలిసి యేవేళలం దైనఁ ♦ దిరుగువాఁడు
పట్టి నేర్చునఁ గాని లో♦బడనివాఁడు.

అని పెక్కుభంగుల నుగ్గడించిన లెక్కింపక యారక్కసుండు మూఁడుకోట్లయవనబలంబుల నెల్లఁ గూర్చుకొని మధురానగరమును ముట్టడించెను.

శ్రీహరి తదాగమనంబు నెంచి మధురాపురము నిరంతరశత్రుబాధ్యమని తలంచి సముద్రమధ్యభాగంబున నొక్క నగరంబు నిర్మింప విశ్వకర్మ కాజ్ఞాపించి ద్వారవతి యనుపేరు దాని

కై నిడి తనయోగప్రభావంబున మధురానగరవాసుల నందుఁ జేర్చి కృష్ణుం డొక్కరుండ నిరాయుధుండై మధురానగరము వెలువడి కాలయవనున కెదురుగాఁ బోయెను. వాఁ డాతనిం గాంచి యచ్చెరువంది తన యశ్వంబును బురికొలిపి కృష్ణునిపైఁ గవియఁ, బరుగిడుహరిం జూచి వాఁడు నవ్వుచు

మ. బలిమిన్ మాధవ! నేఁడు నిన్ను భువన♦ప్రఖ్యాతిగాఁ బట్టుదున్
జలముల్ చొచ్చినఁ భూమిక్రిందఁ జనినన్ ♦ శైలంబుపై నెక్కినన్
బలిదండన్ విలసించినన్ సకృతగో♦పంబుం బ్రవేశించినన్
జలధిన్ దాఁటిన నగ్రజన్మహలికా♦శ్వాటాకృతుల్ తాల్చినన్.

అని పలుకుచుం బాఱినఁ బట్టుపడిన ట్లుండి పట్టుపడక వానిం దీసికొనిపోయి పోయి యొకగుహాంతరాళంబు సొచ్చి యదృశ్యుం డయ్యెను. అందు ముచుకుందుఁ డనుయోగి నిద్రించుచుం డెను. ఎవ్వఁ డాతనినిద్రకు భంగముచేయునో వాఁడు నశించును. ఆవిషయము మాహారి యెఱింగియే యదృశ్యుం డయ్యెను. కాలయవనుఁ డాతని హరిగాఁ దలంచి యార్చుచుఁ గాలఁ దన్నెను.

ఉ. తన్నిన లేచి నీల్గి కనుఁ♦దమ్ములు మెల్లన విచ్చి లోపలన్
సన్నపుఁ గిన్క వర్ధిల ది♦శల్ గని దృష్టిసమిద్ధవిగ్రహో
త్పన్నమహాగ్నికీలముల ♦ భస్మము చేసె నతండు సాయక
చ్ఛిన్నవిరోధికంఠవను ♦ శ్రీభవనున్ యవనున్ లఘుక్రియన్.

అంతలో శ్రీహరి యాముచుకుందునెదుట నిల్చెను. అప్పు డా యోగి

సీ. వనరుహాలోచను ♦ వైజయంతీదామ
శోభితు రాకేందు♦సుందరాస్యు
మకరకుండలకాంతి ♦ మహితగండస్థలుఁ
గౌస్తుభాలంకృతు ♦ ఘనశరీరు
శ్రీవత్సలాంఛనాం♦చితవక్షు మృగరాజ
మధ్యుఁ జతుర్బాహు ♦ మందహాసుఁ
గాంచనసన్నిభ♦కౌశేయవాసు గాం
భీర్యసౌందర్యశో♦భితుఁ బ్రసన్ను
ఆ. నమ్మహాత్తుఁ జూచి ♦ యాశ్చర్యమును బొంది
తన్నసోజ్జదీప్తి ♦ దనరుఁ జూడ
నలవిగాక చకితుఁ ♦ డై యెట్టకేలకుఁ
బలికెఁ బ్రీతి నవని♦పాలకుండు.

మహాత్మా! పరమేశ్వరా!

ఉ. పూని యనేకజన్మములఁ ♦ బొంది తుదిం దనపుణ్యకర్మసం
తానము పేర్మిఁ గర్మనను♦ధాత్రిలిఁ బుట్టి ప్రపూర్ణ దేహుఁడై
మానవుఁడై గృహేచ్ఛఁ బడు ♦ మందుఁ డజంబు తృణాభిలాషియై
కానకపోయి నూతఁబడు♦కైవడి నీపదభక్తిహీనుఁ డై.

అని యనేకవిధంబుల వినుతించిన సంతసించి యతని కనేకవ రంబు లొసంగి యంతర్ధానంబు నంది ద్వారవతిం జేరెను. అని పలికిన: బరీక్షిన్నరేంద్రుఁడు యోగీంద్రుం గనుంగొని మహాత్మా! భగవంతునకు రుక్మిణీదేవి పత్నియయ్యె నని వింటిని. ఆమె లక్ష్మీదేవి యనియు నెఱింగితి. ఆగాధం దెలుపవే యని ప్రార్థించెను. శుకయోగి సంతసంబున రాజేంద్రా! చక్కని ప్రశ్న మొనరించితివి. విను మావివాహకథ వినిపించెద.

రుక్మిణీకల్యాణము.

విదర్భదేశమునఁ గుండినగరము గలదు. భీష్మకుం డను రాజు తత్పురమును బాలించుచుండెను. ఆతని కేవురు కొడుకులు, ఒక్కపుత్త్రికయుఁ గలదు. ఆమెయె కడగొట్టు చెల్లెలు. ఆమెపేరు రుక్మిణి. ఆకన్నియ దినదినప్రవర్ధమానయై బాలేందురేఖవలె నుండెను. కొంతకాలమునకు

సీ. దేవకీసుతుకోర్కి ♦ తీఁగెలు వీడంగ
తొలఁదికి మైఁదీఁగె ♦ వీడఁదొడఁగె
కమలనాభునిచిత్త ♦ కమలంబు వికసింపఁ
గాంతి నింతికి ముఖ ♦ కమల మొప్పె
మధువిరోధికి లోన ♦ మదనాగ్ని పొడచూపఁ
బొలఁతికిఁ జనుదోయి ♦ పొడవు చూపె
శౌరికి ధైర్యంబు ♦ సన్నమై డయ్యంగ
జలజాక్షిమధ్యంబు ♦ సన్నమయ్యె

ఆ. హరికిఁ బ్రేమబంధ ♦ మధికంబుగాఁ గేశ
బంధ మధిక మగుచు ♦ బాల కమరెఁ
బద్మనయనువలనఁ ♦ బ్రమదంబు నిండార
నెలఁతయౌవనంబు ♦ నిండియుండె.

ఈమె యన్నలు రుక్మి రుక్మిరథ రుక్మబాహు రుక్మకేశ రుక్మనేత్రు లనువారు. ఆరుక్మిణి తండ్రిగృహమునకు వచ్చునతిథిజనులవలన శ్రీకృష్ణునిరూపగుణశౌర్యాదుల విని యాహరిని బెండ్లియాడ మదిఁ గోరెను. బంధువు లామెభావ మెఱింగి

సంతోషించిరి. అన్న యగు రుక్మిమాత్రము శిశుపాలున కొసం గ నిశ్చయించి వార్త నంపెను. తలిదండ్రు లాతని సేమనఁ జాలక యూరకుండిరి. కొలఁదికాలమునకు వివాహము సాగు నని వార్త రుక్మిణి చెవుల సోఁకెను. పరితాపము నొంది యొక్క బ్రాహ్మణప్రవరునివిశ్వాసపాత్రునిం బిలిచి శ్రీహరికి నాయభీష్టము నెఱింగించిరమ్మని యటఁ జెప్పఁదగుమాటలు చెప్పి పంపెను. ఆభూసురుఁడు ద్వారవతికిం బోయి శ్రీహరిని దర్శించి సత్కారములొంది కుశలప్రశ్నానంతరము రుక్మిణిదేవివచనములుగా

సీ. ఏనీగుణములు క ♦ ర్ణేంద్రియంబు సోఁక
దేహతాపంబులు ♦ తీఱిపోవు
నే నీశుభాకార ♦ మీక్షింపఁ గన్నుల
కఖిలార్థలాభంబు ♦ లమరుచుండు
నే నీచరణసేవ ♦ లేప్రొద్దు చేసిన
భువనోన్నతత్వంబుఁ ♦ బొందఁ గలుగు
నే నీలసన్నామ ♦ మేప్రొద్దు భక్తితోఁ
జదివిన బంధసం♦తతులు పాయు
తే. నట్టి నీయందు నాచిత్త ♦ మనవరతము
నచ్చియున్నది నీయాన ♦ నాన లేదు
కరుణఁ జూడుము కంసారి ♦ ఖలవిదారి
శ్రీయుతాకార మానినీ♦చిత్తచోర.

శ్రీకృష్ణా! దీనబంధూ!

ఉ. శ్రీయుతమూర్తి యో పురుష♦సింహమ సింహముపాలిసొమ్ము గో
మాయువు గోరుచందమున ♦ మత్తుఁడు చైద్యుఁడు నీపదాంబుజ

ధ్యాయిని యైన నన్ను వడిఁ ♦ దాఁ గొనిపోయెద నంచు నున్నవాఁ
డాయధమాధముం డెఱుఁగఁ ♦ డద్భుతమైన భవత్ప్రతాపమున్.

ప్రాణేశా! వేసరక నాయీదీనాలాపమును మఱొక్కదాని నాల కింపుము.

ఉ. అంకిలి చెప్పలేదు చతు♦రంగబలంబులతోడ నెల్లి యో
పంకజనాభ నీవు శిశు♦పాల జరాసుతులన్ జయించి నా
వంకకు వచ్చిరాక్షసవి♦వాహమునన్ భవదీయ శౌర్యమే
యుంకువ చేసి కృష్ణ పురు♦షోత్తమ ! చేకొనిపొమ్ము వచ్చెదన్.

శ్రీహరీ! యిట్లు రుక్మిణీకన్యకామణి మనవి చేయఁబంపెను. నాయందుఁ గల ప్రీతిని దీనురాలగు తత్కన్యకామణియందలి ప్రేమను దయచేసి శిశుపాలాదుల నోడించి యామెకోరికను ఫలింపఁజేయుము. మహాత్మా! ఆమె చెప్పినమాటలలో నొక్కవాక్యమును మఱియు విన్నవింతు. అవధరింపుఁడు.

సీ. ప్రాణేశ ! నీమంజు♦భాషలు వినలేని
కర్ణరంధ్రంబుల♦కలిమి యేల
పురుషరత్నమ ! నిన్నుఁ ♦ బొడఁగానఁగాలేని
తనులతవలని సౌం♦దర్య మేల
భువనమోహన నిన్నుఁ ♦ బొడఁగానఁగాలేని
చక్షురింద్రియముల♦సత్త్వ మేల
దయిత నీయధరామృ♦తం బానఁగా లేని
జిహ్వకు ఫలరస♦సిద్ధి యేల
ఆ. నీరజాతనయన ♦ నీవనమాలికా
గంధ మబ్బ లేని ♦ ఘ్రాణ మేల

ధన్యచరిత నీకు ♦ దాస్యంబు చేయని
జన్మ మేల యెన్ని ♦ జన్మములకు.

శ్రీహరీ! ఆదినారాయణా! ఇట్లు మొఱ్ఱపెట్టు రుక్మిణియాలాపంబుల దెస నాలంబు చేయక యనుగ్రహింపుఁ డని తెలిపి యామె యసమానరూపసద్గుణాదుల వర్ణించి గోపాలబాలునియాదృతి నెఱింగి వచ్చి వివాహము చేసికొం దునన్న సత్యవాక్యమును గైకొని బహువిధసమ్మానముల నంది రుక్మిణి కవ్వార్త నెఱింగింపం బోయెను.

అచ్చట వివాహప్రయత్నము చేయఁబడియె. శిశుపాలాదులు చతురంగబలములు సముద్రములభంగి ఘూర్ణిల్ల వచ్చి కుండినపురమును జేరిరి. శిశుపాలుని ప్రతిపక్షుల నడంచుపొంటె జరాసంధప్రభృతులు పెక్కుసేనలతో వచ్చి పురము నిండించిరి. శ్రీహరియు నావిప్రునిం బంపి దారుకసన్నద్ధరథవర్యము నధిష్ఠించి కుండినమునకుం బయనమయ్యెను. బలరామాదులు యాదవవాహినీసాగరపరివృతులై శ్రీహరికి సాయ మొనరింపఁ గూడఁ బోయిరి.

అంతలో రుక్మిణి శిశుపాలురాక నెఱింగి వివాహశుభదిన మరుదేర భీతిల్లి వివాహము తప్పక సాఁగఁగల దను వ్యథను మది గుందఁగాఁ దనలో

మ. ఘనుఁ డాభూసురుఁ డేగెనో నడుమ మా♦ర్గశ్రాంతుఁడై చిక్కెనో
విని కృష్ణుం డిది తప్పుగాఁ దలఁచెనో ♦ విచ్చేసెనో యీశ్వరుం

దనుకూలింపఁ దలంచునో తలఁపడో ♦ యార్యామహాదేవియున్
నను రక్షింప నెఱుంగునో యెఱుఁగదో ♦ నాభాగ్య మెట్లున్నదో.

అని పలుభంగులఁ బరితపించుచుండు నంతలో, ఆబ్రాహ్మణుండు వచ్చి రుక్మిణీదేవి దుఃఖంబు పోవునట్లుగా శ్రీకృష్ణుని రాకం దెల్పెను. ఆమె నిర్భరానందమున దేహము తెలియక యించుక నే పుండి యానందాశ్రువులు ధారలై ప్రవహించుచుండఁగా

మ. జలజాక్షున్ దోడితెచ్చితివి నా ♦ సందేశముం జెప్పి నన్
నిలువం బెట్టితి నీకృపన్ బ్రదికితిన్ ♦ నీయంతపుణ్యాత్మకుల్
కలరే దీనికి నీకుఁ బ్రత్యుపకృతిం ♦ గావింపఁగా నేఁ నం
జలి గావించెద భూసురాన్వయమణీ ♦ సద్బంధుచింతామణీ.

ఇట్లు లోకకన్యకామణి నమస్కరింప నాభూసురుండు పరమానంద మందెను. అంతలో శ్రీహరిప్రభృతులు నగరముఁ జొచ్చిరి. రుక్మిణి యలంకృతయై కులమర్యాద ననుసరించి పార్వతీదర్శనమునకు ముత్తైదువులు కూడఁగా నరిగి దేవాలయముఁ జొచ్చి సాష్టాంగముగాఁ బ్రణమిల్లి భక్తివినయసంతోషముల తో హస్తముల ముకుళించి నిలువంబడి నిశ్చలచిత్తముతో

ఉ. నమ్మితి నామనంబున స♦నాతనులైన యుమామహేశులన్
మిమ్ముఁ బురాణదంపతుల ♦ మేలు భజింతు గదమ్మ మేటి పె
ద్దమ్మ దయాంబురాశివి గ♦దమ్మ హరిం బతి చేయు మమ్మ నిన్
నమ్మినవారి కెన్నటికి ♦ నాశము లేదు గదమ్మ యీశ్వరీ.

అని మ్రొక్కి తత్పాదాంబుజముల స్పృశించి మరలెను. త్రోవ నే శ్రీహరి యామెరాకకై వేచియుండెను. రుక్మిణి మార్గమున

నున్న రాజులం గాంచుచు విఫలమనోరథ యగుచుఁ గొంత దూరము మార్గముఁ గడచి వచ్చి యొక్కచోఁ దనకోరికలు ఫలింప,

మ. కనియెన్ రుక్మిణి చంద్రమండలముఖున్ ♦ గంఠీరవేంద్రావల
గ్నునవాంభోజదళాక్షుఁ జారు తరవ♦క్షున్ మేఘసంకాశదే
హు నగారాతిగజేంద్రహస్తనిభబా♦హుం జక్రిఁ బీతాంబరున్
ఘనభూషాన్వితుఁ గంబుకంఠు విజయో♦త్కంఠున్ జగన్మోహనున్.

కని పరమానందంబుఁ బొందుచుండునంతలో శ్రీహరి యామెను తనరథంబుపై నిడుకొని ద్వారకానగరమార్గంబుఁ బట్టి చనుచుండ రాజు లోర్వఁజాలక యొండొరులం బురికొల్పుకొనుచు మార్కొనిరి. బలరామాదులు కొందఱను శ్రీహరి కొందఱను జక్కుపఱచిరి. శిశుపాలుఁడు చేయునది లేక యూరకుండ రాజు లాశ్వాసించిరి. అందఱు వెనుకకు మరలిరి. రుక్మి యాగ్రహించి శ్రీకృష్ణుని మార్కొని పరాభవంబు నొందెను. రుక్మిణీదేవి ప్రార్థింప నాతనిం జంపక శ్రీహరి విడిచిపుచ్చెను. ద్వారకానగరంబున గోపాలబాలుఁడు బంధుజనులు హర్షింప సాధురాజలోకంబు కీర్తింప మహామును లాశీర్వదింప దివిజులు వినుతింప మహావైభవంబున

మ. ధ్రువకీర్తిన్ హరి పెండ్లియాడె నిజచే♦తోహారిణిన్ మానవై
భవగాంభీర్యవిహారిణిన్ నిఖిలసం♦పత్కారిణిన్ సాధుబాం
ధవసత్కారిణిఁ బుణ్యచారిణి మహా♦దారిద్ర్యసంహారిణిన్
సువిభూషాంబరధారిణిన్ గుణవతీ♦చూడామణిన్ రుక్మిణిన్.

ఆవివాహమునకు దుష్టరాజులు తప్పఁ దక్కినభూపాలురు వచ్చి సత్కృతులై తమతమనెలవుల కరిగిరి. నారదాదిమును లాదిలక్ష్మీదేవ్యంశసంభూతురాలు రుక్మిణి రుక్మిణి యని పొగడిరి. యానందమునకు మేఱలేకుండెను.

ఇది దశమస్కంధమునఁ బూర్వభాగము.

దశమస్కంధము.

ఉత్తరభాగము.

శ్రీకృష్ణునకు రుక్మిణి, జాంబవతి, సత్యభామ, కాళింది. మిత్రవింద, నాగ్నజితి, భద్ర, లక్షణ యనునామంబులఁ బరఁగు నెనమండ్రుగురు నారీరత్నములు భార్యలైరి. వారందఱం గూడి ద్వారకానగరంబున వసించి దీనులఁ గాపాడుచుండెను. అని శుకయోగి తెలుప రా జిట్లు ప్రశ్నించెను. మహాత్మా! సత్యభామ హరిఁగూడి నరకాసురునితో యుద్ధముచేసె నని వింటిని. దానిని వినఁగోరెద నని యోగి యిట్లు పలికెను. రాజా! వినుము. ఇంద్రుఁడు నరకాసురుని బాధపడఁజాలక శ్రీహరితో విన్నవించెను. హరియు వానిం జంప వాగ్దాన మొసంగెను. లోకకంటకుని వాని వధింపఁగా సమకట్టి కృష్ణుఁడు గరుడవాహనారూఢుండై చనుసమయంబున సత్యభామ ప్రాణనాథుం జేరి నీవెంట నన్నుం దోడ్కొనిపొమ్మా యని ప్రార్థించుచు నీయుద్ధప్రావీణ్యమును గన్నులారఁ గాంచి తక్కుంగల దేవీసమూహమునకుం దెల్పుదు ననియుఁ దెల్పెను. ఆమాట లాలకించి దరహాసితాననుండై ప్రాణవల్లభం గాంచి

సీ. సమదపుష్పంధయ♦ఝంకారములు గావు
భీషణకుంభీంద్ర ♦ బృంహితములు
వాయునిర్గతపద్మ ♦ వనరేణువులు గావు
తురగరింఖాముఖో♦ద్ధూతరజము
లాకీర్ణ జలతరం♦గాసారములు గావు
శత్రుధనుర్ముక్త♦సాయకములు
కలహంస సారస♦కాసారగములు గావు
దనుజేంద్రసైన్యక♦దంబకములు
తే. కమల కల్హార కసుచు సం♦ఘములు గావు
చటుల రిపుశూల ఖడ్గాది ♦ సాధనములు
కన్య నీవేడ రణరంగ♦గమన మేడ
వత్తు వేగమ నిలువుము ♦ వలదు వలదు.

అని యెంతచెప్పినను వినక మఱిమఱి ప్రార్థిప నెట్టకేల కంగీకరించి పిలుచుకొని నరకాసురునగరం బాక్రమించిన నరకాసురుండు హరి మార్కొనరాఁగా సత్యభామ లేచి యుద్ధోన్ముఖురా లగుటం గాంచి కృష్ణుఁడు తనశరాసనం బొసంగెను. ఆమెయుఁ జాపంబుఁ గొని గుణంబు సారించి

సీ. సౌవర్ణకంకణ♦ఝణఝణనినదంబు
శింజినీరవముతోఁ ♦ జెలిమి చేయఁ
తాటంకమణిగణ♦ధగధగదీప్తులు
గండమండల రుచిఁ ♦ గప్పికొనఁగ
ధవళతరాపాంగ♦ధళధళరోచులు
బాణజాలప్రభా♦పటలి నడఁప
శరపాత ఘుమఘుమ♦శబ్దంబు పరిపంథి
సైనిక కలకల♦స్వనము నడప

తే. వీర శృంగార భయ రౌద్ర ♦ విస్మయములు
కలసి భామిని యయ్యెనా ♦ కాక యనఁగ
నిషువు దొడుగుట తివుచుట ♦ యేయుటెల్ల
నెఱుఁగరాకుండ నని చేసె ♦ నిందువదన.

ఆమహాయుద్ధసమయమందు

మ. పరుఁ జూచున్ వరుఁ జూచు నొంప నలరిం♦పన్ రోషరాగోదయా
విగత భ్రూకుటి మందహాసములతో ♦ వీరంబు శృంగారమున్
జరగన్ గన్నులకెంపు సొంపుఁ బరఁగన్ ♦ జండాస్త్రసందోహమున్
సరసాలోకసమూహమున్ నెఱపుచుం ♦ జంద్రాస్య హేలాగతిన్.

ఆయుద్ధనైపుణ్యము చూచుచున్న శ్రీకృష్ణున కానందబాష్పము లెడ తెగక ప్రవహింప సాగెను. ప్రియ యిట్లు శత్రుభయంకరముగా సమరకేళి సల్పుతఱిఁ బుండరీకాక్షుండు తనమనంబున

సీ. కేలఁ జక్కఁగఁ బట్టు ♦ వెరవెఱుంగని కొమ్మ
బాణాసనం బెట్లు ♦ పట్ట నేర్చె
మ్రాఁకునఁ దీఁగెఁ గూ♦ర్పంగ నేరనిలేమ
గుణము నేక్రియ ధనుః♦కోటిఁ గూర్చె
సరవి ముత్యము గ్రువ్వఁ ♦ జాలని యబల యే
నిపుణత సంధించె ♦ నిశితశరముఁ
జిలుకకుఁ బద్యంబుఁ ♦ జెప్ప నేరని తన్వి
యస్త్రమంత్రము లెన్నఁ ♦ డభ్యసించెఁ

ఆ. బలుకు మనినఁ బెక్కు ♦ పలుకని ముగుదయే
గతి నొనర్చె సింహ♦గర్జనములు
ననఁగ మెఱసెఁ ద్రిజగ♦దభిరామ గుణధామ
చారు సత్యభామ ♦ సత్యభామ.

అత్తఱి నాసాధ్వీమణి ప్రావృట్కాలమేఘాకృతిగఁ దనయాకృతి కనఁబడఁజేయుచు బాణవృష్టి నరివీరుని ముంచుచుండెను.

సీ. రాకేందుబింబమై ♦ రవిబింబమై యొప్పు
నీరజాతేక్షణ ♦ నెమ్మొగంబు
కందర్పకేతువై ♦ ఘనధూమకేతువై
యలరుఁ బూఁబోఁడి చే♦లాంచలంబు
భావజు పొదియై ♦ ప్రళయార్కపరిధియై
మెఱయు నాకృష్టమై ♦ మెలఁతచాప
మమృతప్రవాహమై ♦ యనలసందోహమై
తనరారు నింతిసం♦దర్శనంబు

ఆ. హర్షదాయియై మ♦హారోషదాయియై
పరఁగు ముద్దరాలి ♦ బాణవృష్టి
హరికి నరికిఁ జూడ ♦ నందంద శృంగార
వీరరసము లోలి ♦ విస్తరిల్ల.

ఆబాణవృష్టి కోర్వఁజాలక సైన్యంబంతయు నరకాసురుని వెనుకఁ జొచ్చెను. ఆకార్యమున కానందించి హరి పరమాదరంబున సత్యభామం గాంచి ధనుస్సు నందుకొని నరకాసురునితో యుద్ధము చేయఁబూనెను. ఆమహాహవంబు భయంకరముగా నుండెను. హరిచక్రము నరకునిశిరసును ఖండించెను. భూదేవి పురుషోత్తముని వినుతించిన సుప్రీతుండై నరకపుత్రుండగు భగదత్తునకభయహస్తం బొసంగి కారాగారంబున నున్న వారల విముక్తులనుగా నొనరించి హరి ద్వారకానగరంబు చేరి

సుఖంబుండెను. అని శుకయోగి పరీక్షిత్తునకుం జెప్పి మరల నిట్లు పలికెను.

మహారాజా! వినుము. శ్రీకృష్ణుగాథల వినిపించెద. బలిచక్రవర్తి పుత్రులు నూర్వురు గలరు. వారిలో బాణాసురుఁడు బలశాలి. వాఁ డీశ్వరుంగూర్చి ఘోరతపస్సొనరించినఁ బ్రత్యక్షమై శివుం డాదరించి వరముం గోరుమన్న వాఁడు గర్వంబున నాభుజాబలము నోర్వఁగలవాఁడ వీవు దక్క నొం డెవ్వఁడు గలఁడే యని పలికిన నీశ్వరుం డించుక యసూయం జెంది యతనితో

కం. విను మూఢహృదయ నీకే
తన మెప్పుడ కారణంబ ♦ ధారణిపైఁ గూ
లునో యపుడు నీభుజావలి
దునియఁగ నాయుంతవాని♦తో నని కల్గున్.

అని పలికి యంతర్హితుం డయ్యెను.

ఉషాకన్యచరిత్రము.

ఆ బాణాసురున కొక్క కూఁతురు గలదు. ఉషాకన్య యని యామె నందఱు పిలుతురు. రూపమున నామె కామెయే సాటి. ఆలలనాతిలక మొకనాఁడు సురుచిరసౌధోపరిభాగంబున శయనించి నిదురించుచుండ నెన్నఁడేఁ గన్నది విన్నదిగాని సౌందర్యమున నిఱ్ఱవీఁగునీటుకాఁ డొకఁడు కనఁబడి తనతోఁ గ్రీడించినట్లు కలఁగనియె. వెంటనే మేల్కాంచి నిజప్రాణేశ

రుం డగపడమిఁ జింతిల్లుచు బయ లప్పళించుచు వెఱ్ఱియెత్తిన దానిచందమున నుండెను. ఆమె కొక నెచ్చెలి గలదు. దాని పేరు చిత్రరేఖ యని. ఆచెలికత్తియ యొకనాఁ డుషాకన్య యిట్లుండ నేల యని యూహించి చెంతకుంబోయి

తే. వనిత నాకన్న నెవ్వరైన ♦ వారు నీకుఁ
గలుగ నేస్తుర నీకోర్కెఁ ♦ దెలియఁ జెప్పు
కున్న మీయన్న తోడన్నఁ ♦ గన్నుఁగవకు
నలరు నునుసిగ్గుతో నగ ♦ నామతింప.

కలలోనివృత్తాంత మంతయు దెలియం బల్కి తనచింతం దెల్పెను. చిత్రరేఖయు నవ్వి

సరసిజనేత్ర యేటికి వి♦చారము నాకుశలత్వ మేర్పడన్
నరసురయక్షకింపురుష ♦ నాగనభశ్చరసిద్ధసాధ్యకి
న్నర వరముఖ్యులం బటము♦నన్ లిఖియించినఁ జూచి నీమనో
హరుఁ గని వీఁడె పొమ్మనిన ♦ నప్పుడె నానిని నీకుఁ దెచ్చెదన్.

అని యొడంబఱచి తననేర్పు మెఱయ స్వర్గమర్త్యపాతాళలోక వాసుల సుందరాకారుల నొక్కపటంబున విలిఖించి తెచ్చి సౌధాంతరంబున నుషాకన్యక యెదుటఁ బెట్టి వేఱువేఱవారి పేరు లుగ్గడించి చెప్పెను. స్వర్గలోకవసతులను, బాతాళలోక వాసులను బేర్కొని మర్త్యలోకస్థులం జాలమంది నుగ్గడించుచు నామెసమ్మతిం గానక హలాయుధుం జూపి తద్గుణంబు లుగ్గడించి యామె సంప్రీతి నాదరింపమి నవ్వల

సీ. కమనీయ శుభగాత్రుఁ ♦ గంజాతదళనేత్రు
వసుధాకళత్రుఁ బా♦వనచరిత్రు
సత్యసంకల్పు ని♦శాచరోగ్రవికల్పు
నతపన్నగాకల్పు ♦ నాగతల్పుఁ
గౌస్తుభమణిభూషు ♦ గంభీరమృదుభాషు
శ్రితజనపోషు సం♦చితవిశేషు
నీలనీరదకాయు ♦ నిర్జితదైత్యేయు
ధృతపీతకౌశేయు ♦ నతవిధేయు
తే. నఘమహాగదవైద్యు వే♦దాంతవేద్యు
దివ్యమునిసన్నుతామోదుఁ ♦ దీర్ఘపాదు
జిష్ణు వరసద్గుణాలంక♦రిష్ణుఁ గృష్ణుఁ
జూడు దైతేయకులబాల♦శుభగలీల.

అమ్మా! ఈమహానుభావుఁడు కృష్ణకుమారుఁ డని యవ్వాలివా నిం గనఁబఱచుచు

చ. స్ఫురదళిసింజినీరవవి♦భూషితపుష్పధనుర్విముక్త భా
స్వర నవ చూత కోరకని♦శాతశిలీముఖపాతభీతపం
కరుహభవాదిచేతనని♦కాయు మనోజు నిజాంశురుక్మిణీ
వరసుతు రాజకీరపరి♦వారుని మారుని జూడు కోమలీ.

అని చెప్పుచుండఁగనే యుషాకన్యమేను గగుర్పాటు నొందెను. నేత్రపద్మములు వికసించెను. అధర పల్లవ మాడెను. ఆ రూపమును బరితాపభరంబునం గాంచి కాంచి యల్లన

ఉ. ఇంతి మదీయమాన♦ మెల్ల హరించిన ముచ్చు నిమ్మెయిం
బంత మెలర్ప వ్రాసి పట♦భాగనిరూపితుఁ జేసి నట్టి నీ

యంతటి పుణ్యమూర్తిఁ గొని♦యాడఁగ నేర్తునె నీచరిత్రముల్
వింతలె నాకు నీమహిత♦వీరకులంబుబలంబుఁ జెప్పుమా.

అని ప్రశ్నించెను. చిత్రరేఖయుఁ బూసగ్రుచ్చినట్లు తచ్చరిత్ర మంతయుఁ జెప్పెను. పిదప వీని నతివేగము తెచ్చి నీకడ నునిచె దం జూడు మని చనియెను.

ఆర్యబాలకులారా! చిత్రరేఖ సకలలోకవాసులఁ బటంబున లిఖించి తెచ్చుట యతిశయోక్తిగా మీకుఁ దోఁప వచ్చును. కాని యదిపూర్వకాలమున సహజము. ఈకాలమున విచిత్రముగఁ దోఁచువిషయములు మున్నుమిగుల సులభకార్యములని నమ్ముఁడు. మనరాజకుటుంబములలో నందఱు రాణులు తత్సఖిజనము చిత్రలేఖనమున మిగులనేర్పు గలవారు. కాళిదాసాదిమహాకవులు నాటకములందు పురుషునిం జూచినంతనే చిత్రఫలకమున విలిఖించినట్లు వ్రాసియున్నవారు. ఆయాచారము లేకపోయినచో నట్లు వ్రాయఁగలరా. లోకమున లేని పదార్థముల పేరులు చెప్పువా రుండరు కదా. అట్లే చిత్రరేఖ స్వర్గపాతాళలోకవాసుల గ్రంథములం బట్టియు మర్త్యలోకవాసులఁ దాఁజూచి నట్లు విన్నయట్లు లిఖించెననుటలో శంక నొందఁదగిన పనియే లేదు. చిత్రరేఖ చమత్కృతింజూపి మంత్రశక్తి నతనింగొని తెచ్చుటయు విచిత్రముకాదు. ఈకాలమున మనవారిలో నట్టిమంత్రశక్తి, క్రియాశక్తి లోపించినందునఁ బూర్వచరిత్రమున శంక తోఁచునంతటిస్థితి గల్గుచున్నందులకే

దుఃఖింప వలయుంగాని పూర్వ మిట్టిశక్తి యుండెనా యని వింతనొందఁ బనియే లేదు. ఇఁకఁ గథ వినుఁడు.

చిత్రరేఖ యట్లు పోయి ద్వారవతిం జొచ్చి యెరు లెఱుంగకుండఁ దనశరీరమును మంత్రబలమున మఱుగు కల్పించుకొని సౌధోపరి భాగంబున మృదులతరపుష్పశయ్య నిదురించియున్న యనిరుద్ధకుమారుం గొని శోణపురంబున కరుదెంచి యుషాకన్యయున్న సౌధోర్ధ్వభాగంబున నామోహంసతూలికాతల్పంబున నునిచి యావృత్తాంత మెఱింగించి సెలవంది చనియె. ఆవల వా రిరువురు మనస్సులలర మాటలాడుచుండిరి. కొంతకాల మాలాగుకాలము సాగెను. రాకొమరితె చూలాలయ్యెను. ఆవార్త గావారికు లెట్లో యెఱింగి బాణాసురునకుం దెల్పిరి. వాఁ డాగ్రహించి చనుదెంచి దృఢపాశనిబద్ధుం జేసి యనిరుద్ధకుమారుని కారాగారమున నుంపఁ బంచెను. కొలఁదిదినము లిట్లు సాగఁగా నారదముని ద్వారవతికిం బోయి శ్రీహరి దర్శించి యనిరుద్ధకుమారువార్తం దెల్పెను. శ్రీహరి తా నెఱింగియుండియు నెఱుంగనట్లు నారదువలన విని చతురంగబలంబుల వెలువడ నియమించి శోణనగరంబుమీఁదికి దండయాత్ర సాటఁ బంచెను.

యాదవబలంబులు శోణనగరంబుఁ జేరెను. ఆపురమున బాణాసురునిపక్షమున శివగణములు యుద్ధమునకు వెడలెను. పోరు ఘోర మయ్యెను. సమరమున శ్రీకృష్ణుఁడు బాణాసురుని

హస్తపంక్తి ఖండించెను. నాల్గుచేతులు మిగిలియుండఁగా శంకరుఁ డరుదెంచి శ్రీకృష్ణునిం బొగడెను. హరి యానందించి

క. కరములు నాలుగు చిక్కం
బరిమార్చితి వీఁడు ♦ భక్తుల కగ్ర
సరుఁడై పొగడొందె జరా
మరణాదిభయంబు దక్కి ♦ మను నిటమీఁదన్.

అని వరం బిచ్చి యుషాకన్యాసహితంబుగా ననిరుద్ధుం దోడుకొని ద్వారవతి కరిగి యుషాకన్య నాదరించి విమలమణి భూషాంబరంబు లొసంగి సంతుష్టం జేసి తానును బుత్త్రయుతుండై సుఖంబుండెను.

కొంతకాలమునకు నృగమహారాజు శాపంబున నూసరవెల్లియై యుండ శ్రీహరి యాతని శాపంబునకు ముక్తిం బ్రసాదించి పౌండ్రకవాసుదేవుం డనుదుష్టభూపతి వధించెను. బలరాముండు ద్వివిదుఁ డను వానరు నతిదుష్టాత్ముని బొరిఁగొనియెను. అని పరీక్షి శుకయోగి రాజున కిట్లు చెప్పెను.

నారదముని శ్రీకృష్ణునిమహిమముఁ బరీక్షించుట.

నరకాసురుం జంపినపిదప శ్రీహరి పానియింటనున్న పదాఱువేలసుందరీమణులఁ బెండ్లియాడి యందఱ కిన్నిరూపులై తనరూపము వెలుంగ నుండెను. ఈవార్త నారదుఁ డాలకించి దీనిం బరీక్షింపవలయు నని మనంబున నెంచి వీణాపాణియై ద్వారవతికిం బోయి యొక్కసుందరాంగియింట శ్రీహరిం

దిలకించెను. వేఱొకకమలాక్షియింట నట్లే కాంచెను. దివ్యదృష్టిం బరికింప శ్రీకృష్ణుం డేకకాలంబునఁ బదాఱువేలసుందరుల కడ నొక్కవిధమున నుండెను. ఆయద్భుతమహిమంబున కచ్చెరు వంది కరములు ముకుళించి

క. నీమాయఁ దెలియువారలె
తామరసాసనసురేంద్రతాపసులైనన్
ధీమంతులు నీభక్తిసు
ధామాధుర్యమునఁ బొదలు ధన్యులు దక్కన్.

అని కొనియాడి తనదారిం బోయెను.

ఆవల శ్రీహరి ధర్మరాజుచే రాజసూయమును జేయించి దంతవక్త్రునిఁ బరిమార్చి తనప్రతాపము సాధుజనానందకరమగునట్లొనరించెను. ద్వారకానగరమును బ్రవేశించి బలభద్రసహితుండై సుఖంబుండెను.

కుచేలోపాఖ్యానము.

అని పలుక విని పరీక్షిన్నరేంద్రుండు శుకయోగివర్యుం జూచి

చ. హరి భజియించుహస్తములు హస్తము లచ్యుతుఁగోరి మ్రొక్కుత
చ్ఛిరము శిరంబు చక్రధరుఁ జేరినచిత్తము చిత్త మిందిరా
వరుఁ గనుదృష్టి దృష్టి మురవైరి నుతించినవాణి వాణి య
సురకథ లానుకర్ణములు కర్ణములై విలసిల్లుఁ బో భువిన్.

కాఁబట్టి,

క. హరిపాదతీర్థసేవా
పరుఁడై విలసిల్లునట్టి ♦ భాగవతుని వి
స్ఫురితాంగము లంగము లా
పరమేశ్వరు నెఱుఁగ నాకుఁ♦ బలుకు మునీంద్రా.

అన విని యోగీంద్రుఁ డారాజేంద్రు నాదరంబునం జూచి నీయడిగిన ప్రశ్నమున కుదాహరణముగా నొక్కపరమభాగవతశేఖరునిచరిత్రము వచింతు. ఆలకింపు మని చెప్పఁ దొడఁగెను.

శ్రీహరిసఖుఁడు కుచేలుఁ డనుభూసురుఁడు కలఁడు. పరమశాంతుఁడై జ్ఞానియై యోగియై సంసారబంధములం జిక్కక జితేంద్రియుఁడై యతఁ డుండు. ఎంత దారిద్ర్యము తన్ను బాధించుచున్నను దాని కతఁడు లొంగక యొరుల దీనవృత్తి యాచింపఁ బోక లభించినయల్పవస్తువును మేరువుగా భావించి సంసారయాత్ర సాగించుచుండును. ఆతనికి సత్కులప్రసూతయమలస్వాంత భార్య కలదు. ఆమె పతివ్రతాశిరోమణి యను విఖ్యాతిం గాంచెను. పెక్కుమంది పుత్రు లామెకుం గల్గిరి. వారెల్ల క్షుద్బాధచేఁ గలఁగి తన్నుఁ జేరి అమ్మా! అన్నము పెట్టుమా యని ఆకులు చేతులలో నునుచుకొని వేఁడఁగా నామాటలు తనకర్ణరంధ్రముల బ్రద్దలు చేయ బదులు చెప్పఁజాలక పెట్టఁ బదార్థము లేక దుఃఖించుచుండుట యామెకు వాడుకయే గాని యొక్కనాటిది కాదు. క్రొత్తదియుఁ గాదు. పాప మాసాధ్వి

యెంతకాల మూరకుండఁ గలము? ఒక్కనాఁడు ప్రాణనాథుం జేరి "జీవితేశ, తెట్టుముట్టాడు నిట్టి పేదఱిక మిట్లు నోంప దీని కుపాయ మూహింప వైతి" అని వేఁడుచు

తే. బాలసఖుఁడైన యప్పద్మ♦పత్రనేత్రుఁ
గాన నేగి దారిద్ర్యాంధ♦కారమగ్ను
లైన మ మ్ముద్ధరింపుము ♦ హరి కృపాక
టాక్షవిదీప్తిఁ బడసి మ♦హాత్మ! నీవు.

అనియుఁ బ్రార్థించెను. అంతతో నూరకుండక బాలురం దలంచుకొని కడుపు బగ్గుమనఁగా మహాత్మా!

మ. కలలోనందను మున్నెఱుంగని మహా♦కష్టాత్ముఁ డైనట్టి దు
ర్బలుఁ డాపత్సమయంబునన్ నిజపదా♦బ్జాతంబు లుల్లంబులోఁ
దలఁపం దోడనె మెచ్చి యార్తిహరుఁ డై ♦ తన్నైన నిచ్చున్ సుని
శ్చలభక్తిన్ భజియించువారి కిడఁడే ♦ సంపద్విశేషోన్నతుల్.

ఆతరుణమున నమృతధారలవలె నాపలుకులు శ్రుతుల సోఁకఁగా నలరి శ్రీకృష్ణునిఁ జూడఁబోవుట యిహపరసాధన మని తలంచి సాధ్విం గాంచి

తే. నీవు చెప్పినయట్ల రా♦జీవనేత్రు
పాదపద్మంబు లాశ్రయిం♦పంగఁ జనుట
పరమశోభన మాచక్ర♦పాణి కిపుడు
కాను కేమైనఁ గొంపోవఁ ♦ గలదె మనకు.

అని పలుకఁగా విని సంతోషమున నాయింతిమిన్న విభునికొంగున నడుకులు మూటఁగట్టి పయనము చేయింప నమ్ముని ద్వార

కకుం బోవుచు ద్వారవతికిం బోయిన నంతఃపురమునకుం బోని త్తురో, కావారికి లక్షుపెట్టుదురో యని పలుభంగులం జింతిం చుచుం బోయెను. ఎట్లో ద్వారవతిం జేరెను. రాజగృహమును బ్రవేశించెను. అం దొకరమ్యతల్పంబున రుక్మిణి పాదము లొ త్తబరుండియున్న పుండరీకాక్షుని

సీ. ఇందీవరశ్యాము ♦ వందితసుత్రాముఁ
గరుణాలవాలు భా♦సురకపోలుఁ
గౌస్తుభాలంకారుఁ ♦ గామితమందారు
సురుచిరలావణ్యు ♦ సురశరణ్యు
హర్యక్షనిభమధ్యు ♦ నఖిలలోకారాధ్యు
ఘనచక్రహస్తు జ♦గత్ప్రశస్తు
ఖగకులాధిపయానుఁ ♦ గౌశేయపరిధానుఁ
బన్నగశయను న♦బ్జాతనయను

తే. మకరకుండలసద్భూషు ♦ మంజుభాషు
నిరుపమాకారు దుగ్ధసా♦గరవిహారు
భూరిగుణసాంద్రు యదుకులాం♦భోధిచంద్రు
విష్ణు రోచిష్ణు జిష్ణు స♦హిష్ణుఁ గృష్ణు.

కన్నులారఁ గాంచి సమీపమునకుఁ బోవునంతలో శ్రీ హరి దిగ్గున లేచి తల్పమునుండి దిగి యెదురు చని బంధుస్నేహ మునఁ గౌఁగిలించుకొని పరమాదృతిఁ దనతల్పమునఁ గూరుచుం డఁ జేసెను. పరిమళవస్తుమిళితచందన మలంది మార్గశ్రమము పాయునట్లు తాళవృంతమున విసరి ధూప మొసంగి మణిగణదీప

ముల నివాళించి తాంబూలం బిడి సురభికుసుమంబులు సిగముడి నలంకరించి స్వాగతం బడిగి గారవించెను.

ఇట్లనూనప్రేమమున గారవింపఁగా నాపేదవిప్రుఁడు మేనం బులకాంకురంబు లంకురింప మహానందసాగరమున మునింగియుండెను. అంతలో శ్రీహరిప్రియపత్ని రుక్మిణి చామరముచే నంది విసరుచు నిలువంబడెను. ఆయద్భుతగౌరవప్రీతులం జూపుటఁ గాంచి శుద్ధాంతకాంతాజనంబులు తమమనంబుల యందు

ఉ. ఏమి తపంబు చేసెనొకొ ♦ యీధరణీదివిజోత్తముండు తొ
ల్లామున యోగివిస్ఫురదు♦పాస్యకుఁడై తనరారు నీజగ
త్స్వామి రమాధినాథునిజ♦తల్పమునన్ వసియించి యున్నవాఁ
డీమహనీయమూర్తి కెన ♦ యే మునిపుంగవు లెంతవారలున్.

అని వేనవేలువిధంబులఁ దలపోయుచుండిరి. అప్పుడు శ్రీరమణుఁడాభూసురరమణుకరమును దనకరంబునఁ దెమల్చి చిన్ననాఁటివృత్తాంతముల నడిగి సంసారవిషయప్రశ్నములు చేసి విద్యాభ్యాసము చేయుతఱి జరగిన చర్యలఁ బ్రస్తావించి వీని మఱువవు కదా యని ప్రశ్నింపఁగాఁ గుచేలుఁడు భక్తిభరితుఁడై

క. గురుమతిఁ దలఁపఁగ ద్విజగ
ర్రురుఁడ వనం వగిన నీకు ♦ గురుఁ డనఁగా నొం
డొరుఁ డెవ్వఁ డింతయును నీ
కరయంగ విడంబనంబు ♦ లగుఁ గాదె హరీ.

అని సాభిప్రాయంబుగాఁ బలికెను. అంత శ్రీకృష్ణుఁడు కుచే

లుం గాంచు నీవిచ్చుటకి వచ్చునపుడు నాకుఁ గానుకగా నేపదార్థంబుఁ దెచ్చితివి. అప్పదార్థంబు లేశమాత్రమైనను బదివేలుగా నంగీకరింతును. మఱియు.

క. దళమైనఁ బుష్పమైనను
ఫలమైనను సలిలమైన ♦ బాయనిభక్తిన్
గొలిచిన జను లర్పించిన
నెలమిన్ రుచిరాన్నముగనె ♦ యేను భుజింతున్.

అని వినయమునఁ బ్రార్థించెను. కుచేలుఁ డామాటలకు బదులు పలుక నేరకుంట యెఱింగి యతని జీర్ణవస్త్రంబుకొంగున ముడిచినయడుకులముడియ మెల్లన విచ్చి పుచ్చుకొని యివి యసకలలోకంబుల నన్నును బరితృప్తిం బొందింపఁ జాలు నని పలుకుచు మఱియుఁ బిడికెడడుకులు భక్షించి యింకను బిడికిటఁ గొనుచుండ రుక్మిణి తనకరములఁ బట్టుకొని మెల్లఁగా

క. సొంపారఁగ నతనికి బహు
సంపద లందింప నివియ ♦ చాలును నిఁక భ
క్షింపఁగ వలవదు త్రిజగ
త్సంపత్కర దేవదేవ ♦ సర్వాత్మ! హరీ.

అని వారించెను.

ఆరాత్రి కుచేలుఁడు గోవిందుమందిరమున నివసించి బహువిధపక్వాన్నంబుల భుజించి సుఖనిద్ర చేసి మేల్కాంచి కాలోచితకృత్యంబులం దీర్చి యిందిరాసుందరుననుమతిం బడసి పోవుచుఁ దనమనంబున

ఉ. శ్రీనిధి యిట్లు నన్నుఁ బచ♦రించి ఘనంబుగ విత్త మింత యే
నీని తెఱుఁగు గానఁబడె ♦ నేను దరిద్రుఁడు సంపదంధుఁడై
కానక తన్నుఁ జేరఁ డని ♦ కాక శ్రితార్తిహరుండు సత్కృపాం
భోనిధి సర్వవస్తుపరి♦పూర్ణుని గా నను జేయకుండునే.

అని తలంచుచుం బోయిపోయి తనయాశ్రమంబు మహాత్తరనగరాకృతి నుండఁ గాంచి యందుఁ బ్రవేశించి భార్య సకలోపచారములు చేయ వానిం బాటింపక శ్రీమన్నారాయణపాదారవిందముల ధ్యానించుచు విగతబంధనుఁడై చిరకాలముండి కడపట నపవర్గమును బొందెను. అని పలికిన శుకయోగిని జూచి రాజు మహాయోగీ! ఇంకను శ్రీహరిమహిమము వినఁగోరు నా చెవులకుఁ బండువు సేయుమా యన యోగి నవ్వుచు రాజా! పరమపావనచిత్తుఁడవు. ఎంత విన్నను భగవత్కథాజాలమున సంతృప్తి యుండకుండుట స్వభావము. అది నీయందుఁ బొడచూపెడిని. వినుము వచించెద.

శ్రీహరి మృతవిప్రకుమారులఁ దెచ్చి యిచ్చుట.

రాజేంద్రా! ఒక్కనాఁడు శ్రీబాలగోపాలుఁడు ద్వారవతీనగరమున సుఖం బుండఁగా, ఒక బ్రాహ్మణుఁడు మృతుఁడయిన బాలకుంగొనివచ్చి రాజద్వారమునఁ బెట్టి యేడ్చుచు రాజు అధర్మపరుఁడు కాఁబట్టి నాకొడుకు మృతుఁడయ్యె. లేకున్న నిట్టియకార్యంబు సాగునే అని దూఱుచు నింటికిం బోయెను. మరల నొక్కకొడుకు కలిగి మృతుఁడయ్యెను. ఇట్టు లెన

మంత్రగురు కొడుకులు మృతులైరి. రాజగృహము మున్ దటఁ బెట్టి విలపించుచు రాజుం దూఱుచుఁ బోవుచుండెను. తొమ్మిదవకుమారుండును మృతుండు కాఁగా యథాపూర్వము గఁ గొనివచ్చి రాజగృహప్రాంగణమునఁ బెట్టి పలవరించుచుం డఁగా నాకాలమున శ్రీహరిం జూడవచ్చియున్న యర్జునుఁ డా తనిం జూచి కరుణతో

క. ఈపగిది నీవు వగలన్
వాపోవఁగఁ జూచి యకట ♦ వారింపంగా
నోపిన విలుకాఁ డొక్కం
డీపురి లేఁడయ్యె నయ్య ♦ యిదిపాప మగున్.

అని పలికెను. అంతట నూరకుండక యితనియు నే బ్రది కించెద. అటు చేయలేకపోతినే హుతవహుం జొచ్చెద నని నా విప్రుఁడు బలరామకృష్ణు లిందుండ నట్టు లనుట పాడిగా దనఁగా నర్జునుఁ డాగ్రహంబున

మ. బలుఁడం గాను సురాసురాంతకుఁడఁ గాఁ ♦ బ్రద్యుమ్నుఁడం గాను నేఁ
దెలియం దత్తనయుండఁ గా ననిఁ బినా♦ధివ్రాతకున్ భీషణో
జ్జ్వలగాండీవధనుర్వ్యుక్తనిశితా♦స్త్రశ్రేణిచేఁ బిన్నుపెం
టలు కావించుపరాక్రమప్రకట చం♦డస్ఫూర్తి నేఁ బార్థుఁడన్.

ఇంతియ కాదు.

చ. బలిమి పురాంతకుం దొడిరి ♦ బాహువిజృంభణ మొప్ప నెక్కటిం
దలఁపడి పోరినట్టి రణ♦ధైర్యనిధిన్ నన్ను నెఱుంగ వక్కటా!
పెలుకుల మృత్యుదేవతను ♦ బింక మడంచి భవత్తనూజులన్
అలవుఁ జలంబుఁ జూపి కొని♦యాడఁగ నిప్పుడ తెచ్చి యిచ్చెదన్.

అని నమ్మం బలికెను. ఆ ప్రతిజ్ఞకు బ్రాహ్మణుం డానందించి యుతనిం బొగడుచుం బోయి కొంతకాలమునకు వెండియుఁ బత్నికిఁ బ్రసూతిసమయంబు వచ్చిన వచ్చి విప్రుఁ డర్థించి యావిధం బెఱింగించెను. విజయుండు వేగంబ కోదండంబు చేనంది సుగుణంబుచేసి పరిశుద్ధుండై యాభూసురుని వెంటఁ బోయి సూతికాగృహముచుట్టును బాణవితతి నరికట్టి కాచి యుండఁగా నాభూదివిజునింతి మగశిశువును బ్రసవించెను. అం దున్నవారు పోయెఁబోయె ననుచుండఁగా నాశిశువు బొందితోడన ఆకాశమున కెగిరిపోయెను. ఆవార్త నాలించి విప్రుఁడు ముకుందుకడకుం జని యర్జునుని వృథాజల్పంబు లెఱింగించి జరిగినవార్తం దెలిపి మహానుభావా! కృపానిధీ! శ్రీకృష్ణా!

క. ఎక్కడి పాండుతనూభవుఁ
డెక్కడి విలుకాఁడు వీని ♦ కెక్కడి సత్యం
బెక్కడి గాండీవము తన
కెక్కడిదివ్యాస్త్రసమితి ♦ యే మనవచ్చున్.

అని దూఱెను. ఆపలుకులకు విసిగి యర్జునుఁడు చిడిముడిపడుచుఁ దనవిద్యాతిశయమున యమపురమును జేరి యందు మృతపుత్రులు కనరాక యుంట శతమఖాదినగరంబుల కరిగి యందును వారిం గానక మఱియు వెదకి యేచోటను విప్రసుతులం బరికింపనేరక తన ప్రతిజ్ఞ నెఱవేర్ప నగ్నిం బ్రణయించి యందుఁ బడ నుంకించెను. ఆవిధము శ్రీకృష్ణునిమనస్సునఁ దట్టెను. వెం

టనే యచట నామహాసీయమూర్తి పొడసూపెను. విజయా! అగ్నిఁ బ్రవేశింప వలదు. ఆవిప్రకుమారులం జూపెద నని వారించి యర్జునుం దోడ్కొని కాంచనరథ మెక్కి యుత్తరదిక్కునకుం బోయిపోయి కులపర్వతంబులు దాటి మేరునగం బతిక్రమించి యేమియు గోచరింపని తమఃప్రదేశమును జొచ్చి గుఱ్ఱము లవ్వలంబోవఁ గాళ్లురాక నిలువంబడ నాతమఃపటల మడంగఁ దనదివ్యతేజస్సును వెలయించి దాని కర్జునుండు వెఱగంద నావారాశిమధ్యభాగంబున నొకసుందరహర్మ్యంబుం గాంచి యందుఁ బ్రవేశించెను. అం దొకతావున భోగీంద్రభోగతల్పంబున సుఖాసీనుండై యున్నపురుషుని డాయంబోయి.

సీ. సజలనీలాంబుద♦శ్యామాయమానాంగు
నాశ్రితావనముద♦తాంతరంగు
సనకాదియోగిహృ♦ద్వనజమధ్యాళీంద్రు
ముఖపద్మరుచిజిత♦పూర్ణచంద్రుఁ
గమనీయనిఖిలజ♦గద్విచారిత్రు
బ్రత్యూషసంఫుల్ల♦పద్మనేత్రు
నిందిరాహ్లాదయూర♦విందారుణోల్లాసు
శ్రీకరపీతకౌ♦శేయవాసు

తే. హారకుండలకటకకే♦యూరమకుట
కంకణాంగదమణిముద్రి♦కావినూత్న
రత్ననూపురకాంచీవి♦రాజమాను
భవమహార్ణవశోష స♦వ్యక్తపోషు.

ఆమ్మహాత్ముం గాంచి దండప్రణామంబులు చేసి నిలువంబడెను. అయ్యాదిదేవుండు విజయకృష్ణులంగాంచి కృపారసము దళుకొత్తఁగా

క. ధరణికి వ్రేఁగగు దైత్యులఁ
బోరిఁబోరి వధియించి ధర్మ◆మున్ నిలుపుటకై
ధర జనియించితి రిరువురు
నరనారాయణు లనంగ ◆ నాయంశమునన్.

నాచెంత నుండు నీమునులు మిమ్ముం జూడం గోరిన మిమ్ము రప్పించుటకై యీబ్రాహ్మణపుత్రుల నిటకుం దెప్పించితి. వీరిఁ దోడుకొని పొండని యాజ్ఞాపించెను. ఆమహానీయునానతి శిరసావహించి వారిం దోడ్కొని ద్వారక కరుదెంచి బ్రాహ్మణునిఁ బిలుపించి పుత్రుల నప్పగింప నతఁడు మహానందంబున వారిం గొనియాడి పుత్రులం దోడుకొనిపోయి సుఖం బుండెను. అర్జునుండు తనయహంకారము నశింపఁజేసినందులకై గోవిందుం గొనియాడెను. అవ్వల,

మ. హరి సర్వేశుఁ డనంతుఁ డాద్యుఁ డభవుం ◆ డామ్నాయసంవేది భూ
సురముఖ్యప్రజలన్ సమస్తధనవ◆స్తుశ్రేణి నొప్పారఁగాఁ
బరిరక్షించుచు ధర్మమున్ నిలుపుచున్ ◆ బాపాత్ములం ద్రుంచుచున్
బరమోత్సాహ మెలర్ప భూరిశుభవి◆భ్రాజిష్ణుఁడై ద్వారకన్.

నివసించి మునీంద్రులు తన్ను దర్శించి కృతార్థులగుచుండ సుఖం బుండెను. అని పలికి శుకయోగీంద్రుఁడు రాజుంగాంచి

మ. మనుజేంద్రోత్తమ! యేను నీకుఁ ద్రిజగ♦న్మాంగల్యమై యొప్పఁ జె
ప్పిన యీకృష్ణకథాసుధారసము సం♦ప్రీతాత్ములై భక్తిఁ గ్రో
లిన పుణ్యాత్ములు కాంతు రిందు సుఖముల్ ♦ నిర్ధూతసర్వాఘులై
యనయంబుం దుదిఁ గాంతు రచ్యుతపదం♦ బైనట్టి కైవల్యమున్.

అని పలికి శ్రీకృష్ణపాదారవిందధ్యాననిమగ్నుఁడై యుండెను.

ఇది దశమస్కంధము.

ఏకాదశస్కంధము.

వసిష్ఠాదులు శ్రీహరిం గానవచ్చుట.

పరీక్షిత్తు శుకయోగిధ్యానసమాధి నుండ నమస్కరించి మహాత్మా! శ్రీకృష్ణచరితంబుఁ జెప్పవే యని వేఁడెను. యోగిచంద్రుఁడు కన్నులు తెఱచి సంతసంబున నిట్లనియె. రాజచంద్రమా! విను మవ్వలిహరికథ వచియింతు. ఒక్కతఱి వసిష్ఠాదులు శ్రీకృష్ణుదర్శింప నరుదెంచి

సీ. ఘనుని శ్రీకృష్ణునిఁ ♦ గౌస్తుభాభరణునిఁ
గర్ణకుండలయుగ్మ ♦ ఘనకపోలుఁ
బుండరీకాక్షు నం ♦ భోధరశ్యామునిఁ
గలితనానారత్న ♦ ఘనకిరీటు
నాజానుబాహు ని ♦ రర్గళాయుధహస్తు
శ్రీకరపీతకౌ ♦ శేయవాసు
రుక్మిణీనయనస ♦ రోజదివాకరు
బ్రహ్మాదిసురసేవ్య ♦ పాదపద్ము
తే. దుష్టనిగ్రహశిష్టసం ♦ తోషకరుఁ
గోటిమన్మథలావణ్య ♦ కోమలాంగు
నార్తజనరక్షణైకవి ♦ ఖ్యాతచరితుఁ
గనిరి కరుణాసముద్రుని ♦ ఘనులు మునులు.

భగవంతుఁ డవ్వారి ననూనసత్కారముల నాదరించెను. వారును గృతాంజలులై గోపాలకృష్ణా! మహాకరుణాసింధూ! దీనరక్షకా!

క. తరణంబులు భవజలధికి
హరణంబులు దురితలతల కాగముల కా
భరణంబు లా ర్తజనుల
శరణంబులు నీదు దివ్యచరణంబు లిలన్.

అని మఱియుఁ బెక్కురీతులఁ గొనియాడి తమవచ్చినకార్యమును రహస్యముగా నెఱింగించి పనివినిరి.

అంతఁ గొలఁదిదినములకే బ్రహ్మాదిదేవత లరుదెంచి కృష్ణుని దర్శించి మహాత్మా! భూభారహరణార్థ మవతరించితివి. ఆపని ముగిసినది. ఇఁక నిట నుండ నేల? వైకుంఠమున కరుదెమ్మా యని ప్రార్థించిరి. శ్రీహరియుఁ దనసమ్మతిం దెల్పెను. కొంతకాలమునకు భగవంతునకు నూర్ధ్వలోకగమన మిష్టపడెను అప్పుడ ద్వారకానగరమున మహోత్పాతములు చూపట్టెను. ఆవిపరీతముల నెల్ల యదువులకుం జెప్పి మీ రిఁక నిం దుండవలదు. ప్రభాసతీర్థమున కరుగుఁ డని యానతిచ్చెను. వారెల్లఁ దదుక్తప్రకారము వెడలి ప్రభాసతీర్థమును జేరిరి. అప్పుడు శ్రీహరి యుద్ధవుండు తనచెంతకుం జనుదెంచిన నతనికి ధర్మంబు లుపదేశించి రాఁగలకాలమును దెలిపి యతనిం బంపి బలరాముండు తానును ద్వారకానగరంబు వెడలి యాదవులు మదిరాపానమత్తులై తమలోఁ దారు కలహించి మృతినొంద నిఁక నుండఁ బని లేదని వైకుంఠమున కరిగిరి. అప్పుడే కలియుగ మారంభమయ్యెను.

ఇది ఏకాదశస్కంధము.

ద్వాదశస్కంధము.

పరీక్షిన్నరేంద్రుండు వాసుదేవునివ్యాఖ్యానంబు విని కాలగతులం దలంచి శుకయోగిం గాంచి పరమహర్షంబున మహాత్మా! భావికాలగతుల నెఱింగించి నన్నుఁ గృతకృత్యుం జేయవే యని ప్రార్థించిన నాయోగిపుంగవుం డిట్లనియె. రాజా! నీప్రశ్నము లోకోపకారకంబు. వినుము. సంగ్రహించి వివరించెద. సూర్యచంద్రవంశంబులం బుట్టఁగల రాజులు తమతమ శక్తి నగపఱచి రక్షణంబు సేయుదురు. కలియుగం బగుట ధర్మంబు క్రమంబుగ క్షీణించి నామమాత్రంబుగా నుండు. పాపంబు క్రమవృద్ధిఁ గాంచుచుండు. నరపతులబాహుబలపరాక్రమంబులు ఫలింపకుండు. జనుల సన్న్యాసంబు మంచిదిగాఁ దోఁచు. ఇంకొక్కవిశేషంబు గలదు.

చ. నరవర తొంటిభూపతుల ♦ నామగుణంబులు వృత్తచిహ్నముల్
సిరియును రూపసంపదయుఁ ♦ జెన్నగురాజ్యము లాత్మవిత్తముల్
వరుస నడంగెఁ గాని యట ♦ వారలకీర్తులు నిర్మలంబులై
యురవడి భూమిలోన నిలిచి ♦ యున్నవి నేఁడును రాజశేఖరా.

శంతనుసియనుజన్ముఁడగు దేవాపియు నిక్ష్వాకువంశజుండగు మరుత్తుండును యోగనిరతులై కలాపగ్రామనివాసులై కలియుగాంతంబున వాసుదేవుండు పురికొల్పఁ బ్రజల నాశ్రమాచా

రంబులు తప్పకుండ నడపుచు నారాయణస్మరణంబు నిత్యంబొ నర్చి కైవల్యంబున కరుగుదురు. అని మఱియు ననేకవిషయంబు లెఱింగించి సంసారసాగరంబు దాఁట హరికథ యను మహానౌక సహాయంబుగా గాని వేఱొక్కటి కానరా దని తెలుపుచు నాపరమయోగిచంద్రుండు భూపేంద్రుఁగాంచి భగవంతుని లోఁ దలంచి కరకమలంబులు మోడ్చి శ్రీకృష్ణపరమాత్మకు నమస్కరించి రాజచంద్రా!

ఉ. ఏను మృతుండ నౌదు నని ♦ యింత భయంబు మనంబులోపలన్
మానుము సంభవంబు గల ♦ మానవకోట్లకుఁ జావు నిత్య మీఁ
గాన హరిం దలంపు మిఁకఁ ♦ గల్గదు జన్మము నీకు ధాత్రిపై
మానవనాథ! పొందెదవు ♦ మాధవలోకనివాససౌఖ్యముల్.

అని యుపదేశించెను. పరీక్షిత్తు తదుక్తప్రకారంబున శ్రీకృష్ణుని మానసవీధి నిలిపి ధ్యానించి పుత్త్రుఁడగు జనమేజయునిభూపాలునిగా నభిషిక్తుం జేయఁదగువారి నియోగించెను. శుకమహర్షియు నాతని సంపూర్ణజ్ఞానిగా నొనరించి తనయిచ్చం జనియె. శాపకాలంబు సమీపింపఁ దత్ఫలంబు పరీక్షిత్తనుభవించెను. మంత్రు లాభూపాలకుమారుని బ్రాహ్మణపురస్సరులై సకలరాజ్యపాలనదక్షుంగా నెఱింగి పట్టభద్రునిగఁ జేసిరి.

సీ. సకలగుణాతీతు ♦ సర్వజ్ఞు సర్వేశు
నఖిలలోకాధారు ♦ నాదిదేవుఁ
బరమదయారసో♦ద్భాసితుఁ ద్రిదశాభి
వందితపాదాబ్జు ♦ వనధిశయను

నాశ్రితమందారు ♦ నాద్యంతశూన్యుని
వేదాంతవేద్యుని ♦ విశ్వమయునిఁ
గౌస్తుభశ్రీవత్స♦కమనీయవక్షుని
శంఖచక్రగదాసి♦శార్ఙ్గధరుని
తే. శోభనాకారుఁ బీతాంబ♦రాభిరాము
రత్నరాజితమకుటవి♦భ్రాజమానుఁ
బుండరీకాక్షు మహనీయ ♦ పుణ్యదేహుఁ
దలఁతు నుతియింతు దేవకీ♦తనయు నెపుడు.

ఇది ద్వాదశస్కంధము.

గద్య. ఇది శ్రీకాశ్యపగోత్రపవిత్ర జనమంచివంశప్రభవ
సుబ్రహ్మణ్యతనూభవ తాండవకృష్ణాపరాభిధేయ
శేషాద్రినామధేయ ప్రణీతకృతులయందు
సంగ్రహభాగవతము సంపూర్ణము.

శ్రీ కృష్ణార్పణమస్తు.

శ్రీ. శ్రీ. శ్రీ.

చెన్నపురి : 'శ్రీరామ'ప్రెస్సున ముద్రితము—192(